మంగళవారం 22-8-2017



'సంపద అట్టడుగు వర్గాలకు చేరితే వారి కొనుగోలు శక్తి పెరుగుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 20+20 వెల: ₹ 5.00

సంపుటి: 10 సంచిక: 152

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

సాక్షి స్పోర్ట్స్
మంగళవారం 22-8-2017



మళ్లీ నంబర్‌వన్ ర్యాంక్ నమ్మశక్యంగా లేదు: నాదల్


మూడేళ్ల తర్వాత ప్రపంచ పురుషుల టెన్నిస్ ర్యాంకింగ్స్‌లో మళ్లీ నంబర్‌వన్ స్థానాన్ని అందుకోవడం నమ్మశక్యంగా లేదని స్పెయిన్ స్టార్ రాఫెల్ నాదల్ అన్నాడు. సోమవారం విడుదల చేసిన తాజా ర్యాంకింగ్స్‌లో నాదల్ 7,645 పాయింట్లతో టాప్ ర్యాంక్‌లో నిలిచాడు. 2014 జూన్‌లో చివరిసారి నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచిన నాదల్ ఆ తర్వాత గాయాల కారణంగా ఒకదశలో 13వ ర్యాంక్‌కు పడిపోయాడు. నాదల్ తర్వాత ఆండీ ముర్రే (7,150 పాయింట్లు) రెండో స్థానంలో, ఫెడరర్ (7,145 పాయింట్లు) మూడో స్థానంలో ఉన్నారు. వచ్చే వారం మొదలయ్యే యూఎస్ ఓపెన్‌లో నాదల్, ముర్రే, ఫెడరర్ ప్రదర్శన ఆధారంగా టాప్ ర్యాంక్ తారుమారు అయ్యే అవకాశముంది.

క్రీడా అవార్డుల నిబంధనల్లో మార్పులు!

వచ్చే ఏడాది నుంచి అమల్లోకి...

న్యూఢిల్లీ: ప్రతీ ఏడాది జాతీయ క్రీడా అవార్డులు ప్రకటించడం... ఆ వెంటనే పలువురు క్రీడాకారుల నుంచి నిరసనలు వ్యక్తమవడం పరిపాటిగా మారింది. దీంతో ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా, అర్హులైన వారందరికీ అన్యాయం జరగకుండా చూసేందుకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖ నడుం బిగించింది. ఈ నేపథ్యంలో అవార్డుల కోసం ఆటగాళ్ల ఎంపిక పద్ధతిని మార్చాలని ఆలోచిస్తోంది. ఆయా క్రీడా సమాఖ్యల ద్వారా నామినేట్ అయిన వారికే ఇప్పటిదాకా అవార్డులను ప్రకటిస్తున్నారు. కానీ అర్హులై ఉండి అలా నామినేట్ కాని వారిని కూడా ఎంపిక కోసం పరిగణనలోకి తీసుకోనున్నారు. ఈపాటికే కేంద్ర క్రీడా మంత్రి విజయ్ గోయల్ ఈ దిశగా చర్చలు ప్రారంభించారని సమాచారం. 'వచ్చే ఏడాది నుంచి అవార్డుల పద్ధతిని మార్చాలనుకుంటున్నాం. త్వరలోనే కొత్త నిబంధనలు వస్తాయి. సమాఖ్యల ద్వారా నామినేట్ కాని వారు... తాము సొంతంగా దరఖాస్తు పెట్టుకోని వారిలో కూడా నిజంగా అర్హులై ఉంటే వారినీ ఎంపిక చేస్తారు. ప్రతీ సెలక్షన్ కమిటీ సభ్యుడు కూడా నామినేట్ కాని అర్హుడైన అథ్లెట్‌పై నిర్ణయం తీసుకోవచ్చు. సభ్యుడి సలహా మేరకు ప్యానెల్ ఆ ఆటగాడి ప్రదర్శనపై ఓ అంచనాకు వస్తారు' అని క్రీడా శాఖ అధికారి ఒకరు తెలిపారు.

హారిక పరాజయం



న్యూఢిల్లీ: అబుదాబి ఓపెన్ అంతర్జాతీయ చెస్ టోర్నమెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్ మాస్టర్ ద్రోణవల్లి హారిక రెండో ఓటమిని చవిచూసింది. ఇవాన్ రోజుమ్ (రష్యా)తో సోమవారం జరిగిన ఎనిమిదో రౌండ్ గేమ్‌లో హారిక 38 ఎత్తుల్లో ఓడింది.

'క్రీడా షెడ్యూల్‌ను అందుబాటులో ఉంచండి'

న్యూఢిల్లీ: దేశంలో ఆయా విభాగాల్లో జరిగే క్రీడా ఈవెంట్ల వివరాలను అందివ్వనందుకు క్రీడా మంత్రిత్వ శాఖను కేంద్ర సమాచార కమిషన్ (సీఐసీ) తప్పుపట్టింది.'వార్షిక క్రీడా షెడ్యూల్ వివరాలను కూడా అభిమానులు సమాచార హక్కు ద్వారా తెలుసుకోవాలా? ఒకవేళ ఆ వివరాలు మీకు కూడా తెలియకపోతే అంతకంటే దారుణం మరొకటి ఉండదు. క్రీడా శాఖతో పాటు భారత స్పోర్ట్స్ అథారిటీ (సాయ్) కూడా తమ వెబ్‌సైట్లలో ఈ వివరాలను అప్‌డేట్ చేయండి' అని సమాచార కమిషనర్ శ్రీధర్ ఆచార్యులు కోరారు.



శ్రీకాంత్

తొలి అడుగు అదిరె...

- శ్రీకాంత్ శుభారంభం
- తొలి రౌండ్‌లో అలవోక విజయం
- సమీర్ వర్మ కూడా ముందంజ
- ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్

పతకమే లక్ష్యంగా ప్రపంచ చాంపియన్‌షిప్ బరిలోకి దిగిన భారత స్టార్ ప్లేయర్ కిడాంబి శ్రీకాంత్ తొలి అడ్డంకిని విజయవంతంగా అధిగమించాడు. కేవలం అరగంటలోపే తన ప్రత్యర్థి ఆట కట్టించి రెండో రౌండ్‌లోకి దూసుకెళ్లాడు. భారత్‌కే చెందిన సమీర్ వర్మ కూడా బోణీ చేయగా... మిక్స్‌డ్ డబుల్స్‌లో సాత్విక్ సాయిరాజ్-మనీషా జంట కూడా గెలిచింది.


గ్లాస్గో (స్కాట్లాండ్): వరుసగా రెండు సూపర్ సిరీస్ టైటిల్స్ సాధించి అద్భుతమైన ఫామ్‌లో ఉన్న భారత బ్యాడ్మింటన్ స్టార్ కిడాంబి శ్రీకాంత్ అదే జోరును ప్రపంచ చాంపియన్‌షిప్‌లోనూ కొనసాగిస్తున్నాడు. సోమవారం మొదలైన ఈ మెగా ఈవెంట్‌లో ఎనిమిదో సీడ్‌గా బరిలోకి దిగిన శ్రీకాంత్ పురుషుల సింగిల్స్ విభాగంలో శుభారంభం చేశాడు. తొలి రౌండ్‌లో శ్రీకాంత్ 21-13, 21-12తో కేవలం 29 నిమిషాల్లో సెర్గీ సిరాంట్ (రష్యా)ను ఓడించాడు. ఆరంభంలో కాస్త తడబడ్డ శ్రీకాంత్ వెంటనే తేరుకొని తన సహజశైలిలో విజృంభించాడు. నెట్ వద్ద పైచేయి సాధిస్తూనే, పదునైన స్మాష్‌లతో అదరగొట్టాడు. తొలి గేమ్‌లో 11-6తో ముందంజ వేసిన శ్రీకాంత్ ఆ తర్వాత అదే దూకుడుతో తన ఆధిక్యాన్ని 15-7కు పెంచుకున్నాడు. తొలి గేమ్‌ను ఎలాంటి ఇబ్బంది లేకుండా సొంతం చేసుకున్న శ్రీకాంత్‌కు రెండో గేమ్‌లోనూ పెద్దగా ప్రతిఘటన ఎదురుకాలేదు. అయినప్పటికీ ఏ దశలోనూ శ్రీకాంత్ నిర్లక్ష్యానికి తావివ్వకుండా ఆడుతూ నిలకడగా పాయింట్లు సాధించి విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. మరోవైపు పాబ్లీ అబియాన్ (స్పెయిన్)తో జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌లో సమీర్ వర్మ 21-8, 17-4తో ఆధిక్యంలో ఉన్న దశలో అబియాన్ గాయంతో వైదొలిగాడు.

మిక్స్‌డ్ డబుల్స్ తొలి రౌండ్‌లో సాత్విక్ సాయిరాజ్-మనీషా (భారత్) ద్వయం 24-22, 21-17తో టామ్ చున్ హీ-ఎన్జీ సాజ్ యావు (హాంకాంగ్) జోడీపై నెగ్గి రెండో రౌండ్‌కు చేరుకుంది. పురుషుల డబుల్స్‌లో సుమీత్ రెడ్డి-మనూ అత్రి (భారత్) జోడీ తొలి రౌండ్‌లోనే ఇంటిముఖం పట్టింది. సుమీత్-మనూ అత్రి 20-22, 11-21తో చుంగ్ ఇయు సియోక్-కిమ్ డ్యూక్‌యంగ్ (కొరియా) ద్వయం చేతిలో ఓడిపోయింది. మహిళల సింగిల్స్ తొలి రౌండ్‌లో తన్వీ లాడ్ (భారత్) 17-21, 21-10, 21-19తో చోల్ బిర్చ్ (ఇంగ్లండ్)ను ఓడించింది.

మరో మ్యాచ్‌లో ప్రాజక్తా సావంత్ (భారత్)-యోగేంద్రన్ కృష్ణన్ (మలేసియా) జంట 21-15, 13-21, 21-18తో లియు చింగ్ యావో-చియాంగ్ కయ్ సిన్ (చైనీస్ తైపీ) జోడీపై గెలిచింది. మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో ఆరతి సారా సునీల్-సంజన సంతోష్ (భారత్) జంట 21-15, 21-18తో నటాల్యా వ్యోట్సెక్-యెలజెవెటా జర్కా (ఉక్రెయిన్) ద్వయంపై నెగ్గింది.

మంగళవారం జరిగే మహిళల సింగిల్స్ రెండో రౌండ్‌లో కిమ్ హ్యో మిన్ (కొరియా)తో పీవీ సింధు; పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో వీ నాన్ (హాంకాంగ్)తో సాయిప్రణీత్; వ్రాబెర్ (ఆస్ట్రియా)తో అజయ్ జయరామ్ తలపడతారు. మిక్స్‌డ్ డబుల్స్ రెండో రౌండ్‌లో ప్రాజక్తా-యోగేంద్రన్‌లతో ప్రణవ్ చోప్రా-సిక్కి రెడ్డి; క్రిస్టియాన్సన్-సారా తిగెసన్ (డెన్మార్క్)లతో సాత్విక్-మనీషా; వాంగ్ యిలు-డాంగ్‌పింగ్ (చైనా)లతో సుమీత్ రెడ్డి-అశ్విని పొన్నప్ప; మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో రిరిన్ అమెలియా (ఇండోనేసియా)-చింగ్ చెయోంగ్ (మలేసియా)లతో సిక్కి రెడ్డి-అశ్విని; పురుషుల డబుల్స్ తొలి రౌండ్‌లో హిరోయుకి-యుటా వటనాబె (జపాన్)లతో సాత్విక్-చిరాగ్ శెట్టి తలపడతారు.

భారత రెజ్లర్లకు నిరాశ



హర్‌దీప్

పారిస్: ప్రపంచ సీనియర్ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో తొలి రోజు గ్రీకో రోమన్ విభాగంలో పోటీపడిన నలుగురు భారత రెజ్లర్లు హర్‌దీప్ (98 కేజీలు), యోగేశ్ (71 కేజీలు), గుర్‌ప్రీత్ సింగ్ (75 కేజీలు), రవీందర్ ఖత్రి (85 కేజీలు) నిరాశపరిచారు. ఈ నలుగురిలో ఒక్కరు కూడా కనీసం రెండో రౌండ్‌ను దాటలేకపోయారు. రెండో రౌండ్ బౌట్‌లలో హర్‌దీప్ 2-5తో విలియస్ లారినైటిస్ (లిథువేనియా) చేతిలో... యోగేశ్ 1-3తో తకెషి ఇజుమి (జపాన్) చేతిలో... రవీందర్ ఖత్రి 0-8తో విక్టర్ లోరింజ్ (హంగేరి) చేతిలో ఓడిపోయారు. క్వాలిఫయింగ్ బౌట్‌లో గుర్‌ప్రీత్ సింగ్ 1-5తో మిందియా సులుకిడ్జె (జార్జియా) చేతిలో పరాజయం పాలయ్యాడు. భారత రెజ్లర్లను ఓడించిన వారందరూ క్వార్టర్ ఫైనల్స్‌లోనే వెనుదిరగడంతో... మనోళ్లకు రెప్‌చేజ్ రౌండ్‌లలో పోటీపడి కనీసం కాంస్య పతక బౌట్‌లకు అర్హత సాధించే అవకాశం లేకుండా పోయింది. పోటీల రెండోరోజు మంగళవారం భారత రెజ్లర్లు జ్ఞానేందర్ (59 కేజీలు), రవీందర్ (66 కేజీలు), హర్‌ప్రీత్ (80 కేజీలు), నవీన్ (130 కేజీలు) బరిలోకి దిగుతారు.

భారత్ 'ఎ' 276 ఆలౌట్

పోష్‌స్ట్రూమ్: భారత్, దక్షిణాఫ్రికా 'ఎ' జట్ల మధ్య జరుగుతున్న రెండో అనధికారిక టెస్టు డ్రా దిశగా పయనిస్తోంది. మూడో రోజు 181/3 ఓవర్‌నైట్ స్కోరుతో సోమవారం ఆట కొనసాగించిన భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 89.4 ఓవర్లలో 276 పరుగుల వద్ద ఆలౌటైంది. శ్రేయస్ అయ్యర్ (82 బంతుల్లో 65; 5 ఫోర్లు, 4 సిక్సర్లు) క్రితం రోజు స్కోరుకు మరో 9 పరుగులే జోడించి ఔటయ్యాడు. తర్వాత వచ్చిన వారిలో షాబాజ్ నదీమ్ (36) మినహా ఇంకెవరూ చెప్పుకోదగ్గ స్కోర్లు చేయలేకపోయారు. డేన్ పీడ్ 4, ప్యాటర్సన్ 3 వికెట్లు తీశారు. సఫారీ జట్టుకు తొలి ఇన్నింగ్స్‌లో 46 పరుగుల ఆధిక్యం లభించింది. అనంతరం రెండో ఇన్నింగ్స్ ఆడిన దక్షిణాఫ్రికా 'ఎ' ఆట నిలిచే సమయానికి 52 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 138 పరుగులు చేసింది. స్టీఫెన్ కుక్ (55 బ్యాటింగ్; 7 ఫోర్లు), ఫెలుక్‌వాయో (29 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ప్రస్తుతం సఫారీ జట్టు 184 పరుగుల ఆధిక్యంలో ఉంది.



పడి లేచాడు!

అద్భుత ఫామ్‌లో శిఖర్ ధావన్ ● వైఫల్యాల నుంచి పాఠాలు నేర్చుకున్న ఓపెనర్

శ్రీలంక పర్యటనకంటే దాదాపు ఏడాది ముందు శిఖర్ ధావన్ భారత్ తరఫున తన ఆఖరి టెస్టు మ్యాచ్ ఆడాడు. ఓపెనర్లుగా విజయ్, రాహుల్ కుదురుకోవడంతో అతను చోటు కోల్పోయాడు. సొంతగడ్డపై గత సీజన్‌లో భారత్ 13 టెస్టులు ఆడితే ధావన్ ఒక్క మ్యాచ్‌కే పరిమితమయ్యాడు. వన్డేల్లో కూడా పరిస్థితి గొప్పగా లేదు. 2016లో కేవలం ఐదు వన్డేలే ఆడగలిగిన అతను, ఇంగ్లండ్‌తో సిరీస్ మొత్తం కూడా జట్టులో కొనసాగలేదు. ఈ వైఫల్యాలు అతని కెరీర్‌ను ప్రమాదంలో పడేశాయి. కానీ అదృష్టం కలిసొచ్చి అనూహ్యంగా దక్కిన అవకాశాన్ని అతను రెండు చేతులా ఒడిసి పట్టుకున్నాడు. శ్రీలంక గడ్డపై టెస్టు సిరీస్‌తో పాటు తొలి వన్డేలోనూ చెలరేగి తన అసలు సత్తాను మరోసారి ప్రదర్శించాడు.

సాక్షి క్రీడా విభాగం

శ్రీలంకతో గాలేలో జరిగిన మొదటి టెస్టులో దూకుడైన ఆటతో సెంచరీ సాధించినప్పుడు పాత శిఖర్ ధావన్ కనిపించాడు. ఎప్పుడో తొలి మ్యాచ్ ఆడిన నాటి ధాటిని అతను మరోసారి తన బ్యాటింగ్‌లో చూపించాడు. మైదానమంతా అతను కొట్టిన 31 బౌండరీలు అతనిలో పెరిగిన ఆత్మవిశ్వాసానికి నిదర్శనం. ఆదివారం వన్డేతో అది మరోసారి రుజువైంది. శ్రీలంక బౌలింగ్‌లో అతను చూడచక్కటి బ్యాటింగ్‌ను ప్రదర్శించాడు. 'ఆస్ట్రేలియాతో నా తొలి టెస్టు సమయంలో ఇలాంటి షాట్లు ఆడాను. ఇటీవల మొదటి టెస్టులో ఆట, ఈ వన్డేలో బ్యాటింగ్ కూడా ఒకే తరహాలో సాగిందని నా అభిప్రాయం. నాదైన శైలిలో షాట్లు ఆడటం సంతృప్తినిచ్చింది' అని ధావన్ చెప్పాడు.

చాంపియన్ ఆట...

ఐసీసీ ఈవెంట్లలో అయితే ధావన్ చెలరేగిపోతాడు... అతడి గురించి తరచుగా చెప్పే మాట ఇది. గణాంకాలు కూడా ఇదే చెబుతున్నాయి. వన్డే కెరీర్ ప్రారంభించిన తర్వాత రెండున్నరేళ్ల కాలంలో ధావన్ కేవలం ఐదే వన్డేలు ఆడగలిగాడు. అయితే 2013 చాంపియన్స్ ట్రోఫీతో అతను జట్టులోకి పునరాగమనం చేశాడు. అది అతని కెరీర్‌ను మలుపు తిప్పింది. ఆ టోర్నీలో జట్టు టైటిల్ గెలవడంలో కీలకపాత్ర పోషించి 'మ్యాన్ ఆఫ్ ద సిరీస్'గా నిలిచిన ధావన్, 2015 వన్డే వరల్డ్ కప్‌లోనూ భారత టాప్‌స్కోరర్ కావడం విశేషం. ఇటీవల చాంపియన్స్ ట్రోఫీలో ధావన్ కెరీర్ మళ్లీ ఊపందుకుంది. శ్రీలంకపై సెంచరీ... పాక్, దక్షిణాఫ్రికాలపై అర్ధ సెంచరీలు చేసిన అతను మరోసారి టాప్ స్కోరర్ అయ్యాడు. ఇదే ఫామ్‌ను ఇప్పుడు శ్రీలంకలోనూ కొనసాగిస్తున్నాడు. 'వైఫల్యాలు ఎదురైన సమయంలోనూ నేను కుంగిపోలేదు. మరింత కష్టపడి జట్టులోకి వచ్చేందుకు ప్రయత్నించాను. చోటు లభించాక కూడా నా ఆటను మరింత మెరుగుపర్చుకునేందుకు అదే తరహాలో సాధన కొనసాగిస్తున్నాను' అని శిఖర్ వ్యాఖ్యానించాడు.

ఫామ్ కొనసాగించాలి...

టెస్టు టీమ్‌లో ఇతర ఓపెనర్ల నుంచి కాస్త పోటీ ఉన్నా... వన్డేల్లో మాత్రం ఇక తిరుగులేని విధంగా శిఖర్ తన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటున్నాడు. ఇప్పుడు ఫామ్‌లోకి వచ్చినా... ఉదాసీనత ప్రదర్శించనని అతను చెబుతున్నాడు. 'జీవితంలో వైఫల్యాలు మనకు చాలా విషయాలు నేర్పిస్తాయి. నా విషయంలోనూ అదే జరిగింది. నా కెరీర్‌లో క్లిష్ట పరిస్థితులను అధిగమించగలిగాను కాబట్టి దాని గురించి భయం లేదు. అయితే మళ్లీ తప్పులు జరగకుండా జాగ్రత్త పడతా' అని ధావన్ అన్నాడు. గత రెండు చాంపియన్స్ ట్రోఫీల్లో ప్రదర్శనను బట్టి చూస్తే ఇంగ్లండ్ పరిస్థితుల్లో అతను కీలకమైన ఆటగాడు అనడంలో ఎలాంటి సందేహం లేదు. రాబోయే వరల్డ్ కప్ గురించే భారత్ సన్నాహకాలు సాగుతున్నాయని పదే పదే చెబుతున్న నేపథ్యంలో ఈ రెండేళ్ల పాటు ధావన్ తన ఫామ్ నిలబెట్టుకోవడం కూడా ముఖ్యం. 'వరల్డ్ కప్‌కు చాలా సమయం ఉంది. అయితే అప్పటి వరకు నేను బాగా ఆడాలని నాకు తెలుసు. ఎందుకంటే ప్రస్తుత భారత జట్టులో చాలా మంది ప్రతిభావంతులు ఉన్నారు. నేను కాస్త తగ్గితే ఎవరైనా నా స్థానాన్ని లాగేసుకోగలరు' అని ఈ ఢిల్లీ ఆటగాడు అభిప్రాయపడ్డాడు. మరోసారి సెలక్టర్లు తన గురించి ప్రతికూలంగా ఆలోచించే అవకాశం ఇవ్వకుండా ఇదే జోరు కొనసాగించగలనని అతను నమ్మకంతో ఉన్నాడు.

> గత కొంత కాలంగా ధావన్ అద్భుతంగా ఆడుతున్నాడు. అతనికి అన్నీ కలిసొచ్చాయి. ఎలాంటి ఒత్తిడి లేకుండా తనదైన పరిధిలో అతను ఇప్పుడు ప్రశాంతంగా ఉన్నాడు. ఇది ఇలాగే కొనసాగాలని మేం కోరుకుంటున్నాం. ఎందుకంటే ధావన్ తనదైన శైలిలో ఆడినంత కాలం అతను మ్యాచ్‌లు గెలిపిస్తూనే ఉంటాడు. ఒక్కసారి అతని జోరు మొదలైందంటే ఆపడం చాలా కష్టం. *- విరాట్ కోహ్లి, భారత కెప్టెన్*

నేటి నుంచి మొయినుద్దౌలా టోర్నీ

- బరిలో 10 జట్లు
- ఎయిరిండియా తరఫున రైనా



మీడియా సమావేశంలో వివేక్, శేష్ నారాయణ్ తదితరులు

సాక్షి, హైదరాబాద్: సుదీర్ఘ కాలంగా హైదరాబాద్ క్రికెట్‌లో అంతర్భాగంగా ఉన్న ఆలిండియా మొయినుద్దౌలా గోల్డ్ కప్ క్రికెట్ టోర్నీకి రంగం సిద్ధమైంది. నేటి నుంచి జరిగే ఈ టోర్నీలో మొత్తం 10 జట్లు బరిలోకి దిగుతున్నాయి. ఈ నెల 31న ఫైనల్ నిర్వహిస్తారు. సోమవారం జరిగిన మీడియా సమావేశంలో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ (హెచ్‌సీఏ) అధ్యక్ష, కార్యదర్శులు జి.వివేకానంద్, టి.శేష్ నారాయణ్ టోర్నమెంట్ విశేషాలను వెల్లడించారు. 1930 నుంచి జరుగుతున్న ఈ టోర్నీని ఈ ఏడాది వన్డే ఫార్మాట్‌లో నిర్వహిస్తున్నారు. మొత్తం 10 టీమ్‌లను రెండు గ్రూప్‌లుగా విభజించారు. లీగ్ దశలో ఒక్కో జట్టు తమ గ్రూప్‌లోని ప్రత్యర్థులతో నాలుగు మ్యాచ్‌లు ఆడుతుంది. టాప్-2 టీమ్‌లు సెమీస్‌కు చేరతాయి. గ్రూప్ 'ఎ'లో హెచ్‌సీఏ ఎలెవన్, ఆంధ్ర కోల్ట్స్, కాగ్, గోవా, విదర్భ జట్లు... గ్రూప్ 'బి'లో హెచ్‌సీఏ ప్రెసిడెంట్స్ ఎలెవన్, ఎయిరిండియా, బరోడా, కేరళ, కంబైన్డ్ డిస్ట్రిక్ట్స్ జట్లు ఉన్నాయి. 'తెలంగాణలోని వివిధ జిల్లాలకు చెందిన ప్రతిభావంతులైన ఆటగాళ్లను ప్రోత్సహించేందుకు ఈసారి కంబైన్డ్ డిస్ట్రిక్ట్స్ జట్టును ఆడిస్తున్నాం. ఈ టీమ్‌తో పాటు హెచ్‌సీఏ తరఫున బరిలోకి దిగుతున్న రెండు జట్లలో కూడా ఆటగాళ్లను పూర్తిగా వారి ప్రతిభ, స్కోర్లను బట్టే ఎంపిక చేశాం. ఈ విషయంలో ఎలాంటి పక్షపాత ధోరణి ప్రదర్శించలేదు' అని వివేకానంద్ చెప్పారు. టోర్నీలో పాల్గొంటున్న జట్లలో ఎక్కువ మంది వర్ధమాన ఆటగాళ్లే ఉన్నారు. అయితే ఇటీవల భారత జట్టులో చోటు కోల్పోయిన సురేశ్ రైనా ఎయిరిండియా తరఫున బరిలోకి దిగుతున్నాడు. అతనితో పాటు టెస్టు ఆటగాడు జయంత్ యాదవ్, నమన్ ఓజా, రజత్ భాటియా మాత్రమే కాస్త గుర్తింపు ఉన్న క్రికెటర్లు. టోర్నీ మొత్తం ప్రైజ్‌మనీ రూ. 10 లక్షలు.

నేటి మ్యాచ్‌లు

హెచ్‌సీఏ ఎలెవన్ X ఆంధ్ర కోల్ట్స్
గోవా X విదర్భ
హెచ్‌సీఏ ప్రెసిడెంట్స్ X కేరళ
బరోడా X కంబైన్డ్ డిస్ట్రిక్స్ ఎలెవన్

'అసలు' బంగారాన్ని తీసుకురండి...

మీడియా సమావేశంలో మొయినుద్దౌలా వారసులు ఫక్రుద్దీన్, నిఖత్ కూడా పాల్గొన్నారు. కొన్నేళ్ల క్రితం అసలు గోల్డ్ కప్‌ను ఎవరో దొంగిలించి దాని స్థానంలో నకిలీది ఉంచారని ఆరోపణలు వచ్చాయి. దానిపై పలు విధాలుగా విచారణ జరిపినా అసలేం జరిగిందో మాత్రం తేలలేదు. ఇప్పుడైనా తమ తాతగారు ఇచ్చిన అసలు గోల్డ్ కప్‌ను కనుగొనాలని ఫక్రుద్దీన్ కోరారు. దీంతో పాటు గతంలో ఉన్న విధంగా హెచ్‌సీఏ మొయినుద్దౌలా క్లబ్ జట్టును కూడా పునరుద్ధరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. దీనిపై సానుకూలంగా స్పందించిన హెచ్‌సీఏ అధ్యక్షుడు వివేక్ తగు చర్యలు తీసుకుంటామని, అవసరమైతే అసలు బంగారంతో మరో కప్‌ను సిద్ధం చేస్తామని చెప్పారు.

'సిన్సినాటి' చాంప్స్ దిమిత్రోవ్, ముగురుజా



ఒహాయో: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ సన్నాహక టోర్నీల్లో భాగమైన సిన్సినాటి మాస్టర్స్ టెన్నిస్ టోర్నమెంట్‌లో పురుషుల సింగిల్స్‌లో గ్రిగోర్ దిమిత్రోవ్ (బల్గేరియా), మహిళల సింగిల్స్‌లో ముగురుజా (స్పెయిన్) టైటిల్స్‌ను సొంతం చేసుకున్నారు. ఫైనల్స్‌లో దిమిత్రోవ్ 6-3, 7-5తో నిక్ కిరియోస్ (ఆస్ట్రేలియా)పై... నాలుగో సీడ్ ముగురుజా 6-1, 6-0తో రెండో సీడ్ సిమోనా హలెప్ (రొమేనియా)పై విజయం సాధించారు. చాంపియన్స్‌గా నిలిచిన దిమిత్రోవ్‌కు 9,54,225 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 6 కోట్ల 12 లక్షలు)తోపాటు 1000 ర్యాంకింగ్ పాయింట్లు... ముగురుజాకు 5,22,450 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 3 కోట్ల 35 లక్షలు)తోపాటు 900 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి.




'తెలుగువారి గుండెచప్పుడు
వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు...
నా జన్మ ధన్యమైనట్టే'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM
పేజీలు: 20+20 వెల: ₹ 5.00
సంపుటి: 10
సంచిక: 152

మంగళవారం 22-8-2017

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఓట్లను బట్టే సీట్లు!
ఎన్నికల సంస్కరణలపై ఆనంద్‌శర్మ కమిటీ పరిశీలన - 6లో



రాస్‌నెఫ్ట్ చేతికి ఎస్సార్ ఆయిల్
13 బిలియన్ డాలర్లకు సొంతం చేసుకున్న రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్ - 14లో

పట్టపగలే చిమ్మ చీకట్లు

అమెరికాలో కనువిందు చేసిన సంపూర్ణ సూర్య గ్రహణం

-వివరాలు 17లో


సోమవారం ఒరెగాన్ రాష్ట్రంలోని రెడ్మండ్‌లో సంపూర్ణ సూర్యగ్రహణ దృశ్యం

ఒక బడి.. కలబడి, నిలబడి



తిరిగి తెరుచుకున్న బ్రాహ్మణపల్లి సర్కారీ బడి
మూసివేతపై విద్యార్థుల పోరాటం

- హేతుబద్ధీకరణ పేరుతో నెలరోజుల క్రితం మూత
- విద్యార్థుల ఆందోళన.. తల్లిదండ్రుల నిరసన
- మూసేసినా బడికి హాజరైన వైనం
- చివరికి వెనక్కి తగ్గిన విద్యాశాఖ అధికారులు

5 లో

పెద్దపల్లి జిల్లా బ్రాహ్మణపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు పాఠాలు చెబుతున్న ఉపాధ్యాయుడు

తెలంగాణ.. మినీ భారత్


సోమవారం రాజ్‌భవన్‌లో ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడుకు సీఎం కేసీఆర్ పౌర సన్మానం. చిత్రంలో కేంద్ర మంత్రి దత్తాత్రేయ, గవర్నర్ నరసింహన్

ఇదే ఇక్కడి ప్రత్యేకత — **ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు**

- ఇది ఉత్తరాదివారికి దక్షిణ భారతం. దక్షిణాదివారికి ఉత్తర భారతం
- రాష్ట్రం విడిపోయింది ఒకరికి వ్యతిరేకంగా కాదు
- విడిపోయినా మనమంతా తెలుగువారమే
- ఇద్దరు సీఎంలు రాష్ట్రాలను ముందుకు తీసుకువెళ్లాలి
- అవినీతి, ఆకలి చావులు, అక్రమాలు లేని రాజ్యమే రామరాజ్యం
- అలాంటి రాజ్య స్థాపన కోసం నాయకులు కృషి చేయాలి
- రాష్ట్రం తరఫున ఘనంగా పౌర సన్మానం

2 లో

ఎన్టీఆర్ తర్వాత తెలుగోడికి మళ్లీ అంతటి గౌరవం

- వెంకయ్యనాయుడు మనందరికీ గర్వకారణం: సీఎం కేసీఆర్
- దేశంలోనే అద్భుతమైన వక్త..

- వివరాలు 2లో





బ్యాంకు ఖాతాలకు ఆధార్ ముప్పు!

సరిగా సీడింగ్ జరగక బ్లాక్ అయ్యే అవకాశం

రాష్ట్రంలో ఇప్పటివరకు జరిగిన సీడింగ్
87%

ఇందులో ఖాతాలకు ఆధార్ జత కుదిరినవి
13%

- రాష్ట్రంలో సుమారు 3 కోట్ల బ్యాంకు ఖాతాలకు సమస్య
- తగిన చర్యలు చేపట్టాలంటూ రాష్ట్ర బ్యాంకర్లకు ఆదేశాలు
- డిసెంబర్ 31లోగా ఆధార్ సీడింగ్ పూర్తికావాలి.. లేకుంటే ఖాతాలు బ్లాక్.. నగదు విత్‌డ్రా, జమలు బంద్
- బ్యాంకు శాఖకు వెళ్లి వివరాలు నిర్ధారించుకోవాలని ఖాతాదారులకు సూచన

11 లో



విశ్రాంత ఐఏఎస్ పీవీఆర్‌కే ప్రసాద్
కన్నుమూత

పంజాగుట్ట శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి

- కొద్దిరోజుల క్రితం గుండెపోటుతో బంజారాహిల్స్ కేర్‌లో చేరిక
- చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున తుదిశ్వాస
- కేసీఆర్, చంద్రబాబు, వైఎస్ జగన్ సంతాపం - 2లో

వ్యవసాయ శాఖలో పోస్టుల భర్తీ

242 అసిస్టెంట్ ప్రొఫెసర్ పోస్టులకు నోటిఫికేషన్
వచ్చే నెల 20 వరకు దరఖాస్తు గడువు
రాత పరీక్ష లేదు.. ఇంటర్వ్యూల ఆధారంగానే భర్తీ

సాక్షి, హైదరాబాద్: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 242 అసిస్టెంట్ ప్రొఫెసర్ల పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదలైంది. ఈ మేరకు రిజిస్ట్రార్ సుధీర్‌కుమార్ సోమవారం ఓ ప్రకటన విడుదల చేశారు. 185 వ్యవసాయ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 22 వ్యవసాయ ఇంజనీరింగ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 16 హోం సైన్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు, 19 బ్యాక్‌లాగ్ అసిస్టెంట్ పోస్టులను భర్తీ చేయనున్నారు. అర్హత కలిగిన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో సెప్టెంబర్ 20 సాయంత్రం 4 గంటల్లోపు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందని రిజిస్ట్రార్ పేర్కొన్నారు. దరఖాస్తు కాపీలను అదే నెల 29 సాయంత్రం 4 గంటల్లోపు పంపాల్సి ఉంటుందన్నారు. అగ్రికల్చర్ ఎకనామిక్స్, ఎక్స్‌టెన్షన్, మైక్రోబయాలజీ, అగ్రోనమీ, క్రాప్ ఫిజియాలజీ,



మిగతా 2వ పేజీలో ▶


సోమవారం చెన్నైలో పన్నీర్‌సెల్వం, పళనిస్వామి కరచాలనం

చేతులు కలిపారు

ఈపీఎస్, ఓపీఎస్ వర్గాల విలీనం

- డిప్యూటీ సీఎం, పార్టీ కన్వీనర్‌గా పన్నీర్
- సీఎం, పార్టీ కో కన్వీనర్‌గా పళనిస్వామి
- శశికళ తొలగింపునకు త్వరలో జనరల్ కౌన్సిల్ భేటీకి నిర్ణయం
- నేడు గవర్నర్‌ను కలవనున్న శశికళ వర్గం ఎమ్మెల్యేలు

17 లో

'ధర్నా చౌక్' కోసం ధర్నా

జంతర్ మంతర్ వద్ద గళమెత్తిన విపక్షాలు

- హాజరైన టీజేఏసీ, ప్రతిపక్ష నేతలు
- ధర్నా చౌక్ సాధించుకునే వరకు పోరాడతామని స్పష్టీకరణ
- రాజ్‌నాథ్‌కు వినతిపత్రం

10 లో


సోమవారం ఢిల్లీలో రాజ్‌నాథ్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ డి.రాజా, వీహెచ్, చాడ, కోదండరాం, తమ్మినేని

ఇదండీ సంగతి



... సెల్ఫీ ప్లీజ్!

బీజేపీ 'మిషన్ 350 ప్లస్'


సోమవారం ఢిల్లీలో జరిగిన బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశంలో ప్రధాని మోదీ, అమిత్ షా

అమిత్ షా, మోదీ దిశానిర్దేశం
బీజేపీ పాలిత ముఖ్యమంత్రులతో భేటీ

2019 లోక్‌సభ ఎన్నికల్లో 350కి పైగా సీట్లలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలకు ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోదీలు దిశానిర్దేశం చేశారు. 'మిషన్ 350 ప్లస్'లో భాగంగా ఇంతవరకూ బీజేపీ గెలవని 120 నియోజకవర్గాల్లో విజయం సాధించేందుకు శ్రమించాలని స్పష్టం చేశారు. అమిత్ షా అధ్యక్షతన సోమవారం సాయంత్రం పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీ పాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో దాదాపు మూడున్నర గంటలు భేటీ కొనసాగింది.

- వివరాలు 17లో

వేగంగా కేంద్ర కేబినెట్ విస్తరణ కసరత్తు

ఆగస్టు 24 లేదా 26న ముహూర్తం!

- మంత్రివర్గంలోకి అన్నాడీఎంకే, జేడీయూ
- అన్నాడీఎంకేకు 2, జేడీయూకు ఒక కేబినెట్ పదవి
- బిహార్ గవర్నర్‌గా కేంద్రమంత్రి కల్‌రాజ్ మిశ్రా
- టీడీపీ నుంచి సీఎం రమేశ్, బీజేపీ నుంచి హరిబాబుకు అవకాశం!
- 2019 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని విస్తరణ

- వివరాలు 17లో

విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీఆర్‌కే ప్రసాద్ ఇకలేరు

పంజాగుట్ట శ్మశాన వాటికలో అంత్యక్రియలు పూర్తి



హైదరాబాద్: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌తో పాటు కేంద్ర సర్వీసుల్లో వివిధ హోదాల్లో పనిచేసిన విశ్రాంత ఐఏఎస్ అధికారి పీవీఆర్‌కే ప్రసాద్ (77) కన్నుమూశారు. హైదరాబాద్‌లోని బంజారాహిల్స్ కేర్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం తెల్లవారుజామున 2 గంటలకు తుదిశ్వాస విడిచారు. గత శుక్రవారం ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబసభ్యులు కేర్ ఆసుపత్రిలో చేర్చారు. ఐసీయూలో చికిత్స పొందుతూ ఆరోగ్య పరిస్థితి విషమించడంతో మృతిచెందారు. ఆయన భౌతికకాయాన్ని బంజారాహిల్స్ రోడ్ నంబర్7లోని స్వగృహానికి తరలించారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఏపీ ముఖ్య సలహాదారు పరకాల ప్రభాకర్, లోక్‌సత్తా అధినేత జయప్రకాశ్‌నారాయణ పలువురు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఆయన భౌతికకాయానికి నివాళులు అర్పించారు. అనంతరం పంజాగుట్ట శ్మశాన వాటికలో ఆయన కుమారుడు సంజీవి ప్రసాద్ అంతిమ సంస్కారాలు నిర్వహించారు. విశ్రాంత ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు ఐవైఆర్ కృష్ణారావు, ఎంవీఎస్ ప్రసాద్, చెంగప్ప, రాంబాబు, ఎస్‌వీ భాస్కర్‌రావు, బీవీ రామారావు, కృష్ణారావు, సత్యనారాయణ తదితరులు అంత్యక్రియలకు హాజరయ్యారు. దివంగత ప్రధాని పీవీ నర్సింహారావు సమాచార సలహాదారుగా ప్రసాద్ పనిచేశారు. టీటీడీ ఈవోగా తిరుమల విశిష్టతపై పలు రచనలు చేశారు.

కేసీఆర్, చంద్రబాబు సంతాపం..: ప్రసాద్ మృతి పట్ల తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు కె.చంద్రశేఖర్‌రావు, చంద్రబాబునాయుడు సంతాపం వ్యక్తం చేశారు. మాజీ ప్రధాని పీవీ నర్సింహారావుకు సమాచార సలహాదారుగా ప్రసాద్ పనిచేశారని సీఎం కేసీఆర్ గుర్తుచేసుకున్నారు. పీవీఆర్‌కే ప్రసాద్ సమర్థవంతమైన అధికారిగా వ్యవహరించారని, ప్రభుత్వానికి విశేషమైన సేవలు అందించారని చంద్రబాబు కొనియాడారు. టీటీడీ ఈవోగా పనిచేసిన కాలంలో ఎన్నో సంస్కరణలు ప్రవేశపెట్టి భక్తులకు మెరుగైన సదుపాయాలు కల్పించారన్నారు.

పీవీఆర్‌కే ప్రసాద్ మృతిపై జగన్ సంతాపం

రిటైర్డ్ ఐఏఎస్ అధికారి, టీటీడీ మాజీ ఈవో పీవీఆర్‌కే ప్రసాద్ (77) మృతి పట్ల ఏపీ ప్రతిపక్ష నేత, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం ప్రకటించారు. ప్రసాద్ కుటుంబసభ్యులకు జగన్ ప్రగాఢ సానుభూతి తెలిపారు. పలు కీలక పదవుల్లో పనిచేసిన ఆయన విధి నిర్వహణలో చిత్తశుద్ధిగా వ్యవహరించారన్నారు.

✦ మాజీ మంత్రి సమ్మయ్య కన్నుమూత



పరకాల: అనారోగ్యంతో బాధపడుతూ నిమ్స్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు బొచ్చు సమ్మయ్య (71) సోమవారం మృతి చెందారు. హైదరాబాద్‌లోని ఆయన ఇంట్లో కాలు జారిపడి తలకు తీవ్ర గాయం కావడంతో ఈ నెల 9న ఆయన్ను నిమ్స్‌కు తరలించారు. తలలో రక్తం గడ్డకట్టడంతో నిమ్స్‌లో వైద్య నిపుణుల బృందం చికిత్స అందించింది. వరంగల్ జిల్లా పరకాలకు చెందిన సమ్మయ్య.. 1979లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. రెండు సార్లు ఎమ్మెల్యేగా.. చెన్నారెడ్డి, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి హయాంలో మంత్రిగా పనిచేశారు. పీవీ నరసింహారావు హయంలో జాతీయ ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యునిగా సేవలందించారు. మంగళవారం పరకాలలో అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

✦ రేపటి నుంచి ఓయూసెట్ వెరిఫికేషన్

హైదరాబాద్: ఓయూసెట్-2017 రెండో విడత కౌన్సెలింగ్‌లో భాగంగా బుధవారం నుంచి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రారంభం కానున్నట్లు ఓయూ పీజీ అడ్మిషన్స్ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ కిషన్ తెలిపారు. రెండో విడత వెబ్ ఆప్షన్స్‌లో సీటు పొందిన విద్యార్థులు తమ సర్టిఫికెట్లను ఓయూ క్యాంపస్‌లోని పీజీ అడ్మిషన్స్ కార్యాలయంలో ఈ నెల 23, 24, 27, 28 తేదీల్లో వెరిఫికేషన్ చేయించుకోవాలన్నారు. వివరాలను www.osmania.ac.inలో చూడవచ్చు.

వ్యవసాయ శాఖలో పోస్టుల భర్తీ

▶ మొదటి పేజీ తరువాయి

ఎంటమాలజీ, జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, హార్టికల్చర్, ప్లాంట్ పెథాలజీ, ప్లాంట్ మాలిక్యులర్ బయాలజీ అండ్ బయో టెక్నాలజీ, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, సాయిల్ సైన్స్ అండ్ అగ్రికల్చర్ కెమిస్ట్రీ, స్టాటిస్టిక్స్ అండ్ మ్యాథ్స్, లైబ్రరీ సైన్స్ సబ్జెక్టుల కోసం ఈ పోస్టులను భర్తీ చేయనున్నారు. అగ్రికల్చర్ ఇంజనీరింగ్, టెక్నాలజీలో 5 సబ్జెక్టుల కోసం భర్తీ చేస్తారు. హోం సైన్స్‌లోనూ 5 సబ్జెక్టుల్లో పోస్టులు భర్తీచేస్తారు. పూర్తి వివరాలను www.pjtsau.ac.in వెబ్‌సైట్‌లో చూడొచ్చని, ఈ సైట్ ద్వారానే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఈ పోస్టులకు రాత పరీక్ష నిర్వహించరు. ఇంటర్వ్యూల ఆధారంగానే భర్తీ చేస్తారు.

వావ్ ఫ్యాక్టర్

ఎందు కాలిడినా.. ప్యూర్ నీరు!





1. మంచినీటిని శుద్ధి చేసే 'ఆఫ్ గ్రిడ్ బాక్స్'.
2. మారుమూల ప్రాంతాలలోని నీటిని సైతం ఈ బాక్సుతో శుద్ధి చేసుకోవచ్చు.

స్వచ్ఛమైన నీళ్లంటే.. బోలెడన్ని రోగాలను అడ్డుకోవచ్చు. ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. దురదృష్టం కొద్దీ స్వచ్ఛమైన నీళ్లు దొరకనే ప్రపంచవ్యాప్తంగా లక్షల మంది అనారోగ్యం బారిన పడుతున్నారు. మరణిస్తున్నారు కూడా. ఎక్కడో విసిరేసినట్టుగా ఉన్న పల్లెటూళ్లలో నీటి శుద్ధికి అవసరమైన యంత్రాలు అందుబాటులో లేకపోవడమే దీనికి కారణం. ఇకపై ఈ సమస్య అస్సలు ఉండదంటోంది 'ద ఆఫ్ గ్రిడ్ బాక్స్'. ఈ ఇటలీ కంపెనీ తయారు చేసిన మంచినీళ్ల యంత్రమే మీకు ఫొటోలో కనిపిస్తున్నది. దీంతో ఎక్కడికక్కడ స్వచ్ఛమైన నీళ్లను తయారు చేసుకోవడం మాత్రమే కాకుండా.. కరెంటూ ఉత్పత్తి చేసుకోవచ్చు మరి! ఆరు అడుగుల పొడవు, వెడల్పు, ఎత్తు ఉండే ఈ పెట్టె లోపలి భాగంలో నీళ్లను శుద్ధి చేసేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లూ ఉంటే, బయట ఆ యంత్రాలను నడిపేందుకు, కావాల్సిన విద్యుత్తును ఉత్పత్తి చేసేందుకు సోలార్ ప్యానెల్స్ ఉన్నాయి. సోలార్‌ప్యానెల్స్‌కు దిగువన శుద్ధి చేయాల్సిన నీటిని వేడి చేసేందుకు సోలార్‌హీటింగ్ యంత్రాలూ ఉన్నాయి. దీంతో ప్రత్యేకంగా విద్యుత్తులైన్లు వేసుకోవాల్సిన పనిలేకుండా ఏ మారుమూల ప్రాంతంలోనైనా కలుషిత నీటిని శుద్ధి చేసి అందించేందుకు వీలేర్పడుతుంది. యంత్రాలు వాడుకోగా మిగిలిన విద్యుత్తును ఆయా ప్రాంతాల్లో బల్బులు వెలిగించేందుకైనా, ఫోన్లు చార్జ్ చేసుకునేందుకైనా వాడుకోవచ్చు. అవసరాన్ని బట్టి కొంచెం పెద్ద పెద్ద బాక్సులు కూడా దొరుకుతాయి. బేసిక్ మోడల్‌లో 12 సోలార్ ప్యానెళ్లు, ఇన్వర్టర్, బ్యాటరీలు ఉన్నాయి. ఈ బ్యాటరీతో దాదాపు మూడు ఎల్‌ఈడీ లైట్లను దాదాపు నాలుగు గంటలపాటు వెలిగించవచ్చు. 1,200 లీటర్ల నీటిని శుద్ధి చేయగల ఈ యంత్రంలో నీటిని నిల్వ చేసేందుకూ ఏర్పాట్లు ఉన్నాయి. ఒక్కో బాక్స్ ద్వారా కనీసం 1,500 మందికి తాగునీరు అందించవచ్చు. ఆఫ్రికాలోని పేదదేశాల్లో వీటిని ఏర్పాటు చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు కంపెనీ సీఈవో ఇమిలియానో కొచినీ చెబుతున్నారు.

- సాక్షి నాలెడ్జ్ సెంటర్

తెలంగాణ.. మినీ భారత్

ఇదే ఇక్కడి ప్రత్యేకత: ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు



సోమవారం రాజ్‌భవన్‌లో పౌర సన్మాన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు. చిత్రంలో జితేందర్ రెడ్డి, మధుసూదనాచారి, కడియం, దత్తాత్రేయ, గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్, మహమూద్ అలీ, స్వామిగౌడ్, కేకే తదితరులు

సాక్షి, హైదరాబాద్: ''తెలంగాణ.. ఉత్తరాది వారికి దక్షిణ భారతదేశం. దక్షిణాది వారికి ఉత్తర భారత దేశం. అదే ఇక్కడి విశిష్టత. ఇక్కడి భాషలు, ప్రజల జీవన విధానాన్ని పరిశీలిస్తే మినీ భారత్ అని చెప్పవచ్చు'' అని ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు అన్నారు. ప్రపంచ అభివృద్ధి పటంలో హైదరాబాద్‌కు ప్రత్యేక స్థానం ఉందని, దాన్ని ముందుకు తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందంటూ రాష్ట్ర ప్రభుత్వాన్ని ప్రశంసించారు. ''ఈరోజు మనసు విప్పి చెబుతున్నా. రాష్ట్రం విడిపోయింది ఒకరికి వ్యతిరేకంగా కాదు. తమ రాష్ట్రాన్ని తాము పరిపాలించుకోవాలని, త్వరితగతిన అభివృద్ధి చెందాలని, తమకు రావాల్సిన న్యాయమైన వాటాను పొందాలన్న ఉద్దేశంతో ప్రజలు ఉద్యమించారు. కలసి కలహించు కోవడం కన్నా విడిపోయి సహకరించు కోవడమే మిన్నా అని ఆనాడే చెప్పా. ఇవాళ తెలుగు ప్రజలు రెండు రాష్ట్రాలుగా విడిపోయినా ప్రపంచం దృష్టిలో మనమంతా తెలుగువారమే'' అని పేర్కొన్నారు. తెలుగు రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో సమస్యలను అర్థం చేసుకుని రాష్ట్రాలను ముందుకు తీసుకెళ్లాలని అభిలషించారు. ఒక కుటుంబంలో, అన్నదమ్ముల మధ్య అభిప్రాయ భేదాలున్నట్లే రెండు రాష్ట్రాల మధ్య ఉంటాయని, అయినా ఇద్దరు సీఎంలు కలసి మెలసి పనిచేస్తూ రెండు రాష్ట్రాలను బలోపేతం చేస్తారని ఆశిస్తున్నట్లు చెప్పారు. సోమవారం రాజ్‌భవన్‌లో రాష్ట్ర ప్రభుత్వం, ప్రజల తరఫున ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు.. ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు ఘనంగా పౌర సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకయ్య మాట్లాడారు. ''స్వరాజ్యం వస్తే సమస్యలన్నీ పరిష్కారమవుతాయని స్వాతంత్య్ర పోరాటం చేశారు. స్వరాజ్యం వచ్చి 70 ఏళ్లు గడిచినా సమస్యలన్నీ పరిష్కారమయ్యాయా? అన్న విషయంపై రాజకీయ నేతలు, ప్రజాప్రతినిధులందరూ ఆత్మావలోకనం చేసుకోవాలి. ఆకలి, అవినీతి, అరాచకాలు, అక్రమాలకు తావు లేని, అందరికి సమాన అవకాశాలు కల్పించే సమాజం ఏర్పాటే అంతిమ లక్ష్యంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలి. రామరాజ్యం అంటే మత రాజ్యం కాదు. ఆకలి, అవినీతి, అక్రమాలకు తావు లేకుండా ప్రజలందరూ సుఖ సంతోషాలతో కలసి ఉండే రాజ్యమే రాజ్యమని మహాత్మాగాంధీ చెప్పారు. ఇలాంటి రామరాజ్యం స్థాపన కోసం అన్ని పార్టీలు, ప్రజాప్రతినిధులు తమ వంతు కర్తవ్యాన్ని నిర్వర్తించాలి. సమ్మిళిత అభివృద్ధి జరిగితేనే ప్రజాస్వామ్యానికి అర్థం ఉంటుంది. దీన్ని సాధించడం అన్ని రాజకీయ పార్టీలు, నాయకుల బాధ్యత అన్న భావం అందరిలో నెలకొల్పాలి''అని అన్నారు. తెలంగాణ ప్రజల ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలంటే అణగారిన వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రధాని నరేంద్ర మోదీ ఇచ్చి పిలుపు మేరకు స్థానిక సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వాలు, కేంద్ర ప్రభుత్వం అంతా కలసి టీం ఇండియా స్ఫూర్తితో పని చేసి దేశాభివృద్ధికి బాటలు వేయాలన్నారు.

ఎవరినీ కలవలేకపోతున్నా..

తెలిసిన వారిని అభిమానంతో, ఆదరణతో పలకరించకపోతే జీవితానికి అర్థం ఏమిటి అని వెంకయ్యనాయుడు ప్రశ్నించారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత ప్రొటోకాల్, భద్రత సమస్యల వల్ల తనను కలవడానికి వచ్చిన వారిని కలవలేకపోతున్నానంటూ ఆవేదన వ్యక్తంచేశారు. ప్రజలతో నేరుగా సంబంధాలు కలిగిన తనకు ఈ కొత్త బాధ్యతలు ఇబ్బందిగా మారాయని, త్వరలో పరిష్కారం కనుక్కుంటానన్నారు. అసెంబ్లీలు, పార్లమెంట్ జరుగుతున్న తీరుపట్ల ఆందోళన వ్యక్తం చేశారు. పాలక, ప్రతిపక్షాలు రాజ్యసభ సజావుగా నడిచేందుకు సహకరించాల్సి ఉంటుందన్నారు.

పోరాటాల గడ్డ తెలంగాణ

పద్యం, గద్యం వినే అవకాశం ఈ రోజుల్లో తగ్గిపోతోందని, ఈ కార్యక్రమాన్ని చక్కగా, సాహిత్య, సంస్కృతి, సాంప్రదాయ బద్ధంగా ఏర్పాటు చేయడం సంతోషం కలిగించిందని వెంకయ్య నాయుడు పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ స్థానిక మాండలిక భాషలో ప్రసంగించిన తీరు సంతోషాన్ని ఇచ్చిందన్నారు. సాహిత్యానికి, సంస్కృతికి ప్రాణపదమైన నేల తెలంగాణ అని కొనియాడారు. ఈ నేల అడుగున ప్రతిఘటన, పోరాటాల చరిత్ర ఉందని, స్వాతంత్య్ర పోరాటం, నిజాం వ్యతిరేక పోరాటంలో ప్రముఖ పాత్ర పోషించిందని కొనియాడారు. కుమ్రం భీం, సమ్మక్క సారక్క, చాకలి ఐలమ్మలు ఇక్కడి పోరాట స్ఫూర్తికి తార్కాణాలని పేర్కొన్నారు. అక్రమాన్ని, అన్యాయాన్ని ఎవరు ఎదిరిస్తారో వారే నా ఆరాధ్య దేవుళ్లు అని ప్రముఖ కవి కాళోజీ నారాయణ రావు అన్న విషయాన్ని ఈ సందర్భంగా వెంకయ్యనాయుడు ప్రస్తావించారు. తెలంగాణ సంస్కృతి విస్తృతమైనదని, బతుకమ్మ, బోనాలు ఇక్కడి విశిష్టమైన పండుగలన్నారు. రుచులు కూడా భిన్నమైనవని, ఇక్కడి బిర్యానీ, హలీం ప్రపంచ ఖ్యాతిగాంచాయని అన్నారు. ఆ పక్కన వెళ్తే నెల్లూరు చేపల కూర కూడా అంతే ప్రసిద్ధి గాంచిందని చెప్పారు.

నేను వెళ్లని మండలం లేదు..

తెలంగాణ నేలలో తాను ఎక్కువ తిరిగానని, పుట్టింది నెల్లూరులో చదివింది విశాఖపట్నంలో అయితే రాజకీయంగా పెరిగింది ఎదిగింది హైదరాబాద్‌లోనే అని వెంకయ్య అన్నారు. ఎమ్మెల్యేగా ఎన్నికై 1977లో హైదరాబాద్‌కు వచ్చానని, దాదాపు 40 ఏళ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నానని చెప్పారు. ''ఈ నగరం అన్నా, తెలంగాణ ప్రాంతం అన్నా ఎంతో ఇష్టం. ఇక్కడ నేను పర్యటించని తాలూక, మండలం లేదంటే అతిశయోక్తి కాదు. ఇక్కడి ప్రజలు, విభిన్న మతాలు, విభిన్న సంప్రదాయాలకు ప్రతీక. కేంద్రమంత్రి దత్తాత్రేయ అలయ్ బలయ్ పేరుతో ఈ సంప్రదాయాన్ని ఉత్సవంగా నిర్వహిస్తున్నారని కొనియాడారు.



రాజ్‌భవన్‌లో వెంకయ్య నాయుడుకు పౌరసన్మానం సందర్భంగా ఆయన నిలువెత్తు చిత్రపటాన్ని బహూకరిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో గవర్నర్ నరసింహన్ తదితరులు

ఎవడయ్యా వాడు.. తెలుగువాడు..

''మన కట్టుబొట్టూ, ఆటాపాటా, మన భాష, మన ధ్యాస, మన గోసలను కాపాడుకోవాల్సిన అవసరముంది. తెలుగు భాషలో సౌందర్యముంది. తెలుగువాడికి ప్రత్యేకత ఉంది''అని వెంకయ్య అన్నారు. ఈ సందర్భంగా తెలుగువాడిపై సినారె రాసిన 'పంచె కట్టులో ప్రపంచంలోనే మొనగాడు.. కండువా లేనిదే గడపదాటని వాడు.. పంచభక్ష్యాలు కంచాన వడ్డించినా గోంగూర పచ్చడికై చూసేవాడు.. ఎవడయ్యా ఎవడు వాడు.. ఇంకెవడయ్యా తెలుగువాడు..' పంక్తులను గుర్తుచేసుకున్నారు. ''నేను తెలుగు రాష్ట్రాల సీఎంలను రెండు విషయాలే కోరుకుంటున్నా. ఒకటి వారిద్దరూ కలసి పని చేయాలి.. రెండోది తెలుగు భాషకు ప్రాధాన్యం ఇవ్వాలి''అని అన్నారు. ''ఆంగ్లం ఓ వ్యాధిలా మారింది. ఆ భాషకు నేను వ్యతిరేకం కాదు. అయితే విద్యా బోధన ఏ భాషలో జరిగినా మాతృభాష తెలుగు ఓ సబ్జెక్టుగా తప్పనిసరిగా ఉండాలి. ఉద్యోగం రావాలంటే తప్పనిసరిగా తెలుగు చదివి ఉండాలి. ప్రజలకు అర్థమైన భాషలో పరిపాలన సాగాలి. పాలనా భాషగా, వ్యావహారిక భాషగా తెలుగుకు ప్రాధాన్యం ఇవ్వాలి''అని అన్నారు.

ఎన్టీఆర్ తర్వాత తెలుగోడికి మళ్లీ అంతటి గౌరవం

వెంకయ్యనాయుడు మనందరికి గర్వకారణం: సీఎం కేసీఆర్

- దేశంలోనే అద్భుతమైన వక్త.. ఎమర్జెన్సీ టైంలో ఆయన ప్రసంగం విన్నా
- ఉప రాష్ట్రపతిగా దేశానికి మేలు చేస్తారు: గవర్నర్

సాక్షి, హైదరాబాద్: ''ఎన్టీఆర్ రాజకీయాల్లోకి వచ్చిన తర్వాతే దేశంలో తెలుగువారంటూ ఉన్నారని ప్రపంచానికి తెలిసింది. తెలుగు భాష ఉందన్న గౌరవం లభించింది. మళ్లీ అలాంటి గౌరవం తెలుగు బిడ్డ వెంకయ్య నాయుడు ఉప రాష్ట్రపతిగా ఎన్నిక కావడంతో లభించింది'' అని సీఎం కె.చంద్రశేఖర్‌రావు కొనియాడారు. ఉప రాష్ట్రపతిగా ఎన్నికైన తర్వాత తొలి సన్మానం జరిపే అవకాశాన్ని రాష్ట్రానికి ఇచ్చినందుకు వెంకయ్య నాయుడికి కృతజ్ఞతలు తెలుపుతున్నానన్నారు. తెలుగు వ్యక్తి అత్యున్నత శిఖరాన్ని అధిరోహించడం మనందరికి సంతోషం, గర్వకారణమన్నారు. సోమవారం వెంకయ్యకు నిర్వహించిన పౌరసన్మానం కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. ఆయన అద్భుతమైన వక్త అని కొనియాడారు. ''వక్తృత్వం, ఉపన్యాసాన్ని పండించడానికి అద్భుతమైన పదాల కూర్పు, భావం అవసరం. 'చదువది ఎంత గలిగిన.. రసజ్ఞత ఇంచుక చాలకున్నా.. ఆ చదువది నిరర్థకంబు' అన్నట్టు ప్రసంగంలో రసజ్ఞత కొరవడితే ఆకట్టుకోదు. కొంచెం హాస్యం, చతురత అన్నీ కలగలసి ఉండాలి. వీటన్నింటిని జోడించి ఉపన్యాసాన్ని పండించడంలో దేశంలోనే అద్భుతమైన వక్త వెంకయ్య. తెలుగు, హిందీ, ఆంగ్లంలో అద్భుతంగా ప్రసంగిస్తారు. బీజేపీ నేత సుబ్రమణ్యస్వామితో కలసి 1980వ దశకంలో సిద్దిపేటలో ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా వెంకయ్య నాయుడు అద్భుతంగా ఉపన్యాసం చేశారు. అప్పుడే పీజీ పూర్తి చేసిన నాకు ఆ ఉపన్యాసం వినే అవకాశం లభించింది'' అని సీఎం అన్నారు. నాలుగు పర్యాయాలు ఎంపీగా, రెండు పర్యాయాలు కేంద్రమంత్రిగా ప్రజలకు వెంకయ్య సేవలు చేశారన్నారు. ఓ జాతీయ పార్టీకి అధ్యక్షుడిగా వ్యవహరించి తెలుగువారి గౌరవాన్ని పెంపొందించారన్నారు. వెంకయ్య నాయుడు ఆత్మీయంగా మాట్లాడుతారని, తమవారు అన్న భావన కలిగిస్తారని ప్రశంసించారు. కార్యక్రమంలో కేంద్రమంత్రి దత్తాత్రేయ, అసెంబ్లీ స్పీకర్ మధుసూధనాచారి, శాసన మండలి చైర్మన్ స్వామిగౌడ్, ఉప ముఖ్యమంత్రులు కడియం శ్రీహరి, మహమూద్ అలీ, మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సినీ ప్రముఖులు, వివిధ రంగాల ప్రముఖులు పాల్గొన్నారు.

సభను సజావుగా నడుపుతారు: గవర్నర్

వెంకయ్య నాయుడు గొప్ప వక్త అని, రాజ్యసభను సజావుగా నిర్వహించడంలో సఫలమవుతారని గవర్నర్ నరసింహన్ అన్నారు. పార్టీ నాయకుడిగా, ఎంపీగా, కేంద్రమంత్రిగా దేశానికి ఎంతో సేవ చేసిన వెంకయ్య.. ఉప రాష్ట్రపతిగా కూడా ఎంతో మేలు చేస్తారనడంలో ఎలాంటి అనుమానాలు లేవన్నారు. ''ఉషాపతి (వెంకయ్య సతీమణి పేరు ఉష)గా ఉంటాను.. ఉప రాష్ట్రపతిగా వద్దు అని వెంకయ్య అన్నారు.. కానీ ఉషాపతిగా ఉంటే ఉపరాష్ట్రపతిగా ఉన్నట్లే..'' అని గవర్నర్ చమత్కరించారు. శ్లోకాలు, పద్యాలతో గవర్నర్ నరసింహన్, సీఎం కేసీఆర్ తమ ప్రసంగాల్లో వెంకయ్యపై ప్రశంసల వర్షం కురిపించారు. వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య సీఎం కేసీఆర్.. వెంకయ్యకు పట్టు వస్త్రాలు, మెమెంటోను బహూకరించి సత్కరించారు.

✦ 26, 27 తేదీల్లో పీజీఈసెట్ కౌన్సెలింగ్

హైదరాబాద్: ఇంజనీరింగ్ పీజీ కోర్సులు ఎంటెక్, ఎంఈ, ఎంఫార్మసీ, ఎంఆర్క్ కోర్సుల్లో ప్రవేశానికి ఈ నెల 26, 27వ తేదీల్లో రెండో విడత కౌన్సెలింగ్‌ను నిర్వహించనున్నట్లు సెట్ కోఆర్డినేటర్ ప్రొఫెసర్ రమేశ్ బాబు తెలిపారు. పీజీఈసెట్‌లో అర్హత సాధించిన విద్యార్థులు ఓయూ క్యాంపస్‌లోని పీజీఈసెట్ అడ్మిషన్స్ కార్యాలయంలో సర్టిఫికెట్లను వెరిఫికేషన్ చేయించుకోవాలని అన్నారు. మొదటి విడత కన్వీనర్ కోటా సీట్లలో 6 వేల సీట్లు భర్తీ అయ్యాయని, కేవలం 1000 సీట్లు మాత్రమే ఖాళీగా ఉన్నాయని అధికారులు పేర్కొన్నారు. ప్రతి ఏడాది ఇంజనీరింగ్‌లో పీజీ సీట్ల సంఖ్య తగ్గుతుందని తెలిపారు.

✦ ఓపెన్ ఎస్సెస్సీ పరీక్షల ఫీజు గడువు పెంపు

సాక్షి, హైదరాబాద్: అక్టోబర్‌లో నిర్వహించనున్న ఓపెన్ స్కూల్ ఎస్సెస్సీ, ఇంటర్మీడియెట్ పరీక్షలకు హాజరు కావాలనుకునే వారు ఈ నెల 26వ తేదీ వరకు తత్కాల్‌లో ఫీజు చెల్లించవచ్చని ఓపెన్ స్కూల్ సొసైటీ ఓ ప్రకటనలో తెలిపింది. పరీక్ష ఫీజుకు అదనంగా తత్కాల్ కింద ఎస్సెస్సీకి రూ. 500, ఇంటర్‌కు రూ. 1,000 చెల్లించాలని సూచించింది. గతంలో ఇచ్చిన తత్కాల్ గడువు ఈ నెల 21తో ముగిసిపోయిందని, అయితే ఆ గడువును మరోసారి పొడిగిస్తున్నట్లు పేర్కొంది. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరింది.

ఇది ఆరంభమే

మరో ఏడేళ్లలో హైదరాబాద్‌ను విశ్వనగరం చేస్తాం

- బాలానగర్ ఫ్లైఓవర్ భూమిపూజలో మంత్రి కేటీఆర్
- నగర డ్రైనేజీ వ్యవస్థ మార్చేందుకు రూ.11 వేల కోట్లు అవసరం
- అభివృద్ధి, సంక్షేమంపై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ
- 2019లో అధికారం టీఆర్ఎస్‌దేనని తెలిసే కాంగ్రెస్ నేతల తప్పుడు ప్రచారం

సాక్షి, హైదరాబాద్: రాబోయే ఏడెనిమిదేళ్లలో అంతర్జాతీయ ప్రమాణాలతో హైదరాబాద్‌ను విశ్వనగరంగా తీర్చిదిద్దుతామని, బాలానగర్ ఫ్లైఓవర్ పనులే ఇందుకు ఆరంభమని పురపాలకశాఖ మంత్రి కె.తారకరామారావు అన్నారు. గత పాలకుల నిర్లక్ష్యంతో చిందరవందరగా మారిన నగరాన్ని పూర్తిస్థాయిలో మార్చేందుకు కొంత సమయం పడుతుందని చెప్పారు. హైదరాబాద్ మహానగరాభివృద్ధి సంస్థ (హెచ్ఎండీఏ) రూ.369.53 కోట్లతో బాలానగర్‌లోని శోభన థియేటర్ నుంచి ఐడీపీఎల్ వరకు నిర్మించనున్న 6 లేన్ల ఫ్లైఓవర్ (1.09 కి.మీ. పొడవు) పనులకు సోమవారం కేటీఆర్ భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. 'తెలంగాణ వస్తే కరెంట్ ఉండదు, నీటి సమస్యలొస్తాయి, శాంతిభద్రతలు అదుపులో ఉండవంటూ గత పాలకులు ఎన్నో అపోహలు సృష్టించారు.వారి అపోహలకు చెక్ పెడుతూ శాంతిభద్రతల అదుపులో దేశంలోనే హైదరాబాద్ నంబర్ వన్‌గా నిలిచింది' అన్నారు. రాష్ట్రంలో, నగరంలో మండువేసవిలోనూ కరెంట్ కోతలు లేకుండా చేశామని, చిన్న తరహా పరిశ్రమలకు ఆసరాగా నిలిచామని పేర్కొన్నారు. అధికారంలో ఉన్నప్పుడు నగరాన్ని పట్టించుకోని కాంగ్రెస్.. టీఆర్ఎస్ ప్రభుత్వ అభివృద్ధిపై విమర్శలు చేస్తోందని విమర్శించారు. 2019లో కేసీఆర్‌కే ప్రజలు పట్టం కడతారని కాంగ్రెస్ నేతలకు తెలిసే తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు.

'నీటి' పనులకు అడ్డుపడుతున్నారు

రాష్ట్ర ప్రభుత్వం రైతులకు నీళ్లిచ్చే ప్రయత్నం చేస్తుంటే.. కాంగ్రెస్ వాళ్లు కేసులేస్తూ ప్రాజెక్టులను అడ్డుకుంటున్నారని కేటీఆర్ మండిపడ్డారు. నగరానికి శాశ్వతంగా తాగునీటి తిప్పలు లేకుండా కాళేశ్వరం ప్రాజెక్టుతో గోదావరి, ప్రాణహిత నదుల నుంచి డెడికేటెడ్ డ్రింకింగ్ వాటర్ రిజర్వాయర్‌ను కట్టాలనుకుంటున్నామని, దీనివల్ల మూడేళ్లు కరవొచ్చినా నగరవాసులకు తాగునీటి గోస ఉండబోదని చెప్పారు. కానీ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా చనిపోయినవారి వేలిముద్రలతో దొంగ కేసులేస్తున్నారని, అసెంబ్లీలో శాసనసభాపక్ష నేత జీవన్‌రెడ్డి ఈ విషయాన్ని ఒప్పుకున్నారని గుర్తు చేశారు. కేసులు పెట్టింది అవాస్తవమైతే శాసనసభ సాక్షిగా చెప్పిన మాట తప్పని కాంగ్రెస్ నేతలు చెప్పాలన్నారు.

టీఎస్ ఐపాస్‌తో రూ.70 వేల కోట్ల పెట్టుబడులు

సీఎం కేసీఆర్ మార్గదర్శనంలో అభివృద్ధి, సంక్షేమం బ్రహ్మాండంగా ముందకెళుతోందని కేటీఆర్ అన్నారు. రైతులకు ఉచిత కరెంట్‌తో పాటు వచ్చే ఏడాది నుంచి 'మన పంట–మన పెట్టుబడి'తో ఎకరాకు 4,000 ఇచ్చే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. రాష్ట్రం ఏర్పడ్డాక పారిశ్రామికవేత్తలు వెళ్లిపోతారన్న అపోహలను పటాపంచలు చేస్తూ 'ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్'లో దేశంలోనే రాష్ట్రం అగ్రగామిగా ఉందని పేర్కొన్నారు. టీఎస్ ఐపాస్ ద్వారా 70 వేల కోట్ల పెట్టబడులు తీసుకొచ్చామని, ఈ కంపెనీలతో 2,30,000 మందికి ఉపాధి లభించిందన్నారు. దేశంలో నాణ్యతతో కూడిన జీవన ప్రమాణాలున్న నగరంగా హైదరాబాద్ నంబర్ 1 స్థానంలో నిలిచిందన్నారు.

నగరాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి

హైదరాబాద్‌లో రూ.3 వేల కోట్లతో రోడ్లు, ఫ్లైఓవర్, జంక్షన్ల అభివృద్ధి పనులు చేస్తున్నామని, మరో రూ.పది వేల కోట్ల ప్రతిపాదనలున్నాయని కేటీఆర్ చెప్పారు. మురుగు నీటి వ్యవస్థ సరిగా లేక 2 సెం.మీ. వర్షమొస్తే నగర రోడ్లపైనే నీరు నిలుస్తోందని, డ్రైనేజీ వ్యవస్థ మార్చాలంటే రూ.11 వేల కోట్లు కావాలన్నారు. శివారు మున్సిపాలిటీల్లో రూ.2 వేల కోట్లతో భగీరథ పనులు చేస్తున్నామని, తాగునీటికి 56 రిజర్వాయర్లు నిర్మిస్తున్నామని పేర్కొన్నారు. నాగోల్–మియాపూర్ మెట్రో మార్గాన్ని నవంబర్ నెలాఖర్లో ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నామన్నారు. ప్యారడైజ్–కొంపల్లి, జూబ్లీ బస్టాండ్–తూముకుంట వరకు 2 స్కైవేలు నిర్మించనున్నామన్నారు. అంబర్‌పేట 6 నంబర్–రామంతాపూర్, ఉప్పల్–నారపల్లి ఫ్లైఓవర్ల పనులను త్వరలోనే చేపడతామన్నారు. కార్యక్రమంలో మంత్రులు తలసాని శ్రీనివాస్ యాదవ్, మహేందర్ రెడ్డి, ఎంపీ మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, వివేకానంద, హెచ్ఎండీఏ కమిషనర్ చిరంజీవులు, మెంబర్ ఎస్టేట్ రాజేశం, జీహెచ్ఎంసీ డిప్యూటీ మేయర్ ఫసీయుద్దీన్ పాల్గొన్నారు.

కోదండరామిరెడ్డి.. దొంగ రామిరెడ్డి: నాయిని

టీజేఏసీ చైర్మన్ కోదండరామిరెడ్డి దొంగ రామిరెడ్డి అని హోంమంత్రి నాయిని విమర్శించారు. ఉద్యమ సమయంలో కేసీఆర్ మద్దతుతోనే టీజేఏసీ చైర్మన్ అయ్యారని, దాన్ని మరిచి సొంతంగా చైర్మన్ అయినట్టు విర్రవీగుతున్నారని, కాంగ్రెస్ తొత్తుగా మారి మాట్లాడుతున్నారని నిప్పులు చెరిగారు. కేసీఆర్‌ను ప్రజలు పెద్ద కొడుకుగా భావిస్తుంటే.. వారు మాత్రం అభివృద్ధికి అడ్డుపడుతూ.. తప్పుడు ప్రచారం చేస్తున్నారని దుయ్యబట్టారు.



బాలానగర్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న మంత్రి కేటీఆర్. చిత్రంలో మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఎంపీ మల్లారెడ్డి తదితరులు

నేడు రేపు మోస్తరు.. తర్వాత రెండ్రోజులు భారీ వర్షాలు



సాక్షి, హైదరాబాద్: రుతుపవనాలు ఊపందుకోవడంతో మంగళ, బుధవారాల్లో కొన్నిచోట్ల తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. ఆ తర్వాత 24, 25 తేదీల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. ఇదిలావుండగా గత 24 గంటల్లో సారంగాపూర్, బాన్సువాడ, లింగంపేట్, నాగరెడ్డి పేట్, ఎల్లారెడ్డి, తాడ్వాయిలలో 2 సెంటీమీటర్ల చొప్పున వర్షపాతం నమోదైంది. మరికొన్నిచోట్ల ఒక సెంటీమీటర్ చొప్పున వర్షం కురిసింది.

ఆర్ఎంపీ, పీఎంపీలకు ఒకేసారి శిక్షణ

సంఘం ప్రతినిధులతో మంత్రి లక్ష్మారెడ్డి భేటీ

సాక్షి, హైదరాబాద్: గ్రామీణ ప్రాంతాల్లో పనిచేస్తున్న ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు రాష్ట్రవ్యాప్తంగా ఒకేసారి శిక్షణ ఇవ్వనున్నట్లు వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సి.లక్ష్మారెడ్డి తెలిపారు. ఆర్ఎంపీలు, పీఎంపీల్లో వృత్తి నైపుణ్యం పెంచేందుకు నిర్ణయించినట్లు చెప్పారు. ఆర్ఎంపీలు, పీఎంపీలకు ప్రభుత్వపరంగా శిక్షణ ఇచ్చి.. సర్టిఫికెట్లు, గుర్తింపు కార్డులను ఇవ్వాలని ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యుల జేఏసీ ప్రతినిధులు మంత్రిని కోరారు. ఆర్ఎంపీ, పీఎంపీ జేఏసీ చైర్మన్ శ్రీనివాసగౌడ్‌తో కలసి సోమవారం లక్ష్మారెడ్డితో భేటీ అయ్యారు. అధికారులతో ఎదురవుతున్న ఇబ్బందులను అరికట్టాలని కోరారు. ఆర్ఎంపీ, పీఎంపీ వైద్యులకు సమస్యలు రాకుండా చూస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

సాక్షి


మంగళవారం, ఆగస్టు 22

మళ్లీ ఘోర ప్రమాదం

ఉత్తరప్రదేశ్‌లోని ముజఫర్‌నగర్ జిల్లా ఖతౌలి సమీపాన శనివారం పూరీ–హరిద్వార్ ఉత్కళ్ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌కు జరిగిన ప్రమాదం మరోసారి రైల్వే శాఖ లోపాలను బట్టబయలు చేసింది. 22మంది నిండు ప్రాణాలు తీసి, మరో 156 మంది గాయాలపాలు కావడానికి దారి తీసిన ఈ దుర్ఘటనకు మానవ తప్పిదమే కారణమని ప్రాథమికంగా నిర్ధారించారు. ప్రమాదాల్లో మానవ తప్పిదం విషయాన్ని వెనువెంటనే ఆ శాఖ అంగీకరించడం చాన్నాళ్ల తర్వాత ఇదే మొదటిసారి. అంతే కాదు... కార్యదర్శి స్థాయి రైల్వే బోర్డు అధికారిని సెలవుపై పంపి, నలుగురు అధికారులను సస్పెండ్ చేయడంతోపాటు ఒకరిని బదిలీచేశారు. ప్రమాదం జరిగాక రైల్వే సిబ్బందిలో ఇద్దరి మధ్య జరిగిన సంభాషణ వెల్లడికావడం వల్ల ఇంత చురుగ్గా వ్యవహరించి ఉండొచ్చు. ఆ సంభాషణ ప్రమాదం జరిగిన పట్టాలపై వెల్డింగ్ పనులు నడుస్తున్నాయని నిర్ధారిస్తోంది.

ప్రయాణికుల భద్రతకు అత్యధిక ప్రాధాన్యమిస్తున్నామని రైల్వే శాఖ తరచు చెబుతుంటుంది. కానీ చాలా ప్రమాదాలు పట్టాలు తప్పడం కారణంగానే చోటు చేసుకుంటున్నాయి. శనివారంనాటి ప్రమాదానికి కేవలం పైనుంచి కింది వరకూ ఉండే సిబ్బంది మధ్య ఏర్పడ్డ సమాచార లోపమే కారణం. పట్టాలపై పనులు సాగుతున్నాయి గనుక 20 నిమిషాలు ఇటువైపు రైళ్లు రాకుండా చూడాలని తాము చెప్పామని కొందరంటుంటే, తనకలాంటి సమాచారం లేదని స్టేషన్ సూపరింటెండెంట్ చెబుతున్నారు. పట్టాలపై స్వల్ప మరమ్మతులేమైనా ఉంటే ఆ కొద్ది నిడివిలోనూ రైలును అతి నెమ్మదిగా నడుపుతారు. పనుల సంగతిగానీ, అటు వెళ్ల కూడదన్న సంగతిగానీ తెలియని డ్రైవర్ యథాప్రకారం వేగంతో నడిపిన కారణంగా 22మంది ప్రాణాలు అర్ధంతరంగా ముగిసిపోయాయి. నిజానికి మరమ్మతులున్న పక్షంలో ఆ పని జరిగే ప్రాంతంవైపు రైళ్లు రాకుండా ఎర్రజెండాలుంచుతారు. కనీసం అది కూడా అక్కడ పాటించి ఉండరని ప్రమాదం జరిగిన తీరును చూస్తే అర్ధమవుతుంది. పట్టాల మరమ్మతులు, ఇతరత్రా పనులు చేసేటప్పుడు ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోవాలో తెలియజెప్పే మాన్యువల్ ఉంటుంది. అలాంటి సమయాల్లో ఏ స్థాయి వారి బాధ్యతలేమిటో, ఎవరు ఏఏ పనులు నిర్వర్తించాలో స్పష్టంగా ఆ పుస్తకం వివరిస్తుంది. పైగా మరమ్మతులున్నప్పుడు ముందస్తుగా లిఖితపూర్వక అనుమతులు తీసుకోవడం తప్పనిసరి. ఏదైనా లోపాన్ని గుర్తించినప్పుడు అత్యవసరంగా పట్టాల్ని మరమ్మతు చేయాల్సి రావొచ్చు. ఆ సమయంలో సైతం పనులకు సంబంధించిన వర్తమానాన్ని అన్ని స్థాయిల్లోనివారికి చేరేయగలగాలి. మరమ్మతుల విషయంలో అక్కడి రైల్వే డివిజన్ మొదలుకొని స్థానిక స్టేషన్ సూపరింటెండెంట్ వరకూ ప్రతి ఒక్కరికీ సమాచారం ఉండి తీరాలి. అప్పుడు మాత్రమే రైలు నడిపే డ్రైవర్‌కు ఆ విషయం తెలుస్తుంది. ప్రతి స్థాయిలోనూ అతడికి సూచనలు అందుతాయి. ఆ మార్గదర్శకాలను అనుసరిస్తే ఇలాంటి ప్రమాదాలు జరిగే ఆస్కారం ఉండదు. ఇందులో ఎక్కడ లోపం జరిగినా ప్రయాణికుల ప్రాణాలకు ముప్పు వస్తుంది. నిజానికి సిబ్బంది సంసిద్ధత ఏమేరకు ఉన్నదో తెలుసుకోవడానికి నిర్ణీత కాలవ్యవధిలో కసరత్తులు జరుగుతుంటాయి. వాటిల్లో బయటపడే లోపాలపై సమీక్ష నిర్వహించుకుని సరిదిద్దుకోవాలి. అవి క్రమం తప్పకుండా కొనసాగిస్తుంటే ప్రమాదాలను నివారించవచ్చు. రైల్వే శాఖకొస్తున్న నష్టాలను తగ్గించుకోవడానికి చాన్నాళ్లనుంచి సిబ్బందిని తగ్గించడం, మరీ తప్పనిసరైనప్పుడు కాంట్రాక్టు సిబ్బందిని తీసుకోవడం, అదే సమయంలో ఆధునికీకరణ ప్రక్రియ చురుగ్గా ముందుకు సాగకపోవడం వంటివి సమస్యలు తెస్తున్నాయని రైల్వే యూనియన్లు ఆరోపిస్తుంటాయి. సిబ్బందిపై పని భారం విపరీతంగా పెరిగిపోవడం వల్ల వారికి దేనిపైనా సమగ్రంగా దృష్టి సారించడం సాధ్యం కావడంలేదన్న ఆరోపణ కూడా ఉంది. విస్తృతమైన దర్యాప్తు చేస్తే తప్ప ఇప్పుడు జరిగిన ప్రమాదంలో వీటి భాగమెంతో తెలియదు. ప్రమాదం జరిగినప్పుడల్లా పట్టాలను మెరుగుపర్చడానికి, వాటి యాజమాన్య నిర్వహణకు వినియోగిస్తున్న లేదా వినియోగించబోతున్న సాంకేతికత గురించి, బోగీల ప్రమాణాలు పెంచడానికి తీసుకుంటున్న చర్యలు వగైరాలను చెప్పడం రైల్వే శాఖకు పరిపాటి.

ఈసారి కూడా నలువైపుల నుంచీ వస్తున్న విమర్శల ధాటికి రైల్వే శాఖ స్పందించింది. గత మూడేళ్లలో ప్రమాదాలు చాలా భాగం తగ్గాయని చెబుతోంది. 2014–15లో 135 ప్రమాదాలు జరిగితే ఆ మరుసటి సంవత్సరం 107, ఈ ఏడాది ఇంతవరకూ 104 జరిగాయని గణాంకాలు ఏకరువు పెట్టింది. నిరుటితో పోలిస్తే ఈ ఏడాది మెరుగుదల 48.3 శాతం ఉన్నదని వివరించింది. యూపీఏ హయాంతో పోలిస్తే గత మూడేళ్లలో ఏ ఏ అంశాల్లో పురోగతి సాధించామో చెప్పింది. అలాగే భద్రతకు యూపీఏ ప్రభుత్వం ఏటా రూ. 33,972 కోట్లు వెచ్చిస్తే తాము రూ. 54,031 కోట్లు ఖర్చు చేస్తున్నామని వివరించింది. అయితే ఇలాంటి గణాంకాలు స్వీయ సమీక్షకు పనికొస్తాయి తప్ప ప్రయాణికులను సంతృప్తిపరచలేవు. వారికి సంబంధించినంతవరకూ సురక్షితంగా గమ్య స్థానాలకు చేరడం ముఖ్యం. అందుకు చేస్తున్నదేమిటో రైల్వే శాఖ చెప్పగలగాలి. ముఖ్యంగా ఖాళీల భర్తీ విషయంలో తీసుకుంటున్న చర్యలేమిటో తెలియజేయాలి. పట్టాల నిర్వహణ, బోగీల పటిష్టత, ప్రమాదాల నివారణకు వివిధ స్థాయిల్లో అమల్లోకి తెచ్చిన వ్యవస్థలు వగైరాలపై వివరించాలి. వీటన్నిటినీ రైల్వే శాఖలోని విభాగాలే చూస్తూ అంతర్గత సమీక్షలతో సరిపెడితే కుదరదు. వివిధ రంగాల నిపుణులతో కూడిన సంఘం ఎప్పటికప్పుడు గమనిస్తూ నిర్ణీత కాలవ్యవధిలో నివేదికలిచ్చే ఏర్పాటుండాలి. రైల్వే శాఖ చెబుతున్నదానికీ, క్షేత్ర స్థాయిలో ఉన్న వాస్తవానికీ మధ్య ఉన్న వైరుధ్యాలు అందరికీ తెలియాలి. అలాచేస్తే రైల్వే శాఖ అనుసరిస్తున్న ప్రమాణాలపై సాధారణ ప్రజానీకంలో విశ్వసనీయత కలుగుతుంది. అందుకవసరమైన పారదర్శకత పాటించడం తక్షణావసరమని ఆ శాఖ గుర్తించాలి.




ఏ రంగంలోనైనా నాణ్యత అనేది యాధృచ్ఛికంగా సంభవించేది కాదు. అది ఎల్లప్పుడు సామూహిక మేధో ప్రయత్నమే.

– జాన్ రస్కిన్
బ్రిటిష్ రచయిత, విమర్శకుడు

గ్రహం అనుగ్రహం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్ష ఋతువు భాద్రపద మాసం, తిథి శు.పాడ్యమి రా.10.54 వరకు, తదుపరి విదియ నక్షత్రం మఖ సా.4.14 వరకు, తదుపరి పుబ్బ, వర్జ్యం రా.12.07 నుంచి 1.40 వరకు, దుర్ముహూర్తం ఉ.8.17 నుంచి 9.10 వరకు, తదుపరి రా.10.54 నుంచి 11.40 వరకు, అమృతఘడియలు ప.1.52 నుంచి 3.26 వరకు.


సూర్యోదయం : 5.46
సూర్యాస్తమయం : 6.20
రాహుకాలం : ప 3.00 నుంచి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుంచి 10.30 వరకు



నమాజ్ వేళలు

ఫజర్	4.46	మగ్రీబ్	6.37
జొహర్	12.19	ఇషా	7.52
అసర్	4.46		

రహస్య సంధి ఫలితమే రగడ



ఏబీకే ప్రసాద్
సీనియర్ సంపాదకులు

భూటాన్–చైనాల మధ్య డోక్లామ్‌తో ఏర్పడిన సంక్షోభంలో భూటాన్‌కు–భారత ప్రభుత్వానికి మధ్య కుదిరిన రహస్య ఒప్పందంవల్ల వర్తక, వాణిజ్య సంబంధాలు కూడా దెబ్బతినే అవకాశం ఉందా? గత మూడుమాసాలుగా భూటాన్–చైనాల మధ్య ఆ మేరకు, భారత్–చైనాల మధ్య తగాదాలు లేదా ఘర్షణలు పరిమితిని దాటి మరింతగా కుదరకపోవడానికి కారణం కూడా ప్రపంచ మార్కెట్‌లో చైనా స్థాపించుకున్న వర్తక సంబంధంలో దాని అగ్రస్థానమే అయి ఉంటుంది.

''ప్రధాని నరేంద్ర మోదీ అమెరికా పర్యటనలో ఉన్నప్పుడు ఆ దేశ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 1962లో భారత్–చైనా సరిహద్దు యుద్ధంలో ఇండియాకు కలిగిన నష్టాల గురించి హెచ్చరించారు. అదే సమయంలో పాకిస్తాన్, నేపాల్, బంగ్లాదేశ్, శ్రీలంక, మైన్మార్‌లతో చైనా ఎలా సన్నిహిత సంబంధాలు పెంచుకుందో గమనించాలని గుర్తు చేశారు.''

– పత్రికల వార్తలు

''1. పరస్పరం ఇరుదేశాల సరిహద్దుల సమగ్రత, సార్వభౌమాధికారాల పట్ల గౌరవ భావం చూపాలి. 2. పరస్పరం దాడులను నివారించాలి. 3. దేశ ఆంతరంగిక వ్యవహారాలలో పరస్పరం జోక్యం చేసుకోరాదు. 4. సమానత్వాన్నీ, పరస్పర ప్రయోజనాన్ని గౌరవించుకోవాలి. 5. శాంతి సహకారాలతో పరస్పరం వర్ధిల్లాలి.''

(ఏప్రిల్ 29, 1954 తేదీన భారత్–చైనా పంచసూత్రాల ఆధారంగా బీజింగ్‌లో చేసుకున్న ఒప్పందం)

ఈ 'పంచసూత్ర'ఒడంబడిక పైన ఇండో–చైనా అధిపతులు టిబెట్ సమస్య పూర్వరంగంలో కుదుర్చుకోవడానికి కారణం– టిబెట్‌పైన చైనా సర్వసత్తాక సార్వభౌమాధికారాన్ని నాటి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ గుర్తించక తప్పక పోవడమే. ఏ రెండు ఇరుగుపొరుగు దేశాల అధిపతులైనా తమ పార్టీ రాజకీయ ప్రతిపత్తిని సంరక్షించుకోవడానికో, తమ అధికార స్థానాలు నిలబెట్టుకునేందుకో దేశ సరిహద్దులనీ, ఉభయ దేశాల ప్రజల విశాల ప్రయోజనాలనీ పణంగా పెట్టడానికో తగాదాలను పెంచి యుద్ధాలకు దారి తీసేవిధంగా వ్యవహరించరాదు. కానీ ప్రస్తుతం జరుగుతున్నదేమిటి? 1962లో ఈ రెండు దేశాల మధ్య జరిగిన భీకర సరిహద్దు ఘర్షణలు ఎట్టకేలకు ఒక కొలిక్కి వచ్చాయి. కానీ గత మూడు మాసాలుగా మరొక దేశం (భూటాన్) సరిహద్దు ప్రాతిపదికగా యుద్ధం జరగకపోయినా, అందుకు దారి తీయగల స్థాయిలో సైన్యాల మోహరింపు జరుగుతోంది. నిజానికి ఆనాడు టిబెట్ కారణంగానూ, ఆ దేశ ఫ్యూడల్ వ్యవస్థ అవశేషంగా ఉన్న దలైలామా పారిపోయి భారత్‌కు వస్తే మన పాలకులు ఆశ్రయం ఇచ్చిన కారణంగా ఉభయ దేశాల నడుమ ఘర్షణలు తలెత్తాయి.

చారిత్రక పరిస్థితులను గమనించాలి

గత పరిణామాలుగానీ, తాజాగా సిక్కిం– భూటాన్ సరిహద్దులు ఆధారంగా జన సంచారంలేని డోక్లామ్ పీఠభూమిలో భారత్–చైనాల మధ్య కొత్తగా అంకురించిన ఘర్షణ వాతావరణం గానీ– ఏ పూర్వ రంగంలో, ఏ చారిత్రక పరిణామాల ఫలితంగా సంక్రమించాయో గ్రహించాలి. ఎందుకంటే, 1962 నాటి తగాదాలకు ఏ బ్రిటిష్ సామ్రాజ్యవాద పాలకులు 19వ శతాబ్దంలో కారకులైనారో, నేటి డోక్లామ్ ఘర్షణ వాతావరణానికి కూడా వారే కారకులని మరచిపోరాదు. ఒకప్పుడు నేపాల్, సిక్కిం, భూటాన్ బ్రిటిష్ పాలనలో కొన సాగవలసి వచ్చింది. తరువాత భారతదేశం స్వాతంత్ర్యం సాధించుకున్న దరిమిలా నేపాల్‌తో పాటు, సిక్కిం కూడా స్వతంత్ర ప్రతిపత్తిగల దేశంగా ఉన్నప్పటికీ భారత్–చైనాల మధ్య సరిహద్దు వివాదాల మధ్య ఇందిరాగాంధీ నేతృత్వంలో సిక్కింను భారత్‌లో ఒక రాష్ట్రంగా విలీనం చేయడం జరిగింది. ఈ పరిణామాన్ని 'దురాక్రమణ'గా ప్రకటించినవారు మరెవరో కాదు, తరువాత ప్రధాని పదవిని చేపట్టిన మొరార్జీ దేశాయే. భూటాన్ కూడా నేపాల్‌తో పాటు స్వతంత్ర దేశంగా ఉంటూ వచ్చింది. కానీ విదేశీ వ్యవహారాలు మాత్రం భారత ప్రభుత్వానికి దఖలు పరిచింది. ప్రస్తుతం సిక్కిం, భూటాన్,

రెండో మాట



చైనాల మధ్య అధికారిక సరిహద్దులు లేక పైలాపచ్చీసుగా ఉన్న డోక్లామ్ పీఠభూమిలో రోడ్ల నిర్మాణాన్ని చైనా ఆరంభించింది. నిజానికి ఇది భూటాన్–చైనాల సమస్య. కానీ భూటాన్ తన వైదేశిక విధానాల నిర్ణయాల అధికారాన్ని మన దేశానికి అప్పగించడంతో డోక్లామ్ వివాదంలో భారత్ ఇరుక్కోవలసి వచ్చింది. అంటే 1914–15 నాటి సిమ్లా సమావేశంలో ఒక చైనా అధికారికి అధికారి హోదా కల్పించి దొంగచాటుగా టిబెట్‌ను చైనా నుంచి విడగొట్టడానికి బ్రిటిష్ వలస అధికారి మెక్‌మహన్ దొంగ సంధి పత్రం మీద సంతకం చేయించుకున్నాడు. అయితే అది దొంగ పత్రమేనని అంగీకరిస్తూనే 'నిజానికి చైనా ప్రభుత్వ అధికార ప్రతినిధులు టిబెట్‌ను చైనా నుంచి విభజించే పత్రం మీద సంతకాలు చేయడానికి నిరాకరించార'ని స్పష్టం చేయవలసి వచ్చింది. అలాగే ఇప్పుడు అలాంటి పరిస్థితే 'డోక్లామ్' తగాదా పూర్వరంగంలో మనకూ, చైనాకూ మధ్య దాపురించింది. ఇది మన పాలకులకు కక్కలేని, మింగలేని పరిస్థితి. కనుకనే ముందు డోక్లామ్‌లోకి మన సైనికుల్ని పంపి భూటాన్ తరపున వకాల్తా పుచ్చుకునేందుకు దూకాం. కానీ భూటాన్ ఈ సంక్షోభంలో ఎటూ పాలుపోక కాసేపు ఇండియా తరపునా, మరి కాసేపు చైనా తరపునా మాటలు మార్చి ఊగిసలాడుతోంది. ఈ ఊగిసలాటకు కారణం–సిక్కిం–భూటాన్–చైనాల మధ్య త్రికోణాకారంలో ఉన్న ఊసర క్షేత్రం డోక్లామ్.

భూటాన్ ఊగిసలాట

మనకు సంక్రమించిన 'పెత్తన'మల్లా భూటాన్ విదేశాంగ వ్యవహారాల నిర్వహణ బాధ్యతను అక్కడి రాచరిక ప్రభుత్వం అప్పగించటం. ఈ పెత్తనం భూటాన్ తన ఇష్టానుసారంగా దఖలు పరచడంవల్లనా, లేక ఇతరుల ఒత్తిళ్ల వల్ల దఖలైనదా తెలుసుకోవాలంటే రెండు రకాల సంధి పత్రాలను పరిశీలించాల్సిందే. ఎందుకంటే, 1949 నుంచీ భూటాన్–చైనాల మధ్య నలుగుతూ, ముదురుతూ వస్తున్న సంక్షోభానికి బీజం 1949లో భూటాన్ రాచరిక ప్రభుత్వానికీ స్వతంత్ర భారత ప్రభుత్వానికీ మధ్య జరిగిన 'రహస్య ఒప్పందం' (సీక్రెట్ ట్రీటీ)లో ఉంది. ఈ విషయాన్ని డోక్లామ్‌లో చైనా రోడ్ల నిర్మాణం చేపట్టిన సందర్భంగా సీనియర్ జర్నలిస్టు, వ్యాఖ్యాత సయీద్ నక్వీ (4.8.17) ఇటీవలనే బయటపెట్టారు. నాటి భూటాన్ రాజు, నక్వీకి (1979 సెప్టెంబర్ 11) ఇచ్చిన ఇంటర్వ్యూలో అది ఉంది. రాజు జిమీ సింగ్యే వాంగ్ చుక్ ఇచ్చిన అరుదైన ఇంటర్వ్యూ అది. ప్రస్తుతం ఆయన విశ్రాంతి తీసుకుంటున్నారు. ఇప్పటికీ మన మధ్య ఉన్నారు. ప్రస్తుత పాలకుడు ఆయన కొడుకే. ఇంతకూ వాంగ్ చుక్ 1979లో చైనాతో చర్చలు జరపవలసిన అవసరం ఉందని ఎందుకు భావించినట్టు? 1949 నాటి రహస్య ఒప్పందంలోని 2వ క్లాజు ప్రకారం 'భూటాన్ విదేశాంగ వ్యవహారాల నిర్వహణ విషయంలో భారత ప్రభుత్వ జోక్యం ఉంటుంది'. కానీ భౌగోళిక పరిస్థితుల దృష్ట్యా భూటాన్‌కు చైనాతో సంబంధాలు అనివార్యమని, కానీ 1949 నాటి భూటాన్ –భారత్ రహస్య ఒప్పందంలోని రెండవ క్లాజు చైనాతో సంబంధాలకు అవరోధం కల్గిస్తోందనీ రాజు ప్రకటించినట్టు సయీద్ నక్వీ ఆ ప్రత్యేక ఇంటర్వ్యూలో వెల్లడించారు. అంతేగాదు, రాజు ఆ ప్రకటనలో ఇలా స్పష్టం చేశాడు: ''దౌత్యపరమైన పరిభాషలో కాకుండా నేరుగా నా స్పష్టమైన సమాధానం ఏమంటే– 1949 నాటి భారత్–భూటాన్ ఒప్పందాన్ని ఆధునిక అవసరాల దృష్ట్యా విధిగా తీర్చిదిద్దాల్సి ఉంటుంది''. అంటే, భూటాన్ విదేశాంగ వ్యవహారాల నిర్వహణలో ఇకమీదట భారత ప్రభుత్వ సలహా సంప్రదింపులకు భూటాన్ కట్టుబడి ఉండాల్సిన పనిలేదన్న భావాన్ని రాజు వ్యక్తం చేశాడని నక్వీ అభిప్రాయపడ్డారు. ఈ రీత్యా ఇంతవరకు భూటాన్–చైనాలమధ్య క్షేత్రస్థాయిలో నేల మీద గుర్తు పెట్టకుండా వదిలేసిన 'సరిహద్దును వెంటనే ప్రత్యక్ష సంప్రదింపుల ద్వారా'ఉభయ దేశాలూ సరిహద్దుల్ని గుర్తుపెట్టాల్సిన అవసరం ఉందని డోక్లామ్ పరిణామాలు నిరూపిస్తున్నాయి. 1949 నుంచీ భూటాన్ –భారత్‌ల మధ్య 'రహస్య ఒడంబడిక' ఫలితంగా అనేక పరిణామాలు జరిగినందున ఈ తాజా సమీక్ష చాలా అవసరమని కూడా భూటాన్ భావిస్తోందని పలువురు వ్యాఖ్యాతల అభిప్రాయం. అయితే అదే సందర్భంలో భారత్ ప్రధాన ప్రయోజనాలకు హాని కలిగేలా భూటాన్ ప్రవర్తించదని నక్వీ భావన. మరో విచిత్రమేమంటే భూటాన్‌లో నివసిస్తున్న టిబెట్ పౌరులు అనేకమంది భారతదేశంలోని దలైలామా తెరచిన 'ధర్మశాల'దుకాణానికి పన్నులు కూడా చెల్లిస్తున్నారని వింటున్నాం.

మేకపోతు గాంభీర్యమే

అయితే ఇదే సమయంలో మరొక ప్రశ్న తలెత్తుతోంది: భూటాన్–చైనాల మధ్య డోక్లామ్‌తో ఏర్పడిన సంక్షోభంలో భూటాన్‌కు–భారత ప్రభుత్వానికి మధ్య కుదిరిన రహస్య ఒప్పందంవల్ల వర్తక, వాణిజ్య సంబంధాలు కూడా దెబ్బతినే అవకాశం ఉందా? గత మూడుమాసాలుగా భూటాన్–చైనాల మధ్య ఆ మేరకు, భారత్–చైనాల మధ్య తగాదాలు లేదా ఘర్షణలు పరిమితిని దాటి మరింతగా కుదరకపోవడానికి కారణం కూడా ప్రపంచ మార్కెట్‌లో చైనా స్థాపించుకున్న వర్తక సంబంధంలో దాని అగ్రస్థానమే అయి ఉంటుంది. బహుశా 'పంటి బిగువు' కోసం నేటి భారత్ బీజేపీ–ఆరెస్సెస్ పాలకులు 'డోక్లామ్' మోహరింపుల మధ్యనే చైనాతో వర్తక వాణిజ్య సంబంధాల కోసం ఉవ్విళ్లూరుతూనే మరొకవైపున చైనా పట్ల 'మేకపోతు గాంభీర్యం' ప్రదర్శిస్తున్నట్లు కన్పిస్తోంది. ఎందుకంటే 'నోట్ల రద్దు' అక్రమ ప్రయోగం కాస్తా సామాన్యుడిమీద 'పిచ్చుకపై బ్రహ్మాస్త్రం'లా విరుచుకుపడినా, ఆ ప్రయోగాన్ని సమర్థించుకునే ప్రయత్నంలో మరోవైపు నుంచి భారతదేశంలోకి చైనా పెట్టుబడులను ధారాళంగా ఆహ్వానిస్తూ తివాచీలు పరుస్తూనే ఉన్నారు. ఈ విషయంలో ట్రంప్ అధికారానికి వచ్చిన మొదట్లో చైనాతో కొంత 'కంపు' చేసుకోవడానికి ప్రయత్నించినా, చైనాను బుజ్జగించడానికి 'చాయంగల విన్నపా'లన్నీ చేయవలసి వచ్చింది. అదంతా వ్యాపార రహస్యం. ఆ పాఠమే ఇండియాలో మోదీ కూడా అనుసరించి ప్రపంచవ్యాప్తంగా చొచ్చుకుపోతున్న చైనీస్ 'అలీబాబా' పెట్టుబడి సంస్థ సహకారంతో 'పేటీఎం' అనే భారత టెక్ కంపెనీ ద్వారా ధన లావాదేవీలను భారీగా నిర్వహింపజేస్తున్నారు. మరొకవైపున, జనరల్ మోటార్స్‌తో సంయుక్తంగా వ్యాపారాలు నిర్వహిస్తున్న చైనీస్ కంపెనీ 'సాయిక్ మోటార్ కార్పొరేషన్ లిమిటెడ్' సరాసరి గుజరాత్‌లోని హాలోల్ వద్ద భారత మాన్యుఫాక్చరింగ్ పరిశ్రమను కాస్తా స్వాధీనం చేసుకుంటోంది. అలాగే నాగపూర్ విమానాశ్రయం వద్ద ఉన్న ఇంటర్నేషనల్ కార్గో హబ్ కేంద్రంలో మెట్రో రోలింగ్ స్టాక్ తయారీ (మాన్యుఫాక్చరింగ్) పరిశ్రమను నెలకొల్పడానికి చైనా ప్రభుత్వం రైల్వే రోలింగ్ స్టాక్ కార్పొరేషన్‌ను భారత ప్రభుత్వ రంగ పరిశ్రమల్ని పస్తుల్లోకి నెట్టి ఆహ్వానం చెప్పింది. ఈ కారణాల రీత్యా కూడా డోక్లామ్‌లో చైనాతో తులతూగలేని పరిస్థితి మనది!

abkprasad2006@yahoo.co.in

నిజాయితీకి, నిబద్ధతకు నిలువుటద్దం

తిరుపతిలో టీటీడీ ఈఓగా పనిచేసే రోజుల్లో ప్రసాద్ ఎప్పుడు బుద్ధిపుడితే అప్పుడు ఎవరికీ చెప్పకుండా కాలినడకన తిరుమల కొండ ఎక్కేసేవారు. తనను కలుసుకోవడానికి వచ్చే అతి సామాన్యుడికి సైతం అసంతృప్తి కలగకుండా మాట్లాడి పంపించేవారు. ప్రధాని వద్ద పనిచేసే రోజుల్లో సొంత పనులకు వెళ్లాల్సి వస్తే, తనే కారు డ్రైవ్ చేసుకుని వెళ్లిపోయేవారు.



నివాళి

రిటైర్ అయిన ఒక ఐఏఎస్ అధికారి విశిష్టత గురించి కొన్ని మాసాలపాటు సీరియల్‌గా రాయాల్సిన వ్యక్తి ఒక్క పత్రి వేంకటరామకృష్ణ ప్రసాద్ మాత్రమే. పీవీఆర్‌కే ప్రసాద్‌గా బాగా గుర్తింపు పొందిన 1966 ఐఏఎస్ బ్యాచ్ అధికారి ఈ ఆగస్టు 21 తెల్లవారుజామున హైదరాబాద్‌లో కన్నుమూశారు. ఆంధ్రప్రదేశ్ దేవాదాయ ధర్మాదాయశాఖ కింద ఏర్పడిన హిందూధర్మ పరిరక్షణ ట్రస్టు చైర్మన్‌గా 2015లో బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచీ ప్రసాద్ ట్రస్టు లక్ష్యాల కోసం విరామం లేకుండా పనిచేస్తూనే ఉన్నారు. 2015 డిసెంబర్‌లో, 2017 ఫిబ్రవరిలో సుమారు 60 మంది వివిధ మతాధిపతులు, పీఠాధిపతులతో ధార్మిక సదస్సులు నిర్వహించి, ధర్మాచార్యుల్ని ఏకతాటిపై నడిపించే బృహత్కార్యాన్ని సాగిస్తున్నారు.

1980–81లో ఆయన తిరుమల తిరుపతి దేవస్థానాల ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా పని చేస్తున్నప్పుడు తిరుమల ఆలయంలో మూల విరాట్ విగ్రహానికి అష్టబంధనం జరిగింది. అష్ట బంధనంలో వాడాల్సిన నవరత్నాల సెట్లన్నీ ముందే తెప్పించుకుని పెట్టుకున్నా, అష్ట బంధనం జరిగే కొన్ని గంటల ముందు ఒక సెట్ తక్కువైంది. సమయానికి చెన్నై నుంచి సతీసమేతంగా ఒక వ్యాపారవేత్త నవరత్నాల సెట్‌తో వచ్చి దాన్ని అష్ట బంధనంలో వాడమని కోరాడు. అంతే! వాణ్ణి (శ్రీనివాసుణ్ణి) నమ్ముకుంటే, అన్నీ వాడే ఇస్తాడు, చేస్తాడు అన్న నమ్మకం ప్రసాద్‌లో పాతుకుపోయింది.

ఇదే కాదు. టీటీడీలో కాలినడకన వెళ్లే భక్తులకోసం షెల్టర్లు నిర్మించినా, కొండ మీద యాత్రికులకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించినా, నిత్యాన్నదాన పథకం ప్రవేశపెట్టినా, వైకుంఠం క్యూ కాంప్లెక్స్‌ని సుసంపన్నం చేస్తూ నిర్మింపచేసినా, పాపనాశనం డ్యామ్‌ని అధిక ప్రయోజనం లభించేలా నిర్మింపజేసినా, అన్నమాచార్య ప్రాజెక్టు, దాస సాహిత్య ప్రాజెక్టు తదితరాలను, తిరుమల ఆలయ సేవల్లో కొత్త సేవల్ని, సంస్కరణల్ని తీసుకువచ్చినా, తిరుమల కొండపై మాస్టర్ ప్లాన్ అమలుచేసినా... ఆ ఘనతంతా శ్రీనివాసుడిదే అనేవారు ప్రసాద్. 1985లో సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్‌గా ప్రసాద్ అనేక ఉద్యోగాలకు భారీ ఎత్తున రిక్రూట్‌మెంట్ చేపట్టారు. అందులో భాగంగా పరీక్షలు, ఇంటర్వ్యూలను జరుపుతున్నప్పుడు ప్రసాద్‌ని బదిలీచేస్తున్నట్లు సమాచారం అందింది. ఉత్తర్వులు చేతికి వచ్చేదాకా నిరీక్షించకుండానే బాధ్యతలను ఆ శాఖ డైరెక్టర్‌కు అప్పగించి వెళ్లిపోయారు.

విశాఖపట్నం పోర్టు చైర్మన్‌గా ఉండే రోజుల్లో ఒకసారి కుటుంబంతో పాటు ఆయన ఊరికి వెళ్లి వచ్చారు. వాళ్లకోసం రావల్సిన పోర్టు కారు రైల్వేస్టేషన్‌కి రాలేదు. ''కారు ఎందుకు రాలేదు? పంపాల్సిన వాడు ఎందుకు పంపలేదు? ఎవడు దీనికి బాధ్యుడు..?'' ఇలాంటి మాటలు మాట్లాడకుండా, వెంటనే ఆటో ఎక్కేసి బంగళాకు వెళ్లి పోయారు. తిరుపతిలో టీటీడీ ఈఓగా పనిచేసే రోజుల్లో కూడా ఎప్పుడు బుద్ధి పుడితే అప్పుడు ఎవరికీ చెప్పకుండా కాలినడకన తిరుమల కొండ ఎక్కేసేవారు. తనను కలుసుకోవడానికి వచ్చే అతి సామాన్యుడికి సైతం అసంతృప్తి కలగకుండా మాట్లాడి పంపించేవారు. ఢిల్లీలో ప్రధానమంత్రి దగ్గర పనిచేసే రోజుల్లో ఏదైనా షాపింగ్ లేదా సినిమాలు వంటి సొంత పనులకు వెళ్లాల్సి వస్తే, సొంతంగా కారు డ్రైవ్ చేసుకుని వెళ్లి పోయేవారు.ఇలాంటి ఎన్నో సంఘటనలు ఆయన నిరాడంబర జీవితాన్ని సూచిస్తాయి.

1986–87లో ఎక్సైజ్ కమిషనర్‌గా ఉండగా ప్రసాద్ కుమార్తెకు చెన్నైలోని ఒక మెడికల్ కాలేజీలో మెరిట్ ప్రాతిపదికపై సీటు వచ్చింది. కాలేజి మంచిది. కాని ఆ కాలేజి యాజమాన్యం అప్పట్లో ఆంధ్రప్రదేశ్‌లో సారా కాంట్రాక్టర్లుగా ఉన్న ఒడయార్స్ బంధువులది. ప్రసాద్, స్వయంగా ముఖ్యమంత్రి (ఎన్టీ రామారావు)ని కలసి విషయాన్ని లిఖితపూర్వకంగా ఆయన ముందుంచి, ''మీరు విచారణ చేసి, ఇందులో నేను ఎలాంటి అనైతికతకు పాల్పడ్డానని మీకు అనిపించినా నేను ఈ అడ్మిషన్ వదులుకుంటాను'' అన్నారు. ఆ విషయంలో ప్రభుత్వం ఆయన పట్ల పూర్తి విశ్వాసాన్ని ప్రకటించింది. ఆయన ఎక్సైజ్ శాఖలో ఉన్నప్పుడే, లిక్కర్ వ్యాపారం చేసే ఒక బడా వ్యాపారవేత్త తనకు లంచం ఇవ్వాలని ప్రయత్నిస్తే, తక్షణం అవినీతి నిరోధక శాఖకు ఫోన్ చేసి ఆ వ్యాపారవేత్తను పట్టించారు ప్రసాద్.

ప్రసాద్, విశాఖపట్నం పోర్టు చైర్మన్‌గా పనిచేస్తున్నప్పుడు కొత్తగా విజిలెన్స్ ఆఫీసర్‌గా వచ్చిన ధిల్లేశ్వరరావు అనే ఒక మాజీ ఎయిర్ ఫోర్స్ అధికారి పోర్టులో అవినీతి అధికారుల చిట్టాని ఆయన ముందుంచి ''ఈ చిట్టాలో ఉన్నవాళ్లంతా అవినీతిపరులే. ముందుగా ఎవర్ని ట్రాప్‌చేయమంటారు సర్'' అని అడిగారు.ఆ చిట్టా చూసి సంభ్రమంలో మునిగిన ప్రసాద్ చివర్లో ఉన్న తన ప్రైవేట్ సెక్రటరీని ముందు ట్రాప్ చేయమని అడిగారు. అంతే! ఆ ప్రైవేట్ సెక్రటరీ, ఉద్యోగం కోసం తిరుగుతున్న ఒక వ్యక్తి వద్ద లంచం తీసుకుంటూ పట్టుబడ్డాడు. నీతివంతమైన పాలన కోసం ప్రసాద్ తాపత్రయపడిన ఇలాంటి సంఘటనలు చాలా ఉన్నాయి.

ఎన్. జనార్ధన రెడ్డి ముఖ్యమంత్రిగా (1990–92) పనిచేస్తున్నప్పుడు 12 మెడికల్ కాలేజీలకి అనుమతిస్తున్నారంటూ కోర్టులో కేసు దాఖ లైంది. కోర్టు ప్రభుత్వాన్ని తప్పు పట్టింది. జనార్ధన రెడ్డి పదవి కోల్పోయారు. 1996లో ఉన్నత విద్యాశాఖ ప్రధాన కార్యదర్శిగా పనిచేస్తుండగా ప్రసాద్, ప్రపంచవ్యాప్తంగా సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్‌కు డిమాండు పెరగనున్న దృష్ట్యా ఇంజనీరింగ్ కాలేజీలు ప్రారంభించాలని ప్రతిపాదించారు. జనార్ధన రెడ్డి అనుభవం నేపథ్యంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అందుకు సంకోచించారు. కానీ హేతుబద్ధమైన, నిర్మాణాత్మమైన విధానం ద్వారా ప్రతి రెవెన్యూ డివిజన్‌కి ఒక ఇంజనీరింగ్ కాలేజీని ఎలా ఏర్పాటు చేయవచ్చో ప్రణాళికను రూపొందించి ప్రసాద్ ముఖ్యమంత్రిని ఒప్పించారు. ఇవ్వాళ తెలుగు విద్యార్థులు ఇంజనీరింగ్ సీట్ల కోసం ఇతర రాష్ట్రాలకు వెళ్లనక్కర లేకుండా ఆంధ్ర, తెలంగాణ రాష్ట్రాల్లో విస్తృతంగా ఇంజనీరింగ్ కాలేజీలు ఏర్పాటు చేయడానికి కారణం ప్రసాద్ దూరదృష్టే.

విశాఖపట్నం పోర్టు చైర్మన్‌గా ఆయన బాధ్యత స్వీకరించిన తొలి మూడు సంవత్సరాలపాటు (మొదటిసారిగా) ఆ పోర్టును జాతీయస్థాయిలో అగ్రస్థానంలో నిలబెట్టారు. పోర్టు భవిష్యత్తు (ఖనిజాల నిల్వల) అవసరాల కోసం హార్బర్‌లోని ఉద్యోగుల కాలనీని నగరం బయటకు తరలించి, ఎవరికీ ఎలాంటి ఇబ్బందీ లేకుండా, అన్ని యూనియన్లను ఒప్పించి, కొత్త కాలనీలు కట్టించారు.

1984–85లో సాంస్కృతికశాఖ కమిషనర్‌గా కూడా ప్రసాద్ వ్యవహరించారు. సాంస్కృతిక శాఖకి పునర్వైభవం తీసుకొచ్చే ప్రయత్నంలో భాగంగా జానపద కళలని ప్రోత్సహించారు. 'కళామంగళ' కార్యక్రమం ద్వారా హైదరాబాద్ రవీంద్రభారతిలో ప్రతి మంగళవారం ఉచితంగా ఒక సాంస్కృతిక కార్యక్రమాన్ని సమర్పించే ఏర్పాటు చేశారు. సురభి నాటకసంస్థలు జిల్లాల్లో సంచరిస్తూ నాటకాలు ప్రదర్శించేందుకు ప్రోత్సాహం అందించారు. ఆ ప్రయత్నాల్లో భాగంగానే ఓరుగల్లు దగ్గర శివరాత్రి నాడు ఆంధ్ర నాట్యాన్ని ప్రదర్శింపజేసి వెలుగులోకి తీసుకొచ్చారు. టీటీడీలో ఉండగా, డాక్టరు మేడసాని మోహన్ వంటి సాహితీవేత్తల్నీ, శోభారాజ్, బాలకృష్ణప్రసాద్ వంటి గాయకుల్ని ప్రోత్సహిస్తూ వెలుగులోకి తీసుకొచ్చారు.

సాహిత్యం, కళలు, కళాకారులు ఆయన మనసుకి ఎంతో ఇష్టమైన విషయం. హైదరాబాదులో టీటీడీపరంగా ఉగాది ఉత్సవాన్ని ప్రవేశపెట్టిన ఘనత ఆయనదే.

పాలనా సామర్థ్యం, దూరదృష్టి, ప్రణాళికారచనలో నైపుణ్యం, నీతి నియమాలు, నిరాడంబరత, సత్యసంధత, నమ్మిన లక్ష్యం కోసం నిలబడే ధైర్యం, నిబద్ధత, సంగీతం, సాహిత్యం, కళలపట్ల మక్కువ, విజయం పరాజయం రెండూ భగవంతుని అనుగ్రహమే అని నమ్మే భక్తి విశ్వాసాలు, ధర్మబద్ధమైన జీవితాన్ని రాబోయే తరాలకి అందించాలన్న తపనతో ధార్మిక ఉద్యమానికి రిటైర్‌మెంట్ అనంతర జీవితాన్ని అంకితం చేసుకున్న వ్యక్తిత్వం... ఇవన్నీ కలబోస్తే కనిపించే రూపం పీవీఆర్‌కేప్రసాద్.

'నాహం కర్తా, హరిః కర్తా', 'తిరుమలలీలామృతం', 'తిరుమలచరితామృతం', 'అసలేం జరిగిందంటే...!' (Wheels Behind the Veil) అనే ఆయన రచనలు ప్రసాద్ సంపూర్ణ వ్యక్తిత్వానికి అద్దం పట్టేవే.

జి. వల్లీశ్వర్, సీనియర్ పాత్రికేయులు I మొబైల్ : 99493 51500

సైనికులకు అగౌరవం

సాక్షి దినపత్రిక – 19–08–2017– నాటి సంపాదక పేజీలో ప్రముఖ కాలమిస్టు ఆకార్ పటేల్ రాసిన 'సైనికులకు ఇవ్వాల్సింది బూటకపు గౌరవమేనా?' అనే వ్యాసంపై వాయుసేన విశ్రాంత ఉద్యోగిగా నా స్పందనను ఇక్కడ తెలియజేస్తున్నాను.

1. భారతీయ వాయుసేనలో చేరినప్పుడు నేను పంజాబ్‌లోని అదంపూర్‌లో పని చేయవలసివచ్చింది. నా కుటుంబంతోపాటు ఉండేందుకు అనుమతించారు. ఉన్నట్లుండి మమ్మల్ని పఠాన్ కోట్‌కి తరలి వెళ్లాల్సిందిగా ఆదేశించారు. అది జమ్మూ, ఆక్రమిత కశ్మీర్, పంజాబ్ మూడు ప్రాంతాల కూడలి(ట్రై జంక్షన్).

2. 1965 సెప్టెంబర్ 29 అనుకుంటాను.. ఈ ట్రై జంక్షన్ ప్రాంతంపై సాయంత్రం 4 గంటల సమయంలో దాడి చేయాలని మా స్క్వాడ్రన్‌కి ఆదేశాలు వచ్చాయి. మా పైలట్లు విజయవంతంగా దాడి ముగించి అరగంటలో తిరిగి వచ్చారు. కానీ గంట లోపే పాకిస్తాన్ బలగాలు ప్రతీకార దాడికి దిగాయి. దీంతో వెనువెంటనే మా స్క్వాడ్రన్ విమానాశ్రయాన్ని ఖాళీ చేయాల్సి వచ్చింది. మేము మొదట అంబాలా వైమానిక స్థావరానికి తర్వాత ఢిల్లీ సమీపంలోని హిండన్ విమానాశ్రయానికి తరలివెళ్లాము. ఆ సమయంలో ఇరుపక్షాల మధ్య స్వల్ప సంఘర్షణలు జరిగాయి.

3. ఆ సమయాన్ని మేము మా సంస్థాగత విధాన నిబంధనలు–పీఓఆర్–లోనూ తర్వాత డిశ్చార్జి పత్రంలో కూడా నివేదించాం. నేను హైదరాబాద్‌కు మారినప్పుడు నాకు అక్కడ శాశ్వత నివాస గృహం లేదు. దీంతో తెలంగాణ రాష్ట్రంలోని సైనిక్ వెల్ఫేర్ ఆఫీసులో పునరుద్ధరించిన నా డిశ్చార్జి పత్రాన్ని పొందాను. అయితే నా వివరాలన్నింటినీ పొందుపర్చినప్పటికీ, నా దరఖాస్తును వారు యథావిధిగా తమ ఫైల్‌లో అట్టిపెట్టుకున్నారు. 1965 నాటి యుద్ధంలో పాల్గొన్న సైనికులను సత్కరిస్తామని ప్రధాని మోదీ ప్రకటించినప్పుడు.. దేశవ్యాప్తంగా ఉన్న జిల్లా సైనిక్ సంక్షేమ కార్యాలయాల ద్వారా అలాంటి సైనికుల వివరాలను సేకరించి, అలనాటి యుద్ధవీరులను సత్కరించాలని నేను మన్‌కీ బాత్‌కు ఉత్తరం రాశాను.

4. కొన్ని రోజుల తర్వాత జిల్లా కలెక్టర్ అలనాటి సైనిక సిబ్బందిని తమ చాంబర్‌లో సత్కరించారని వార్తల్లో చూసినప్పుడు హైదరాబాద్‌లోని సైనిక్ వెల్ఫేర్ బోర్డ్ కార్యాలయానికి కాల్ చేశాను. తమ రికార్డులలో ఆ వివరాలన్నీ ఉన్నప్పటికీ, అర్హులైన వారు తమ వివరాలు పంపించాలని కోరుతూ స్థానిక తెలుగు దినపత్రికల్లో ప్రకటించామని వారు చెప్పారు. నా డిశ్చార్జి రికార్డుల్లో నా కచ్చితమైన జన్మదినం లేదని పెన్షన్ అధికారులు తెలుపడంతో నా జన్మదిన ధ్రువీకరణ పత్రాన్ని కూడా నేను పొందాల్సి వచ్చింది. ఇప్పుడు నాకు 80 ఏళ్లు. శారీరక అంగవైకల్యంతో నా అద్దె ఇంటినుంచి బయటకు అడుగుపెట్టలేను. ఒక వేళ నన్ను పిలిచినా వెళ్లగలిగే స్థితిలో లేను.

5. సైనికుల జీవితంలోని అత్యంత శక్తిమంతమైన భాగాన్ని జాతి పూర్తిగా ఉపయోగించుకున్న తర్వాత మాజీ సైనికులపై చూపుతున్న అగౌరవం పట్ల విచారం వ్యక్తం చేయడానికే ఇక్కడ నేను వీటిని పేర్కొంటున్నాను. మాజీ సైనికోద్యోగుల దుస్థితిపై సాక్షి పత్రికలో మీరు కథనాన్ని ప్రచురించినందుకు మిమ్మల్ని అభినందిస్తున్నాను.

జి. శ్రీరామమూర్తి, భారత వాయుసేన మాజీ ఉద్యోగి, అజామాబాద్, హైదరాబాద్

ఒక బడి.. కలబడి.. నిలబడి!

ప్రభుత్వ స్కూలు మూసివేతపై విద్యార్థుల పోరాటం సక్సెస్

పెద్దపల్లి రూరల్: ఆ ఊర్లో బడి ఉంది.. తగిన సంఖ్యలో విద్యార్థుల్లేరంటూ సర్కారు దాన్ని మూసేసింది.. టీచర్లను వేరే స్కూళ్లకు బదిలీ చేసేసింది.. కానీ పిల్లలు మాత్రం రోజూ బడికి వచ్చారు.. తమ బడిని తిరిగి తెరవాలంటూ పోరాటం మొదలుపెట్టారు.. గ్రామస్తులు కూడా తలా కొంత పోగేసి శ్రమదానంతో బడిని కట్టుకుంటే ఇప్పుడు మూసేయడమేమిటంటూ ఆందోళన చేపట్టారు.. స్థానిక ప్రజా ప్రతినిధులు వారికి మద్దతుగా నిలిచారు.. దీంతో సర్కారు దిగి వచ్చింది.. ఆ ఊర్లో బడి మళ్లీ తెరుచుకుంది. పెద్దపల్లి జిల్లా బ్రాహ్మణపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల కథ ఇది.


పాఠాలు బోధిస్తున్న ఉపాధ్యాయుడు

నెల రోజులుగా..

ఉన్నతాధికారులు హేతుబద్ధీకరణ పేరుతో నెల కింద బ్రాహ్మణపల్లిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలను మూసివేశారు. టీచర్లను సమీపంలోని ఇతర స్కూళ్లకు బదిలీ చేశారు. ఇక్కడి విద్యార్థులకు టీసీలు ఇచ్చేందుకు సిద్ధపడ్డారు. తమ పాఠశాలను మూసేయవద్దంటూ విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు పోరాటం మొదలుపెట్టారు. నెల రోజులుగా ఆందోళన చేస్తున్నారు. విషయం తెలుసుకున్న పెద్దపల్లి జడ్జి పట్టాభి రామారావు, డీఈవో, స్థానిక తహసీల్దార్ రెండు రోజుల కింద పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా గ్రామస్తులంతా పాఠశాల వద్దకు చేరుకుని జిల్లా విద్యాధికారిని నిలదీశారు. వెంటనే పాఠశాలను తెరవాలని డిమాండ్ చేయడంతో డీఈవో అంగీకరించారు. సోమవారం ప్రధానోపాధ్యాయుడు సురేందర్‌తోపాటు డిప్యుటేషన్‌పై వెంకటేశ్ అనే టీచర్‌ని పాఠశాలకు పంపారు. విద్యార్థులకు పాఠాలు బోధించేలా చర్యలు చేపట్టారు. మధ్యాహ్న భోజనం అందించారు.

శ్రమదానంతో కట్టుకున్నాం

''ఊర్లో వాళ్లమంతా కలసి నాగలికి రూ.200 చొప్పున పోగేసి.. శ్రమదానంతో బడిని కట్టుకున్నం.. చదువు చెప్పేందుకు సార్లకు కూడా మేమే తలా కొంత పోగుచేసి జీతాలిచ్చినం.. ఇప్పుడు పాఠశాలను తరలిస్తామంటే ఎట్ల ఊరుకుంటం''అంటూ గ్రామస్తులు పేర్కొన్నారు. ఇక్కడి పాఠశాలలో 28 మంది విద్యార్థులే ఉన్నారంటూ విద్యాశాఖాధికారులు సాకు చూపారని.. ఇంగ్లిష్ మీడియం బోధనకు అనుమతిస్తే విద్యార్థుల సంఖ్య 100 దాటేదన్నారు. విద్యార్థుల చదువుకు ఇబ్బందులు రాకుండా చూస్తామంటూ ప్రభుత్వం ప్రకటనలు చేస్తోందని.. అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించడం సరికాదన్నారు. ఈ పాఠశాలలో పనిచేసే టీచర్లను సమీపంలోని స్కూళ్లకు బదిలీ చేశారని.. వారందరినీ తిరిగి బ్రాహ్మణపల్లి పాఠశాలకు రప్పించాలని ఇన్‌చార్జి సర్పంచ్ మేకల రాజయ్య, మాజీ సర్పంచ్ గాండ్ల మల్లేశం కోరారు.

చర్యలు చేపట్టాం

''బ్రాహ్మణపల్లి పాఠశాలను మూసివేసినా.. విద్యార్థులు మాత్రం యథావిధిగా పాఠశాలకు వస్తున్నారు. గ్రామస్తులు కూడా పాఠశాలను ఇక్కడే ఉంచాలని డిమాండ్ చేస్తున్నారు. దాంతో ప్రస్తుతానికి ప్రధానోపాధ్యాయుడితో పాటు డిప్యుటేషన్‌పై ఓ ఉపాధ్యాయుడిని నియమించాం. విద్యార్థులకు బోధనతోపాటు మధ్యాహ్న భోజనం కూడా అందించే ఏర్పాట్లు చేశాం. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకే నడుచుకుంటున్నాం. వారి సూచనతోనే తదుపరి చర్యలుంటాయి.''

– వెంకటేశ్వర్‌రావు, పెద్దపల్లి డీఈవో

నేరెళ్ల ఘటనపై స్పందించిన హైకోర్టు

జస్టిస్ చంద్రకుమార్ లేఖ పిల్‌గా పరిగణన



సాక్షి, హైదరాబాద్: సిరిసిల్ల జిల్లా, నేరెళ్ల, జిల్లెల, రామచం ద్రాపురం గ్రామాల దళితులను పోలీసులు చిత్రహింసలకు గురిచేసిన ఘటనపై హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి, తెలంగాణ రైతు సంక్షేమ సమితి అధ్యక్షుడు జస్టిస్ బెజ్జారం చంద్రకుమార్ రాసిన లేఖపై ఉమ్మడి హైకోర్టు స్పందించింది. ఆ లేఖను ప్రజా ప్రయోజన వ్యాజ్యం(పిల్)గా పరిగణించింది. దీనిపై మంగళవారం తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్‌రంగనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరపనుంది. పోలీసులు ఉద్దేశపూర్వ కంగానే నేరెళ్ల తదితర గ్రామాలకు చెందిన 8 మంది దళితులను హింసించి, వారి హక్కులను హరించారని ఆయన లేఖలో పేర్కొన్నారు. కరీంనగర్ జైలులో ఉన్న బాధితుల వాంగ్మూలాలను నమోదు చేసేలా సంబంధిత కోర్టును ఆదేశించాలని హైకోర్టును అభ్యర్థించారు.

ఒక వలంటీర్.. ఇద్దరు విద్యార్థులు

కోనాపూర్ తండాలో సర్కార్ బడి పరిస్థితి ఇది


ఇద్దరు విద్యార్థులకు చదువు చెబుతున్న వలంటీర్

రామాయంపేట (మెదక్): రామాయంపేట మండలం కోనాపూర్ తండా ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఇద్దరు విద్యార్థులకు ఒక వలంటీర్ చదువు చెబుతున్నాడు. సోమవారం 'సాక్షి విజిట్'తో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. కోనాపూర్ తండాలో, పక్కనే ఉన్న మరో చిన్న తండాలో బడీడు పిల్లలు సుమారు 50 మంది వరకు ఉంటారు. ఈ పిల్లలందరినీ వారి తల్లిదండ్రులు రామాయంపేట లోని ప్రైవేట్ స్కూళ్ల లో చేర్పించారు.ఈ రెండు తండాల నుంచి నలుగురు విద్యార్థులు మాత్రమే ప్రభుత్వ పాఠశాలలో చేరారు. ఇక్కడ పనిచేస్తున్న మహిళా ఉపాధ్యాయురాలు ప్రసూతి సెలవుపై వెళ్లగా, వలంటీర్ పాఠశాలను కొనసాగిస్తున్నారు. సోమవారం ఇద్దరు విద్యార్థులు మాత్రమే హాజరు కాగా, వలంటీర్ వారికి పాఠాలు చెబుతూ కనిపించారు.

అభివృద్ధి పనులకు త్వరలో శంకుస్థాపన

వరంగల్ నగరానికి ప్రభుత్వ ప్రాధాన్యం: కేటీఆర్



సాక్షి, హైదరాబాద్: త్వరలోనే వరంగల్ నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేయనున్నామని, ఇందుకోసం ముఖ్యమంత్రి కేసీఆర్ జిల్లాలో పర్యటిస్తారని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి కె.తారకరామారావు పేర్కొన్నారు. ఈ పర్యటనలోనే వరంగల్ టెక్స్‌టైల్ పార్కు శంకుస్థాపనకు తమ శాఖ తరపున అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలియజేశారు. ప్రభుత్వం వరంగల్ నగరానికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నదని, ఇందుకోసం కార్పొరేషన్‌కు ప్రత్యేక నిధులను కేటాయించిందన్నారు. ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఆధ్వర్యంలో వరంగల్ జంట జిల్లాల ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు మంత్రితో బేగంపేట క్యాంపు కార్యాలయంలో సోమవారం సమావేశమయ్యారు. వరంగల్‌లో జరుగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రగతిని, పెండింగ్ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకొచ్చారు. ముఖ్యమంత్రి ఆశించిన మేరకు వరంగల్ నగరంలో మార్పు తీసుకొచ్చేందుకు చేపట్టాల్సిన ప్రణాళికలపైన చర్చించేందుకు వరంగల్ నగరంలో ప్రత్యేకంగా పురపాలక శాఖ తరపున ఒకరోజు సమీక్ష నిర్వహించాలని మంత్రిని జిల్లా ప్రజా ప్రతినిధులు కోరారు. వచ్చేవారం సమీక్ష సమావేశం నిర్వహిస్తామని, పురపాలకశాఖ ఉన్నతాధికారులతో పాటు జిల్లాస్థాయి యంత్రాంగం మొత్తం పాల్గొంటుందని మంత్రి కేటీఆర్ బదులిచ్చారు. మంత్రి కేటీఆర్‌ను కలిసిన వారిలో ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, ఆరూరి రమేశ్, చల్ల ధర్మారెడ్డి, నగర మేయర్ నన్నపనేని నరేందర్, కుడా చైర్మన్ మర్రి యాదవ రెడ్డి, వికలాంగుల కార్పొరేషన్ చైర్మన్ కె.వాసుదేవరెడ్డి తదితరులున్నారు.

బీసీ హాస్టళ్లకూ నిధులివ్వండి

ఆర్. కృష్ణయ్య డిమాండ్



సాక్షి, హైదరాబాద్: రెడ్డి హాస్టల్‌కు రూ.10 కోట్లతో పాటు పది కరాల స్థలాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని, పేదలు, వెనుకబడిన వర్గాలు చదువుకుంటున్న బీసీ గురుకులాలకు కూడా ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని బీసీ సంక్షేమ సంఘం నేత, టీడీపీ ఎమ్మెల్యే ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఒక్కో వసతిగృహం, గురుకులానికి రూ.10 కోట్ల చొప్పున నిధులు కేటాయించడంతో పాటు శాశ్వత భవనాలు నిర్మించేందుకు భూములు ఇవ్వాలని కోరుతూ సోమవారం ఆయన సీఎం కేసీఆర్‌కు లేఖ రాశారు. ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ హాస్టళ్లు అద్దెభవనాల్లో అరకొర సౌకర్యాలతో నడుస్తున్నాయని.. దీంతో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.

వివాదాల్లేకుండా 'ఏకీకృత సర్వీసు రూల్స్'!

- రూపకల్పనపై విద్యాశాఖ దృష్టి
- ప్రైమరీ స్కూల్ హెడ్‌మాస్టర్లుగా ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎంలు!

సాక్షి, హైదరాబాద్: వివాదాలకు తావులేకుండా ఉపాధ్యాయుల ఏకీకృత సర్వీసు రూల్స్ రూపకల్పనపై విద్యా శాఖ దృష్టి సారించింది. ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి ఆదేశాల మేరకు పాఠశాల విద్యా శాఖ కమిషనర్ కిషన్ సోమవారం టీజేఏసీ, జాక్టో, ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీతో సమావేశమై సర్వీసు రూల్స్‌కు సంబంధించిన వివిధ అంశాలపై చర్చించారు. డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ పోస్టుకు సమాన కేడర్ అయిన గ్రేడ్–1 హెడ్‌మాస్టర్ పోస్టులను అలాగే కొనసాగించాలా.. వద్దా.. గెజిటెడ్ కేటగిరీలో ఏయే పోస్టులు ఉండాలి.. కొత్త రూల్స్ ఎలా ఉండాలి.. జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి(ఎన్‌సీటీఈ) నిబంధనలు ఏం చెబుతున్నాయి.. అనే అంశాలపై చర్చించారు. ఆయా సంఘాల నేతలు సరోత్తంరెడ్డి, నర్సిరెడ్డి, సదానంద్‌గౌడ్ తదితరులు తమ అభిప్రాయాలను తెలియజేశారు. గ్రేడ్–1 హెడ్ మాస్టర్ పోస్టులను డిప్యూటీ ఈవోలుగా చేయాలని, డివిజన్‌కు ఒక డిప్యూటీ ఈవోను నియమించాలని సూచించారు. లో ఫిమేల్ లిటరసీ(ఎల్‌ఎఫ్‌ఎల్) హెడ్‌మాస్టర్ పోస్టును ఇకపై ప్రాథమిక పాఠశాల హెడ్‌మాస్టర్‌గా కొనసాగించాలని అభిప్రాయపడ్డారు. స్కూల్ అసిస్టెంట్ కంటే కిందిస్థాయి పోస్టులను నాన్ గెజిటెడ్ కేడర్‌లో ఉండాలని, బోధనలో ఉన్నవారికే డీఈవో పోస్టుల పదోన్నతులను కేటాయించాలని, నాన్ టీచింగ్ వారికి డిప్యూటీ డైరెక్టర్ పోస్టులను కేటాయించాలని సూచించారు. హెడ్‌మాస్టర్‌కు డిప్యూటీఈవోకు మధ్యలో ఒక కేడర్ సృష్టించి ఆ స్థానంలో ఎంఈవో పోస్టులను ఉంచాలని పేర్కొన్నారు. ఈ అభిప్రాయాలు అన్నింటిని ఆయా సంఘాలు ఒకటీ రెండు రోజుల్లో రాత పూర్వకంగా అందజేయాలని కిషన్ సూచించారు.

వీడిన 'విగ్రహ' ముడి

- ప్రధాన అర్చకుడి బీరువాలో బయటపడిన విగ్రహం
- అధికారుల సమక్షంలో తనిఖీ
- తీసుకెళ్లింది ఉత్సవ విగ్రహం కాదు


బీరువాలో బయటపడిన అమ్మవారి విగ్రహం

నిర్మల్ రూరల్: బాసర సరస్వతమ్మ విగ్రహాలొల్లి ఓ కొలిక్కి వచ్చింది. అమ్మవారి ఉత్సవ మూర్తిని ఊరుదాటించారంటూ జరిగిన ప్రచారంలో వాస్తవం లేదని తేలింది. ప్రధాన అర్చకుడి అధీనంలో ఉన్నది అమ్మవారి ఉత్సవమూర్తి కాదని, భక్తులు సమర్పించిన చిన్న విగ్రహమేనని అధికారులే తేల్చారు. ఆలయ ఈవో సుధాకర్‌రెడ్డి, రెవెన్యూ, పోలీసుల సమక్షంలో సోమవారం బీరువాలను తెరిచారు. ఇందులో ప్రధాన అర్చకుడి బీరువాలో భక్తులు కానుకగా ఇచ్చిన కిలోన్నర బరువున్న అమ్మవారి పంచలోహ విగ్రహం బయటపడింది. ఆలయ ప్రధానార్చకుడు సంజీవ్ పూజారి, సప్తశతి పారాయణధారుడు ప్రణవ్ శర్మలతో పాటు పరిచారకుడు విశ్వజిత్‌లు గత నెల 28న నల్లగొండ జిల్లా దేవరకొండలోని రెండు పాఠశాలల్లో అక్షరాభ్యాసాలను చేయించారు. ఈ పూజలకు బాసర క్షేత్రం నుంచి అమ్మవారి విగ్రహాన్ని తీసుకెళ్లారని ప్రచారం జరిగింది. దీంతో ఆలయ అధికారులు విచారణ చేపట్టారు. ప్రధానార్చకుడు అందుబాటులో లేకపోవడం, విగ్రహం కూడా కనిపించకపోవడంతో ఆలయ అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దేవరకొండకు వెళ్లిన అర్చకులే విగ్రహాన్ని తీసుకెళ్లారని అనుమానం ఉందన్నారు. ఆలయ స్టోర్‌రూంలోని ప్రధాన అర్చకుడి బీరువాలను సీజ్ చేశారు. ఈ వివాదంలో దేవాదాయశాఖ ప్రధాన అర్చకుడు, సప్తశతి పారాయణధారుడికి సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేసింది.

విగ్రహాల 'లెక్క'లేదా..

ఆలయంలో అమ్మవారి ఉత్సవ విగ్రహాలు ఎన్ని ఉన్నాయి.. భక్తులు సమర్పించిన విగ్రహాలెన్ని.. అన్న లెక్కలు అధికారుల వద్దే స్పష్టంగా లేనట్లు తెలుస్తోంది. ప్రధాన అర్చకుడి బీరువాలో బయటపడిన విగ్రహం రికార్డుల్లో ఉందా.. అన్న దానిపైనా అధికారులు స్పష్టత ఇవ్వలేదు. సదరు విగ్రహం గురించి ప్రశ్నిస్తే రికార్డులను పరిశీలిస్తే తెలుస్తుందని ఈవో పేర్కొనడం గమనార్హం. ఆలయంలో ఎన్ని ఉత్సవ మూర్తులు ఉన్నాయి.. ఎన్ని భక్తులు సమర్పించిన విగ్రహాలు ఉన్నాయన్న దానిపై స్పష్టత లేకపోవడం విస్మయం కలిగిస్తోంది. కాగా, ఈ విగ్రహం తరలింపు విషయంలో విచారణ కొనసాగుతుందని ఆలయ ఈవో చెప్పారు. కేసు కోర్టు పరిధిలో ఉందన్నారు. కాగా, తనపై కక్ష సాధింపు చర్యల్లో భాగం గానే కేసు పెట్టి ఇబ్బంది పెడుతున్నారని ప్రధాన అర్చకుడు సంజీవ్ పూజారి చెప్పారు. తాను ఎలాంటి విగ్రహాన్ని దేవర కొండకు తీసుకెళ్లలేదని వివరించారు.

బీరువా తనిఖీల్లో..

కేసు విచారణలో భాగంగా దేవాదాయశాఖ కమిషనర్ ఆదేశాలతో సోమవారం ఆలయ ఈవో, బాసర తహసీల్దార్ వెంకటరమణ, ముథోల్ సీఐ రఘుపతి, బాసర ఏఎస్‌ఐ నర్సయ్య తనిఖీలు చేపట్టారు. సీజ్ చేసిన ప్రధాన అర్చకుడి బీరువాలో సరస్వతీ మాత పంచలోహ విగ్రహం బయటపడింది. అది అమ్మవారి ఉత్సవ విగ్రహం కాదని, భక్తులు సమర్పించిన విగ్రహమేనని తేలింది.

డిపార్ట్‌మెంటల్ టెస్టు వాయిదా

సెప్టెంబర్ 15వ తేదీకి...

సాక్షి, హైదరాబాద్: సెప్టెంబర్ 10న నిర్వహించాల్సిన డిపార్ట్‌మెంటల్ టెస్టును (మే–2017 సెషన్) 15వ తేదీకి వాయిదా వేసినట్లు టీఎస్‌పీఎస్సీ తెలిపింది. 10న గురుకులాల పరీక్షలున్నందున ఈ మార్పు చేసినట్లు పేర్కొంది. వివరాలను తమ వెబ్‌సైట్‌లో పొందవచ్చని వెల్లడించింది.

నేడు బ్లాక్ డే

అధ్యాపకుల సంఘం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: యూజీసీ నూతన స్కేళ్లను అమలు చేయడంలో కేంద్రం వహిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా ఈ నెల 22న బ్లాక్ డేగా పాటించనున్నట్లు తెలంగాణ గవర్నమెంట్ కాలేజీ గెజిటెడ్ టీచర్స్ అసోసియేషన్ పేర్కొంది. ఆల్ ఇండియా ఫెడరేషన్ ఆఫ్ యూనివర్సిటీ కాలేజీ టీచర్స్ ఆర్గనైజేషన్ పిలుపు మేరకు బ్లాక్ డేగా పాటించాలని నిర్ణయించినట్లు తెలిపింది. నూతన స్కేళ్లను వెంటనే అమలు చేయాలన్న డిమాండ్‌తో ఈ నిరసన చేపట్టనున్నట్లు వెల్లడించింది.

'ఉపకార' దరఖాస్తు గడువు పొడిగింపు!

- నెల రోజులు పెంచాలని ఎస్సీ అభివృద్ధి శాఖ నిర్ణయం
- 13.5 లక్షల మందిలో దరఖాస్తు చేసింది 3.45 లక్షలే



సాక్షి, హైదరాబాద్: పోస్టు మెట్రిక్ విద్యార్థుల ఉపకార వేతనాలు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌కు సంబంధించి దరఖాస్తు గడువు పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నెల 30తో గడువు ముగియనుండగా.. సగం మంది విద్యార్థులు కూడా దరఖాస్తులు సమర్పించలేదు. ఒకవైపు పలు కోర్సుల్లో అడ్మిషన్ల ప్రక్రియ కొనసాగుతుండటంతో గడువును తప్పనిసరిగా పొడిగించాల్సిన పరిస్థితి ఏర్పడింది. 2017–18 విద్యా సంవత్సరానికి సంబంధించి రాష్ట్ర వ్యాప్తంగా 13.5 లక్షల దరఖాస్తులు వస్తాయని అధికారులు అంచనా వేయగా.. ఇప్పటివరకు 3.45 లక్షల మంది మాత్రమే దరఖాస్తులు సమర్పించారు. మెజారిటీ విద్యార్థులు దరఖాస్తు చేసుకోకపోవడంతో గడువు తేదీని నెల రోజుల పాటు పొడిగించాలని ఎస్సీ అభివృద్ధి శాఖ నిర్ణయించింది. ఈ మేరకు పరిస్థితిని ప్రభుత్వానికి నివేదించింది.

'ముందస్తు' కష్టమే..

ఉపకార వేతనాల పంపిణీలో జాప్యాన్ని అరికట్టాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ఈ ఏడాది ముందస్తు దరఖాస్తు స్వీకరణకు ఉపక్రమించింది. ఆగస్టులోగా దరఖాస్తు ప్రక్రియ పూర్తయితే నవంబర్‌కి వాటిని పరిశీలించి అర్హులను నిర్ధారించి.. డిసెంబర్ నుంచి ఉపకార వేతనాలు పంపిణీ చేయాలని భావించింది. జూన్ మూడో వారం నుంచి దరఖాస్తుల స్వీకరణ మొదలు పెట్టింది. వివిధ కోర్సుల్లో ప్రవేశాలకు సంబంధించి కౌన్సెలింగ్ నిర్వహణ, ప్రవేశాల ప్రక్రియ ఆలస్యం కావడంతో ముందస్తు ఆలోచన గాడితప్పినట్లయింది. ఇంటర్ ప్రవేశాల ప్రక్రియ ఇంకా కొనసాగుతోంది. డిగ్రీ ప్రవేశాలకు సంబంధించి సాంకేతిక సమస్యలు తలెత్తడంతో మరో విడత కౌన్సెలింగ్ నిర్వహించాలని ఉన్నత విద్యామండలి నిర్ణయించింది. దీంతో ఈ రెండు కేటగిరీలకు సంబంధించి ప్రవేశాల ప్రక్రియకు మరికొంత సమయం తీసుకోనుంది. దరఖాస్తుల గడువు నెల రోజులు పొడిగించాలని ప్రభుత్వానికి ఎస్సీ అభివృద్ధి శాఖ నివేదించిన నేపథ్యంలో.. దరఖాస్తుల స్వీకరణ సెప్టెంబర్ చివరి వరకు కొనసాగనుంది. దీంతో డిసెంబర్ వరకు దరఖాస్తుల పరిశీలనకే సమయం గడిచిపోతుంది. ఇక ముందస్తుగా చేయాలనుకున్న ఉపకార వేతనాల పంపిణీ ఆలస్యం కానుందని అధికారులు చెబుతున్నారు.

ఓట్లను బట్టే సీట్లు!

మన దేశంతోపాటు చాలా చోట్ల మెజారిటీ జనామోదం లేకుండానే ప్రజాప్రతినిధులు ఎన్నికవుతున్నారు. ఓట్ల శాతం తక్కువగా ఉన్నప్పటికీ ఆయా పార్టీలు ప్రభుత్వాలను ఏర్పాటు చేస్తున్నాయి. మరోవైపు దేశవ్యాప్తంగా ప్రజాదరణ ఉన్నా.. గణనీయంగా ఓట్ల శాతాన్ని సాధించినా.. సీట్లు మాత్రం రావడం లేదు. ఇది ప్రజాభిప్రాయాన్ని ప్రతిబింబించడం లేదన్న వాదన ఉంది. అసలు పోలైన ఓట్లలో 50 శాతానికి మించి సాధిస్తేనే జనామోదం ఉన్నట్లు పరిగణించాలనే వాదన కూడా ఉంది. ఓటింగ్‌లో ప్రస్తుతం రెండు విధానాలు అమల్లో ఉన్నాయి.

– సాక్షి నాలెడ్జ్ సెంటర్

ఎన్నికల్లో దామాషా పద్ధతి మేలా? ● నియోజకవర్గాల్లోనే ‘ఓటు బదిలీ’ పద్ధతి పాటించాలా? ● ఎన్నికల సంస్కరణలపై ఆనంద్‌శర్మ కమిటీ పరిశీలన

ఒక్క ఓటు ఎక్కువొచ్చినా..


ప్రస్తుతం మనం అనుసరిస్తున్నది ‘ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్ (ఎఫ్‌పీటీపీ)’విధానం. పరుగు పందెంలో ఎందరు పాల్గొన్నా.. మొదట గీత దాటిన వాడే గెలిచినట్లుగా ప్రకటిస్తారు. దాన్ని దృష్టిలో పెట్టుకుని ‘ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్’అని ఈ ఎన్నికల విధానానికి పేరు పెట్టారు. ఇందులో పోటీలో ఉన్న అభ్యర్థులందరిలో ఎవరికి ఎక్కువ ఓట్లు (ఒక్క ఓటు మెజారిటీ ఉన్నా సరే) వస్తే వారే గెలిచినట్లు. మొత్తం పోలైన ఓట్లలో వారికి ఎంత శాతం ఓట్లు పడ్డాయనే దానితో సంబంధం లేదు. త్రిముఖ, చతుర్ముఖ పోటీ నెలకొన్న సందర్భాల్లో 27 లేదా 28 శాతం ఓట్లు పొంది కూడా ఒక అభ్యర్థి గెలవచ్చు. అంటే మిగతా 72 శాతం ఆ అభ్యర్థిని తిరస్కరించారనే కదా అర్థం. మన దగ్గర లోక్‌సభకు, రాష్ట్రాల అసెంబ్లీలకు ఎఫ్‌పీటీపీ విధానంలోనే ఎన్నికలు జరుగుతున్నాయి.

ఓట్ల శాతాన్ని బట్టి ప్రాతినిధ్యం


ఓటింగ్ ప్రక్రియలో రెండోది ప్రపోర్షనల్ రిప్రజెంటేషన్ (పీఆర్ విధానం).. ఓట్ల శాతానికి సమానంగా ప్రాతినిధ్యం. అంటే ఒక పార్టీకి ఎంత శాతం ఓట్లు వస్తాయో.. మొత్తం సీట్లలో అంత శాతం ఆ పార్టీకి కేటాయిస్తారు. ఇందులో మళ్లీ రెండు విధానాలున్నాయి.

- ఒకటి.. లిస్ట్ పద్ధతి. ఇందులో పార్టీలు మొత్తం స్థానాలకు సరిపడా అభ్యర్థుల పేర్లతో ఒక జాబితాను ఎన్నికలకు ముందే ఎన్నికల సంఘానికి అందిస్తాయి. ఇందులో అభ్యర్థుల పేర్లను ప్రాధాన్య క్రమంలో పొందుపరుస్తాయి. పార్టీకే ప్రజలు ఓటేస్తారు. వచ్చిన ఓట్ల శాతాన్ని బట్టి.. అంతకు సమానశాతం సీట్లను జాబితాలోని అభ్యర్థులకు వరుసగా కేటాయిస్తారు.
- రెండోది.. సింగిల్ ట్రాన్స్‌ఫరబుల్ ఓటు. ఇందులో ఓటర్లు బరిలో ఉన్న అభ్యర్థులకు ప్రాధాన్యక్రమంలో ఓటేస్తారు. ఎవరికైనా 50 శాతానికి మించి తొలి ప్రాధాన్య ఓట్లు పడితే గెలుపొందినట్లే. ఎవరికీ 50 శాతానికి మించి తొలి ప్రాధాన్య ఓట్లు రాకపోతే.. అతితక్కువ ఓట్లు వచ్చిన అభ్యర్థిని పోటీ నుంచి తప్పించి.. రెండో ప్రాధాన్య ఓట్లను లెక్కిస్తారు. ఇలా ఎవరికైనా 50 శాతానికిపైగా ఓట్లు వచ్చే దాకా ఎలిమినేషన్ జరుగుతుంది. రాష్ట్రపతి ఎన్నికల్లో ఇదే విధానాన్ని అనుసరిస్తాం.

2014 లోక్‌సభ ఎన్నికల్లో వివిధ పార్టీలకు వచ్చిన సీట్లు



ఓట్ల దామాషా పద్ధతిన కేటాయిస్తే ఆయా పార్టీలకు వచ్చే సీట్లు



పొంతన లేని ఓట్లు.. సీట్లు

- బీజేపీ 2014 ఎన్నికల్లో కేవలం 31 శాతం ఓట్లతో 282 లోక్‌సభ సీట్లు సాధించింది. మన దేశ చరిత్రలో మరే సందర్భంలోనూ ఇంత తక్కువ ఓట్ల శాతంతో ఒక పార్టీకి సొంత మెజారిటీ రాలేదు.
- దేశవ్యాప్తంగా ఓట్లశాతంలో బీజేపీ, కాంగ్రెస్‌ల తర్వాత మూడోస్థానంలో నిలిచిన బీఎస్పీకి (4.1 శాతం ఓట్లు) ఒక్క సీటు కూడా రాకపోవడం గమనార్హం.
- ఇదే సమయంలో తృణమూల్ కాంగ్రెస్ కేవలం 3.8 ఓట్ల శాతం ఓట్లతో 34 లోక్‌సభ స్థానాల్లో గెలిచింది. అన్నాడీఎంకే 3.3 శాతం ఓట్లతోనే 37 సీట్లు పొందింది.
- మరోవైపు కాంగ్రెస్ పార్టీ 19.3 శాతం ఓట్లు సాధించి కూడా 44 సీట్లకే పరిమితమైంది.
- 2009లో బీజేపీకి 18.5 శాతమే ఓట్లు వచ్చినా ఏకంగా 116 సీట్లు గెలుచుకుంది.
- 1984లో ఇందిరాగాంధీ హత్యానంతరం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ 49.1 శాతం ఓట్లతో ఏకంగా 405 స్థానాలతో భారీ మెజారిటీ సాధించింది. అయితే ఓట్లశాతం పరంగా చూస్తే (వచ్చిన ఓట్లు 50 శాతం దాటలేదు కాబట్టి) మెజారిటీ ప్రజల ఆమోదం ఉన్న ప్రభుత్వం కాదనే వాదనా ఉంది.
- కొన్ని నియోజకవర్గాలకే పరిమితమైన పార్టీలు తక్కువ ఓట్లు వచ్చినా ఎక్కువ సీట్లు నెగ్గుతున్నాయి. మరోవైపు దేశవ్యాప్తంగా ఉనికి ఉన్నప్పటికీ కొన్ని పార్టీలు తక్కువ సీట్లు గెలుచుకుంటున్నాయి. ఉదాహరణకు సీపీఎం (3.25 శాతం)కు 2014 సాధారణ ఎన్నికల్లో అన్నాడీఎంకేతో దాదాపు సమానంగా ఓట్లు వచ్చినా 9 సీట్లే నెగ్గింది.

చర్చ ఎందుకు?

ప్రస్తుతం మనం అనుసరిస్తున్న ఎఫ్‌పీటీపీ విధానం సరైనది కాదేమోనన్న సందేహాలు కొన్నేళ్లుగా వినిపిస్తున్నాయన్న అంశాన్ని ఎంపీ ఆనంద్ శర్మ నేతృత్వంలోని పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ (పర్సనల్, ప్రజా ఫిర్యాదులు, చట్ట, న్యాయ అంశాలపై కమిటీ) తాజాగా లేవనెత్తింది. ఈ ఏడాది ఫిబ్రవరి–మార్చి నెలల్లో జరిగిన ఉత్తరప్రదేశ్ ఎన్నికల ఫలితాలను ఆయా పార్టీల పేర్లు తీసుకోకుండా ఉదహరించింది. యూపీలో మొత్తం అసెంబ్లీ సీట్లు 403 కాగా... 39 శాతం ఓట్లు వచ్చిన పార్టీ (బీజేపీ) 312 సీట్లు, 22 శాతం ఓట్లు వచ్చిన పార్టీ (సమాజ్‌వాదీ) కేవలం 47 సీట్లు, 21 శాతం ఓట్లు వచ్చిన పార్టీ (బీఎస్పీ) కేవలం 19 సీట్లు మాత్రమే పొందాయని గుర్తుచేసింది. అంటే పార్టీకి ఉన్న జనాదరణకు, వాటికి వచ్చిన సీట్లకు పొంతన లేదన్న విషయాన్ని స్పష్టం చేసింది. ఈ నేపథ్యంలో ప్రత్యామ్నాయ విధానాలు, వాటి అమలులోని సాధ్యాసాధ్యాలను సూచించాలని ఎన్నికల సంఘానికి, అన్ని రాజకీయపార్టీలకు లేఖలు రాసింది.

‘ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్’ విధానం

అనుకూలతలు..

1. సులభమైనది. నిరక్షరాస్యులు కూడా తేలిగ్గా అర్థం చేసుకోగలరు.
2. మెజారిటీ ఓటు (50 శాతం పైచిలుకు)తో సంబంధం లేకుండా సుస్థిర ప్రభుత్వాలు ఏర్పడే అవకాశాలు ఎక్కువ.
3. పార్టీల సిద్ధాంతాలతో పాటు అభ్యర్థి గుణగణాలను కూడా పరిగణనలోకి తీసుకుని నిర్ణయానికి వచ్చే అవకాశం ఓటరుకు ఉంటుంది.
4. అభ్యర్థికి ప్రత్యేకంగా నియోజకవర్గం ఉంటుంది కాబట్టి తన రాజకీయ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అయినా అభివృద్ధి కోసం కృషి చేయాల్సి ఉంటుంది.
5. అన్ని మతాలు, సామాజికవర్గాలను మెప్పించేందుకు అభ్యర్థులు పనిచేయాల్సి ఉంటుంది.
6. ప్రజల్లో ఆదరణ ఉంటే స్వతంత్ర అభ్యర్థిగానూ పోటీచేసి గెలవొచ్చు.

ప్రతికూలతలు...

1. దేశవ్యాప్తంగా ఉనికి ఉన్నా.. నియోజకవర్గాల్లో పట్టులేని కారణంగా కొన్ని పార్టీలకు పార్లమెంటులో ప్రాతినిధ్యమే లేకుండా పోతుంది. 2014లో బీఎస్పీ విషయంలో జరిగింది ఇదే.
2. అభ్యర్థులకు వచ్చిన ఓట్లు బదిలీ చేసే అవకాశం లేదు కాబట్టి ఓట్లు వృథా అవుతాయి.
3. ఎఫ్‌పీటీపీ విధానంలో సుస్థిర ప్రభుత్వం వస్తుందనే హామీ ఏమీ లేదు.
4. అభ్యర్థులు తమ గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకుంటారు కాబట్టి ఎన్నికల ఖర్చు అధికం.
5. కుల, మత, ప్రాంతీయ విభజనను ప్రోత్సహించేలా ఉంటుంది.

ఓట్ల శాతానికి తగ్గ ప్రాతినిధ్య విధానం



అనుకూలతలు


1. నియోజకవర్గ స్థాయిలో ఎన్నికల ఖర్చు చాలా తక్కువ.
2. దేశవ్యాప్త ఉనికి ఉన్న చిన్నపార్టీలు, మైనారిటీ, మహిళల పార్టీలకు వారికి వచ్చిన ఓట్లను బట్టి చట్టసభల్లో ప్రాతినిధ్యం దక్కుతుంది.
3. ఓటు వృథా కాదు. దామాషా ప్రాతిపదికన ఇతర అభ్యర్థులకు కేటాయించబడుతుంది.

ప్రతికూలతలు

1. గెలిచిన అభ్యర్థులు మెజారిటీ వర్గాలపైనే దృష్టి పెట్టి.. మిగతా వారిని పట్టించుకోకపోవచ్చు.
2. అభ్యర్థిని ఎంచుకొనే స్వేచ్ఛ ఓటరుకు ఉండదు. పార్టీ ఎవరిని నిర్ణయిస్తే వారిని అంగీకరించాల్సిందే.
3. సుస్థిరత అంతగా ఉండదు. మెజారిటీ సాధించడానికి సంకీర్ణాలు తప్పవు.
4. ప్రజాప్రతినిధి–ప్రజలకు (ఓటర్లకు) మధ్య ప్రత్యక్ష సంబంధం ఉండదు. కాబట్టి నిర్లక్ష్య వైఖరితో వ్యవహరించే అవకాశాలుంటాయి.
5. స్వతంత్ర అభ్యర్థులకు అవకాశం ఉండదు. ఏదో ఒక పార్టీ పేరుపైన పోటీ చేయాల్సిందే.

✦ అబద్ధాల్లో మోదీ, కేసీఆర్ ఇద్దరూఇద్దరే

ఏఐసీసీ మైనారిటీ సెల్ చైర్మన్ సల్మాన్ ఖుర్షీద్



సాక్షి, హైదరాబాద్: అబద్ధాలు చెప్పి ప్రజలను మోసం చేయడంలో ప్రధాని మోదీ, సీఎం కేసీఆర్ ఇద్దరూ ఇద్దరేనని ఏఐసీసీ మైనారిటీ సెల్ చైర్మన్ సల్మాన్ ఖుర్షీద్ విమర్శించారు. పార్టీ నేతలతో కలిసి సోమవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడుతూ కేసీఆర్ ముస్లింలకు 12 శాతం రిజర్వేషన్లను ఎందుకు అమలు చేయడంలేదని ప్రశ్నించారు. మోదీ మూడేళ్ల పాలనలో ప్రజలకు ఒరిగింది శూన్యమన్నారు. రైతులపై దాడులు, గోరక్ష పేరుతో అమాయకులను పొట్టన పెట్టుకోవడం వంటి కిరాతక చర్యలకు హద్దులేకుండా పోయిందన్నారు. ముస్లిం మహిళలకు సంబంధించిన తలాఖ్ గురించి మాట్లాడుతున్న మోదీ, తన వ్యక్తిగత జీవితంలో భార్య గురించి ఎందుకు మాట్లాడటంలేదని ప్రశ్నించారు. మోదీ పాలన కారణంగా విదేశీ పెట్టుబడులు రావడంలేదన్నారు. ఇతర పార్టీలకు చెందిన ప్రభుత్వాలను కూలదోయడం, ఏదో విధంగా అధికారాన్ని హస్తగతం చేసుకోవడమే మోదీ పనిగా పెట్టుకున్నారన్నారు. అవినీతి గురించి మాట్లాడుతున్న ఆయన గుజరాత్ ముఖ్యమంత్రిగా తన అవినీతిని ఎందుకు చెప్పుకోవడంలేదని ప్రశ్నించారు.

✦ చర్చంటే జూపల్లికి భయమెందుకు: వంశీచంద్



సాక్షి, హైదరాబాద్: పాలమూరు ఆయకట్టు తగ్గింపు, జీఓలో మార్పులపై బహిరంగచర్చకు రావడానికి మంత్రి జూపల్లి కృష్ణారావు ఎందుకు భయపడుతున్నారని కాంగ్రెస్ ఎమ్మెల్యే వంశీచంద్‌రెడ్డి ప్రశ్నించారు. సోమవారం ఆయన ఇక్కడ విలేకరులతో మాట్లాడుతూ పాలమూరుకు అన్యాయం చేసేవిధంగా జీఓలను మార్చారని ఆరోపించారు. ఆయకట్టును 62 వేల నుంచి 37 వేలకు తగ్గించారని చెప్పారు. ఈ మార్పులు తెలుసుకోలేని అజ్ఞానంలో జూపల్లి ఉండటం జిల్లా ప్రజల దురదృష్టమన్నారు. ఆయనకు మంత్రిగా కొనసాగే హక్కులేదని, వెంటనే రాజీనామా చేయాలని అన్నారు. డిండికి పాలమూరు–రంగారెడ్డి ప్రాజెక్టు నుంచి నీళ్లు తీసుకుపోవద్దని సీఎంకు గతంలో లేఖ రాసిన జూపల్లి ఇప్పుడెందుకు మాట్లాడటం లేదని ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో కోట్లు దండుకోవడానికి ఆయన కల్వకుర్తి కాలువలు, టన్నెల్ సైజులు తగ్గించారని ఆరోపించారు.

✦ రైతు ఆత్మహత్యల నివారణలో విఫలం

కేసీఆర్‌పై ఇంద్రసేనారెడ్డి ధ్వజం



సాక్షి, హైదరాబాద్: రైతు ఆత్మహత్యలు నివారించడంలో సీఎం కేసీఆర్ పూర్తిగా విఫలమయ్యారని బీజేపీ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి విమర్శించారు. సోమవారం ఆయన పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ.. రైతులకు భరోసానిచ్చి, అండగా నిలబడుతున్నామనే విశ్వాసం రాష్ట్ర ప్రభుత్వం కల్పించలేకపోయిందని ఆరోపించారు. రైతు సమస్యలపై కమిషన్ వేయాలని ప్రభుత్వానికి హైకోర్టు సూచనలు చేసి ఏడాది దాటినా టీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. దీనిపై కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. సీఎం కేసీఆర్‌కు వ్యవసాయ అవార్డు ప్రకటించింది కేంద్రం కాదని.. ఓ ప్రైవేట్ విత్తన వ్యాపార సంస్థ అని స్పష్టం చేశారు.

✦ దామాషా ప్రకారం కృష్ణా జలాలు వదలాలి

సీపీఎం నేత జూలకంటి



సాక్షి, హైదరాబాద్: మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలు కృష్ణానదిపై అక్రమంగా కొత్త ప్రాజెక్టులు నిర్మించడంతో పాటు, ఉన్న ప్రాజెక్టుల సామర్థ్యం పెంచుకుని వచ్చే నీటిని మొత్తం వారే వాడుకుంటున్నారని సోమవారం సీపీఎం నేత జూలకంటి రంగారెడ్డి విమర్శించారు. ప్రస్తుతం కర్ణాటకలోని ఆల్మట్టి, నారాయణపూర్ ప్రాజెక్టులు పూర్తిగా నిండిఉన్నాయని, అయినా, కిందకు నీటిని వదలడం లేదని అన్నారు. ఈ ఏడాది ఇప్పటి వరకు శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు చుక్కనీరు రాలేదని, ఇక ముందు వస్తుందన్న ఆశకూడా లేకుండా పోయిందని అన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో శ్రీశైలం, నాగార్జునసాగర్ ప్రాజెక్టులకు నీళ్లు రావాలంటే ఎగువ నుంచి వచ్చే నీటిని ఎప్పటికప్పుడు మహారాష్ట్ర, కర్ణాటకలు కొంత వాడుకుని, కొంత నీటిని దామాషా పద్ధతిలో కిందకు విడుదల చేయాలని, అప్పుడే అన్ని ప్రాంతాలకు న్యాయం జరుగుతుందని అన్నారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, కృష్ణా బోర్డు నిర్ణయం తీసుకుని అమలు చేయాలని కోరారు.

✦ బీ, సీ కేటగిరీ రెండో దశ పూర్తి

ఎంబీబీఎస్, బీడీఎస్ సీట్ల కేటాయింపుపై కాళోజీ వర్సిటీ

సాక్షి, హైదరాబాద్: ఎంబీబీఎస్, బీడీఎస్ బీ, సీ కేటగిరీ రెండో దశ కౌన్సెలింగ్ సీట్ల కేటాయింపు పూర్తయ్యింది. ఈ మేరకు కాలేజీల వారీగా సీట్లు పొందిన అభ్యర్థుల జాబితాను కాళోజీ నారాయణరావు ఆరోగ్య, విజ్ఞాన విశ్వవిద్యాలయం సోమవారం వెల్లడించింది. ఎన్‌సీసీ కేటగిరీలోని ఎంబీబీఎస్, బీడీఎస్ వైద్య సీట్ల విషయంలో అర్హుల మెరిట్ జాబితాను వెలువరించింది. ఈ వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

ఓట్లా.. ఓట్ల శాతమా?

రాజకీయ పార్టీల అభిప్రాయం కోరిన పార్లమెంటరీ కమిటీ

న్యూఢిల్లీ: ప్రస్తుతం దేశంలో అనుసరిస్తున్న ఎక్కువ ఓట్లను సాధించిన వ్యక్తిని విజేతగా ప్రకటించే ‘ఫస్ట్ పాస్ట్ ది పోస్ట్ (ఎఫ్‌పీటీపీ) ఎన్నికల విధానంపై అభిప్రాయాలు తెలపాలని న్యాయ, మానవ వనరులపై ఏర్పాటైన పార్లమెంటరీ కమిటీ జాతీయ, ప్రాంతీయ రాజకీయ పార్టీల్ని కోరింది. ఎఫ్‌పీటీపీ విధానం సరైంది కాదేమోననే సందేహాలు వ్యక్తం చేసింది. అందుకు ఈ ఏడాది జరిగిన ఉత్తరప్రదేశ్ ఎన్నికల ఫలితాల్ని ఉదాహరణగా పేర్కొంది. యూపీలో 39 శాతం ఓట్లు వచ్చిన బీజేపీకి 312 సీట్లు రాగా, 22 శాతం వచ్చిన సమాజ్‌వాదీ పార్టీకి 47 సీట్లు, 21 శాతం వచ్చిన బీఎస్పీకి కేవలం 19 సీట్లే వచ్చాయి. ఈ విధానంలో సాధించిన ఓట్ల శాతంతో సంబంధం లేకుండా ఎన్నికల్లో ఎక్కువ ఓట్లు పొందిన అభ్యర్థి గెలిచినట్లు. ఓట్ల శాతానికి ప్రాతినిధ్య విధానం సహా మరికొన్ని ఎన్నికల వ్యవస్థల గురించి కమిటీ ప్రస్తావించింది. అలాగే రాజకీయ పార్టీలకు వ్యక్తిగత నగదు విరాళాల్ని రూ. 2 వేలకు పరిమితం చేయడం సహేతుకమా? కాదా? అన్న అంశంపై స్పందించాలని పార్టీల్ని కమిటీ కోరింది. ఎలక్టోరల్ బాండ్స్ ద్వారా విరాళాలిచ్చే వారి వ్యక్తిగత గోపత్యకు ఏమైనా ప్రమాదముంటుందా అని కూడా ప్రశ్నించింది. ఎన్నికల సంస్కరణలపై ఆర్థిక బిల్లులో సూచించిన సిఫార్సుల్ని పరిశీలించిన కమిటీ ఆ మేరకు పార్టీలకు ప్రశ్నావళిని పంపింది. నగదు లావాదేవీల వాడకం తగ్గించడం, రాజకీయ పార్టీలకు విరాళాల విషయంలో పారదర్శకత కోసం ఆర్థిక బిల్లు, 2017లో ఆదాయపు పన్ను చట్టానికి సవరణలు సూచించారు. పార్టీలకు ఇచ్చే వ్యక్తిగత నగదు విరాళాలు రూ.2వేలు మించకూడదని అందులో పేర్కొన్నారు. అయితే రూ.2వేల పరిమితి ప్రస్తుతం దేశ ద్రవ్యోల్బణ దృష్ట్యా మార్కెట్ పరిస్థితులకనుగుణంగా ఉందా అని ప్రశ్నావళిలో కమిటీ పేర్కొంది. ప్రస్తుత ఎన్నికల వ్యవస్థలు, మీడియా/పార్టీ ప్రచారానికి ఉచిత ప్రచార సమయం, రాజకీయ పార్టీల్లో అంతర్గత ప్రజాస్వామ్యం తదితర అంశాలపై పార్టీల అభిప్రాయాల్ని కోరింది.

అభియోగాలు దాఖలైతే అనర్హత వేటుపై ఆందోళన

కోర్టులో అభియోగాలు దాఖలు చేసే రోజు నుంచే ఎన్నికల్లో పోటీ చేయకుండా అనర్హుల్ని చేయాలన్న ప్రతిపాదనపై కమిటీ ఆందోళన వ్యక్తం చేసింది. ఆ చట్టం అమల్లోకి వస్తే అధికారంలో ఉన్న పార్టీ దుర్వినియోగం చేసే అవకాశముందని, ఈ అంశంపై పార్టీలు తమ అభిప్రాయాలు తెలపాలని కోరింది. ప్రస్తుతం కేసులో దోషిగా తేలితేనే అనర్హత వేటు వేస్తున్నారు.

400 ఎకరాల్లో షేడ్‌నెట్లు

సాక్షి, హైదరాబాద్: వచ్చే వేసవిలో కూరగాయల నిరంతర సరఫరాకు 400 ఎకరాల్లో షేడ్‌నెట్ హౌస్‌ల నిర్మాణానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు వ్యవసాయశాఖ కార్యదర్శి పార్థసారథి, ఉద్యానశాఖ కమిషనర్ వెంకట్రామిరెడ్డి తెలిపారు. ఈ మేరకు ఉద్యాన, మార్కెటింగ్‌శాఖ అధికారులతో సోమవారం వారు సమీక్ష నిర్వహించారు. మార్చి నుంచి ఆగస్టు వరకు కొరత ఉన్న కూరగాయలను గుర్తించి వాటి నిరంతర సాగు, సరఫరా జరిగేలా ఏర్పాట్లు చేయాలని నిర్ణయించినట్లు చెప్పారు. శాశ్వత పందిర్లు, పాలీహౌస్, షేడ్‌నెట్‌ల ఏర్పాటు ద్వారా కూరగాయల కొరతను అధిగమించేందుకు ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. పంట కాలనీలతో పాటు 50 శాతం రాయితీపై శాశ్వత పందిర్లను ఏర్పాటు చేస్తామన్నారు.

సింగరేణిలో ఎన్నికల నగారా

- అక్టోబర్ 5న గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలు



సాక్షి, హైదరాబాద్: సింగరేణి బొగ్గు గనుల సంస్థలో గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల నగారా మోగింది. అక్టోబర్ 5న సింగరేణి కార్మిక సంఘం గుర్తింపు ఎన్నికలు జరగనున్నాయి. సింగరేణి భవన్‌లో సోమవారం కార్మిక సంఘాలతో నిర్వహించిన సమావేశంలో కేంద్ర కార్మిక శాఖ డిప్యూటీ చీఫ్ లేబర్ కమిషనర్ (సెంట్రల్), రిటర్నింగ్ అధికారి కె.కె.హెచ్.ఎం శ్యామ్‌సుందర్ ఎన్నికల షెడ్యూల్ ప్రకటించారు. దీని ప్రకారం... అక్టోబర్ 5 ఉదయం 7 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఎన్నికలు జరగనున్నాయి. ఆ వెంటనే ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఈ నెల 30లోగా సింగరేణి యాజమాన్యం కార్మిక సంఘాలకు ముసాయిదా ఓటర్ల జాబితాను అందజేయనుంది. ఓటర్ల జాబితాలో అభ్యంతరాలుంటే సెప్టెంబర్ 6 సాయంత్రం 5 గంటలలోగా కార్మిక సంఘాలు రిటర్నింగ్ అధికారికి తెలపాలి. అభ్యంతరాలపై సెప్టెంబర్ 9న సాయంత్రం 5 గంటలలోగా రిటర్నింగ్ అధికారి నిర్ణయాన్ని ప్రకటిస్తారు. సెప్టెంబర్ 13న తుది ఓటర్ల జాబితాను ప్రదర్శిస్తారు. 14న ఉదయం 10 గంటల నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభం కానుంది. సెప్టెంబర్ 16వ తేదీ సాయంత్రం 5 గంటలతో నామినేషన్ల స్వీకరణ ముగియనుంది. 19న మధ్యాహ్నం 2 గంటలతో నామినేషన్ల ఉప సంహరణకు గడువు ముగియనుంది. 20 ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంటవరకూ నామినేషన్ల పరిశీలన నిర్వహించనున్నారు. 20న మధ్యాహ్నం 2 గంటలలోపు అభ్యర్థులకు ఎన్నికల గుర్తులు కేటాయిస్తారు. అక్టోబర్ 5న ఎన్నికలు నిర్వహించి అదేరోజు రాత్రి 7 గంటలకు ఓట్ల లెక్కింపు ప్రారంభిస్తారు. ఆగస్టు 1 నాటికి హాజరు పట్టీలో ఉన్న ఉద్యోగులను తాత్కాలిక ఓటర్లుగా గుర్తిస్తామని, అయితే అక్టోబర్ 5 నాటికి హాజరు పట్టీలో ఉన్న ఉద్యోగులు మాత్రమే ఓటు వేయడానికి అర్హులని సింగరేణి యాజమాన్యం తెలిపింది. ఈ మధ్యకాలంలో రిటైరైన ఉద్యోగులు ఓటు వేయడానికి అనర్హులని పేర్కొంది.

డిసెంబర్ నాటికి ‘భగీరథ’ నీరు: వేముల



సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశాల మేరకు డిసెంబర్ నాటికి రాష్ట్రంలోని అన్ని గ్రామాలకు మిషన్ భగీరథతో తాగునీటిని అందిస్తామని వైస్ చైర్మన్ వేముల ప్రశాంత్‌రెడ్డి తెలిపారు. ఇంటెక్ వెల్ నుంచి ఇంటింటికి నల్లా వరకు పనులు వేగంగా జరుగుతున్నాయన్నారు. సచివాలయంలో సోమవారం మిషన్ భగీరథ పనుల పురోగతిపై అధికారులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సెగ్మెంట్, జిల్లాల వారీగా పనులు ఏఏ దశల్లో ఉన్నాయో సమగ్ర నివేదిక రెండు రోజుల్లో అందించాలని ఆదేశించారు. వచ్చే నెలనుంచి ఏ సెగ్మెంట్లో ఎన్ని గ్రామాలకు భగీరథ నీటిని అందిస్తారో వివరాలు ఇవ్వాలన్నారు. పైప్‌లైన్, ఎలక్ట్రో మెకానికల్ సబ్ స్టేషన్ నిర్మాణాలు, వాల్వ్, వర్టికల్ కనెక్షన్లకు సంబంధించి ఏజెన్సీలు ఇచ్చిన ఆర్డర్ వివరాలతోపాటు యాక్షన్ ప్లాన్‌ను రెండు రోజుల్లో అందించాలని సూచించారు.

కాళేశ్వరంపై ప్రజాభిప్రాయం

నేటి నుంచి 26 వరకు 15 జిల్లాల్లో కొనసాగనున్న ప్రక్రియ



సాక్షి, హైదరాబాద్: కాళేశ్వరం ప్రాజెక్టు పర్యావరణ అనుతుల్లో భాగంగా మంగళవారం నుంచి ఈ నెల 26 వరకు రాష్ట్ర కాలుష్య నియంత్రణ బోర్డు(పీసీబీ) ప్రాజెక్టు ముంపు ప్రభావిత గ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టనుంది. ఎంపిక చేసిన మండలాల పరిధిలోనిగ్రామాల్లో ప్రజాభిప్రాయ సేకరణ కార్యక్రమం జరగనుంది. మొత్తంగా 15 జిల్లాల్లో జరిగే ఈ కార్యక్రమంపై ఇప్పటికే సంబంధిత అధికారులను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతుల ప్రక్రియలో పర్యావరణప్రభావ మదింపు(ఈఐఏ), పర్యావరణ ప్రభావ నిర్వహణ ప్రణాళిక(ఈఎంపీ)ని తప్పనిసరిగా చేయాల్సి ఉంటుంది. ఇందులో భాగంగా ప్రజాభిప్రాయ సేకరణ చేసి ఆ వివరాలను కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వ శాఖకు అందించాలి. దీన్ని దృష్టిలో పెట్టుకొనే భూసేకరణ అవసరమైన జిల్లాల్లో పీసీబీ ప్రజాభిప్రాయాన్ని సేకరించనుంది.

ప్రజాభిప్రాయ సేకరణ షెడ్యూలు

22-08-17: రాజశ్రీ గార్డెన్స్, రేకుర్తి, కరీంగనర్; రాజీవ్‌గాంధీ ఆడిటోరియం, నిజామాబాద్ టౌన్; బాలాజి ఫంక్షన్ హాల్, శామీర్‌పేట్, మేడ్చల్;సోమ రాధాకృష్ణ ఫంక్షన్ హాల్, రాయిగిరి, భువనగిరి

23-08-17: రెడ్డి ఫంక్షన్ హాల్, రాఘవపూర్, పెద్దపల్లి; మా ఫంక్షన్ హాల్, నారాయణఖేడ్, సంగారెడ్డి; లక్ష్మీదేవి గార్డెన్స్, దేవునిపల్లి, కామారెడ్డి; రాజరాజేశ్వరి కల్యాణ మండపం, చిట్యాల. నల్లగొండ.

24-08-17: నరేందర్‌రెడ్డి గార్డెన్స్, మెట్‌పల్లి, జగిత్యాల; శ్రీసాయి బాలాజీ గార్డెన్స్, మెదక్; వైఎస్సార్ ఫంక్షన్ హాల్ నిర్మల్.

26-08-17: వియోలా గార్డెన్స్, సిద్ధిపేట; తహశీల్దార్ ఆఫీస్, జైపూర్, మంచిర్యాల; రాష్ట్ర సాంఘిక సంక్షేమ గురుకల పాఠశాల, గంభీరావ్‌పేట, సిరిసిల్ల; ఏఎస్‌ఆర్ గార్డెన్స్, కుందూర్ పల్లి, భూపాలపల్లి.

ఎస్సారెస్పీకి వరద ఉధృతి

సాయంత్రం వరకు 1.90 లక్షల క్యూసెక్కుల మేర ఇన్‌ఫ్లో

- 17.84 టీఎంసీలకు చేరిన నీటిమట్టం
- నిజాంసాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు ప్రవాహాలు

సాక్షి, హైదరాబాద్/బాల్కొండ: ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టులోకి భారీ ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. స్థానిక వర్షాలకు తోడు ఎగువ ప్రాజెక్టుల వరద నీరు కూడా తోడవ్వడంతో ఇన్‌ఫ్లో పెరుగుతోంది. సోమవారం ఉదయం 1.50 లక్షల క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరగా సాయంత్రానికి అది మరో 40 వేల క్యూసెక్కులకు పెరిగి 1.90 లక్షల క్యూసెక్కులకు చేరింది. అయితే సాయంత్రం తర్వాత వరద తగ్గుముఖం పట్టి, 95 వేల క్యూసెక్కులకు చేరిందని నీటి పారుదల వర్గాలు తెలిపాయి. ఇక భారీ ప్రవాహాలు వచ్చి చేరడంతో ప్రాజెక్టు నీటి మట్టం శరవేగంగా పెరుగుతోంది. ప్రాజెక్టు నీటిమట్టం ఆదివారం 9.66 టీఎంసీలు ఉండగా, సోమవారం సాయంత్రానికి 17.84 టీఎంసీలకు చేరింది. ఇక నిజాంసాగర్, కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు స్థిరంగా ప్రవాహాలు కొనసాగుతున్నాయి. నిజాంసాగర్‌కు 3 వేల క్యూసెక్కులు, కడెంకు 2,400 క్యూసెక్కులు, ఎల్లంపల్లికి 6,110 క్యూసెక్కుల మేర ప్రవాహాలు వస్తుండటంతో ప్రాజెక్టుల మట్టాలు క్రమంగా పెరుగుతున్నాయి. కృష్ణా బేసిన్ ప్రాజెక్టుల్లో జూరాలకు వస్తున్న 2,500 క్యూసెక్కుల ప్రవాహం మినహాయించి, మరెక్కడా ప్రవాహాలు లేవు.

వేగంగా పెరుగుతున్న నీటి మట్టం..

శ్రీ రాంసాగర్ ప్రాజెక్టులోకి భారీగా వరద నీరు వచ్చి చేరుతుండటంతో ప్రాజెక్ట్ నీటి మట్టం వేగంగా పెరుగుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 1,091 అడుగులు కాగా, సోమవారం సాయంత్రానికి 1,065 అడుగులకు చేరింది. అయితే రాత్రికల్లా ఎగువ ప్రాంతాల నుంచి వరద నీరు క్రమంగా తగ్గుముఖం పట్టింది. రాత్రి 8 గంటల వరకు 1.5 లక్షల క్యూసెక్కులు వచ్చిన ఇన్‌ఫ్లో.. 9 గంటలకు 95 వేల క్యూసెక్కులకు పడిపోయింది. మొత్తంగా ఒక్క రోజు వ్యవధిలో 8.80 అడుగుల మట్టం పెరగ్గా.. 10 టీఎంసీల మేర వరద నీరు వచ్చి చేరింది.



వరద నీటితో కళకళలాడుతున్న శ్రీరాంసాగర్ ప్రాజెక్టు

కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదల..

శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి జగిత్యాల, కరీంనగర్ జిల్లాల ప్రజల తాగు నీటి అవసరాల కోసం కాకతీయ కాలువ ద్వారా 500 క్యూసెక్కుల నీటిని సోమవారం ప్రాజెక్ట్ అధికారులు విడుదల చేశారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం
22-8-2017



గొప్పగుణాల వల్ల దేవుణ్ణి మనం కొలుస్తాం.
గొప్ప స్నేహితుడిగా దేవుణ్ణి తలుస్తాం.
కష్టం వచ్చినా..
సంతోషం వచ్చినా
దేవాలయానికి చేరుతాం.
ఆ దైవత్వం మనిషిలోనే ఉంటే..!

మంచితనం సహాయగుణం
మనిషే అయితే ..!!
అప్పుడు
మనిషే మసీద్ అయిపోతాడు.
అలాంటి మంచితనానికి
ఆశీర్వచనం ఉంటుంది.

మంచికి ఆశీర్వచనం ఉంటుంది!

ఫొటో: శివ మల్లాల

నేను నా దైవం

ఎస్.ఎం. మలిక్‌కు ధార్మిక సమాజంలో మంచి పేరు ఉంది. ఇస్లాం ధార్మిక కార్యకర్తగా, ఇస్లాం ధార్మిక పత్రిక 'గీటురాయి'కి ముప్పై ఏళ్లుగా సంపాదకునిగా, వీటికంటే విశిష్టంగా ఖురాన్ తెలుగు అనువాదకునిగా సమాజంలో ఆయన గౌరవం, గుర్తింపు పొందారు. జమాతే ఇస్లామీ హింద్ సంస్థతో ఆయనకు సుదీర్ఘ అనుబంధం ఉంది. దైవాన్ని కనుగొనడంలో, ఆరాధన ద్వారా దైవానికి చేరువ కావడంలో మలిక్ స్వీయ అనుభవాలు ఎలా ఉన్నాయి, ఇస్లాం ఒక మతంగా జీవన ధర్మంగా ఎటువంటి దైవమార్గాన్ని బోధిస్తుంది, తదితర సందేహాలకు ఏడు పదుల వయసు దాటిన మాలిక్ కూలంకషంగా జవాబులు చెప్పారు.

● **మీ జీవితంలో ఇదంతా దైవికం అనుకున్న సందర్భం?**

మాది కర్నూలు జిల్లా. నేను పెద్ద పెద్ద చదువులు చదువుకోలేదు. పది వరకు ఉర్దూ, తెలుగు, సంస్కృతం చదువుకున్నాను. కాలేజీ మెట్లు ఎక్కలేదు. పుస్తకాలు ముఖ్యంగా తెలుగుసాహిత్యం బాగా చదివాను. సింగరేణి కాలరీస్‌లో ఎలక్ట్రికల్ విభాగంలో డెయిలీ మజ్దూర్‌గా పనిచేశాను. తర్వాత సదరన్ రైల్వేలో పదేళ్లు డ్రాఫ్ట్స్‌మన్‌గా పనిచేశాను. ఆ తర్వాత ధార్మిక సేవ చేయాలనిపించింది. జాబ్‌కు రిజైన్ చేసి ఇస్లాం అంశాల తెలుగు అనువాదకుడిగా ఉన్నాను. ఇదే నాకు పోషణ అయ్యింది. నేను ఉర్దూ మీడియంలో కాకుండా తెలుగు మీడియంలో చదువుకోవడానికి ఇదే కారణం అయ్యుంటుందని ఆ తర్వాత నాకు అనిపించింది. ఆ తర్వాత గీటురాయి పత్రికను ఆరంభించాను. ఇదంతా దైవికంగా జరిగినదే.

● **దైవాన్ని తెలుసుకోవాలంటే మతం తప్పనిసరా?**

మనిషి సమాజంతో ఎలా నడుచుకోవాలో చెప్పేదే మతం. ప్రపంచంలో ఎలా జీవించాలో, కుటుంబంతో ఎలా ఉండాలో, భాగస్వామితో, పిల్లలతో ఎలా మెలగాలో ఇవన్నీ మతం చెప్పాలి. అలాగే రాజకీయ, ఆర్థిక వ్యవస్థల పనితీరు గురించి కూడా తెలియజెప్పాలి. ఇవేవీ చెప్పని మతం మూఢమైనదని, మత్తుమందు వంటిదని మార్క్స్ వంటి వారు అన్నారు. ఇది నిజం. ఇవేమీ తన ప్రవక్తల ద్వారా సంకేతాల ద్వారా సందేశం ఇవ్వని దైవం ఇక మనకేం ఇస్తాడు. ఇస్లాంలో చూసినట్లయితే మనిషి సమాజంతో ఎలా నడుచుకోవాలో చెప్పేవన్నీ ఖురాన్‌లో ఉన్నాయి. ఖురాన్‌లో ఉన్న ప్రకారం మనిషి నడుచుకుంటే చాలు దైవం దృష్టిలో గొప్ప గుణశీలుడే. మనిషికి నిత్య జీవితంలో ఏమేం అవసరమో అవన్నీ చెప్పే దైవాన్ని నేను కొలుస్తాను. అలాంటి దైవం పట్ల ఆరాధన భావం లేకుండా చేసే పూజ పనికిరాదు. అలాంటి బోధనలు ఇవ్వని దైవమూ పనికిరాదు.

● **దేవుడు మనిషిని ఎందుకు సృష్టించాడు?**

ఈ భూమ్మీద ఇంత జంతుజాలం ఉంది. అది ప్రకృతికి ఏదో విధంగా ఉపయోగపడుతుంది. మనిషి మాత్రం అలా ఉపయోగపడడు. మరి మనిషి దేనికి ఉపయోగపడతాడు? దైవాన్ని తెలుసుకోవడానికి ఉపయోగపడతాడు. అందుకే సృష్టించబడ్డాడు. ఈ సృష్టిలో మానవుని సృజన దైవం కోసమే! దైవంలో ఏమున్నాయో అవన్నీ మనిషిలో ఉన్నాయి. ఇక్కడ మినియేచర్ గాడ్ మనిషి. అందుకే అతను కోరుకున్నవి తప్పక అవుతాయి. అయితే దైవంలో ఉన్న శక్తి అనంతం. మనిషిలో అవి పరిమితం. మనిషి తన శక్తులను సద్వియోగం చేస్తున్నాడా? దుర్వినియోగం చేస్తున్నాడా అనేది తెలుసుకోవడానికే మతం.

● **దైవం గురించి తెలుసుకోవడానికి సమయం, సందర్భం రావాలంటారా?**

దైవం తన గురించి తెలుసుకోవడానికి మనకు ఎన్నో అవకాశాలు ఇస్తుంటాడు. వాటిని మనం అందిపుచ్చుకోవాలి. ఇందుకు నా జీవితంలో జరిగిన ఒక సంఘటన చెబుతాను. మద్రాస్‌లో ఉద్యోగం చేసుకుంటున్న రోజులు. అప్పుడు నా వయసు 21. ఓ రోజు మా నాన్న ఉత్తరం రాశాడు... నువ్వేం చేయకపోయినా ఫజర్ నమాజ్ (సూర్యోదయానికి ముందు చేసే నమాజ్) మాత్రం తప్పక చేయమని అందులో ఉంది. మా నాన్న చెప్పినట్టు చేయాలని సంకల్పించుకున్నాను. అప్పుడు లాడ్జ్‌లో ఉండేవాడిని. లాడ్జి మేనేజర్‌ని కలిసి, ఉదయాన్నే నమాజ్‌కి వెళ్లాలి, గేటు తీస్తారా.. అని అడిగాను. వాళ్లు కుదరదన్నారు. అప్పుడు నా నెల జీతం 110 రూపాయలు. లాడ్జికి 10 రూపాయలు చెల్లిస్తున్నాను. 20 రూపాయలు అయినా సరే, అలాంటి రూమ్ కావాలని వెతికాను. కానీ, ఎక్కడా దొరకలేదు. ఎవరో దారిలో కలిసి ఆఫీసుకు దగ్గరలోనే మసీదు ఉంది అక్కడ రూమ్‌లు ఉన్నాయి అన్నారు. అక్కడకెళ్లి ఎవర్ని సంప్రదించాలో తెలియక నమాజు చేసుకోవడానికి కాళ్లూ చేతులు కడుక్కుంటున్నాను. ఇమామ్ పిలిచి 'వేళకాని వేళలో నమాజ్ చేసుకోవడానికి వచ్చావేంటి?' అని అడిగాడు. చెప్పాను. ''మా నాన్న నమాజ్ చేయమన్నాడు అందుకు రూమ్ కోసం వెతుకుతున్నాను'' అన్నాను. అప్పుడు అతను అన్నాడు.. నాన్న చెప్పాడనో.. అన్న చేయమన్నాడనో ... ఇంకెవరో ఆర్డర్ వేశారనో కాదు.. నీకు దైవాన్ని తలవాలనిపిస్తేనే చెయ్యి అన్నాడు. రూమ్ ఇప్పిస్తే చేసుకుంటాను అన్నాను. రూమ్ ఇచ్చాడు. నాకు చాలా నిశ్చింత అనిపించింది. అయితే, తెల్లవారు ఝామున జరిగే ఫజర్ నమాజ్‌కి ఎవరూ నన్ను నిద్ర లేపలేదు. వరుసగా నాలుగురోజులు చూశాను. నాకు దుఃఖం వస్తోంది. ఇమామ్‌ను కలిసి కంప్లైంట్ చేశాను, ఎవరూ నన్ను నిద్రలేపడం లేదని. నీకు నమాజ్ చేయాలనిపిస్తే నువ్వే లేస్తావు ఎవరో వచ్చి ఎందుకు లేపుతారు అన్నాడు. ఆ రోజు నమాజ్‌లో నాకు విపరీతమైన ఏడుపు వచ్చింది. ఏడుస్తూనే ప్రార్థన చేశాను. 'అల్లా నేను సిన్సియర్‌గా ప్రార్థన చేయాలనుకుంటున్నాను. నన్ను అనుగ్రహించు' అని కోరుకున్నాను. ఆశ్చర్యం... ఆ రోజు నుంచి ఈ రోజు వరకు ఎవరూ నన్ను నిద్ర లేపలేదు. కానీ, ఫజర్ నమాజ్ టైమ్‌కన్నా ముందే మెలకువ వచ్చేస్తుంది. స్వామిని కోరితే ఇవ్వలేనిదేముంది?

● **మనం కోరుకున్నవన్నీ ఇలా విని, అలా ఇచ్చేస్తాడా దేవుడు?**

ఖురాన్‌లో ఒక చోట– 'ప్రవక్తా.. మానవులు అడిగినప్పుడు ఇలా చెప్పు. నా దాసుల హృదయం కన్నా అత్యంత చేరువలో నేను ఉన్నాను అని చెప్పు. వారు నన్ను ఆర్తిగా పిలిచినప్పుడల్లా నేను వారికి బదులిస్తాను అని చెప్పు' అని ఉంది. ఆయన ఉన్నాడు కాబట్టే మనం ఈ భూమ్మీద మనగలుగుతున్నాం. మనకు మేలైనది ఏదో అది కోరుకుంటే దానిని ఆయనే పూర్తి చేస్తాడు. ఎదుటివాడికి చెడు చేయాలనే తలంపు ఉంటే మాత్రం దానికి ఆయన అనుగ్రహం ఉండదు. నా విషయమే ఒకటి చెబుతాను. ఇరవై ఏళ్ల క్రితం గుండెకు మూడు స్టంట్లు వేశారు. అప్పటికి నేను మొదలెట్టిన ఖురాన్ అనువాదం పూర్తి కాలేదు. అందుకని ఆ సమయంలో ఆసుపత్రి నుంచే అల్లాను ప్రార్థించాను. 'అల్లా... దివ్య ఖురాన్ తెలుగు అనువాదం, వ్యాఖ్యానం పూర్తిచేసే బాధ్యతలు ఉన్నాయి. వీటిని పూర్తి చేసే శక్తి, వ్యవధి ఇవ్వు' అని కోరుకున్నాను. ఆ దైవం నాకు ఆ సమయం ఇచ్చాడు. ఇప్పుడు అనువాదం ప్రింటింగ్ దశలో ఉంది. నా జీవితాన్ని పొడిగించే శక్తిని ఆ అల్లానే ఇచ్చాడు.

> ● **సంతృప్తిగా జీవించాలంటే దైవాన్ని ఏమని కోరుకోవాలి?**
>
> దైవంతో మమేకమైతే సంతోషం కలుగుతుంది. ఆ సంతోషానికి మాటలు ఉండవు. దైవాన్ని కోరుకున్నవన్నీ జరుగుతాయని లేదు. కానీ, చిన్న ఆశ, నమ్మకం ఉంటాయి. అది జరిగిందనుకోండి. ఎంతో సంతోషం. అలాంటి ప్రత్యక్ష సాయం అందుతుండగా నేను నా కళ్లారా చూశాను. వాటి గురించి నా పుస్తకాల్లో రాశాను. ఆ సంతోషమే తృప్తి. ఆ సమయంలో దైవం గుర్తుండాలి. ఆ సమయంలో కృతజ్ఞతాభావం ఏదైతే ఉందో అదే దైవానికి మనం ఇచ్చే కానుక.

● **దైవం నుంచి సరే... మరి ప్రజలు పాలకుల నుంచి ఏం కోరుకోవాలి?**

ప్రజలు ఫలానా వారు మాకు నాయకుడు కావాలని బలంగా కోరుకోవాలి. ఎవరైతే ప్రజలకు సేవ చేస్తాడో అతనే నాయకుడవుతాడు. అంతేకానీ పెత్తనం చెలాయించేవాడు నాయకుడు కాదు. 'సాటి మనిషి కష్టాన్ని అంత త్వరగా గుర్తించి, చేయూతనివ్వు. అప్పుడే నువ్వు మనిషిగా ఎదుగుతావు' అంటారు ప్రవక్త. పాలకుడు అలా ఉండాలి. కులం, మతం, ప్రాంతం, భాష, రంగులు.. వీటితో దైవానికి సంబంధం లేదు. అలాగే పాలకుడికీ సంబంధం ఉండకూడదు. దైవం దృష్టిలో ఏ మనిషి ధర్మబద్ధంగా నడుచుకుంటాడో. అతనే గొప్ప గుణశీలుడు.

● **ఆత్మను ఎలా శుద్ధి చేసుకోవాలి?**

మనం చాలా బలహీనులం. ఎన్నో బలహీనతలు ఉంటాయి. అందుకే, ఎన్నో తప్పులు చేస్తాం. నేనూ చేశాను. వాటివల్ల వచ్చే కష్టాలు ఏవైనా అవి శిక్షగా కాదు. పరీక్షగా వస్తాయి. శిక్షలు ఏమైనా పరలోకంలో ఉంటాయి. మనం చేయాల్సింది తప్పు చేశానని దైవం ముందు ఒప్పుకోగలగాలి. 'దైవమా నేను చాలా బలహీనుడిని, అనుగ్రహించు' అని కోరుకోవాలి. నేను బాధతో ఎప్పుడు ఏడ్చినా దైవం సమక్షంలోనే ఏడ్చాను. ఎవరి ముందూ కన్నీరు పెట్టుకోలేదు. పశ్చాత్తాపంతో రాల్చే ఒక్క కన్నీటి బిందువు మన ఆత్మను పరిశుద్ధం చేస్తుంది. అలా రాల్చే కన్నీటిబొట్టు నేల రాలకముందే దైవకటాక్షం లభిస్తుంది. ఆత్మపరిశుద్ధత బయట ఎక్కడో వెతకనక్కర్లేదు. మనలోనే ఉంది. ఎవరికి వారే తమ ఆత్మను పరిశుద్ధ పరుచుకోవాలే తప్ప మరొకరి వల్ల కాదు.

● **దైవం స్త్రీయా, పురుషుడా?**

దైవానికి రూపం లేదు. లింగం లేదు. దైవం మహాశక్తి. అయితే, ప్రాచీన కాలం నుంచి ఏ సామ్రాజ్యంలో చూసినా, ఏ భాషలో అయినా దేవుడు పుంలింగంగానే పరిగణించబడుతున్నాడు. మానవ స్త్రీ, పురుషుల్లో లైంగిక పరమైన విభేదాలు ఉన్నాయి. మానసిక, శారీరక రూపాల్లో విభేదాలు ఉన్నాయి. అయితే, దైవం దృష్టిలో ఇద్దరూ సమానమే! ఖురాన్‌లో పురుషునికి ఉన్నట్టే స్త్రీకీ సమాన హక్కులు ఉన్నాయి. బాధ్యతలు మాత్రమే వేరు. ఆర్థికరంగంలో బాధ్యత పురుషుడిది. కుటుంబపోషణకు ఖర్చుపెట్టే బాధ్యత స్త్రీది. అయితే, ప్రాక్టికల్‌గా వచ్చేసరికి కొన్ని తారతమ్యాలు వచ్చేశాయి. వాటిని సరిదిద్దుకోవాలి.

● **సమాజ శ్రేయస్సు కోసం దైవాన్ని ఏమని కోరుకోవాలి?**

మన కోసం మనం ఎంత చేసుకున్నా కలగని తృప్తి ఎదుటివాడికి సాయపడటంలో కలుగుతుంది. జమాతే ఇస్లామ్ అనే స్వచ్ఛంద సంస్థతో కలిసి సమాజసేవలో పాల్గొంటున్నాను. ఈ సంస్థ మెటర్నిటీ ఆసుపత్రిని నిర్వహిస్తుంది. దాదాపు 50 శాతం మంది ముస్లిం స్త్రీలు ఈ ఆసుపత్రిలో పురుడు పోసుకుంటారు. సేవలో స్వార్థచింతన కూడదు. మేము అనే భావన పోయి, మనం అనే భావన రావాలి. హిందూ, ముస్లిం వైరుధ్యాలు పోవాలంటే ఉభయవర్గాలు కష్టపడాలి. త్యాగం చేయాలి. ఓర్పు, సంయమనం పాటించాలి. ప్రార్థనలు చేయాలి. అప్పుడే సమాజంలో మంచి పెరుగుతుంది. ఏది కోరినా ఇచ్చే అల్లా మంచితనాన్ని కోరితే ఇవ్వడా?! ఈ లోకంలో మంచిని నింపు అని వేడుకోవడంతో పాటు మనమూ సాటివారితో మంచిగా ఉండాలి. తారతమ్యాలు లేని ప్రపంచాన్ని చేరువచేయమని కోరుకోవాలి. అప్పుడు దైవం తప్పక కరుణిస్తాడు. మంచిలోనే మనల్ని ఉంచుతాడు. ఎందుకంటే మంచికి ఎప్పుడూ ఆశీర్వచనం ఉంటుంది.

- నిర్మలారెడ్డి చిల్కమర్రి



ఆత్మీయం

మతం కాదు... మానవ ధర్మం



'బౌద్ధం' మతమా లేక దర్శనమా? అని చాలామందికి అనుమానం. దానిని ఏ పేరుతో పిలిచినా తప్పులేదు. 'బౌద్ధం' బౌద్ధంగానే ఉంటుంది కాని మారదు. పేరులోనేముంది? మనం 'మల్లె' అని పిలిచే పదాన్ని మరేపేరుతో పిలిచినా దాని సుగంధం ఒకటే. మధురంగా ఉంటుంది. రాజకుటుంబంలో జన్మించి, అతిలోక సౌందర్యవతి అయిన భార్యను, ముద్దులు మూటగట్టే కుమారుని పొందాడు గౌతముడు. సుఖభోగాలు పొందడం ఆయనకు అతి సులభమైన పని. అయితేనేం, సర్వ మానవ సంక్షేమం కోసం, మానవాళిని దుఃఖ విముక్తులను చేయడం కోసం రాజ్యాన్ని, రాజభోగాలను, సంసార సుఖాలను గడ్డిపోచతో సమానంగా త్యజించి 'త్యాగం' అంటే ఇలా ఉండాలి అని చూపిన ఆచరణశీలి. అంతులేని ధనరాశులతో పొందలేని ఆత్మజ్ఞానం అనంతమైన జ్ఞానసాగరంలోని కేవలం ఒక్క బిందువుతోనే అపారంగా పొందవచ్చని గ్రహించాడు. తానేది గ్రహించాడో దానిని బోధించాడు. ఏది బోధించాడో దానినే అక్షరాలా ఆచరించాడు. ఆయన బోధనలు మానవ ధర్మబద్ధమైన, హేతుబద్ధమైన, పవిత్రమైన జీవనానికి వెలుగు బాటలు పరిచాయి. శాంతంతో కోపాన్ని, సాత్వికతతో హింసను, దానంతో లోభాన్ని, సత్యంతో అసత్యాన్ని జయించవచ్చునని, ప్రేమ వల్లనే ద్వేషం నశిస్తుందని ఆయన బోధించాడు. మతమంటే మరేదో కాదు, అన్ని ప్రాణుల పట్ల సానుభూతి కలిగి ఉండడమేనని, అందరినీ ప్రేమించడమే మానవత్వమని నిరూపించాడు. అందువల్ల బౌద్ధమతం అనేకంటే, బౌద్ధం అనడమే సరైనది.

బ్యూటిప్స్

బ్లాక్ హెడ్స్ నివారణ కోసం...

- అయిదారు కప్పుల నీటిలో టేబుల్ స్పూన్ నిమ్మరసం వేసి మరగబెట్టాలి. మరిగిన తరవాత ఆ పాత్రని టేబుల్ మీద ఉంచి ముఖానికి ఆవిరి పట్టించాలి. టవల్‌తో బ్లాక్ హెడ్స్ ఉన్న చోట నెమ్మదిగా రుద్దాలి. ఇలా రెండు, మూడుసార్లు చేయాలి. అయిదు నిమిషాల తరవాత చన్నీటితో ముఖాన్ని కడగాలి. ఆ తరవాత చర్మానికి సరిపోయే ఫేస్‌ప్యాక్ వేసి ఆరిన తరవాత గోరువెచ్చని నీటితో కడిగేయాలి.



- టేబుల్ స్పూన్ పెరుగులో టీ స్పూన్ బియ్యం పిండి కలిపి పెట్టుకోవాలి. ముఖానికి ఆవిరి పట్టించిన తరవాత ఈ మిశ్రమాన్ని బ్లాక్ హెడ్స్ ఉన్నచోట అప్లై చేసి, వేళ్లతో వలయాకారంలో నెమ్మదిగా రుద్దాలి. ఇలా వారంలో రెండుసార్లు క్రమం తప్పకుండా చేయడం వల్ల ముఖంపై ఏర్పడ్డ బ్లాక్‌హెడ్స్ తగ్గుతాయి.



సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం
22-8-2017



ఇరవై ఏళ్ల క్రితం శ్రీనివాస్ దెంచనాల వయసు అటూ ఇటుగా ఇరవై ఐదేళ్లు. అది మరీ చిన్న వయసేం కాదు కానీ, అప్పటికే అతడు ఓ తట్టెడు నాటకాల ప్రేక్షకుడు! ఒక్కటీ నచ్చడం లేదు! పక్కన థియేటర్‌లో సూపర్‌స్టార్‌ల సినిమా ఆడుతుంటే, ఈ పక్కన స్టేజి ఆర్టిస్టులు ఎవరికైనా ఎలా ఎక్కుతారు?! అది కాదు రీజన్. దెంచనాల యునీక్. అతడికి రంగస్థల నటులే అప్పటికీ.. ఇప్పటికీ.. ఎప్పటికీ 'మెగా'లు, 'సూపర్'లు, 'రైజింగ్'లు. అంతిష్టం నాటకం అంటే! కానీ తెలుగు నాటకమేంటీ ఇలా చివికి పోతోంది? మంచి బట్టలేవు. మంచి తిండి లేదు. మంచి 'లుక్' లేదు! నాటకం మధ్యలో బయటికొచ్చి సమోసా తిని, చాయ్ తాగి మళ్లీ లోపలకి వెళ్లేవాడే కానీ నీరసంగా వెళ్లేవాడు. 'ఇలా కాదు' అనుకున్నాడొక రోజు. అనుకుని.. 'జనపదం' థియేటర్ రిపర్టరీని స్టార్ట్ చేశాడు. టూరింగ్ టాకీస్‌లా.. జనం మధ్యలోకి వెళ్లి, జనం చేతే ప్రదర్శింపజేసే కళాసంస్థ అది! జనపదం రిపర్టరీ ఆవిర్భావానికి.. ముందు.. తర్వాత.. ప్రస్తుతం.. రంగస్థలం ఏమిటన్నది ఆయన మాటల్లోనే...

కవి, రచయిత, రంగస్థల దర్శకుడు, నటుడు శ్రీనివాస్ దెంచనాల తో 'సాక్షి' ఇంటర్వ్యూ

జనపదం

బరువు మోస్తున్న బాటసారి

■ **కంగ్రాట్స్! రంగస్థలానికి రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపును తెచ్చిపెట్టారు.**
ఆవిర్భావ వేడుకల్లో మా థియేటర్ రిపర్టరీ అందుకున్న అవార్డు గురించేనా?

■ **అవును.**
అది ప్రజా కళాకారుల ఘనత.

■ **కానీ ఆ ఘనత వెనుక ఉన్నది మీరే కదా! మీ దర్శకత్వం, స్టేజ్ ప్లే, రైటింగ్.. ఔట్‌స్టాండింగ్.**
మీరు అంటున్న ఔట్‌స్టాండింగ్ ఒక్కరి వల్ల వచ్చే ఫలితం కాదు.

■ **బాధితులనే నటులుగా చేయాలని ఎందుకనిపించింది?**
అనిపించడం కాదు. అది నాలో ఇన్‌బిల్ట్‌గా ఉన్నట్లుంది. హబీబ్ తన్వీర్ నాటకాలు చూశాక, నేను కోరుకుంటున్నది ఏదో తెలిసింది. ఆయన నాటకాలు ఆగ్రా బజార్, చరణ్‌దాస్ చోర్.. నన్ను ఇన్‌స్పైర్ చేశాయి.

■ **ఏమిటి ఆయన ప్రత్యేకత? బాధితులను నటులుగా చేసి చూపించడమేనా?**
అదొక్కటే కాదు. ఆయన నాటకాలు ఇంగ్లిషు నాటకాల్లా ఉండవు. మామూలు జానపద నాటకాల్లా ఉండవు. మోడర్న్‌గా ఉంటాయి. సంప్రదాయాన్ని వదలకుండానే నాటకాన్ని ఆధునీకరిస్తారు.

■ **హబీబ్ తన్వీర్.. ఉర్దూ నాటక రంగ ప్రముఖులు. తెలుగులో మిమ్మల్ని ఆయనతో పోల్చవచ్చా?**
రెండేళ్లు ఆయన దగ్గర పని చేశాను. ఆయన నాటక బృందంతో కలిసి దేశమంతా కలియదిరిగాను. బృందంతో చేరి వారికి కాస్ట్యూమ్స్, సెట్టింగ్స్ మోయడం, నాటకాలను అబ్జర్వ్ చేయడం మొదలుపెట్టాను. హబీబ్ తన్వీర్‌తో పాటు బాదల్ సర్కార్, ధవళం నారాయణ ఫణిక్కర్, బీవీ కారత్ వంటివారు ఆధునిక నాటకాన్ని తమదైన శైలిలో అప్పటికే ప్రదర్శిస్తున్నారు. కానీ నన్ను గట్టిగా పట్టుకుంది మాత్రం హబీబ్ తన్వీర్.

■ **తెలుగులో ఆధునిక నాటకం లేదనేనా అంతదూరం వెళ్లారు?**
అంత దూరం అంటే..?

■ **ఖమ్మంలోని మీరు పుట్టిన పెద్దకిష్టాపురం తండా నుంచి.. ఛత్తీస్‌గఢ్‌లో హబీబ్ పుట్టి పెరిగిన గిరులలోకి!**
అది దూరం వెళ్లడం కాదు. ఆధునిక నాటకానికి దగ్గరగా వెళ్లడం.

■ **తెలుగు నాటకం ఇంతకాలానికీ ఆధునికతను చేరుకోలేకపోయిందని మీరు అంటున్నారు!**
అనడం కాదు. అసలు తెలుగులో ఆధునిక నాటకం లేనే లేదు. ఇది చాలా మంది అంగీకరించరు.

■ **అధునికం అంటే?**
భారతదేశంలోకి బ్రిటిషర్స్ ద్వారా వచ్చిన ఇంగ్లీషు నాటకానికీ, జానపద నాటకాలకూ భిన్నమైన శాస్త్రీయ సంప్రదాయక ప్రభావంగల నాటకం. అది 1950–55 మధ్యలో మన దేశంలో ప్రారంభమైంది. దానికి ఆద్యులు హబీబ్ తన్వీర్.


■ **కానీ ఆయన విదేశాలలో కదా శిక్షణ పొంది వచ్చారు?!**
అవును. లండన్‌లోని రాయల్ ఎకాడమీ ఆఫ్ డ్రమెటిక్ ఆర్ట్ (రాడా)లో శిక్షణ పొందారు. అయితే ఆ ధోరణి మన దేశానికి సరిపోదని ఆయనకు అనిపించి, తన సొంత రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌లో నిరక్షరాస్యులైన ఆదివాసీ ప్రజల స్థానిక సంప్రదాయాన్ని తన నాటకాల్లోకి తీసుకున్నారు. కాళిదాసు అభిజ్ఞాన శాకుంతలాన్ని, షేక్స్‌పియర్ నాటకాలను వేశారు.

■ **మీరు ఆదివాసీ కళాకారులకే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నట్లున్నారు..?**
వాళ్ల సమస్యల్ని వాళ్లైతేనే చక్కగా ప్రెజెంట్ చెయ్యగలరని నా నమ్మకం. ఆదివాసీల అతి ముఖ్యమైన సమస్య మైగ్రేషన్. అటవీశాఖ అధికారుల దౌర్జన్యాలూ, అటవీ సంపద, తమదైన సంస్కృతి నుంచి వారు దూరం కావడం, ఆదివాసీ ఉపాధ్యాయులే వారిని మోసం చేయడం.. ఇవన్నీ నా జీవితంలోని చిన్ననాటి చేదు జ్ఞాపకాలే. ఆ అనుభవాలతో 'మావా నాటే మావా రాజ్' (మా వూళ్ళో మా రాజ్యం) ఉట్నూర్‌లో ప్రదర్శించాం. మూడు వేల మంది ఆదివాసీలు ఆ నాటకాన్ని చూసారు. 1994లో ఈ నాటకం చూసిన ప్రభుత్వాధికారులు ప్రభుత్వ ఉపాధ్యాయుల్ని విమర్శించామన్న నెపంతో తదుపరి ప్రదర్శనలను నిషేధించారు. అయినా మా ప్రయత్నం ఆగలేదు. సెప్టెంబర్‌లో 'కుమ్రుం భీము కల' నాటకాన్ని ప్రదర్శిస్తున్నాం.

■ **మీ 'జనపదం' రిపర్టరీకి సపోర్ట్ లభిస్తోందా?**
కేంద్రప్రభుత్వం, మిత్రులు, ప్రేక్షకులు అందించే ఆర్థిక సాయంతో నడుపుతున్నాం. అప్పుడప్పుడూ సాయం చేసే రాష్ట్రప్రభుత్వాల మద్దతు కూడా ఉంది.

■ **అంటే.. నెట్టుకొస్తున్నాం అంటున్నారా?**
ఒకవిధంగా నెట్టుకు రావడం. ఇంకోవిధంగా ఎదురీదడం. 'తెలుగు ప్రజల సంస్కృతీ సాంప్రదాయాలనూ నాటకం ద్వారా దశదిశలా వ్యాపింపజేయడం మా లక్ష్యం. అయితే అందుకు ప్రభుత్వం కూడా తన సహకారం అందించవలసి ఉంటుంది. కేవలం వ్యక్తుల వల్ల జరిగే పని కాదు ఇది.

■ **ఒక రిపర్టరీ వ్యవస్థాపకులుగా రంగస్థల అభివృద్ధికి ఇంకా జరగలవలసింది ఏమైనా ఉందా?**
రెండు తెలుగు రాష్ట్రాలు తక్కిన రాష్ట్రాల్లో ఆధునిక నాటక పరిస్థితిపై అధ్యయనం చేసి, ప్రతి జిల్లాలో రాష్ట్ర నాటక పాఠశాలలు స్థాపించి రంగస్థల నాటకానికి ప్రభుత్వం ప్రాణంపోయాలి. అలాగే నైపుణ్యంగల దర్శకులైన తెలుగు వారు, తెలుగేతరులను కూడా పిలిచి నాటకాసక్తి కలిగిన యువతకు శిక్షణా శిబిరాలు నిర్వహించాలి. యూనివర్సిటీల్లో ఉన్న నాటక శాఖలను శిక్షణా శిబిరాల ద్వారా పునరుద్ధరించాలి. థియేటర్‌ను అభ్యసించిన విద్యార్థులకు కర్ణాటకలో మాదిరిగా బిఇడి, ర్యాంక్ ఇచ్చి, ప్రభుత్వ పాఠశాలల్లో నాటక విద్యా బోధనను ప్రోత్సహించాలి.



క్షత్రియుడైన నపుంసక రాజుకూ, హిందూ బలి సంప్రదాయానికీ మధ్య నలిగిపోయి రాజును చంపి, తను చనిపోయిన జైన ధర్మచారిణి అమృతలత. పద్మభూషణ్ గిరీష్ కర్నాడ్ నాటకం 'బలి'లోని దృశ్యం ఇది. అనుసృజన, పరికల్పన, దర్శకత్వం : శ్రీనివాస్ దెంచనాల
ప్రదర్శన : జనపదం ఆధునిక సంచార నాటక రిపర్టరీ.

బాధితులే నటులు

ప్రపంచంలో బ్రెజిలియన్ నాటక కర్త, దర్శకుడు అగస్టో బోల్ తొలిసారిగా విక్టిమ్ థియేటర్ (బాధితుల నాటకం) అనే కాన్సెప్ట్‌ను ప్రవేశపెట్టి బాధితులతోనే నాటకం వేయించాడు. ఈ నాటక ప్రక్రియ ద్వారా చాలా మంది స్ఫూర్తి పొందినప్పటికీ.. తెలుగులో తొలిసారి పసుపులేటి పూర్ణచందర్‌రావు అనే దర్శకుడు రెండు దశాబ్దాల పాటు ఇదే పద్ధతిలో నాటకాలు ప్రదర్శించారు. తర్వాత శ్రీనివాస్ దెంచనాల కూడా ఇదే పద్ధతిలో గోండులతో, లంబాడీలతో ఇంకా కొందరు బహుజనులతోటి కలిసి ఈ నాటక ప్రక్రియను అనుసరించారు. అయితే కళాత్మకత లేమివల్ల కొన్ని ప్రదర్శనలతోనే సరిపెట్టుకోవాల్సి వచ్చిందని దెంచనాల అన్నారు.

- **అత్తలూరి అరుణ,** ప్రిన్సిపల్ కరస్పాండెంట్
ఫొటో: **నోముల రాజేష్‌రెడ్డి**



మీరు 6 సమాధానాల కంటే తక్కువ చెబితే... మీకు సినిమ
10 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా
15 సమాధానాల వరకూ చెప్పగలిగితే... మీకు సినిమా
20 సమాధానాలూ చెప్పగలిగితే... ఇంకోసారి ఈ క్విజ్

లవ్ డాక్టర్ — నన్నడగొద్దు ప్లీజ్



ప్రియదర్శిని రామ్
లవ్ డాక్టర్

హాయ్ బ్రో! నాకు ఈ మధ్యే ఎం.ఎన్.సిలో సాఫ్ట్‌వేర్ జాబ్ వచ్చింది. విషయం ఏంటంటే... నా 18 ఏళ్ల వయసులో ఒక అమ్మాయిని ఇష్టపడ్డాను. నాకు అది ప్రేమో, ఆకర్షణో తెలియదు కానీ, అప్పుడే ప్రపోజ్ చేశాను. అయితే, తను రిజెక్ట్ చేసింది. కొన్నిరోజుల తరువాత నన్ను కలిసి... 'ఫస్ట్ నువ్వు సెటిల్ అవ్వు... అప్పుడు చూద్దాం!' అంది. చాలా కష్టపడి ఎమ్మెన్సీలో జాబ్ కొట్టాను. సెటిల్ అయ్యాక వెళ్లి అడిగితే మళ్లీ రిజెక్ట్ చేసింది. ఇప్పుడు నేనేం చెయ్యాలి బ్రో?

- పురుషోత్తం

పురుషోత్తమా...!
'సార్.. పేరు పిలవడంలోనే ఏదో తిరకాసు అనిపిస్తుంది!'
అదేంటి నీలాంబరీ.. అంత ప్రేమగా పిలుస్తుంటే?
'సార్.. మీరు ఏ అబ్బాయినీ ప్రేమగా పిలవడం ఇప్పటిదాకా చూడలేదు!'
అందుకే ఇవాళ అంత ప్రేమగా పిలుస్తున్నా.. పురుషోత్తమా!
'సార్.. ఏదో ట్విస్ట్ ఉండే ఉంటుంది.'
పురుషోత్తమా.. అమ్మాయి ఫస్ట్ టైం సారీ అని చెప్పింది!
'అవును చెప్పింది!!'
మళ్లీ తనే వచ్చి సెటిల్ అయ్యాకా చూద్దాం అని చెప్పింది!
'అవును చెప్పింది సార్!!'
సెటిల్ అయ్యాక వెళ్తే.. నో థ్యాంక్యూ అని చెప్పి పంపించింది!
'అవును పంపించింది!!'
ఆ బంగారు తల్లి 'సెటిల్ అయ్యాక చూద్దాం' అని చెప్పకపోతే...
నువ్వు కష్టపడే వాడివా? గొప్ప ఉద్యోగం తెచ్చుకునే వాడివా?
'అంటే... మీ చెల్లెలు పురుషోత్తం బాగుపడాలని అరటిపండు ఇచ్చినట్లు బిస్కెట్ వేసిందా సార్?'
అదే మరి అమ్మాయిల గొప్పతనం!!
'సార్.. ఇక్కడ పిల్లవాడు హార్ట్ బ్రేక్ అయ్యి.. మైండ్ బ్లాక్ అయితే.. అమ్మాయి గొప్పదని ఎక్కిరిస్తారా? మీకు కూడా అరటి పండు ఇచ్చినట్లే ఇచ్చి హ్యాండ్ ఇస్తా' అని నవ్వింది నీలాంబరి!!

లవ్ డాక్టర్, సాక్షి ఫ్యామిలీ, సాక్షి టవర్స్, రోడ్ నంబరు 1, బంజారాహిల్స్, హైదరాబాద్-34. lovedoctorram@sakshi.com

కాసుకో సుడోకు

		4	1					
		9	4				2	
		2	6			3		8
	6		8	4	3		9	
2	8	5				4	3	1
4	9		2	1	5		8	
3		6			9	5		
	2				1	9		
					4	8		

నిబంధనలు: ప్రతి వరుసలో 1 నుంచి 9 అంకెలు నింపండి (అడ్డంగా, నిలువుగా). ఒక వరుసలో ఒక అంకెను ఒకసారి మాత్రమే వాడాలి. ప్రతి 3X3 చదరంలోనూ 1 నుంచి 9 అంకెలు రావాలి.

నిన్నటి జవాబు

6	5	7	9	3	1	8	4	2
2	9	3	6	4	8	7	5	1
4	8	1	7	2	5	6	9	3
9	4	5	2	6	7	3	1	8
1	7	2	4	8	3	5	6	9
8	3	6	5	1	9	2	7	4
5	1	4	3	7	2	9	8	6
3	6	9	8	5	4	1	2	7
7	2	8	1	9	6	4	3	5

సెల్ఫ్ చెక్

కడ వరకూ కలసి ఉండాలనుకుంటున్నారా?

నేను బతికున్నంతకాలం నీతోనే జీవించాలని ఉంది... ఇలా చెప్పటం పెళ్లైన కొత్తలోనే కాదు, ఆ మాటను నిజం చేయటానికి చాలామంది ప్రయత్నిస్తారు. భార్యాభర్తలు ఒకరిపై ఒకరు అంకిత భావంతో, అవ్యాజమైన ప్రేమతో జీవితాంతం కలసిమెలసి ఉంటే ఎంత ఆనందం! అలాంటి వారు అందరికీ ఆదర్శప్రాయంగా నిలుస్తారు. దాదాపు అర్ధశతాబ్ద కాపురంలో జీవితభాగస్వాములిద్దరూ ఎన్నో అనుభవాలను చవిచూస్తారు. పండు వయసు వచ్చేదాకా ఒకరికోసం ఒకరు బతుకుతూ అమృత ప్రేమను ఆస్వాదిస్తారు. ఇది నిజంగా గొప్ప విషయం. మీరూ మీ జీవితభాగస్వామితో చివరి క్షణం వరకు కలిసి ఉండాలని కోరుకుంటున్నారా? మీ వార్ధక్య దశలో కూడా తోడునీడల్లా ఉండాలని ఆశపడుతున్నారా?

1. ఒంటరిగా ప్రయాణం చేయవలసినప్పుడు, మీ జీవితభాగస్వామి మీకు తోడుగా ఉంటే బాగుంటుందని అనుకుంటారు.
ఎ. అవును ☐ బి. కాదు ☐
2. మీకు తెలియకుండానే మీ లైఫ్‌పార్ట్‌నర్‌లోని కొన్ని అలవాట్లను సొంతం చేసుకొన్నారు.
ఎ. అవును ☐ బి. కాదు ☐
3. మీ భార్య/భర్త లేకుండానే మీరు సంతోషంగా



జీవించగలరని చెప్పగలరు.
ఎ. కాదు ☐ బి. అవును ☐
4. కొన్ని పరిస్థితులవల్ల మీ లైఫ్‌పార్ట్‌నర్ మీకు దూరం కావలసివస్తే... ఎవరైనా (పిల్లలు, తల్లిదండ్రులు మొదలైనవారు) మీకు తోడుగా ఉంటే సరిపోతుందనుకుంటారు.
ఎ. కాదు ☐ బి. అవును ☐
5. అన్యోన్యంగా ఉన్న జంటలను చూస్తే మీకు అసూయ కలుగుతుంది. మీకన్నా వారే సంతోషంగా ఉన్నారనిపిస్తుంది.
ఎ. కాదు ☐ బి. అవును ☐
6. మీరిద్దరూ ఒకరికోసం ఒకరు పుట్టారని నమ్ముతారు. దాపరికం లేకుండా ఒకరి విషయాల ఒకరు చెప్పుకోవటానికి ప్రయత్నిస్తారు.
ఎ. అవును ☐ బి. కాదు ☐
7. శారీరకంగా, మానసికంగా మీ జీవితభాగ మీపై ఆధారపడి ఉన్నారు.
ఎ. అవును ☐ బి. కాదు ☐
8. మీ కాపురంలో ఒకరినివిడిచి మరొకరు ఉ కాలం చాలా తక్కువ.
ఎ. అవును ☐ బి. కాదు ☐
9. మీ జీవితభాగస్వామి మనసును కష్టపెట్ట మీకు ఇష్టం ఉండదు. మీ గురించి కంటే మీ లైఫ్‌పార్ట్‌నర్ గురించే ఎక్కువ ఆలోచిస్తారు.
ఎ. అవును ☐ బి. కాదు ☐
10. గొడవలు మీ కాపురాన్ని కూలదోస్తాయని మీరు నమ్ముతారు.
ఎ. కాదు ☐ బి. అవును ☐

'ఎ' లు ఏడు దాటితే మీ జీవితభాగస్వా ప్రాణంగా చూసుకుంటారు. వారి కష్టసుఖాల్లో పాలు పంచుకుంటారు. చివరి వరకు వారి వెం ఉండాలని కోరుకుంటారు. 'బి' లు 'ఎ' ల కన ఎక్కువగా వస్తే జీవితభాగస్వామిపై మీకు పెద్ద ప్రేమ ఉండదు. ఇద్దరి మధ్య గొప్ప రిలేషన్ ఉండదు. ఒకరికోసం ఒకరు జీవించాలనుకోరు



12
నాని 'భలే భలే మగాడివో య్' కథను దర్శకుడు మారుతి ముందు ఈ హీరోకే చెప్పారు? అతనెవరో తెలుసా??
ఎ) అల్లు శిరీష్
బి) సుధీర్‌బాబు
సి) 'అల్లరి' నరేశ్
డి) సునీల్

10
...రంజీవి 'ఖైదీ నంబర్ ...' క్లైమాక్స్ ఫైట్‌ని కొరి...ఫీ చేసిన ఫైట్‌మాస్టర్?
...యన్ బి) రామ్–లక్ష్మణ్
...) పీటర్ హెయిన్స్
డి) కనల్ కణ్ణన్

2
మనం రెగ్యులర్‌గా చూసే సినిమా ఏ ఫార్మట్‌లో ఉంటుందో తెలుసా?
ఎ) 4డి
బి) 2డి సి) 5డి
డి) 3డి

7
అక్కినేని నాగేశ్వరరావు నటించిన ఏ హిట్ సినిమా పేరుతో రామ్ తెలుగు చిత్ర పరిశ్రమకు హీరోగా పరిచయమయ్యారు?
ఎ) ప్రేమనగర్
బి) మిస్సమ్మ
సి) మాయాబజార్
డి) దేవదాసు

14
'అబ్బనీ తియ్యని దెబ్బ.. ఎంత కమ్మగా ఉందిరోయబ్బ' సాంగ్ డ్యాన్స్ మాస్టర్?
ఎ) ప్రభుదేవా
బి) లారెన్స్
సి) సుందరం మాస్టర్
డి) ప్రేమ్ రక్షిత్

...డ్యాన్సర్‌గా ...రంజీవి సినిమా ...జేత ...ా ఎంబీబీఎస్ ...ా జిందాబాద్ ...కాడీ

18
'కత్తులతో కాదురా కంటి చూపుతో చంపేస్తా' డైలాగ్ రచయిత?
ఎ) చిన్నికృష్ణ
బి) పరుచూరి బ్రదర్స్
సి) త్రివిక్రమ్
డి) పూరి జగన్నాథ్

17
'మిస్టర్ పర్‌ఫెక్ట్'లో కాజల్ అగర్వాల్ చేసిన క్యారెక్టర్‌కు ఫస్ట్ ఈ హీరోయిన్‌నే అడిగారు. అయితే కాలేజీలో సెలవులు దొరక్క ఆమె చేయలేకపోయారు. ఇప్పటికీ ప్రభాస్‌తో సినిమా చేయలేకపోయిన ఆ హీరోయిన్ ఎవరు?
ఎ) పూజా హెగ్డే బి) హెబ్బా పటేల్
సి) రకుల్‌ప్రీత్ సింగ్
డి) అనూ ఇమ్మాన్యుయేల్

3
...డ్డూబాబు' సినిమాలో ...ా లావుగా కనిపించడం ... 'అల్లరి' నరేశ్ వేసుకున్న మేకప్ పేరేంటి?
...) ప్రొస్థటిక్ బి) ఈస్థటిక్
సి) ఫెంటాస్టిక్
డి) లిప్‌స్టిక్

సమాధానాలు
1) డి 2) బి 3) ఎ 4) బి
5) సి 6) బి 7) డి 8) డి
9) డి 10) డి 11) సి 12) డి
13) డి 14) సి 15) బి
16) ఎ 17) సి 18) బి
19) సి 20) ఎ

20
'గచ్చిబౌలి దివాకర్'గా నవ్వించిన కమెడియన్?
ఎ) బ్రహ్మానందం
బి) అలీ
సి) ఎమ్మెస్ నారాయణ
డి) ఎల్బీ శ్రీరామ్

16
కన్నడ బ్యూటీ, ఇప్పటి స్టార్ హీరోయిన్ అనుష్కను టాలీవుడ్‌కి పరిచయం చేసిన దర్శకుడు?
ఎ) పూరి జగన్నాథ్
బి) సముద్ర
సి) రాజమౌళి
డి) సురేశ్ కృష్ణ

13
పక్క ఫొటోలో చిరు నవ్వులు చిందుస్తున్న ఈ చిన్నారి ఇప్పుడు తెలుగు, తమిళ చిత్రాల్లో బిజీ హీరోయిన్. తనెవరో గుర్తుపట్టారా?
ఎ) సమంత
బి) రకుల్ ప్రీత్‌సింగ్
సి) తమన్నా
డి) త్రిష

...ా అంటే ఇష్టం
...అంటే ఇంట్రెస్ట్
...ంటే పిచ్చి
...చదవకండి!


బాహుబలి టీమ్‌లో...


● నాగచైతన్య

అక్కినేని నాగచైతన్య 'బాహుబలి' టీమ్‌లో వర్క్ చేశారట! నిజమా... 'బాహుబలి' రెండు భాగాల్లో చైతూ ఎక్కడా కనిపించలేదే అనుకుంటున్నారా? అయితే... చైతూ వర్క్ చేసింది యాక్టర్‌గా కాదు. మరేం చేశారు? అంటే... డ్రోన్ ఆపరేటర్‌గా వర్క్ చేశారట! చైతూ హీరోగా వారాహి చలన చిత్రం సంస్థ నిర్మించిన సినిమా 'యుద్ధం శరణం'. వచ్చే నెల 8న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇందులో చైతూ డ్రోన్ ఆపరేటర్‌గా నటించిన సంగతి తెలిసిందే. లేటెస్ట్ అప్‌డేట్ ఏంటంటే... 'బాహుబలి'కి వర్క్ చేసే డ్రోన్ ఆపరేటర్‌గా చైతూ కనిపిస్తారట. ఈ సినిమాకు రాజమౌళి తనయుడు ఎస్.ఎస్. కార్తికేయ లైన్ ప్రొడ్యూసర్. ఆయనే ఇంట్రడక్షన్ సీన్స్‌లో హీరోని 'బాహుబలి' డ్రోన్ ఆపరేటర్‌గా చూపిస్తే బాగుంటుందనే ఐడియా ఇచ్చారట. అదీ మేటర్!! కృష్ణ ఆర్.వి. మరిముత్తు దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ సినిమాలో లావణ్యా త్రిపాఠి హీరోయిన్‌గా, శ్రీకాంత్ విలన్‌గా, రావు రమేశ్, మురళీ శర్మ, రేవతి ముఖ్యపాత్రల్లో నటించారు. వివేక్ సాగర్ సంగీతం అందించిన ఈ సినిమాకు రజనీ కొర్రపాటి నిర్మాత.

అఖిల్ హీరోగా విక్రమ్ కె. కుమార్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ అండ్ మనం ఎంటర్‌ప్రైజెస్ సమర్పణలో అక్కినేని నాగార్జున నిర్మిస్తున్న సినిమాకు 'హలో' అనే టైటిల్‌ను ఖరారు చేసినట్టు నిన్న సాయంత్రం ప్రకటించారు. టైటిల్‌తో పాటు మీరు చూస్తున్న కొత్త స్టిల్‌ను విడుదల చేశారు. ఈ సినిమా టైటిల్ 'హలో' అయ్యుంటుందని సోమవారమే 'హలో... టైటిల్ ఇదే!?' పేరుతో 'సాక్షి' వార్తను ప్రచురించింది.

హలో... న్యూ స్టైల్ ఇదిగో!


● అఖిల్

థ్రిల్ ఫుల్



అమోఘ్ దేశపతి, అర్చన, శ్రేయావ్యాస్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన చిత్రం 'షాలిని'. షెరాజ్ దర్శకత్వంలో సాయి వెంకట్ సమర్పణలో పీవీ సత్యనారాయణ నిర్మించిన ఈ సినిమా ప్లాటినమ్ డిస్క్ ఫంక్షన్ హైదరాబాద్‌లో జరిగింది. షెరాజ్ మాట్లాడుతూ– ''సత్యనారాయణతో నాకిది రెండో సినిమా. కథ చెప్పిన వెంటనే ఓకే చెప్పారు. ప్రతి క్షణం ఉత్కంఠ కలిగిస్తుంది. హారర్ ఇష్టపడే వారికి తప్పకుండా మా సినిమా నచ్చుతుంది'' అన్నారు. ''సెప్టెంబర్ 1న సినిమాను విడుదల చేస్తాం'' అన్నారు నిర్మాత. ''ఇందులో మంచి పాత్ర చేశా'' అని అమోఘ్ దేశపతి అన్నారు. ''ఈ చిత్రానికి ప్రధాన కేంద్రాల్లో థియేటర్లు ఇప్పిస్తా'' అన్నారు ఆర్.కె. గౌడ్.

నయనతార@102

హెడ్డింగ్ చదివి, ఈ మధ్యే యాభై సినిమాలు కంప్లీట్ చేసిన నయనతార అప్పుడే వంద సినిమాలు పూర్తి చేసిందా? అని ఆశ్చర్యపోతున్నారా? లెక్క ఆమె నటించిన సినిమాలకు సంబంధించినది కాదు. నందమూరి బాలకృష్ణ హీరోగా నటిస్తున్న 102వ సినిమాలో నయనతార హీరోయిన్‌గా ఎంపికైన సంగతి తెలిసిందే. కె.ఎస్. రవికుమార్ దర్శకత్వంలో మాస్ యాక్షన్ ఎంటర్‌టైనర్‌గా సి. కల్యాణ్ నిర్మిస్తున్న ఈ సినిమా చిత్రీకరణ ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రముఖ స్టూడియోలో వేసిన సెట్‌లో జరుగుతోంది. సోమవారం నయనతార ఈ సినిమా సెట్‌లోకి ఎంటరయ్యారు. 'సింహా, శ్రీరామరాజ్యం' సినిమాల తర్వాత బాలకృష్ణ–నయనతార కాంబినేషన్‌లో వస్తున్న మూడో చిత్రమిది. ఇందులోనూ వాళ్ల కెమిస్ట్రీ ఆయా సినిమాల స్థాయిలో ఉంటుందని చిత్రబృందం పేర్కొంది.

వచ్చే నెలలో సరసుడితో...

బాలకృష్ణ సినిమా పక్కన పెడితే... మాజీ ప్రియుడు శింబుకు జోడీగా నయనతార నటించిన 'సరసుడు' వచ్చే నెల 8న తెలుగులో విడుదల కానుంది. పాండిరాజ్ దర్శకత్వంలో శింబు తండ్రి, 'ప్రేమ సాగరం' ఫేమ్ టి. రాజేందర్ ఈ సినిమాను నిర్మించారు. ఆయన మాట్లాడుతూ– ''తమిళంలో 'ఇదు నమ్మ ఆళు'గా విడుదలైన మంచి విజయం సాధించిన ఈ సినిమా... తెలుగులోనూ మంచి విజయం సాధిస్తుందని ఆశిస్తున్నా. నయనతారతో పాటు మిగతా ఇద్దరు హీరోయిన్లు ఆండ్రియా, ఆదా శర్మలు అద్భుతంగా నటించారు. మా చిన్నబ్బాయి టీఆర్ కురళరసన్ పాటలు, నేపథ్య సంగీతం సినిమాకు హైలైట్‌గా నిలుస్తాయి'' అన్నారు.


● నయనతార

ఫ్యామిలీ డాక్టర్

హోమియో కౌన్సెలింగ్

ఆర్టికేరియా తగ్గుతుంది!

నా వయసు 26 ఏళ్లు. నాకు అప్పుడప్పుడు చర్మం మీద ఎర్రని దద్దుర్లు వచ్చి మర్నాటికి తగ్గుతున్నాయి. డాక్టర్‌ను సంప్రదిస్తే 'అర్టికేరియా' అన్నారు. మందులు వాడుతున్నా తగ్గడం లేదు. హోమియో చికిత్స ద్వారా సమస్య పూర్తిగా తగ్గే అవకాశం ఉందా?
– శివకుమార్, నరసరావుపేట

అర్టికేరియా చాలా సాధారణంగా కనిపించే చర్మసమస్య. ప్రతి ఐదుగురిలో ఒకరు తమ జీవితకాలంలో ఏదో ఒక సమయంలో ఈ సమస్యతో బాధపడుతుంటారు. కొందరిలో ఈ సమస్య 24 గంటల్లో దానంతట అదే తగ్గుతుంది. కానీ మరికొందరిలో ఇది దీర్ఘకాలిక సమస్యగా మారి బాధిస్తుంది. దీన్ని రెండురకాలుగా విభజించవచ్చు. అవి...

అక్యూట్ అర్టికేరియా : సమస్య ఆరు వారాల కంటే తక్కువ రోజులు ఉన్నట్లయితే దాన్ని అక్యూట్ అర్టికేరియా అంటారు.

క్రానిక్ అర్టికేరియా : ఆరువారాలకు పైబడి కొనసాగితే దాన్ని క్రానిక్ అర్టికేరియా అంటారు. ఇది దీర్ఘకాలిక సమస్యగా మారడానికి కారణాలు ఇంకా స్పష్టంగా తెలియరావడం లేదు.

కారణాలు: మన శరీరానికి సరిపడని పదార్థాలు శరీరంలోకి ప్రవేశించినప్పుడు వాటికి ప్రతిస్పందనగా మన ఒంట్లో హిస్టమైన్స్ అనే పదార్థంలో పాటు కొన్ని రకాల రసాయనాలు రక్తప్రవాహంలోకి విడుదల అవుతాయి. వాటి ప్రభావం చర్మంపై కనిపిస్తుంది. మన రోగ నిరోధక శక్తి మనపైనే దుష్ప్రభావం చూపినప్పుడు కూడా ఇది కనిపిస్తుంది.

అర్టికేరియాను ప్రేరేపించే అంశాలు :
● నొప్పి నివారణకుపయోగించే మందులు ● కీటకాలు, పరాన్నజీవులు ● ఇన్ఫెక్షన్ కలిగించే బ్యాక్టీరియా, వైరస్‌లు ● అధిక ఒత్తిడి, సూర్యకాంతి ● మద్యం, కొన్ని సరిపడని ఆహార పదార్థాలు ● అధిక లేదా అల్ప ఉష్ణోగ్రతలు ● జంతుకేశాలు, పుప్పొడి రేణువులు వంటి చాలా అంశాలు అర్టికేరియాను ప్రేరేపిస్తాయి.

లక్షణాలు:
● చర్మంపై ఎరుపు లేదా డార్క్ కలర్‌లో దద్దుర్లు ఏర్పడటం ● విపరీతమైన దురదగా అనిపించడం ● దద్దుర్లలో మంట, నొప్పి కూడా అనిపించడం ● కళ్లచుట్టూ, చెంపలు, చేతులు, పెదవులపై కూడా అవి ఏర్పడవచ్చు. ● గొంతులో వాపు ఏర్పడి అది వాయునాళాలకు అడ్డుగా పరిణమించి ఒక్కోసారి ప్రాణాంతకం కూడా కావచ్చు

చికిత్స : హోమియోలో రోగి శారీరక, మానసిక లక్షణాలను పరిగణనలోకి తీసుకొని కాన్‌స్టిట్యూషన్ పద్ధతుల్లో తగిన మందులు ఇస్తారు. నిపుణులైన హోమియో వైద్యుల పర్యవేక్షణలో మందులు వాడితే ఈ వ్యాధిని పూర్తిగా నయం చేయవచ్చు.



డాక్టర్
శ్రీకాంత్ మోర్లావర్
సీఎండి
హోమియోకేర్ ఇంటర్నేషనల్
హైదరాబాద్


26న అమరావతికి ఉపరాష్ట్రపతి



సాక్షి, అమరావతి: ఉపరాష్ట్రపతి హోదాలో ఎం.వెంకయ్యనాయుడు ఈ నెల 26వ తేదీన తొలిసారిగా రాష్ట్రానికి రానున్నారు. 26, 27వ తేదీల్లో ఉపరాష్ట్రపతి రాష్ట్రంలో పర్యటించనున్నారని, ప్రోటోకాల్ ప్రకారం స్వాగత కార్యక్రమాలు, వసతి ఏర్పాట్లు చేస్తున్నట్లు కృష్ణా జిల్లా కలెక్టర్ లక్ష్మీకాంతం తెలిపారు. ఈనెల 26న అమరావతిలో వెంకయ్యనాయుడుకు ప్రభుత్వం ఘనంగా పౌరసన్మానం చేసేందుకు ఏర్పాట్లు చేస్తోందని, ఇందుకోసం సచివాలయంలో మూడు హెలిప్యాడ్లను సిద్ధం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సన్మాన కార్యక్రమంలో గవర్నర్ నరసింహన్ కూడా పాల్గొననున్నారు. అనంతరం అదే రోజు సాయంత్రం తెనాలిలో పుస్తకావిష్కరణ కార్యక్రమానికి వెంకయ్య హాజరవుతారు.

నైపుణ్య శిక్షణ పొందుతున్న యువతకే భృతి

సీఎం చంద్రబాబు వెల్లడి



సాక్షి, అమరావతి: ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతకు నిరుద్యోగ భృతి ఇవ్వాలని నిర్ణయించినట్లు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. అయితే అది నిరుద్యోగులందరికీ కాదని, కేవలం నైపుణ్య శిక్షణ పొందుతున్న వారికే అని ఆయన వివరించారు. ఏపీలో గ్రామీణ యువతను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దే కార్యక్రమాన్ని పెద్దఎత్తున చేపట్టామన్నారు. సోమవారం వెలగపూడి సచివాలయంలో న్యూఢిల్లీకి చెందిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సంవత్సరం ఐదు కోట్లతో రాష్ట్రంలోని యువతకు నైపుణ్యాభివృద్ధిలో శిక్షణ ఇప్పించనున్నట్లు కార్పొరేషన్ ప్రతినిధులు ముఖ్యమంత్రికి తెలిపారు. ఆ సంస్థ కార్పొరేట్ సామాజిక బాధ్యత (సీఎస్ఆర్) కింద ఏపీలో చేపట్టిన వివిధ కార్యక్రమాల గురించి చర్చించారు. గత ఏడాది రూ.178 కోట్లతో రాష్ట్రంలోని 8,300 పాఠశాలల్లో మరుగుదొడ్ల నిర్మించామన్నారు. గ్రామీణ యువతకు నైపుణ్య శిక్షణ అందించి వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాలన్నది తమ సంస్థ లక్ష్యమని, ఇందుకోసం ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (ఏపీఎస్ఎస్‌డీసీ)తో కలిసి పనిచేయబోతున్నామని పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ డి.రవి తెలిపారు. ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పందంపై ఈ సమావేశంలో ముఖ్యమంత్రి సమక్షంలో రెండు సంస్థల ప్రతినిధులు సంతకాలు చేశారు.

నంద్యాల సర్వే నిషేధంపై జోక్యానికి నో

కౌంటర్లు దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: నంద్యాల ఉప ఎన్నిక పూర్తయ్యేంత వరకు ఓటర్ల ప్రజాభిప్రాయ సేకరణకు సంబంధించిన సర్వే ప్రచురణ, ప్రసారాలపై నిషేధం విధిస్తూ రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఉత్తర్వుల విషయంలో జోక్యానికి ఉమ్మడి హైకోర్టు నిరాకరించింది. ఈ మొత్తం వ్యవహారంలో పూర్తి వివరాలతో కౌంటర్లు దాఖలు చేయాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి, రిటర్నింగ్ అధికారి, కేంద్ర ఎన్నికల సంఘం కార్యదర్శులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి (ఏసీజే) జస్టిస్ రమేశ్ రంగనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమాదేవిలతో కూడిన ధర్మాసనం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఓటర్ల ప్రజాభిప్రాయ సేకరణ సర్వే ప్రచురణ, ప్రసారాలపై నిషేధం విధిస్తూ రిటర్నింగ్ అధికారి ఈ నెల 15న జారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేస్తూ స్వచ్ఛంద సంస్థ 'స్పార్క్' ఏపీ కార్యదర్శి నున్నా రాంబాబు హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై సోమవారం ఏసీజే నేతృత్వంలోని ధర్మాసనం విచారణ జరిపింది. పిటిషనర్ తరపున సీనియర్ న్యాయవాది కనకమేడల రవీంద్రకుమార్ వాదనలు వినిపిస్తూ... రిటర్నింగ్ అధికారి జారీ చేసిన ఉత్తర్వులు ప్రజా ప్రాతినిధ్య చట్ట నిబంధనలకు విరుద్ధంగా ఉన్నాయని తెలిపారు. వాస్తవానికి ప్రజా ప్రాతినిధ్య చట్ట నిబంధనల్లో ఎన్నిక ప్రారంభం కావడానికి 48 గంటల ముందు నుంచి మాత్రమే సర్వే ప్రచురణ, ప్రసారాలపై నిషేధం ఉందని ఆయన కోర్టుకు నివేదించారు.

ఓటర్లను భయపెట్టేలా టీడీపీ కుట్ర

ఎన్నికల సంఘానికి వైఎస్సార్‌సీపీ ఫిర్యాదు

సాక్షి, హైదరాబాద్: నంద్యాల ఓటర్లను భయభ్రాంతులకు గురిచేసేందుకు తెలుగుదేశం పార్టీ కుయుక్తులు పన్నుతోందని ఎన్నికల సంఘానికి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఫిర్యాదు చేసింది. ఆ కుట్రలను అడ్డుకునేందుకు కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేయాలని వైఎస్సార్‌సీపీ తెలంగాణశాఖ ప్రధాన కార్యదర్శి శివకుమార్ సోమవారం సాయంత్రం ఎన్నికల సంఘం ప్రధానాధికారి భన్వర్‌లాల్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నంద్యాలలో తమ పార్టీ బలంగా ఉన్న ప్రాంతాల్లో అల్లర్లు సృష్టించి, ఓటర్లను భయభ్రాంతులకు గురిచేయాలని టీడీపీ కుట్రపన్నుతోందని తెలిపారు. దీనివల్ల ఓటర్లు పోలింగ్‌లో పాల్గొనకుండా చేయడమే అధికార పార్టీ ఎత్తుగడని చెప్పారు.

భన్వర్‌లాల్‌పై టీడీపీ ఫిర్యాదు

సర్వేలను నిషేధించడం నిబంధనలకు విరుద్ధమని వాదన

సాక్షి, న్యూఢిల్లీ: రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారి భన్వర్‌లాల్‌పై కేంద్ర ఎన్నికల సంఘానికి తెలుగుదేశం పార్టీ ఫిర్యాదు చేసింది. ఆ పార్టీ ఎంపీలు రామ్మోహన్ నాయుడు, నిమ్మల కిష్టప్ప, మాల్యాద్రి శ్రీరామ్ సోమవారం ఢిల్లీలో కేంద్ర ఎన్నికల కమిషనర్ అచల్‌కుమార్ జ్యోతితో సమావేశమై.. నంద్యాల ఉపఎన్నికలో భన్వర్‌లాల్ పక్షపాత ధోరణి అవలంబిస్తున్నారంటూ ఫిర్యాదు చేశారు. ప్రతిపక్ష పార్టీ చేస్తున్న ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తున్న భన్వర్‌లాల్.. తాము చేసే ఫిర్యాదులను అసలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. ఎన్నికల్లో రాష్ట్ర ప్రభుత్వానికి అనుకూలంగా వ్యవహరిస్తున్నారంటూ డీఎస్పీపై ప్రతిపక్ష పార్టీ ఫిర్యాదు చేసిన వెంటనే స్పందించిన రాష్ట్ర ఎన్నికల కమిషన్.. ఆయన్ను బదిలీ చేసిందని పేర్కొన్నారు. అయితే ముఖ్యమంత్రిపై విపక్ష నేత చేస్తున్న వ్యాఖ్యలపై టీడీపీ ఫిర్యాదు చేస్తే పట్టించుకోవడం లేదన్నారు. సర్వేలను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేశారని, ఇది నిబంధనలకు విరుద్ధమన్నారు. ఉప ఎన్నికపై సాక్షి దినపత్రిక, చానల్‌లో వస్తున్న కథనాలను పెయిడ్ ఆర్టికల్స్‌గా పరిగణించాలన్నారు.

నంద్యాల పోలింగ్ ఏజెంట్ల న్యాయ పోరాటం

సాక్షి, హైదరాబాద్: నంద్యాల ఉప ఎన్నిక సందర్భంగా అధికార పార్టీ అండతో స్థానిక పోలీసుల బెదిరింపులు, కక్ష సాధింపు చర్యలపై వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి శిల్పా మోహన్‌రెడ్డి పోలింగ్ ఏజెంట్లు న్యాయ పోరాటం ప్రారంభించారు. తమపై తప్పుడు కేసులు నమోదు చేయకుండా, చట్ట విరుద్ధంగా అరెస్టులు చేయకుండా, ఎటువంటి వేధింపులకు గురి చేయకుండా నంద్యాల పోలీసులను ఆదేశించాలని కోరుతూ పోలింగ్ ఏజెంట్లు ఎం.విజయశేఖర్‌రెడ్డి మరో 44 మంది సోమవారం హైకోర్టులో పిటిష న్ వేశారు. ఇందులో హోంశాఖ ముఖ్య కార్యదర్శి, రిటర్నింగ్ అధికారి, జిల్లా ఎస్పీ, డీఎస్పీ, ఇతర పోలీసులను ప్రతివాదులుగా చేర్చారు. ఈ వ్యాజ్యంపై మంగళవారం హైకోర్టు విచారణ జరపనుంది.

ముస్లింలను మోసగించేందుకే ఎత్తుగడ

- ఎన్డీఏలో వైఎస్సార్‌సీపీ చేరుతోందని టీడీపీ దుష్ప్రచారం
- వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ధర్మాన ప్రసాదరావు ధ్వజం



సాక్షి, హైదరాబాద్: బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో వైఎస్సార్ కాంగ్రెస్ భాగస్వామి కాబోతోందంటూ టీడీపీ వర్గాలు ప్రచారం చేస్తున్నవి కేవలం గాలి వార్తలని, అమాయక ముస్లింలను మోసగించడానికే ఇలాంటి నీచపు ఎత్తుగడలకు పాల్పడుతున్నారని వైఎస్సార్‌సీపీ ప్రధాన కార్యదర్శి ధర్మాన ప్రసాదరావు తీవ్రంగా ధ్వజమెత్తారు. ఇలాంటి ప్రచారాన్ని తీవ్రంగా తిప్పి కొడుతూ బీజేపీతో జత కలిసింది వారు (టీడీపీ).. కేంద్రంలో భాగస్వాములైంది వారు (టీడీపీ) ఇదంతా కొట్టొచ్చినట్లు కనిపిస్తున్నదే అయినా ఎదుటి వారిపై నిందలేయడం విడ్డూరమని విస్మయం వ్యక్తం చేశారు. ఈ మేరకు సోమవారం రాత్రి ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. నంద్యాల ఉప ఎన్నికలో ముస్లిం ఓటర్లు టీడీపీకి వ్యతిరేకంగా ఓటేయబోతున్నారని గ్రహించి.. వారిని తప్పు దోవ పట్టించేందుకు కుట్ర పన్నుతున్నారన్నారు.తాము బీజేపీతో ఉంటూ ఆ సంబంధాలను వైఎస్సార్‌సీపీకి ఆపాదించడం లజ్జాకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

రోజూ కిర్లంపూడికి వెల్లువెత్తండి: ముద్రగడ

జగ్గంపేట : రాష్ట్రవ్యాప్తంగా కాపుల నిరసలతోనే ప్రభుత్వం దిగివచ్చి పాదయాత్రకు అనుమతి వస్తుందని కాపు ఉద్యమనేత ముద్రగడ పద్మనాభం అన్నారు. అప్పటి వరకు ప్రతిరోజూ తూర్పు గోదావరి జిల్లా కిర్లంపూడికి తరలి రావాలని కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజికవర్గీయులకు పిలుపునిచ్చారు. 5రోజు నిరసన అనంతరం ఆయన ప్రసంగిస్తూ బాబు పోలీసులను అడ్డు తొలగించే వరకు పోరు ఆగదన్నారు.

మీ ఓటు రహస్యమే



మీరు ఓటెవరికి వేశారో ఇతరులు ఎవరికీ తెలియదు

నిర్భయంగా ఓటు వేయండి.. నంద్యాల ఓటర్లకు ఈసీ భన్వర్‌లాల్ పిలుపు

- ఓటర్లు 92231 66166 నంబర్‌కు ఫిర్యాదు చేయొచ్చు
- లైవ్ వెబ్‌కాస్టింగ్‌తో కట్టుదిట్టమైన ఏర్పాట్లు
- 23వ తేదీ ఉదయం 7 నుంచి సాయంత్రం 6 గంటల వరకు పోలింగ్

సాక్షి, హైదరాబాద్: ఓటరు ఎవరికి ఓటు వేసింది ఇతరులకు తెలిసే అవకాశం ఎంత మాత్రం లేదని, నంద్యాల ఉప ఎన్నికలో ఓటర్లు ఎలాంటి ప్రలోభాలకు, ఒత్తిళ్లకు గురికాకుండా నిర్భయంగా ఓటేయాలని రాష్ట్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి భన్వర్‌లాల్ పిలుపునిచ్చారు. తమకు నచ్చినవారికి, అభీష్టం మేరకు ఓటు వేయాలని సూచించారు. ఈ విషయంలో ఎవరికీ భయపడాల్సిన అవసరం లేదన్నారు. స్వేచ్ఛాయుత వాతావరణంలో పోలింగ్ జరిగేందుకు వీలుగా కట్టుదిట్టమైన భద్రత ఏర్పాట్లు చేసినట్టు ఆయన వెల్లడించారు. పోలింగ్ పూర్తయ్యేవరకు ఎలాంటి సర్వేలు, ఒపీనియన్ పోల్స్ నిర్వహించినా, ఎన్నికల కోడ్‌ను ఉల్లంఘించినా కఠిన చర్యలు తప్పవని పునరుద్ఘాటించారు. సోమవారం హైదరాబాద్‌లోని కార్యాలయంలో భన్వర్‌లాల్ మీడియాతో మాట్లాడా రు. నియోజకవర్గంలోని 255 పోలింగ్ కేంద్రాల్లో బుధవారం ఉదయం 7 నుంచి సాయంత్రం 6 వరకు పోలింగ్ జరుగుతుందని చెప్పారు. ఆరు గంటల సమయానికి పోలింగ్ స్టేషన్ వద్ద క్యూలో ఉన్న వారిని రాత్రి ఎన్ని గంటల వరకైనా ఓటేయడానికి అనుమతిస్తామన్నారు. ప్రతి పోలింగ్ స్టేషన్ లోపలా, బయట లైవ్ వెబ్‌కాస్టింగ్, వీడియోగ్రఫీ ఏర్పాటు చేశామని, పోలింగ్ తీరును అనుక్షణం పరిశీలిస్తారని భన్వర్‌లాల్ వివరించారు. ఎక్కడ ఏం జరిగినా ఎన్నికల సిబ్బంది క్షణాల్లో స్పందించేలా ఏర్పాట్లు చేశామన్నారు. ప్రచారం ముగిసినందున స్థానికేత రులు నంద్యాల విడిచి వెళ్లాలని ఆయన ఆదేశించారు.

భారీ బందోబస్తు: 2,500 మంది పోలీసులు, ఆరు కంపెనీల పారామిలటరీ బలగా లు బందోబస్తులో పాల్గొంటున్నారని భన్వర్ లాల్ తెలిపారు. 82 ఫ్లయింగ్ స్క్వాడ్లను ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లంద రికీ ఓటింగ్ స్లిప్‌లు పంపామని, పోలింగ్ బూత్‌ల్లో తాగునీరు, మరుగుదొడ్ల సదుపాయం కల్పించామని చెప్పారు. వికలాంగులకు ప్రత్యే క ఏర్పాట్లున్నాయని, అంధులకు బ్రెయిలీ లిపి ద్వారా ఓటు వేసే సదుపాయం కల్పించామని తెలిపారు. ఓటరు ఎవరికి ఓటు వేసిందీ ఇతరులెవరికీ తెలిసే అవకాశం లేదని, పోలిం గ్ బూత్‌లో ఓటరు తాను వేసిన ఓటును ఏడు సెకన్ల పాటు చూసుకోవచ్చని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో 15 వేలమంది ఓటర్లకు ఓటింగ్ స్లిప్ లు ఇవ్వలేదని, వీరిలో స్థానికంగా లేనివారు, డూప్లికేట్ ఓటర్లు ఉన్నట్టుగా గుర్తించామన్నారు.

చానళ్లపై నిఘా: రాష్ట్రంలోని 16 తెలుగు చానళ్లను 24 గంటలూ వాచ్ చేస్తున్నామని, ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఎలాంటి ప్రసారాలు చేసినా చర్యలు తప్పవని భన్వర్‌లాల్ హెచ్చరించారు. పోలింగ్ పూర్తయ్యేవరకు ఎలాంటి సర్వేలు, ఒపీనియన్ పోల్స్, చర్చలను అనుమతించవద్దని ఎలక్ట్రానిక్ ప్రసార మాధ్యమాలను కోరారు. పోలింగ్ ఫలితాలను ప్రభావితం చేసేలా ఎలాంటి కథనాలు ప్రసారం చేసినా దాన్ని ఎన్నికల నిబంధనల ఉల్లంఘనగా పరిగణిస్తామని చెప్పారు. సామాజిక మాధ్యమాలు, వాట్సాప్, బల్క్ ఎస్ఎంఎస్‌లపై నిషేధం కొనసాగుతుం దన్నారు. వీటినీ ఎన్నికల సిబ్బంది గమనిస్తున్నారని, ఓటర్లను ప్రభావితం చేసేలా వ్యవహరిస్తే చర్యలు తప్పవని చెప్పారు. ఓటర్లు తమకు ఎలాంటి అసౌకర్యం కలిగినా, పార్టీలు నిబంధనలు ఉల్లంఘించినా 9223166166 అనే నంబర్‌కు ఎస్ఎంఎస్ ద్వారా ఫిర్యాదు చేయాలని విజ్ఞప్తి చేశారు. నందమూరి బాలకృష్ణ ఎన్నికల ప్రచారంలో డబ్బులు పంపిణీ చేసినట్టు వచ్చిన ఫిర్యాదులపై భన్వర్‌లాల్ స్పందించారు. దీనిపై ఎన్నికల కమిషన్ వివరణ కోరిందని, తమకు అందిన వివరణతో జిల్లా కలెక్టర్ ఓ నివేదిక పంపారని, అయితే, దాన్ని మరోసారి పరిశీలించి నివేదిక పంపాలని ఆయన్ను కోరినట్టు తెలిపారు. ఇప్పటివరకు రూ.1.16 కోట్ల నగదు సీజ్ చేశామని, 316 మందిపై కేసులు నమోదు చేసినట్టు చెప్పారు.

ధర్మానికే ఓటెయ్యండి

నంద్యాల ప్రజలకు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు

- వ్యవస్థలో మార్పు...నంద్యాల నుంచి ప్రారంభం కావాలి
- నంద్యాల అభివృద్ధి నాకు వదిలేయండి
- నవరత్నాలకూ ఇక్కడి నుంచే నాంది



నంద్యాలలోని గాంధీచౌక్‌లో నిర్వహించిన ఎన్నికల ప్రచార ముగింపు సభలో భారీ జనసందోహాన్ని ఉద్దేశించి ప్రసంగిస్తున్న వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్

నంద్యాల నుంచి సాక్షి ప్రతినిధి: 'ఫ్యాన్ గుర్తుకే ఓటు వేయండి.. రాబోయే రోజుల్లో నవరత్నాల వెలుగులకు నంద్యాల నుంచే నాంది పలకండి' అని ప్రతిపక్షనేత, వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. 'ఇవాళ మూడున్నర సంవత్సరాల తర్వాత చంద్రబాబు పరిపాలకు తీర్పు ఇవ్వబోతున్నాం. చంద్రబాబు మోసాలకు వ్యతిరేకంగా మీరు ఓటు వేయబోతున్నారు. ఆయన చేసిన అవినీతికి, దుర్మార్గానికి వ్యతిరేకంగా ఓటు వేయబోతున్నాం. రాజకీయ వ్యవస్థలో విశ్వసనీయత లేకపోతే ప్రజాస్వామ్యం దిగజారిపోతుంది. ఎన్నికలప్పుడు హామీలిచ్చి, తర్వాత మోసం చేసే నాయకులను ప్రజలు కాలర్ పట్టుకుని నిలదీసే రోజు రావాలి. అప్పుడే ప్రజాస్వామ్యం వర్ధిల్లుతుంది.' అని జగన్ పేర్కొన్నారు. 'మీ దగ్గరకు డబ్బు మూటలతో వస్తారు.. రూ. 5వేలు చేతిలో పెట్టి జేబులో నుంచి దేవుడి బొమ్మ తీస్తారు.. అది చూపించి ప్రమాణం చేయమంటారు. ఆ క్షణంలో ఒక్కసారి కళ్లు మూసుకుని దేవుడా.. ధర్మం వైపు ఉండేలా చూడమని ప్రార్థించండి. ఏ దేవుడైనా పాపానికి ఓటు వేయమని చెప్పడు.. దెయ్యాలు మాత్రమే అలా అడుగుతాయి. రేపు ఆ దెయ్యాలు వస్తాయి.. జాగ్రత్తగా ఉండండి. ధర్మానికి.. న్యాయానికి ఓటేయండి' అని ఆయన నంద్యాల ప్రజలకు పిలుపునిచ్చారు. నంద్యాల ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా జగన్ సోమవారం నంద్యాల పట్టణంలోని గాంధీ చౌక్ వద్ద ఉప ఎన్నికల ముగింపు ప్రచార సభలో మాట్లాడారు. నంద్యాల ప్రజలు తనపై చూపిస్తోన్న ప్రేమానురాగాలను చూసి చంద్రబాబు వెన్నులో భయంపుట్టిందని, అందుకే అడ్డదారుల్లో గెలవాలని ప్రయత్నిస్తున్నారని జగన్ వ్యాఖ్యానించారు. నంద్యాల అభివృద్ధి బాధ్యతను తనపై ఉంచి.. నీతిని, ధర్మాన్ని గెలిపించాలని అభ్యర్థించారు. ఈ సభలో ఇంకా ఆయన ఏమన్నారంటే....

నంద్యాల నుంచే నవరత్నాలు

మన ప్రభుత్వం వచ్చిన వెంటనే నవరత్నాల పథకాల అమలుకు నంద్యాల నుంచే శ్రీకారం చుడతా. ప్రతి ఇంటికి పథకాలు చేరాలంటే వ్యవస్థలో మార్పు రావాలి. నంద్యాలను జిల్లాగా చేస్తా. జిల్లాకేంద్రం అయితే కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయం, వివిధ జిల్లాస్థాయి కార్యాలయాలు ఏర్పాటవుతాయి. దీంతో నంద్యాల అభివృద్ధి పరుగులు పెడుతుంది. ఒక్క ఏడాది గట్టిగా దువా చెయ్యమని కోరుతున్నా. ఏడాది ఓపిక పడితే.. వచ్చేది మన ప్రభుత్వమే. ఏ పేదవాడూ అప్పు తీసుకుని ఇల్లు కట్టుకోవల్సిన అవసరం లేదు. ఉచితంగా ఇల్లు కట్టి, రిజిస్ట్రేషన్ చేసిస్తామని మాటిస్తున్నా. నంద్యాల పేద ప్రజలకు మూడున్నర సెంట్లలో ఉచితంగా ఇల్లు కట్టిస్తా. ఆటోనగర్ వాసులకు ఇళ్ల స్థలాలు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయిస్తా. మార్కెట్‌లో ఏ ఒక్కరూ రాయల్టీ కట్టాల్సిన అవసరం లేకుండా చేస్తా. రోడ్డు విస్తరణ పనుల్లో వ్యాపార సముదాయాలు పోగొట్టుకున్న వారి కి మార్కెట్ ధర ప్రకారం పరిహారం చెల్లిస్తా. రైతులకు కేసీ కెనాల్ ఆయకట్టు స్థిరీకరించడంతోపాటు గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మిస్తా. అగ్రిగోల్డ్, కేశవరెడ్డి ఆస్తుల వెనుక చంద్రబాబు బినామీలే ఉన్నారు. ఆ బాధితులకు హామీ ఇస్తున్నా.. మన ప్రభుత్వం వచ్చిన మూడు నెలల్లోనే వారికి ఇవ్వాల్సింది పూర్తిగా చెల్లిస్తాం. అడ్డుపడితే.. అవసరమైతే చంద్రబాబు చొక్కా విప్పిస్తాం. ఆదినారాయణరెడ్డి నిక్కర్ కూడా విప్పిస్తాం. వెళ్లే ముందు ఒక్క విషయం చెప్పాలి.. పార్టీ గుర్తు గుర్తుంచుకోండి. ప్రజల్ని అయోమయానికి గురిచేయడానికి ఎస్.మోహన్‌రెడ్డి అనే పేరుతో 10 మందితో నామినేషన్ వేయించారు. అందుకే గుర్తు గురించి మళ్లీ చెబుతున్నా.. ఫ్యాన్ గుర్తుకే ఓటేయండి '' అంటూ జగన్ ప్రచారానికి ముగింపు పలికారు.

తెలంగాణ

'ధర్నా చౌక్' కోసం ధర్నా

జంతర్ మంతర్ వద్ద గళమెత్తిన విపక్షాలు



సోమవారం ఢిల్లీలో చేపట్టిన ధర్నాలో లెఫ్ట్ నేతలు ఏచూరి, సురవరం, కాంగ్రెస్ నేత ఉత్తమ్

సాక్షి, న్యూఢిల్లీ: ఇందిరాపార్కు వద్ద ధర్నాచౌక్‌ను పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఢిల్లీలో గళమెత్తాయి. ధర్నాలను నిషేధించి సీఎం కేసీఆర్ నిజాం పాలనను మరిపించేలా నిరంకుశంగా వ్యవహరిస్తున్నారని నేతలు మండిపడ్డారు. సోమవారం విపక్ష పార్టీలు జంతర్‌మంతర్ వద్ద ధర్నా కార్యక్రమం చేపట్టాయి. దీనికి టీజేఏసీ చైర్మన్ కోదండరామ్, సీపీఎం, సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శులు సీతారాం ఏచూరి, సురవరం సుధాకర్‌రెడ్డి, కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి ఆర్‌సీ కుంతియా, పీసీసీ చీఫ్ ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మాజీ ఎంపీలు వీహెచ్, పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్యే సంపత్‌కుమార్, సీపీఎం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శులు తమ్మినేని వీరభద్రం, చాడ వెంకట్‌రెడ్డి, ఆప్ నేత ప్రొ.విశ్వేశ్వరరావు, ప్రజా సంఘాల నేతలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కోదండరాం మాట్లాడుతూ.. ధర్నాచౌక్‌ను తిరిగి సాధించుకున్నప్పుడే తెలంగాణలో ప్రజాస్వామ్య జీవితాన్ని పునరుద్ధరించుకున్నట్లని అన్నారు. తెలంగాణ సాధించుకున్నా ఏ వర్గమూ సంతోషంగా లేదని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రజల ఆకాంక్షలకు విరుద్ధంగా పాలన సాగిస్తున్నారని కుంతియా విమర్శించారు. కేసీఆర్‌కు తన పాలనపై నమ్మకం లేకనే.. ప్రశ్నించే గొంతుకలను నొక్కేందుకు యత్నిస్తున్నారని ఉత్తమ్ దుయ్యబట్టారు. రాష్ట్ర ప్రభుత్వం ఇసుక దందాలు, భూ కుంభకోణాల్లో మునిగితేలుతూ ప్రజా సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. భావస్వేచ్ఛను హరిస్తూ పోలీసుల పహారాలో ప్రభుత్వం పాలన సాగిస్తోందని చాడ వెంకటరెడ్డి అన్నారు. ఇందిరాపార్కు వద్ద ధర్నాలకు అనుమతించకపోతే హైదరాబాద్ అంతా ధర్నాచౌక్‌గా మారుతుందని తమ్మినేని హెచ్చరించారు.

కేసీఆర్ రాజకీయాల్లోకి రాకముందే ఉంది

కేసీఆర్ రాజకీయాల్లోకి రాకముందు నుంచే ధర్నాచౌక్ ఉంది. పార్లమెంటుకు అర కిలోమీటరు దూరంలో ఉన్న జంతర్‌మంతర్ వద్ద ధర్నాలు చేసుకునేందుకు కేంద్రం అనుమతిస్తోంది. అలాంటిది రాష్ట్ర ప్రభుత్వం ధర్నాచౌక్ వద్ద ఎందుకు అనుమతి ఇవ్వదు. ఉద్యమ సమయంలో ధర్నాచౌక్‌లో చేసిన ధర్నాలు కేసీఆర్‌కు గుర్తుకు లేవా?

– సురవరం సుధాకర్‌రెడ్డి

బాబ్రీ మసీదు ఘటన తర్వాత ఢిల్లీ బోట్ క్లబ్‌లో ఉన్న ధర్నాచౌక్‌ను అప్పటి కేంద్రం ఢిల్లీ వెలుపలకు తరలించింది. కానీ అప్పుడు పోరాడి జంతర్‌మంతర్‌ను సాధించుకున్నాం. అదే స్ఫూర్తితో ధర్నా చౌక్‌ను సాధించుకుంటాం. – సీతారాం ఏచూరి

ధర్నాచౌక్‌ను పునరుద్ధరించేలా ఆదేశాల్వివండి

రాజ్‌నాథ్‌కు నేతల విన్నపం

ఇందిరాపార్క్ వద్ద ప్రభుత్వం ఎత్తేసిన ధర్నాచౌక్‌ను పునరుద్ధరించేలా రాష్ట్ర ప్రభుత్వానికి తగిన ఆదేశాలు జారీ చేయాలని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్‌ను నేతలు కోరారు. ఎంపీ డి.రాజా నేతృత్వంలో కోదండరాం, వీహెచ్, చాడ వెంకట్‌రెడ్డి, తమ్మినేని వీరభద్రం తదితరులు సోమవారం రాజ్‌నాథ్ సింగ్‌ను కలిసి వినతిపత్రం సమర్పించారు.

మూడు నెలల్లో ఏర్పాటు చేయండి

రైతు రుణవిమోచన కమిషన్‌పై సర్కారుకు హైకోర్టు ఆదేశం



సాక్షి, హైదరాబాద్: రైతులు, వ్యవసాయ కూలీలు తదితరుల రుణ విమోచనకు గాను కమిషన్‌ను మూడు నెలల్లో ఏర్పాటు చేయాలని సోమవారం తెలంగాణ ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్‌రం గనాథన్, న్యాయమూర్తి జస్టిస్ జె.ఉమా దేవితో కూడిన ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. తెలంగాణ రాష్ట్ర రుణ విమోచన చట్టం 2016లోని సెక్షన్ 3(1) ప్రకారం రైతులు, వ్యవసాయ కూలీలు తదితరుల కోసం కమిషన్‌ను ఏర్పాటు చేయాల్సి ఉన్నా, ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంలేదంటూ బీజేపీ సీనియర్ నేత నల్లు ఇంద్రసేనారెడ్డి పిటిషన్ వేశారు.

అమెరికా వర్సిటీలు సురక్షితం

జాత్యహంకార దాడులు పెరిగాయనడంలో నిజం లేదు

- అమెరికాలో అభ్యసించే భారతీయుల సంఖ్య తగ్గలేదు
- వీసాల జారీ, విద్యా విధానంలో మార్పుల్లేవు
- విద్యార్థులు ఎటువంటి భయాందోళనలకు గురికావొద్దు
- 'సాక్షి'తో అమెరికన్ కాన్సులేట్ వైస్ కౌన్సెల్ జొనాథన్ అక్లీ



సాక్షి, హైదరాబాద్: అమెరికాలో ఉన్నత విద్యాభ్యాసం అప్పుడు.. ఇప్పుడు.. ఎప్పుడూ సురక్షితమేనని, జాత్యహంకార దాడులపై తగు చర్యలు తీసుకుంటున్నామని అంటున్నారు హైదరాబాద్‌లోని అమెరికన్ కాన్సులేట్ వైస్ కౌన్సెల్ జొనాథన్ అక్లీ. అమెరికన్ వర్సిటీల్లో చేరేందుకు విద్యార్థులు సిద్ధమవుతున్న నేపథ్యంలో యూనివర్సిటీల ఎంపికలో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి.. అక్లీతో 'సాక్షి' ప్రత్యేకంగా ముచ్చటించింది.

ప్ర: అమెరికాలో కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది కదా.. విద్యా విధానానికి సంబంధించి, వీసా జారీలో మార్పులు జరిగాయా?

జవాబు: అలాంటివేవీ లేవు. విద్యకు సంబంధించి గత ప్రభుత్వ విధానాలే కొనసాగుతున్నాయి. అమెరికన్ పౌరుల రక్షణ.. చట్టబద్ధంగా ఈ దేశంలో చదువుకునేందుకు వచ్చిన వారు, పర్యటించేందుకు వచ్చిన వారిని భద్రంగా చూసుకోవడమన్నది అన్ని ప్రభుత్వాలూ అనుసరిస్తున్న విధానం. ఇందులో ఎలాంటి మార్పూ లేదు. తగిన విద్యార్హతలు, చదువును కొనసాగించేందుకు అవసరమైన ఆర్థిక వనరులు, వీసాలు ఉన్న వారెవరైనా ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అమెరికాలో చదువుకోవచ్చు.

ప్ర: ఒకట్రెండేళ్ల క్రితం కొంతమంది తెలుగు విద్యార్థులను వెనక్కి పంపారు. కొన్ని వర్సిటీలు చేసిన పొరబాట్ల వల్ల విద్యార్థులు ఇబ్బందిపడ్డారు. ఇలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటున్నారా?

జ: అమెరికాలో దాదాపు ఆరు వేల కాలేజీలు ఉన్నాయి. వీటిల్లో అమెరికా ఉన్నత విద్యా సంస్థ గుర్తించినవి 4,500 మాత్రమే. వేటికి గుర్తింపు ఉంది? వేటికి లేదన్న వివరాలు www.chea.org వెబ్‌సైట్‌లో ఉన్నాయి. కాలేజీ ఎంపిక సమయంలో విద్యార్థులు ఈ జాబితా పరిశీలించి నిర్ణయం తీసుకుంటే ఇబ్బందులు ఉండవు.

ప్ర: ఇటీవలి కాలంలో అమెరికాలో జాత్యహంకార దాడులు పెరిగినట్లు వార్తలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో విద్యార్థులు అక్కడ సురక్షితంగా ఉండేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు?

జ: వేర్వేరు దేశాల నుంచి వచ్చే విద్యార్థులు ఎలాంటి ఇబ్బందులకు గురి కాకుండా ప్రభుత్వం, వర్సిటీలు ఎప్పటికప్పుడు తగిన చర్యలు తీసుకుంటున్నాయి. అయినా అక్కడక్కడా కొన్ని దురదృష్టకరమైన సంఘటనలు చోటు చేసుకున్న మాట నిజమే. కొంతమంది వ్యక్తులు చట్టాలను ఉల్లంఘించడం వల్ల ఇలా జరుగుతూంటుంది. ఇలాంటి వారిని అదుపు చేసేందుకు తగిన చట్టాలున్నాయిక్కడ. జాత్యహంకార దాడుల్లాంటివి జరిగినప్పుడల్లా మా న్యాయ వ్యవస్థ ద్వారా దోషులకు శిక్ష పడేలా చేయగలుగుతున్నాం. కొన్ని విశ్వవిద్యాలయాలు ఇలాంటి సంఘటనలకు ఎలా స్పందించాలన్న విషయంలో తమదైన ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నాయి కూడా. వర్సిటీలను ఎంపిక చేసుకునే సమయంలో విద్యార్థులు రక్షణకు సంబంధించిన ఏర్పాట్లనూ ఒకసారి పరిశీలించడం మేలు.

ప్ర: అమెరికన్ వర్సిటీల్లో భారతీయ విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది..?

జ: ఇది నిజం కాదు. గత మూడేళ్ల గణాంకాలు తీసుకుంటే ఈ విషయం స్పష్టంగా తెలుస్తుంది. నాన్ ఇమ్మిగ్రెంట్ వీసాలు మూడేళ్లలో 22 శాతం పెరిగాయి. హైదరాబాద్ నుంచి ఈ రకమైన వీసాల జారీ 48 శాతం వరకూ పెరిగింది. విద్యార్థి వీసాల విషయానికొస్తే.. 2014తో పోలిస్తే 2016 నాటికి 122 శాతం పెరిగింది. 2016లో దేశం మొత్తమ్మీద జారీ చేసిన విద్యార్థి వీసాల సంఖ్య దాదాపు 48 వేల వరకూ ఉంది. హెచ్–1బీ వీసాల విషయంలోనూ పెరుగుదలే కనిపిస్తోంది. 2014లో మొత్తం 60 వేల వీసాలు జారీ కాగా.. గత ఏడాది ఇవి 80 వేల కంటే ఎక్కువగా ఉన్నాయి.

''అమెరికాలో చదువుకుంటున్న భారతీయ విద్యార్థుల సంఖ్య 1.66 లక్షల వరకూ ఉంది. అమెరికాలోని ఉన్నత విద్యావకాశాలను భారతీయ విద్యార్థులకు మరింత చేరువ చేసేందుకు ఎడ్యుకేషన్ యూఎస్ఏ అన్ని చర్యలు తీసుకుంటోంది. అమెరికాలోని ప్రతి ఆరుగురు విద్యార్థుల్లో ఒకరు భారతీయులై ఉండటం సంతోషకరం. ఇటీవలి కాలంలో చోటు చేసుకున్న విద్వేష దాడులను అధ్యక్షుడు ట్రంప్‌తోపాటు ఉన్నతాధికారులందరూ ఖండించారు. కాబట్టి ఉన్నత విద్యాభ్యాసం కోసం ఇక్కడకు రావాలనుకునే వారు ఎలాంటి భయాందోళనలకూ గురికావాల్సిన అవసరం లేదు''

– కేథరీన్ హడ్డా, యూఎస్ కాన్సులేట్ జనరల్, హైదరాబాద్.

''అమెరికాలో ఉన్నత విద్యనభ్యసించాలనుకునేవారు హైదరాబాద్‌లోని కాన్సులేట్‌ను సంప్రదిస్తే.. మేము ఉచితంగా కౌన్సెలింగ్ ఇస్తాం. అక్రిడెటెడ్ కళాశాలల వివరాలు మొదలుకుని ఏ కాలేజీలో ఎలాంటి కోర్సులు అందుబాటులో ఉన్నాయి? అడ్మిషన్ విధానాలు తదితర అన్ని అంశాలకు సంబంధించిన వివరాలు అందిస్తాం. విద్యార్థులు చేయాల్సిందల్లా కాన్సులేట్‌కు ఫోన్ చేసి ముందస్తు అపాయింట్‌మెంట్ తీసుకోవడం మాత్రమే''

– పియా బహదూర్, రీజనల్ ఆఫీసర్, యునైటెడ్ స్టేట్స్–ఇండియా ఎడ్యుకేషనల్ ఫౌండేషన్



సేవ్‌దాస్‌నగర్ వాగు నుంచి ఎడ్లబండిపై గర్భిణిని వాగు దాటిస్తున్న గ్రామస్తులు

పురిటినొప్పులతో ఎడ్లబండిపై వాగు దాటి..

నేరడిగొండ (బోథ్): పురిటినొప్పులతో బాధపడుతున్న ఓ గర్భిణిని ప్రాణాపాయ స్థితిలో గ్రామస్తులు ఎడ్లబండిపై వాగు దాటించారు. ఈ సంఘటన సోమవారం ఆదిలాబాద్ జిల్లా నేరడిగొండ మండలం బోరిగాం గ్రామపంచాయతీ పరిధి సేవ్ దాస్‌నగర్‌లో జరిగింది. గ్రామ సమీపంలోని వాగు 4 రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తోంది. దీంతో బయటి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయాయి. గ్రామానికి చెందిన ఆడె లలితకు పురిటినొప్పులు వచ్చాయి. ఆస్పత్రికి తరలించేందుకు రోడ్డు సౌకర్యం లేకపోవడం, మధ్యలో వాగు ప్రవహిస్తుండడంతో గ్రామస్తులు ఎడ్లబండిపై వాగు దాటించారు. అనంతరం ప్రైవేటు వాహనంలో నిర్మల్‌లోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆస్పత్రిలో లలిత కవల ఆడబిడ్డలకు జన్మనిచ్చింది.

సత్తుపల్లిలో టాస్క్‌ఫోర్స్ అధికారుల తనిఖీలు

పసుపు, కారం, పూజ నూనె కల్తీ చేస్తున్నట్లు వెల్లడి

సత్తుపల్లి: ఖమ్మం జిల్లా సత్తుపల్లిలోని అంబేడ్కర్ నగర్‌లో గల దివాకర్ జనరల్ స్టోర్స్, మిల్లుపై టాస్క్‌ఫోర్స్ సీఐ సదానిరంజన్, సత్తుపల్లి సీఐ వెంకటనర్సయ్య, ఎస్సై కరుణాకర్ సోమవారం ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా కారం, పూజ నూనె, పసుపును పరిశీలించి, కల్తీ జరిగినట్లు ప్రాథమిక అంచనాకు వచ్చారు. వెంటనే నిల్వ ఉన్న స్టాక్, దుకాణం, గోడౌన్‌ను సీజ్ చేశారు. రెడ్‌హాట్ చిల్లీ పౌడర్ నంబర్ వన్ బ్రాండ్ పేరుతో కారం, పసుపు ప్యాకెట్లను తెలంగాణ, ఆంధ్రా రాష్ట్రాల్లో హోల్‌సేల్‌గా వ్యాపారం చేస్తున్నట్లు విచారణలో తేలింది. భక్తులు పూజకు వాడే నూనెను సైతం కల్తీ చేసి అమ్ముతున్నట్టు ఈ తనిఖీల్లో వెలుగు చూసింది.

నేడు కృష్ణా బోర్డు భేటీ

- కొత్త ప్రాజెక్టులు, వర్కింగ్ మాన్యువల్‌పై చర్చ

సాక్షి, హైదరాబాద్: కృష్ణా నదీ యాజమాన్య బోర్డు కీలక సమావేశం మంగళవారం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిలో జరగనుంది. ఈ భేటీలో బోర్డు చైర్మన్ హెచ్‌కే సాహూ, సభ్య కార్యదర్శి సమీర్ చటర్జీతోపాటు ఇరు రాష్ట్రాల నీటిపారుదల శాఖ కార్యదర్శులు ఎస్‌కే జోషి, శశిభూషణ్‌కుమార్, ఈఎన్‌సీలు మురళీధర్, వెంకటేశ్వర్లు, అంతర్రాష్ట్ర జల వివాదాల విభాగం అధికారులు పాల్గొననున్నారు. మొత్తం 8 అంశాలపై బోర్డులో చర్చించనుండగా ప్రధాన చర్చ కొత్తప్రాజెక్టులు, ఈ ఏడాదికి వర్కింగ్ మాన్యువల్, నీటి పంపిణీ, చిన్న నీటి వనరుల కింద నీటి వినియోగంపైనే ఉండనుంది. ముఖ్యంగా ఏపీ చేపట్టిన ఆయా ప్రాజెక్టుల నీటి వినియోగంపై తెలంగాణ ప్రశ్నించనుంది. పట్టిసీమ, పోలవరం ప్రాజెక్టుల నుంచి తెలంగాణకు దక్కాల్సిన వాటాలపైనా నిలదీయనుంది. రాష్ట్రానికి చెందిన పాలమూరు, డిండి, భక్తరామదాస ప్రాజెక్టులు కొత్తగా చేపట్టినవి కావని స్పష్టం చేయనుంది.

బ్యాంకు ఖాతాలకు ఆధార్ ముప్పు!

సరిగా సీడింగ్ జరగక ఖాతాలు బ్లాక్ అయ్యే అవకాశం ● రాష్ట్రంలో సుమారు 3 కోట్ల బ్యాంకు ఖాతాలకు సమస్య

సాక్షి, హైదరాబాద్

బ్యాంకు ఖాతాలకు ఆధార్ ముప్పు వచ్చి పడింది.. వాటిని అనుసంధానించే ప్రక్రియ తప్పటడుగులేసింది.. రాష్ట్రంలోని మొత్తం 4.70 కోట్ల బ్యాంకు ఖాతాల్లో దాదాపు మూడు కోట్లకుపైగా ఖాతాలకు సమస్య వచ్చి పడింది. ఈ ఖాతాలకు సరిగా ఆధార్ సీడింగ్ జరగలేదని.. వాటన్నింటినీ బ్లాక్ చేసే అవకాశముందని కేంద్ర ప్రభుత్వం హెచ్చరించింది. రాష్ట్రంలోని 87 శాతం బ్యాంకు ఖాతాలకు ఆధార్ సీడింగ్ పూర్తయినట్లు రాష్ట్ర ప్రభుత్వం నివేదించగా.. అందులో ఏకంగా 74 శాతం ఖాతాలకు, ఆధార్ వివరాలకు పొంతనలేదని కేంద్ర ఆర్థిక శాఖ స్పష్టం చేసింది. రెండు రోజుల కిందట రాష్ట్ర ఆర్థిక శాఖ అధికారులు, బ్యాంకర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఈ వివరాలను వెల్లడించింది. కేవలం 13 శాతం బ్యాంకు ఖాతాలు, ఆ ఖాతాదారుల ఆధార్ సమాచారం సరిపోలిందని పేర్కొంది. ఆధార్ సీడింగ్ ప్రక్రియ సరిగ్గా జరగని తీరుపై ఆందోళన వ్యక్తం చేసింది. ఖాతాదారుల పేర్లలో, ఆధార్ నంబర్లలో, ఇతర వివరాల్లో తప్పులు ఉన్న నేపథ్యంలో.. భారీగా బోగస్ సీడింగ్ జరిగినట్లు సందేహం వ్యక్తం చేసింది.

బ్యాంకర్ల నిర్లక్ష్యంతో..

బ్యాంకర్లు తూతూమంత్రంగా ఆధార్ నంబర్లను ఖాతాలకు జత చేశారని కేంద్ర ఆర్థిక శాఖ అభిప్రాయపడింది. ఆధార్ కార్డు సంబంధిత ఖాతాదారుడిదేనా.. ఇచ్చిన పాన్ నంబర్ సరిగ్గా ఉందా.. వంటి వివరాలను ధ్రువీకరించుకోకపోవటంతో ఈ పరిస్థితి తలెత్తిందని పేర్కొంది. కేంద్రం వద్ద ఉన్న ఆధార్ డేటాబేస్, పాన్ నంబర్ డేటాబేస్‌లకు బ్యాంకు ఖాతాల్లోని ఆధార్ నంబర్లకు పొంతన లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేసింది.

పక్కాగా పరిశీలన

వివరాల్లో తప్పులుండటంతో సీడింగ్ ప్రక్రియను మరింత పక్కాగా నిర్వహించాలని రాష్ట్రంలోని బ్యాంకర్లను కేంద్ర ఆర్థిక శాఖ ఆదేశించింది. ఈ ఏడాది డిసెంబర్ 31లోగా ఖాతాదారులంతా తమ ఆధార్ కార్డులను సమర్పించి ఖాతాలోని వివరాలు ఆధార్‌తో సరిపోలినవో, లేదో ధ్రువీకరించుకునేలా చర్యలు చేపట్టాలని స్పష్టం చేసింది. ఆధార్, పాన్‌కార్డులను సమర్పించడంతోపాటు.. ఆ వివరాలు, బ్యాంకు ఖాతా వివరాలు సరిపోలినవో, లేదో సరిచూసుకోవాలని ఖాతాదా రులకు సూచించింది. ఆధార్ సీడింగ్ చేయని బ్యాంకు ఖాతాల్లో డిసెంబర్ 31వ తేదీ తర్వాత లావాదేవీలన్నీ స్తంభించిపోతాయని.. నగదు తీసుకోవడం, జమచేయటం కూడా కుదరదని మరోసారి స్పష్టం చేసింది. మిగిలిన నాలుగు నెలల వ్యవధిలోనే ఆధార్ కార్డుల సీడింగ్‌ను పక్కాగా పూర్తిచేసేలా బ్యాంకులు స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించాలని సూచించింది. గడువు తేదీ సమీపిస్తే ఒక్కసారిగా ఖాతాదారుల రద్దీ పెరిగిపోతుందని, అందువల్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని పేర్కొంది.

ధ్రువీకరణ తప్పనిసరి

కేంద్ర ఆర్థిక శాఖ సూచనల ప్రకారం.. ఇప్పటికే ఆధార్ కార్డులు, పాన్ కార్డులను సమర్పించిన ఖాతాదారులు సైతం తమ బ్యాంకు ఖాతా వివరాలతో వాటిని ధ్రువీకరించుకోవాలని ఆర్థిక శాఖ వర్గాలు వెల్లడించాయి. ఆధార్ కార్డు తమదేనని ధ్రువీకరించేందుకు మొబైల్ 'వన్ టైమ్ పాస్‌వర్డ్ (ఓటీపీ)'లేదా బయో మెట్రిక్ విధానం ద్వారా బ్రాంచికి రుజువు చేయాల్సి ఉంటుందని పేర్కొన్నాయి. విధిగా ఖాతాదారులందరూ బ్యాంకు శాఖలను సంప్రదించి ఆధార్ సీడింగ్ చేసుకోవాలని సూచిస్తున్నాయి.

ఎందుకింత నిర్లిప్తత?

ఆధార్ సీడింగ్‌పై కేంద్రం హెచ్చరించినా బ్యాంకర్లు నిర్లిప్తంగా వ్యవహరించడమే సమస్యకు కారణమనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆధార్ కార్డులు, పాన్‌కార్డుల వివరాలను తమ ఖాతాల్లోని వివరాలతో సరిపోల్చుకునేందుకు బ్యాంకులకు అవకాశమున్నా.. పొరపాట్లు తలెత్తడం గమనార్హం. అయితే బ్యాంకులకు వచ్చే ఖాతాదారుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయిందని.. ఆన్‌లైన్, డిజిటల్ లావాదేవీలు పెరగడంతో పూర్తిస్థాయిలో ఆధార్ సీడింగ్ చేయలేకపోతున్నట్లు ఇటీవలి వీడియో కాన్ఫరెన్స్‌లో బ్యాంకర్లు వివరణ ఇచ్చారు. కానీ తొలిసారి సీడింగ్ చేసినప్పుడే ధ్రువీకరించుకుని (అథెంటికేషన్ చేసి) ఉంటే ఈ పరిస్థితి తలెత్తేది కాదని కేంద్రం స్పష్టం చేసినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే ప్రత్యేక డ్రైవ్‌లు చేపట్టి, తగిన ప్రచారం చేసి ఆధార్ సీడింగ్ ప్రక్రియను పక్కాగా చేపట్టాలని సూచించింది.

టీకాలను నిరాకరించిన మదర్సా నిర్వాహకులు

వికారాబాద్ జిల్లాలో ఘటన.. సందర్శించిన డీఎంహెచ్‌వో

దోమ: మీజిల్స్, రుబెల్లా టీకాలను వేయించుకునేందుకు నిరాకరించారు ఓ మదర్సా నిర్వాహకులు. ఈ ఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. వికారాబాద్ జిల్లా దోమ మండలం కిష్టాపూర్‌లో 192 మంది పిల్లలతో ఓ మదర్సాను నిర్వహిస్తున్నారు. అయితే, శనివారం పిల్లలకు వ్యాక్సిన్లు వేయించాలని కోరగా నిర్వాహకులు నిరాకరించారు. దీంతో ఈ విషయాన్ని వారు ఉన్నతాధికారులకు తెలుపగా.. సోమవారం ఆ గ్రామాన్ని డీఎంహెచ్‌వో దశరథ్, మండల వైద్యాధికారి కృష్ణ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యుడు కృష్ణతో కలిసి సందర్శించారు. ఆయన మదర్సా నిర్వాహకులు, విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. వ్యాక్సిన్ల విషయంలో ఎటువంటి అపోహలు పెట్టుకోవద్దని, నిర్భయంగా వాటిని వేయించుకోవాలని కోరారు. ఈ వ్యాక్సిన్ వేసుకున్న ముస్లిం పిల్లలు చనిపోయారన్న విషయం తమకు తెలిసిందని మదర్సా నిర్వాహకులు డీఎంహెచ్‌వో దృష్టికి తెచ్చారు. మండల కో–ఆప్షన్ సభ్యుడు సలీంను పిలిపించి ఆయనతో నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. అయినా వారు వినకపోవడంతో డీఎంహెచ్‌వో అక్కడి నుంచి వెనుతిరిగారు.

రెండున్నరేళ్లకే నూరేళ్లు..!

ఆడుకుంటూ.. పట్టాలపైకి.. ● రైలు ఢీకొని కవలలు మృతి



విద్వేశ్, విఘ్నేశ్(ఫైల్)

కామారెడ్డి క్రైం: ఆడుకుంటూ తమకు తెలియకుండానే వారు వేసిన అడుగులు మృత్యువు వైపు నడిపించాయి. ఇంటికి సమీపంలోని రైలు పట్టాలపై ఆడుకుంటుండగా.. రైలు రూపంలో వచ్చిన మృత్యువు వారిని కబళించింది. ముద్దుముద్దు మాటలతో సందడి అప్పటి వరకు సందడి చేసిన ఆ కవల చిన్నారులు విగత జీవులై కనిపించడం గ్రామస్తులను కలచివేసింది. కన్నవారికి కడుపుకోతను మిగిల్చిన ఈ ఘటన కామారెడ్డి మండలంలోని నర్సన్నపల్లిలో సోమవారం జరిగింది. నర్సన్నపల్లి గ్రామానికి చెందిన చందన భానుశ్రీ, చంద్రంలకు రెండున్నరేళ్ల క్రితం కవల పిల్లలు విద్వేశ్, విఘ్నేశ్‌లు ఉన్నారు. చంద్రం కూలి పనులు చేస్తూ కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. సోమవారం ఉదయమే పనిపై వెళ్లాడు. భానుశ్రీ ఏడు నెలల గర్భిణి. మధ్యాహ్నం 2 గంటల వరకు పడుకున్న పిల్లలు.. లేచి ఆడుకోవడానికి ఇంటి పక్కనే ఉన్న కొట్టం దగ్గరికి వెళ్లారు. అక్కడి నుంచి ఇంటికి సమీపంలోని రైలు పట్టాలపైకి చేరి ఆడుకోసాగారు. వీరి ఇల్లు గ్రామ శివారులో ఉండడంతో చిన్నారులు రైలు పట్టాలపై ఉన్న విషయాన్ని ఎవరూ గమనించలేదు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో హైదరాబాద్ నుంచి కామారెడ్డి వైపు వస్తున్న దేవగిరి ఎక్స్‌ప్రెస్ పట్టాలపై ఉన్న వీరిని ఢీ కొట్టింది. అయితే, పట్టాలపై పిల్లలను కొద్దిదూరంలో గమనించిన లోకోపైలట్ రైలును ఆపడానికి బ్రేక్ వేసినా ఫలితం లేకపోయింది. దీంతో కవలలు అక్కడికక్కడే మరణించారు. కవలల్లో ఒకరి మృతదేహం పట్టాల పక్కన పడిపోగా మరొకరి మృతదేహం తునాతునకలైంది. లోకో పైలట్ ఇచ్చిన సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు సంఘటనాస్థలానికి వచ్చి బోరున విలపించారు. సంఘటనాస్థలాన్ని కామారెడ్డి రూరల్ ఇన్‌చార్జి సీఐ కోటేశ్వర్‌రావు, దేవునిపల్లి ఎస్సై సంతోష్‌కుమార్, రైల్వే పోలీసులు సందర్శించి, వివరాలు సేకరించారు.

బురదలో శవయాత్ర



బురదలో శవాన్ని తీసుకెళ్తున్న సత్వార్ గ్రామస్తులు

జహీరాబాద్ టౌన్: పల్లెల్లో రోడ్ల దుస్థితికి అద్దం పడుతోంది ఈ చిత్రం.. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ మండలం సత్వార్ గ్రామంలో దళితుల శ్మశానవాటిక ఊరికి దాదాపు రెండు కిలోమీటర్ల దూరంలో ఉంది. చిన్నపాటి వర్షం పడినా ఈ రోడ్డు చిత్తడిగా మారుతోంది. అంతేకాదు ఇదే దారిలో రోడ్డు పక్కన ఓ వాటర్ ట్యాంక్ ఉంది. తరచూ లీకేజీలతో నీరు పొంగి ఏడాదిలో ఎప్పుడు చూసినా రోడ్డు బురదమయంగా కనిపిస్తుంది. సోమవారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి మృతి చెందగా అంత్యక్రియల కోసం ఈ రోడ్డు మీదుగా శ్మశానవాటికకు తీసుకెళ్లేందుకు నానా అవస్థలు పడ్డారు. ఎక్కడ జారి పడిపోతామోనని జాగ్రత్తగా అడుగులో అడుగు వేసుకుంటూ ఇలా శవయాత్ర నిర్వహించారు. పలుమార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు విన్నవించినా ఫలితం లేకుండాపోయిందని స్థానికులు వాపోయారు.

వాణిజ్య పన్నుల శాఖ హోదాల్లో మార్పు

సాక్షి, హైదరాబాద్: వస్తు సేవల పన్ను (జీఎస్టీ) అమలు నేపథ్యంలో రాష్ట్రంలోని వాణిజ్య పన్నుల శాఖ అధికారుల హోదాల్లో మార్పులు జరిగాయి. తెలంగాణ రాష్ట్ర వస్తు సేవల పన్నుల చట్టం ప్రకారం ఈ శాఖలోని పోస్టులకు కొత్త పేర్లను ఖరారు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులపై వాణిజ్య పన్నుల శాఖ గెజిటెడ్ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టి.వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి ఎల్.సంధ్యారాణిరావు సీఎం కేసీఆర్‌కు, వాణిజ్య పన్నుల శాఖ ముఖ్యకార్యదర్శి సోమేశ్‌కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రస్తుత పేరు	కొత్త పేరు
అడిషనల్ కమిషనర్ ఆఫ్ కమర్షియల్ ట్యాక్సెస్ (ఐఏఎస్/ఐఆర్ఎస్)	స్పెషల్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్
అడిషనల్ కమిషనర్ ఆఫ్ కమర్షియల్ ట్యాక్సెస్	అడిషనల్ కమిషనర్ (గ్రేడ్ –1)
జాయింట్ కమిషనర్ ఆఫ్ కమర్షియల్ ట్యాక్సెస్	అడిషనల్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్
డిప్యూటీ కమిషనర్ ఆఫ్ కమర్షియల్ ట్యాక్సెస్	జాయింట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్
అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ కమర్షియల్ ట్యాక్సెస్	డిప్యూటీ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్
కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్	అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ స్టేట్ ట్యాక్స్
డిప్యూటీ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్	స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్
అసిస్టెంట్ కమర్షియల్ ట్యాక్స్ ఆఫీసర్	డిప్యూటీ స్టేట్ ట్యాక్స్ ఆఫీసర్

విద్య నేటి విద్యలో..
- జనరల్ స్టడీస్: పాలిటీ
- బ్యాంక్ పీవోస్, క్లర్క్స్: బ్యాంకింగ్ అవేర్‌నెస్

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన ఈ-మెయిల్
sakshieducation@gmail.com

దరఖాస్తు చేశారా?

- ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసీఎంఆర్)లో సైంటిస్ట్-1, 2; ప్రోగ్రామర్ తదితర 19 పోస్టులకు చివరి తేదీ: ఆగస్ట్ 24
- ఇన్‌కాయిస్ (ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషియన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్)లో 19 'ప్రాజెక్ట్' పోస్టులకు చివరి తేదీ: ఆగస్ట్ 24
- నేవీలోని ఎగ్జిక్యూటివ్, టెక్నికల్ బ్రాంచ్‌ల్లో ఎస్సెస్సీ, పీసీ ఆఫీసర్ పోస్టులకు చివరి తేదీ: ఆగస్ట్ 25.



ప్రకరణ 18 (2) దేనికి సంబంధించింది?

గ్రూప్స్ ప్రత్యేకం

ఇండియన్ పాలిటీ



ప్రకరణ 18 - బిరుదుల రద్దు

- ప్రకరణ-18(1) – సైనిక, విద్యాపరమైన గుర్తింపు మినహా మిగతా బిరుదులు రద్దు.
- 18(2): భారత పౌరులు విదేశీ బిరుదులను స్వీకరించకూడదు.
- 18(3): భారత పౌరులు కాకపోయినా, భారత ప్రభుత్వంలో లాభదాయక పదవుల్లో ఉన్నప్పుడు రాష్ట్రపతి అనుమతి లేకుండా విదేశాల నుంచి ఎలాంటి బిరుదులను స్వీకరించకూడదు.
- 18(4): ప్రభుత్వంలో లాభదాయక పదవుల్లో ఉన్న వ్యక్తులు రాష్ట్రపతి అనుమతి లేకుండా విదేశాల నుంచి ఎలాంటి బహుమతులు, భృతి స్వీకరించకూడదు.
- ఈ ప్రకరణలో కొన్ని బిరుదులను రద్దు చేశారు. **ఉదా:** బ్రిటిష్ పాలనాకాలంలో సమాజంలోని వ్యక్తుల సామాజిక, ఆర్థిక ప్రాతిపదికలపై కల్పించిన ప్రత్యేక హోదాలైన రావ్ బహద్దూర్, రావ్ సాహెబ్, రాజా విక్రమార్క, జాగీర్దార్, ఇనాందార్, జమిందార్ మొదలైన వాటిని రద్దు చేశారు.
- అయితే విద్యా, సైనిక, విశిష్ట యోగ్యతా పరమైన బిరుదులకు ఈ నిషేధం వర్తించదు. **ఉదా:** భారత రత్న, పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ. అదేవిధంగా సైన్యానికి సంబంధించి పరమ వీరచక్ర, అశోక చక్ర, శౌర్యచక్ర మొదలైన వాటిని ఇవ్వొచ్చు.

ప్రత్యేక వివరణ: భారతరత్న, పద్మవిభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ లాంటివి ప్రత్యేక పురస్కారాలే కానీ బిరుదులు కావు. వీటిని పేరుకు ముందు లేదా పేరుకు తర్వాత వాడకూడదని, అలాగే వ్యాపార కార్యక్రమాలకు వినియోగించకూడదని బాలాజీ రాఘవన్ Vs యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో (1996) సుప్రీంకోర్టు అభిప్రాయపడింది.

వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కులు

ప్రకరణ 19 నుంచి 22 వరకు ఉన్న హక్కులను వివిధ స్వేచ్ఛల రూపంలో పొందుపర్చారు. ప్రజాస్వామ్యంలో వ్యక్తిగత స్వేచ్ఛలు చాలా విలువైనవి. కానీ, ఈ స్వేచ్ఛలపై కూడా హేతుబద్ధ పరిమితులను విధించవచ్చు.

అధికరణ 19లో ఆరు వ్యక్తిగత స్వేచ్ఛలున్నాయి.

1. ప్రకరణ 19(1):

ఎ) వాక్ స్వాతంత్ర్యం, భావ వ్యక్తీకరణ, అభిప్రాయ ప్రకటన.
బి) శాంతియుతంగా, నిరాయుధంగా సమావేశాలు నిర్వహించుకోవడం.
సి) సంఘాలు, సంస్థలను ఏర్పాటు చేసుకోవడం, సహకార సంఘాలను ఏర్పర్చుకొని నిర్వహించుకోవడం.
డి) దేశవ్యాప్త సంచార స్వేచ్ఛ.
ఇ) దేశవ్యాప్త స్థిర నివాస స్వేచ్ఛ.
ఎఫ్) ఆస్తిని సముపార్జించుకునే స్వేచ్ఛ (ఈ క్లాజును 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా తొలగించారు).
జి) వృత్తి, వ్యాపార, వాణిజ్య స్వేచ్ఛలు.

ప్రత్యేక వివరణ: పైన పేర్కొన్న ఆరు స్వేచ్ఛలు పౌరులకు మాత్రమే వర్తిస్తాయి. విదేశీయులకు, కంపెనీలకు, కార్పొరేషన్లకు వర్తించవు.

ప్రకరణ 19(1) (ఎ)లో పేర్కొన్న వాక్ స్వాతంత్ర్యం, భావ ప్రకటనా స్వేచ్ఛకు సంబంధించి చాలా విస్తృతంగా సుప్రీంకోర్టు వ్యాఖ్యానాలు చెప్పింది. పౌరుడు తన భావాలతోపాటు ఇతరుల భావాలను కూడా వ్యక్తీకరించవచ్చు. ఇది పత్రికా స్వేచ్ఛ ద్వారా సాధ్యమవుతుంది. కాబట్టి 'పత్రికా స్వేచ్ఛ' అనేది భావ ప్రకటన స్వేచ్ఛలో అంతర్గతంగా ఉంటుంది. అలాగే ఈ కింది స్వేచ్ఛలు కూడా భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో అంతర్గతంగా ఉంటాయని వ్యాఖ్యానించింది.

- పత్రికా స్వేచ్ఛ
- వాణిజ్య ప్రకటన స్వేచ్ఛ
- రహస్యాలను కాపాడుకునే స్వేచ్ఛ
- ప్రసారాల స్వేచ్ఛ
- బంద్‌కు వ్యతిరేక స్వేచ్ఛ
- సమాచార స్వేచ్ఛ
- మౌనాన్ని పాటించే స్వేచ్ఛ
- నిరసనను వ్యక్తం చేసే స్వేచ్ఛ

మినహాయింపులు: పైన పేర్కొన్న స్వేచ్ఛలపై హేతుబద్ధ పరిమితులను విధించే అధికారం ప్రభుత్వానికి ఉంటుంది. ఈ కింది కారణాలపై పరిమితులు విధించవచ్చు.

- భారత సార్వభౌమాధికారం, సమగ్రత.
- దేశరక్షణ, విదేశాలతో స్నేహ సంబంధాలు.
- ప్రజాశాంతి, సభ్యత, మర్యాద, నీతి, కోర్టు ధిక్కారం.
- పరువు నష్టం, నేర ప్రేరేపణ మొదలైన ప్రాతిపదికలపై హేతుబద్ధ పరిమితులను విధించవచ్చు. అయితే పైన పేర్కొన్న పరిమితులు పార్లమెంటు, శాసనసభ చర్చలకు వర్తించవు. సభాధ్యక్షుల రూలింగ్ మేరకు సభ్యులు తమ భావాలను వ్యక్తీకరించొచ్చు.

భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ-సుప్రీంకోర్టు తీర్పులు

భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు సంబంధించి సుప్రీంకోర్టు విస్తృత తీర్పులు వెలువరించింది.

శ్రేయా సింఘాల్ V/s యూనియన్ ఆఫ్ ఇండియా (2015): ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ చట్టం 2000లోని సెక్షన్ 66ఎ భావ వ్యక్తీకరణ స్వేచ్ఛకు విరుద్ధమని, అది చెల్లదని సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది.

కుష్బూ కేసు (2010): పౌరుడు తన భావాలను స్వేచ్ఛగా వ్యక్తీకరించవచ్చని, ఒకరు వ్యక్తీకరించిన భావం నచ్చకపోతే న్యాయస్థానంలో దావా వేయవచ్చని, కానీ పూర్తిగా తన భావాలను వ్యక్తీకరించకుండా నిషేధించడానికి వీల్లేదని వ్యాఖ్యానించింది. స్త్రీ, పురుషులు మేజర్లయి ఉంటే వివాహం చేసుకోకుండా సహజీవనం చేయడం నేరంగా పరిగణించకూడదని పేర్కొంది.

భరత్‌కుమార్ V/s సి.పి.ఎం. (1998): బంద్‌లు, సార్వత్రిక సమ్మెలు.. ప్రాథమిక హక్కులు కావని, అవి ప్రజా జీవితాన్ని తీవ్రంగా ప్రభావితం చేస్తాయని, ఇవి రాజ్యాంగ విరుద్ధమని పేర్కొంది. ఇలాంటి తీర్పునే టి. రంగరాజన్ V/s తమిళనాడు కేసు (2003)లో సమ్మె చేసే హక్కు.. ప్రాథమిక హక్కు కాదని తీర్పు చెప్పింది.

బిజో ఇమ్మాన్యుయల్ V/s స్టేట్ ఆఫ్ కేరళ (1986): దీన్ని జాతీయగీతం కేసుగా పేర్కొంటారు. జాతీయగీతాన్ని పాడటం తమ మత విశ్వాసానికి విరుద్ధమని నిరూపించగలిగితే, దాన్ని ఆలపించాలని ఏ వ్యక్తినీ ఒత్తిడి చేయకూడదని పేర్కొంది. భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో ఒక వ్యక్తి మౌనంగా ఉండే స్వేచ్ఛ కూడా ఉంటుందని వ్యాఖ్యానించింది.

మేనకా గాంధీ V/s యూనియన్ ఆఫ్ ఇండియా (1978): పౌరులకు సంచార స్వేచ్ఛతో పాటు భావ వ్యక్తీకరణ స్వేచ్ఛ దేశంలో, విదేశీ పర్యటనలో ఉన్నప్పుడు కూడా ఉంటుందని, ఆ స్వేచ్ఛకు భౌగోళిక పరిమితి ఉండదని పేర్కొంది.

నవీన్ జిందాల్ V/s యూనియన్ ఆఫ్ ఇండియా(1995): జాతీయ జెండాను ప్రతి పౌరుడు ఎగరవేయడం భావ వ్యక్తీకరణ స్వేచ్ఛలో అంతర్భాగమని ప్రకటించింది.

ప్రత్యేక విశ్లేషణ: పత్రికలు లేదా మీడియాపై ముందస్తు సెన్సార్‌షిప్ లేదా నియంత్రణ సాధ్యం కాదని అయితే సినిమాలపై ముందస్తు సెన్సార్‌షిప్ ఉండాలని, అది స్వేచ్ఛకు వ్యతిరేకం కాదని బ్రిజ్ భూషణ్ V/s యూనియన్ టెరిటరీ ఆఫ్ ఢిల్లీ కేసులో సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. సెన్సార్‌షిప్ విషయంలో పత్రికలు/మీడియాను, సినిమాలను ఒకేవిధంగా చూడటం సమంజసం కాదని పేర్కొంది. అలాగే సమాచార స్వేచ్ఛ అంటే ప్రభుత్వ కార్యకలాపాలకు సంబంధించిన సమాచారాన్ని తెలుసుకునే హక్కని, ఇది ప్రకరణ 19(1)(ఎ)లో అంతర్భాగమని బెన్నెట్ కోల్‌మన్ కంపెనీ కేసు (1973)లో సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. అందువల్ల 2005 జూన్‌లో పార్లమెంటు సమాచార హక్కు చట్టాన్ని రూపొందించింది.

సీమా V/s అశ్వనీకుమార్ (2006): వివాహాలను తప్పనిసరిగా రిజిస్ట్రేషన్ చేయాలని సుప్రీంకోర్టు పేర్కొంది.

19(1బి): సమావేశ స్వేచ్ఛ: పౌరుల శాంతి భద్రతలకు భంగం కలిగించని రీతిలో ఆయుధాలు లేకుండా, శాంతియుతంగా సమావేశం కావడానికి స్వేచ్ఛ ఉంది. అయితే సిక్కు మతస్తులు తమ మత చిహ్నమైన చిన్న కత్తిని (కృపాణాన్ని) ధరించి శాంతియుతంగా సమావేశం కావచ్చు. ఈ స్వేచ్ఛపై కూడా కొన్ని పరిమితులుంటాయి. దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు, శాంతి భద్రతలకు భంగం కలిగించేలా సమావేశాలు ఉంటే వాటిని నిషేధించవచ్చు. **ఉదా:** క్రిమినల్ ప్రొసీజర్ కోడ్ సెక్షన్ 144 ప్రకారం నిషేధాజ్ఞను, కర్ఫ్యూ నిబంధనలను అమలు చేయొచ్చు.

19(1సి) సంఘాలు, సంస్థలను ఏర్పాటు చేసుకునే స్వేచ్ఛ: పౌరుడు స్వచ్ఛందంగా తనకు నచ్చిన సంఘాలను స్థాపించుకొని కార్యకలాపాలు కొనసాగించవచ్చు. అయితే నైతిక విరుద్ధమైన, సమాజ హితానికి వ్యతిరేకమైన, దేశ సార్వభౌమత్వానికి, సమగ్రతకు, శాంతిభద్రతలకు భంగం కలిగించే సంస్థలు, సంఘాలను అనుమతించరు.

గమనిక: 97వ రాజ్యాంగ సవరణ ద్వారా సహకార సంఘాలను ఏర్పర్చుకొని నిర్వహించుకునే స్వేచ్ఛను కూడా ఆర్టికల్ 19(1సి)లో చేర్చారు.

19(1డి): సంచార స్వేచ్ఛ: పౌరుడు దేశమంతటా తన ఇష్టప్రకారం సంచరించడానికి స్వేచ్ఛ ఉంటుంది. తద్వారా వారిలో విశాల భావజాలం పెంపొందడమే కాకుండా వైవిధ్యాన్ని అర్థం చేసుకునే అవకాశం ఉంటుంది. అయితే ఈ సంచార స్వేచ్ఛపై కొన్ని ఆంక్షలు విధించవచ్చు. సామాన్య ప్రజల సంక్షేమం, షెడ్యూల్డ్ తెగల ప్రయోజనాలు, శాంతి భద్రతల దృష్ట్యా జన సంచారాన్ని నిషేధించవచ్చు. అలాగే సంచార సమయంలో పౌరులు కొన్ని నియమ నిబంధనలు పాటించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవచ్చు. **ఉదా:** వాహనదారులు హెల్మెట్లు ధరించడం, సీటు బెల్టు పెట్టుకోవడం, అంటువ్యాధులు రాకుండా వ్యాక్సిన్లు వేసుకోవడం మొదలైనవి.

19(1ఇ): నివాసం ఏర్పర్చుకుని స్థిరపడే స్వేచ్ఛ: పౌరులు భారతదేశంలో ఏ ప్రాంతంలోనైనా నివాసం ఏర్పర్చుకుని స్థిరపడటానికి స్వేచ్ఛ ఉంది. అయితే ఈ హక్కుపై ప్రజా సంక్షేమం, షెడ్యూల్డ్ ప్రాంతాల ప్రయోజనాల దృష్ట్యా హేతుబద్ధ పరిమితులు విధించవచ్చు. అలాగే జమ్మూకశ్మీర్ రాష్ట్రంలో మాత్రం ఆ రాష్ట్ర రాజ్యాంగ నిబంధనల మేరకు స్థిరపడే హక్కు రాష్ట్రేతరులకు ఉండదు.

19(1జి): వృత్తి, వ్యాపారం చేసుకునే స్వేచ్ఛ: భారత పౌరులు తమకు ఇష్టమైన వృత్తిని, వ్యాపార వాణిజ్యాలను చేసుకోవడానికి స్వేచ్ఛ ఉంది. అయితే ప్రజాసంక్షేమం దృష్ట్యా ప్రభుత్వం హేతుబద్ధ ఆంక్షలు విధించవచ్చు.

ఉదా: జోగిని, దేవదాసి, వేశ్యావృత్తి పూర్తిగా నిషేధం. అలాగే కొన్ని వృత్తులు చేపట్టాలంటే ప్రభుత్వ అనుమతులతో పాటు కొన్ని అర్హతలు ఉండాలి. షరతులు పాటించాలి. **ఉదా:** వైద్య, న్యాయవాద వృత్తులకు, ఔషధాలను విక్రయించే వారికి ప్రత్యేక అర్హతలతోపాటు ప్రభుత్వ అనుమతి కూడా ఉండాలి.

బి.కృష్ణారెడ్డి,
డైరెక్టర్,
క్లాస్-వన్ స్టడీ సర్కిల్



కాంపిటీటివ్ కౌన్సెలింగ్

రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే పరీక్షలకు సంబంధించి విపత్తు నిర్వహణ (disaster management) అంశాలను ఎలా చదవాలి?

- కె.బాలకృష్ణ, అచ్చంపేట.

- సాధారణ మానవ కార్యకలాపాలకు అంతరాయం కలిగిస్తూ.. అకస్మాత్తుగా, తీవ్రంగా సంభవించే ఆపదను విపత్తుగా నిర్వచించవచ్చు. 2005 విపత్తు నిర్వహణ చట్టం ప్రకారం ఏదైనా ఒక ప్రాంతంలో ప్రకృతి సిద్ధంగా లేదా మానవ కార్యకలాపాల వల్ల లేదంటే ప్రమాదవశాత్తు సంభవించి.. ఆ ప్రాంతం కోలుకోలేని విధంగా పెద్దఎత్తున ప్రాణ, ఆస్తి నష్టంతోపాటు పర్యావరణ విధ్వంసానికి కారణమయ్యే ఉపద్రవాన్ని కూడా విపత్తుగా నిర్వచించొచ్చు. విపత్తుకు సంబంధించి ఇలాంటి నిర్వచనాలపై దృష్టి సారించాలి. వివిధ రకాల (భూకంపాలు, సునామీలు, కరవులు తదితర) విపత్తులను అధ్యయనం చేయాలి. దేశంలోని విపత్తు నిర్వహణ వ్యవస్థపై అవగాహన పెంపొందించుకోవాలి.
- విపత్తు నిర్వహణ చట్టం-2005లోని ముఖ్యాంశాలను తప్పనిసరిగా అధ్యయనం చేయాలి. ప్రధాన మంత్రి అధ్యక్షతన 2005, మే 30న జాతీయ విపత్తు నిర్వహణ ప్రాధికార సంస్థను మొదట ఏర్పాటు చేశారు. ఈ సంస్థ చేపడుతున్న విపత్తు కార్యక్రమాలను తెలుసుకోవాలి. అదేవిధంగా విపత్తులను ఎదుర్కొనేందుకు బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ (బీఎస్ఎఫ్), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్‌పీఎఫ్), సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సీఐఎస్ఎఫ్), ఇండో- టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ), సశస్త్ర సీమాబల్ (ఎస్ఎస్‌బీ) నుంచి జాతీయ విపత్తు ప్రతిస్పందన దళాన్ని (ఎన్‌డీఆర్ఎఫ్) ఏర్పాటు చేశారు. విపత్తు నిర్వహణ చట్టం-2005లోని సెక్షన్ 44 కింద ఏర్పాటు చేసిన ఈ దళాలు 2006 నుంచి విధులు నిర్వర్తిస్తున్నాయి. అభ్యర్థులు ఎన్‌డీఆర్ఎఫ్ బెటాలియన్లు- అవి ఉన్న ప్రాంతాలను తెలుసుకోవాలి. రాష్ట్ర, జిల్లా స్థాయి విపత్తు నిర్వహణ యంత్రాంగంపై అవగాహన పెంపొందించుకోవాలి. భూకంప మండలాలు, విపత్తులు-ఉపశమన చర్యలు, విపత్తులకు కారణాలు-పర్యవసానాలు, నష్టనివారణ చర్యలపై అవగాహన పెంపొందించుకోవాలి. పాత ప్రశ్నపత్రాలను పరిశీలించడం ద్వారా ఈ విభాగం నుంచి ఎలాంటి ప్రశ్నలు వస్తున్నాయో తెలుసుకోవచ్చు.

ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలు, http://www.ndma.gov.in/en/లను ప్రిపరేషన్‌కు ఉపయోగించుకోవచ్చు.



విపత్తు నిర్వహణ అంశాలు



- జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి దేని సూచనల మేరకు ఏర్పడింది? – 11వ ఆర్థిక సంఘం
- ఇండియాలో విపత్తు నిర్వహణ చట్టం రూపొందించిన సంవత్సరం? – 2005
- మొదటి విపత్తు నిర్వహణ కాంగ్రెస్ ఎప్పుడు జరిగింది? – నవంబర్ 29-30, 2006.
- నేషనల్ సివిల్ డిఫెన్స్ కాలేజ్ ఎక్కడ ఉంది? – నాగ్‌పూర్
- 'సిదర్' అనే తుపాన్ ఏ దేశాన్ని తాకింది? – బంగ్లాదేశ్
- అమెచ్యూర్ రేడియోకి మరో పేరు? – హామ్ రేడియో
- అంతర్జాతీయ సునామీ హెచ్చరిక కేంద్రం ఎక్కడ ఉంది? – హొనోలులు
- 'సునామీ' అనే పదం ఏ భాష నుంచి వచ్చింది? – జపనీస్
- ఏ మంత్రిత్వ శాఖ విపత్తు కార్యకలాపాలను నిర్వహిస్తుంది? – హోం మంత్రిత్వ శాఖ
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ ఎక్కడ ఉంది? – న్యూఢిల్లీ
- 1945, ఆగస్టు 9న ఫ్యాట్‌మాన్ అనే అణ్వాయుధాన్ని ఏ నగరం మీద ప్రయోగించారు? – నాగసాకి
- W.H.O. నివేదిక ప్రకారం ఏ వాయువు అధికంగా వాతావరణ కాలుష్యానికి కారణమవుతోంది? – కార్బన్ మోనాక్సైడ్
- భారతదేశంలో అతి పెద్ద గని విపత్తు జరిగిన సంవత్సరం? –1975, డిసెంబర్ 27 (ధన్‌బాద్‌కు సమీపంలో)
- భారత పార్లమెంటుపై తీవ్రవాద దాడి జరిగిన సంవత్సరం? – 2001, డిసెంబర్ 13
- తమిళనాడులోని కుంభకోణం పాఠశాలలో విద్యార్థుల మరణానికి కారణమైన విపత్తు? – అగ్ని ప్రమాదం
- భోపాల్ గ్యాస్ దుర్ఘటన వల్ల విడుదలైన విష వాయువు? – మిథైల్ ఐసోసైనేట్
- చెర్నోబిల్ దుర్ఘటన జరిగిన దేశం? – ఉక్రెయిన్
- భూపాతాల విపత్తులకు సంబంధించి నోడల్ ఏజెన్సీగా వ్యవహరించే మంత్రిత్వ శాఖ? – గనుల మంత్రిత్వ శాఖ

కాంపిటీటివ్ గైడెన్స్

డిజాస్టర్ మేనేజ్‌మెంట్

- అంతర్జాతీయ జల వనరుల దశాబ్దం? – 2005-2015
- అత్యధిక తీవ్రమైన కరువుగా పేర్కొనదగినది? – జల సంబంధ కరువు
- 2009, అక్టోబర్‌లో ఏ నదికి ఆకస్మిక వరదలు వచ్చాయి? – కృష్ణానది
- 2015లో తుపాన్, వరదల వల్ల చెన్నై నగరంలో ఎంతమంది మరణించారు? – 347
- నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఓషన్ టెక్నాలజీ (ఎన్ఐవోటీ) ఎక్కడ ఉంది? – చెన్నై
- 2014, అక్టోబర్‌లో రూ.10,000 కోట్ల నష్టాన్ని కలిగించిన తుపాన్? – హుద్-హుద్
- లైలా తుపాన్ సంభవించిన సంవత్సరం? – 2010, మే
- తొలిసారి సైక్లోన్ అనే పదాన్ని ఉపయోగించింది? – హెన్రీ పిడింగ్‌టన్
- 2016, ఆగస్టు 28 నుంచి సెప్టెంబర్ 1 వరకు అంతర్జాతీయ డిజాస్టర్, రిస్క్ కాన్ఫరెన్స్‌ను ఏ నగరంలో నిర్వహించారు? – దావోస్
- జాతీయ విపత్తుల తగ్గింపు దినోత్సవం? – అక్టోబర్ 29

కె. వెంకటరెడ్డి,
సీనియర్ ఫ్యాకల్టీ

Explain different types of Biofuels?

What are Bio Fuels? Explain about first, second, third and fourth generation biofuels?
OR
Explain different types of Biofuels?

Biofuel is any fuel derived from biological material such as trees, agricultural wastes, crops, grass, charcoal and animal dung. Biofuel can be produced from any carbon source that can be replenished rapidly, such as plants. Biofuels can be solid, gaseous or liquid.

Biofuels can be classified into four types

1. First Generation biofuels
2. Second Generation biofuels
3. Third Generation of biofuels
4. Fourth Generation Biofuels

First Generation Biofuels

Biofuels which are produced directly from food crops are called First Generation Biofuels. First generation biofuels are also called conventional biofuels. Food crops like soyabeen, sunflower, maize, sugarcane, suger beat, wheat.. etc are used to make biofuel. Food crops are thus explicitly grown for fuel production. Crops such as wheat and sugar are the most widely used feedstock for bio ethanol while oil seed rape has proved a very effective crop for use in biodiesel. The disadvantage in first generation biofuels is use of food crops for fuel production may create shortage of food grains and price hike of food items.

Second Generation biofuels: They are produced from non-food crops such as wood, organic waste, food crop waste and specific biomass crops. Second generation biofuels are made from lignocellulosic biomass or woody crops, agricultural residues or waste plant material (from food crops). This has both advantages and disadvantages. The advantage is that, unlike with regular food crops, no arable land is used solely for the production of fuel. The disadvantage is that unlike with regular food crops, it may be rather difficult to extract the fuel. Ex. Jatropha, Pongamia..

Third Generation Biofuels

Biofuels produced from micro algae are called Third generation biofuels. Microalgae are single-cell microscopic organisms which are naturally found in fresh water and marine environment. Algae is used for biofuel production due to their high lipid contents, ease of cultivation and rapid growth rate. The algae are cultured to act as a low-cost, high-energy and entirely renewable feedstock. It is predicted that algae will have the potential to produce more energy per acre than conventional crops.



కాంపిటీటివ్ గైడెన్స్
సైన్స్ అండ్ టెక్నాలజీ

A minor drawback regarding algae is that biofuel produced from them tends to be less stable than biodiesel produced from other sources. This is because the oil found in algae tends to be highly unsaturated. Unsaturated oils are more volatile, particularly at high temperatures, and thus more prone to degradation.

Fourth Generation Biofuels:

In Fourth generation biofuels also algae is used. But genetically modified algae is used to capture more CO_2 from the atmosphere resulting in a carbon neutral fuel thus making it more ecofriendly.

What are the advantages and disadvantages of Biofuels ?

Advantages:

- Biofuels are made from renewable resources and biological, agricultural wastes.
- They help reduce carbon emissions into the atmosphere thus helping to save the environment.
- Biofuels tend to be very cost effective, especially in the form of bio diesel.
- Help to preserve the current stores of fossil fuels, which are being slowly used up.
- Biofuels are alternative sources to fossil fuels - allowing for greater fuel security for countries with little or no oil reserves of their own.
- May not produce any particulates, such as soot and other fine particles.
- Produce less greenhouse gases overall than fossil fuels when they are burned.
- Significantly less harmful carbon emission compared to standard diesel.
- Relatively less flammable compared to fossil diesel.
- Significantly better lubricating properties.

Disadvantages:

- Biofuels are more expensive than fossil diesel fuel.
- Mainly produced from edible oil, which could cause shortages of food supply and increased prices.
- Biofuels are less suitable for use in low temperatures.
- It can only be used in diesel powered engines.
- Causes increases in NOx.

Praveen Dathu Rajala
Asst.Professor.
Dr. L.H.R. Government Degree College, Mylavaram



ఐఐఎంలు.. పరిచయం అక్కర్లేని, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మేనేజ్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్‌లు. కానీ.. అవి ఇచ్చే సర్టిఫికెట్లకు మాత్రం అంతర్జాతీయ గుర్తింపు విషయంలో ఒక్కో దేశంలో ఒక్కో నిర్ణయం. ఇన్‌స్టిట్యూట్స్‌లో పరిపాలనపరంగానూ పలు అడ్డంకులు. ఒక అసిస్టెంట్ ప్రొఫెసర్‌ను నియమించుకోవాలన్నా ఎన్నో నిబంధనలు. ఇలాంటి పరిస్థితికి ఫుల్‌స్టాప్ పెట్టే దిశగా ఐఐఎంలకు స్వతంత్ర ప్రతిపత్తి కల్పిస్తూ తెచ్చిన ఐఐఎం బిల్లు-2017కు ఇటీవల లోక్‌సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లుతో ఇన్‌స్టిట్యూట్‌లకు, విద్యార్థులకు కలగనున్న ప్రయోజనాలపై విశ్లేషణ..

ఐఐఎం విద్యార్థులకు.. ఎంబీఏ 'పట్టా'!

❒ ఐఐఎం బిల్లు-2017తో స్వయం ప్రతిపత్తి



ఇక ఎంబీఏ, పీహెచ్‌డీ పట్టాలు

ఇప్పటివరకు ఐఐఎంలు తాము అందిస్తున్న కోర్సులను పీజీ డిప్లొమా లేదా, ఎగ్జిక్యూటివ్ డిప్లొమా పేరుతో సర్టిఫికెట్లను జారీ చేస్తున్నాయి. వీటికి మార్కెట్‌పరంగా, ఉన్నత విద్య కోర్సుల్లో చేరడం విషయంలోనూ పలు దేశాల్లో మాస్టర్ స్థాయి గుర్తింపు లభించడం లేదు. పీహెచ్‌డీకి సమానమైనదని పేర్కొనే ఫెలో ప్రోగ్రామ్ ఇన్ మేనేజ్‌మెంట్ (ఎఫ్‌పీఎం)ను సైతం పలు విదేశీ వర్సిటీలు పీహెచ్‌డీగా పరిగణించేందుకు సంకోచిస్తున్నాయి. ఇలాంటి పరిస్థితిలో.. ఐఐఎం బిల్లు-2017 అమలు ద్వారా ఐఐఎంలకు డిప్లొమాలకు బదులు డిగ్రీలు మంజూరు చేసే అవకాశం లభిస్తుంది. ఐఐఎంలు పీజీడీఎం, ఫెలో ప్రోగ్రామ్స్‌కు బదులు ఎంబీఏ, పీహెచ్‌డీలు ప్రదానం చేసే వీలు కలుగుతుంది.

డైరెక్టర్ నియామకం

తాజా బిల్లు ద్వారా కొత్త డైరెక్టర్‌ను నియమించుకోవడంలో ఐఐఎంలులోని బోర్డ్ ఆఫ్ గవర్నర్స్‌కు స్వీయ అధికారాలు కల్పిస్తారు. ఇప్పటివరకు ఈ విషయంలో హెచ్‌ఆర్‌డీ శాఖ ఆమోదం తీసుకోవాల్సి వచ్చేది. దీనివల్ల ఏళ్ల తరబడి డైరెక్టర్లు లేకుండానే ఇన్‌స్టిట్యూట్స్ నడవాల్సిన పరిస్థితి నెలకొంది. స్వయంప్రతిపత్తి కల్పించడం వల్ల ఒక డైరెక్టర్ పదవీ కాలం పూర్తవగానే కొత్త డైరెక్టర్‌ను నియమించుకునే వీలు కలుగుతుంది.



ఫ్యాకల్టీ కొరతకూ పరిష్కారం

ఐఐఎం-బిల్లు 2017లో ఫ్యాకల్టీ నియామకాల్లోనూ ఇన్‌స్టిట్యూట్‌లకు స్వయంప్రతిపత్తి ప్రతిపాదించారు. దీనివల్ల ప్రభుత్వ అనుమతి కోసం వేచి చూడాల్సిన అవసరం ఉండదు. ఫలితంగా ఐఐఎంలలో ఫ్యాకల్టీ కొరత సమస్యకు పరిష్కారం దొరకనుంది. విజిటింగ్ ఫ్యాకల్టీ, ఇంటర్నేషనల్ ఫ్యాకల్టీని ఆహ్వానించే విషయంలోనూ ఐఐఎంలకు స్వేచ్ఛ లభించనుంది.

కోఆర్డినేషన్ ఫోరమ్

బిల్లు ప్రకారం అన్ని ఐఐఎంలకు కలిపి ఒక కోఆర్డినేషన్ ఫోరమ్ ఏర్పాటు కానుంది. దీనికి అన్ని ఇన్‌స్టిట్యూట్‌ల బీఓజీ చైర్ పర్సన్స్ ప్రాతినిధ్యం వహిస్తారు. వారిలోంచి ఒకరిని కోఆర్డినేషన్ ఫోరమ్ చైర్ పర్సన్‌గా ఎంపిక చేస్తారు. చైర్ పర్సన్ రెండేళ్లపాటు ఆ పదవిలో కొనసాగుతారు. తద్వారా ప్రస్తుతం పలు అంశాలపరంగా ఒక్కో ఐఐఎంలో ఒక్కో తీరుగా అమలవుతున్న విధానాలకు తెరపడి.. కామన్ పాలసీ రూపొందే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా ప్రవేశ ప్రక్రియల్లో ఈ ఉమ్మడి విధానం వల్ల విద్యార్థులకు వ్యయప్రయాసల నుంచి ఉపశమనం లభిస్తుంది.

ఇతర ప్రాంతాల్లో... విదేశాల్లో సైతం

ప్రస్తుత నిబంధనల ప్రకారం ఐఐఎంలు.. అవి నెలకొన్న ప్రాంతంలోనే అకడమిక్ తరగతులను నిర్వహించే వీలుంది. ఐఐఎం-బిల్లు 2017 ద్వారా కేంద్ర ప్రభుత్వ అనుమతితో ఇతర ప్రాంతాల్లోనూ లెర్నింగ్ సెంటర్స్ ఏర్పాటు చేసుకోవచ్చు. కేంద్ర ప్రభుత్వ అనుమతితో విదేశాల్లో సైతం స్టడీ సెంటర్లను నెలకొల్పవచ్చు. ఈ సెంటర్లతో గ్లోబల్ ర్యాంకింగ్స్ పరంగా కీలక పారామీటర్‌గా ఉన్న ఇంటర్నేషనల్ స్టూడెంట్స్ రేషియో విషయంలో ముందంజలో ఉండొచ్చు. సెంటర్ ఏర్పాటు చేసిన విదేశీ యూనివర్సిటీతో ఒప్పందం ద్వారా కొలాబరేటివ్ రీసెర్చ్ కార్యకలాపాలు నిర్వహించే అవకాశం కూడా లభిస్తుంది. ఇది కూడా గ్లోబల్ ర్యాంకింగ్స్ పరంగా పోటీ పడేందుకు, ముందు నిలిచేందుకు ఆస్కారం కల్పిస్తుంది.

రీసెర్చ్‌కు ప్రాధాన్యం

బిల్లులో మరో ప్రధానాంశం.. ఐఐఎంలు స్వయంగా రీసెర్చ్ యాక్టివిటీస్ దిశగా స్వతంత్రంగా వ్యవహరించడం. రీసెర్చ్‌కు అవసరమైన నిధుల సమీకరణ, ఎక్స్ఛేంజ్ ఒప్పందాలు, స్పాన్సర్డ్ రీసెర్చ్ కార్యకలాపాలు వంటివాటి విషయంలో సదరు ఐఐఎం గవర్నింగ్ కౌన్సిల్‌కే పూర్తి నిర్ణయాధికారాలు ఉంటాయి. ఈ ప్రతిపాదన విద్యార్థులకు రీసెర్చ్ యాక్టివిటీస్ పరంగా విద్యార్థులకు మేలు చేస్తుందని భావిస్తున్నారు.

వైవిధ్యానికి ప్రాధాన్యం

బిల్లులో మరో కీలకాంశం వైవిధ్యం (డైవర్సిటీ)కు ప్రాధాన్యం ఇవ్వడం. రిజర్వేషన్లు, జండర్ డైవర్సిటీ ద్వారా అన్ని వర్గాలకు ఐఐఎంలు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టే వీలు కల్పిస్తోంది బిల్లు.
ఐఐఎంలు దేశవ్యాప్తంగా విస్తరించినా కొందరికే అవకాశం లభిస్తోంది. ఇలాకాకుండా ఫ్యాకల్టీ నియామకాల్లోనూ డైవర్సిటీని పాటించనున్నారు. దాంతోపాటు ఐఐఎంలలో ప్రవేశానికి నిర్వహించే క్యాట్ స్వరూపం అన్ని అకడమిక్ నేపథ్యాలవారికి అనుకూలంగా ఉండేలా చూడాలనేది కొత్త బిల్లులోని మరో ముఖ్యాంశం. ఫలితంగా ఇంజనీరింగ్, మ్యాథమెటిక్స్ నేపథ్యం ఉన్నవారికే క్యాట్ అనుకూలం, మిగతా వారికి అవకాశాలు స్వల్పం అనే అభిప్రాయాలకు స్వస్తి పలికే చర్యలు చేపట్టే వీలు కలుగుతుంది.

ముఖ్యాంశాలు

- మాస్టర్స్ డిగ్రీ ప్రదానం చేసే అధికారం
- ఫ్యాకల్టీ, డైరెక్టర్ల నియామకంలో స్వేచ్ఛ
- కొలాబరేటివ్ రీసెర్చ్ విషయంలో స్వతంత్రత
- డొమెస్టిక్, ఇంటర్నేషనల్ సెంటర్స్ ఏర్పాటు
- అడ్మిషన్ ప్రక్రియలో లెవల్ ప్లేయింగ్ ఫీల్డ్‌కు ఆస్కారం ఇచ్చేలా చర్యలు
- ఐఐఎం కోఆర్డినేషన్ ఫోరం ఏర్పాటు - ఫలితంగా అన్ని ఐఐఎంలలో ఒకే తరహా విధానాలు అమలయ్యే అవకాశం

ప్రైవేటు బి-స్కూల్స్‌కు స్వయంప్రతిపత్తి!

దేశంలో ప్రముఖ ప్రయివేట్ బి-స్కూల్స్‌కు కూడా స్వయంప్రతిపత్తి హోదా ఇచ్చే దిశగా ప్రభుత్వం ప్రయత్నాలు ప్రారంభించింది. ఈ విషయంపై అధ్యయనానికి ఇప్పటికే అఖిల భారత సాంకేతిక విద్యా మండలి (ఏఐసీటీఈ) ఒక కమిటీని నియమించింది. ఐఐఎంలకు దీటుగా రాణిస్తూ ప్రపంచ స్థాయిలో పేరుపొందిన ప్రైవేటు ఇన్‌స్టిట్యూట్‌లు.. ప్రభుత్వ నియంత్రణ సంస్థల కారణంగా కార్యకలాపాలు, అకడమిక్స్ నిర్వహణలో ఇబ్బందులకు గురి కాకూడదనే ప్రైవేటు బి-స్కూల్స్‌కు అటానమస్ హోదా ఇచ్చే దిశగా హెచ్‌ఆర్‌డీ యోచిస్తున్నట్లు సమాచారం.

అటానమస్ హోదాతో ప్రయోజనం

ఐఐఎంలకు స్వయంప్రతిపత్తి హోదా కల్పించడం వల్ల అటు విద్యార్థులు, ఇటు ఇన్‌స్టిట్యూట్‌లకు ప్రయోజనం కలుగుతుంది. విద్యార్థులకు గ్లోబల్ ఎక్స్‌పోజర్ లభిస్తుంది. ఇన్‌స్టిట్యూట్‌లు కూడా ఎక్స్ఛేంజ్ ప్రోగ్రామ్స్ నిర్వహణ, కొలాబరేటివ్ రీసెర్చ్ పరంగా స్వతంత్రంగా వ్యవహరించే వీలు కలుగుతుంది.

– **ప్రొఫెసర్.దినేశ్ కుమార్**, ఐఐఎం-బెంగళూరు

ఎంబీఏ స్పెషల్

దేశంలోని పేరొందిన బిజినెస్ స్కూళ్లలో ఒకటి..
మిగతా ప్రముఖ కాలేజీలకు పూర్తి భిన్నం..
అత్యున్నత ప్రమాణాలతో ఇంటర్నేషనల్ బిజినెస్ కోర్సు..
నేటి వ్యాపార అవసరాలకు అనుగుణంగా మేనేజ్‌మెంట్ టెక్నిక్స్..

ఇవీ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫారెన్ ట్రేడ్ (ఐఐఎఫ్‌టీ) విశిష్టతలు...! అంతర్జాతీయ వాణిజ్య సమస్యలు అర్థం చేసుకుని పరిష్కార మార్గాలను కనుగొనడం.. ఇంటర్నేషనల్ బిజినెస్ మేనేజ్‌మెంట్ అండ్ స్ట్రాటజీలో నిపుణులను అందించడమే ధ్యేయంగా కేంద్ర వాణిజ్య, పరిశ్రమల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటైంది ఐఐఎఫ్‌టీ. 2018 -2020 విద్యా సంవత్సరానికి ఐఐఎఫ్‌టీలో ప్రవేశాలకు నోటిఫికేషన్ విడుదలైన నేపథ్యంలో వివరాలు..

ఐఐఎఫ్‌టీ ఫ్యాక్ట్స్

- **74** ఈ ఏడాది ఢిల్లీ, కోల్‌కతా క్యాంపస్‌లలో ప్రి ప్లేస్‌మెంట్స్ ఆఫర్లు
- **03** రూ.కోటిపైగా వార్షిక వేతన ప్యాకేజీకి ఎంపికైనవారు
- **06** రూ.75 లక్షలపైగా ప్యాకేజీ అందుకున్నవారు.
- **రూ.18.41 లక్షలు** సగటు దేశీయ వార్షిక ప్యాకేజీ
- **రూ.26 లక్షలు** అత్యధిక దేశీయ ప్యాకేజీ
- **20** వచ్చిన ఇంటర్నేషనల్ రోల్స్ ఆఫర్లు
- **94** ప్లేస్‌మెంట్ డ్రైవ్స్ నిర్వహించిన కంపెనీలు

ఐఐఎఫ్‌టీ 2017

- **కోర్సు:** ఎంబీఏ (ఇంటర్నేషనల్ బిజినెస్)
- **సీట్లు:** ఢిల్లీ, కోల్‌కతా క్యాంపస్‌లలో ఇంటర్నేషనల్ బిజినెస్ స్పెషలైజేషన్‌తో ఎంబీఏ కోర్సును ఆఫర్ చేస్తోంది. ఢిల్లీ క్యాంపస్‌లో 220, కోల్‌కతా క్యాంపస్‌లో 140 సీట్లున్నాయి.
- **అర్హత:** గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి డిగ్రీ. ఫైనలియర్ చదువుతున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. వీరు 2018 అక్టోబర్ 8 నాటికి డిగ్రీ ఉత్తీర్ణతను ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుకు వయోపరిమితి లేదు.
- **ఎంపిక ప్రక్రియ:** రాత పరీక్ష, గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూ అండ్ రైటింగ్ స్కిల్ అసెస్‌మెంట్ ద్వారా.
- **పరీక్ష విధానం:** రెండు గంటల వ్యవధిలో నిర్వహించే ఈ పరీక్ష పూర్తిగా మల్టిపుల్ చాయిస్ విధానంలో ఉంటుంది. ఇంగ్లిష్ కాంప్రెహెన్షన్, వొకాబులరీ, గ్రామర్, జనరల్ నాలెడ్జ్ అండ్ కరెంట్ అఫైర్స్, లాజికల్ రీజనింగ్, డేటా క్వాంటిటేటివ్ అనాలిసిస్ నుంచి ప్రశ్నలు వస్తాయి. ప్రశ్నపత్రం ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది. మొత్తమ్మీద ఈ విభాగాలను 4 సెక్షన్లుగా చెప్పుకోవచ్చు. అవి..

విభాగం	ప్రశ్నలు	అంశం
సెక్షన్ 1	20	క్వాంటిటేటివ్ ఎబిలిటీ
సెక్షన్ 2	పార్ట్ 1: 22	లాజికల్ రీజనింగ్
	పార్ట్ 2: 20	డేటా ఇంటర్‌ప్రిటేషన్
సెక్షన్ 3	పార్ట్ 1: 16	రీడింగ్ కాంప్రహెన్షన్
	పార్ట్ 2: 20	వెర్బల్ ఎబిలిటీ
సెక్షన్ 4	25	జనరల్ అవేర్‌నెస్

(మొత్తం 123 ప్రశ్నలు. 100 మార్కులు. ఏటా ప్రశ్నల సంఖ్యలో మార్పులు కనిపిస్తుంటాయి. రుణాత్మక మార్కులు ఉంటాయి.)

ఇంటర్వ్యూ/గ్రూప్ డిస్కషన్

రాత పరీక్షలో సాధించిన మార్కుల ఆధారంగా అభ్యర్థులకు అహ్మదాబాద్, బెంగళూరు, చెన్నై, ఢిల్లీ, హైదరాబాద్, కోల్‌కతా, లక్నో, ముంబైల్లో గ్రూప్ డిస్కషన్, ఇంటర్వ్యూలు నిర్వహిస్తారు.

కోర్సు వివరాలు

ప్రధానంగా అంతర్జాతీయ వ్యాపారం, అనుబంధ అంశాలపై ఫోకస్ చేస్తారు. అంతర్జాతీయ స్థాయిలో వాణిజ్య, వ్యాపార విభాగాల్లో దేశీయ అవసరాలకు అనుగుణంగా ఫారిన్ ట్రేడ్‌కు సంబంధించి సమగ్ర అవగాహన కల్పిస్తారు.

డీమ్డ్ యూనివర్సిటీ



1963లో ఏర్పాటైన ఐఐఎఫ్‌టీ అప్‌డేట్ అవుతూ అంతర్జాతీయ గుర్తింపు పొందింది. నాక్ 'ఎ' గ్రేడ్ గుర్తింపుతో పాటు 2002లో డీమ్డ్ యూనివర్సిటీ హోదా పొందింది. ఇంటర్నేషనల్ ట్రేడ్‌కు సంబంధించి కార్పొరేట్ విభాగాలు, ప్రభుత్వ సంస్థలతో పాటు వ్యక్తిగత స్థాయిలోనూ శిక్షణ, పరిశోధన అవకాశాలను కల్పిస్తోంది. బోధన, పరిశోధనలతో పాటు విదేశీ విశ్వవిద్యాలయాలతో సంయుక్తంగా అభ్యర్థులకు పూర్తిస్థాయి బిజినెస్ నాలెడ్జ్ అందిస్తోంది. అంతర్జాతీయ విద్యా సంస్థలతో అవగాహన ఒప్పందాలు కలిగి ఉంది. తాజాగా ఎంహెచ్‌ఆర్‌డీకి చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూషనల్ ర్యాంకింగ్ ఫ్రేమ్‌వర్క్ ర్యాంకింగ్స్‌లో మేనేజ్‌మెంట్ కేటగిరీలో 30వ ర్యాంకులో నిలిచింది.

ప్లేస్‌మెంట్స్

ఇన్‌స్టిట్యూట్‌లోని ప్లేస్‌మెంట్ సెల్.. కోర్సు పూర్తిచేసిన అభ్యర్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో అవకాశాలను అందిస్తోంది. పేరొందిన అన్ని కార్పొరేట్, ఆర్థిక, సర్వీస్ సెక్టార్ సంస్థలు ప్లేస్‌మెంట్స్ కోసం ఐఐఎఫ్‌టీకి వస్తున్నాయి. వీటిలో గోల్డ్‌మన్ శాక్స్, అమెజాన్, యాక్సిస్ బ్యాంక్, సిటీ బ్యాంకు, కాగ్నిజెంట్ బిజినెస్ కన్సల్టింగ్, తదితర ఎన్నో ప్రముఖ కంపెనీలు ఉన్నాయి.

ముఖ్య తేదీలు

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** సెప్టెంబర్ 15
- **దరఖాస్తు ఫీజు:** రూ.1,550 (ఎస్సీ, ఎస్టీ, **పీడబ్ల్యూడీ అభ్యర్థులకు:** రూ.775)
- **ప్రవేశ పరీక్ష:** 2017 డిసెంబర్ 3
- **వెబ్‌సైట్:** http://tedu.iift.ac.in/iift

క్యాట్ స్థాయిలో ప్రిపరేషన్

ఐఐఎఫ్‌టీ ఎంట్రన్స్‌లో ఒక్కో విభాగానికి వేర్వేరుగా మార్కులు ఉంటాయి. లాజికల్ రీజనింగ్, వెర్బల్ ఎబిలిటీల్లో ఒక్కో విభాగానికి 0.75 మార్కుల చొప్పున, జనరల్ అవేర్‌నెస్‌లోని ప్రశ్నలకు అర మార్కు, మిగతా సెక్షన్లలోని ప్రశ్నలకు ఒక మార్కు కేటాయించారు. ప్రతి ప్రశ్నకు నాలుగు ఐచ్ఛికాలు ఇస్తారు. కేటాయించిన మార్కుల్లో మూడో వంతు రుణాత్మక మార్కులు.

- ప్రశ్నల క్లిష్టత దాదాపు క్యాట్ స్థాయిలో ఉంటుంది.
- క్యాట్ సిలబస్‌లో లేని జనరల్ అవేర్‌నెస్ విభాగం ఇందులో ఉంటుంది. ఈ సెక్షన్‌లో స్టాటిక్ జీకే బిట్స్, కరెంట్ అఫైర్స్ నుంచి ప్రశ్నలు అడుగుతారు.
- ప్రిపరేషన్‌లో భాగంగా న్యూస్ పేపర్లు చదవడం, నోట్స్ ప్రిపరేషన్ తప్పనిసరి. ఏదైనా కరెంట్ అఫైర్స్ మ్యాగజైన్ సేకరించుకుని చదివితే అన్ని టాపిక్స్‌కు ఒకేచోట ప్రిపరేషన్ లభిస్తుంది. జనరల్ అవేర్‌నెస్, జనరల్ నాలెడ్జ్‌లకు సంబంధించి సమకాలీనంగా ప్రాధాన్యం సంతరించుకున్న అంతర్జాతీయ అంశాలకు ప్రాధాన్యం ఇవ్వాలి.
- క్వాంటిటేటివ్ ఎబిలిటీ/ క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్‌కు జామెట్రీ, ఆల్జీబ్రా, నెంబర్స్, ప్రాబబిలిటీ తదితర అంశాలపై కాన్సెప్ట్ ఆధారిత ప్రిపరేషన్, వాటి ఆధారంగా సమస్యల సాధనను ప్రాక్టీస్ చేయాలి. టైమ్, స్పీడ్, డిస్టెన్స్, ప్రొగ్రెషన్, సెట్స్, ప్రాఫిట్ అండ్ లాస్, లాగ్స్ విభాగాల నుంచి ప్రశ్నలు ఎక్కువగా అడుగుతున్నట్టు గత ప్రశ్నపత్రాలను చూస్తే అర్థమవుతుంది. వీటికోసం ఏదైనా ప్రామాణిక పుస్తకం ఎంచుకొని ప్రిపరేషన్ సాగించాలి. బేసిక్స్ తర్వాత సాధ్యమైనన్ని ప్రాక్టీస్ బిట్స్, సెక్షన్ వైజ్ మాక్ టెస్టులు రాయడం లాభిస్తుంది.
- అభ్యర్థుల విశ్లేషణ, గణన (కంప్యూటేషన్) నైపుణ్యాలను పరీక్షించే డేటా ఇంటర్‌ప్రిటేషన్‌కు ఫ్లో చార్టులు, డయాగ్రమ్ ఆధారిత ప్రాబ్లమ్స్‌ను ప్రాక్టీస్ చేయాలి. హై లెవల్ క్వాంటిటేటివ్ బుక్ ఎంపిక అవసరం.
- లాజికల్ రీజనింగ్‌లో రాణించేందుకు స్టేట్‌మెంట్స్, పజిల్స్ సాధన ఉపకరిస్తుంది. వెన్ డయాగ్రమ్స్, డిడక్షన్, సిలాయిజమ్; అల్ఫాబెటిక్ సిరీస్, రాంగ్ నంబర్ సిరీస్, మిస్సింగ్ నంబర్‌పై పట్టు సాధించాలి.
- వెర్బల్ ఎబిలిటీ కోసం విశ్లేషణాత్మక అభ్యసన నైపుణ్యం అవసరం. బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌తో పాటు వొకాబులరీ నేర్చుకోవాలి. దీంతోపాటు పద వినియోగం, వాక్య నిర్మాణ శైలిపై ప్రాక్టీస్ చేయాలి. ఈ విభాగం నుంచి సెంటెన్స్ కంప్లీషన్, వొకాబులరీ బేస్, సెంటెన్స్ రీఅరేంజ్‌మెంట్ విభాగాలు అత్యంత కీలకం. వీటి నుంచే ఎక్కువగా ప్రశ్నలు వస్తున్నాయి.
- ఎక్కువ మార్కులు సాధించే కీలక సెక్షన్ రీడింగ్ కాంప్రెహెన్షన్. ఇందులోభాగంగా ఎకానమీ, బిజినెస్ - ఎకానమీ, ఉమెన్స్ రోల్ ఇన్ ఎకానమీ, టెక్నాలజీ అండ్ ఇన్నోవేషన్స్ టాపిక్స్ మీద ప్యాసేజీలు ఉంటున్నాయి. దీనికోసం ఒక అంశాన్ని విశ్లేషణాత్మకంగా చదవడం, అందులోని ముఖ్య సమాచారాన్ని గ్రహించి, సారాంశాన్ని రూపొందించుకునే నైపుణ్యం ఉండాలి. ఇంగ్లిష్ దిన పత్రికల్లోని వ్యాసాలు, ఎడిటోరియల్స్ చదవడం ఉపకరిస్తుంది. వొకాబులరీని పెంచుకుంటే వెర్బల్ ఎబిలిటీ సెక్షన్‌కు కూడా సన్నద్ధత లభిస్తుంది. ఇంగ్లిష్ బేసిక్ గ్రామర్‌పై పట్టు సాధించడంతో పాటు, రోజూ కొత్త పదాలు నేర్చుకోవడం వాటిని వినియోగించే తీరుపై ప్రాక్టీస్ చేయాలి.

బులెటిన్ బోర్డ్

జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ ప్రవేశాలు



తెలంగాణలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు నర్సింగ్ కళాశాలల్లో 2017-18కు గాను జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తూ తెలంగాణకు చెందిన డైరెక్టరేట్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ ప్రకటన వెలువరించింది. మొత్తం సీట్లలో 85శాతం తెలంగాణకు(లోకల్ కేటగిరీ), 15శాతం ఆంధ్రప్రదేశ్‌కు(నాన్ లోకల్) కేటాయించారు.
కోర్సుల పేరు: జనరల్ నర్సింగ్ అండ్ మిడ్‌వైఫరీ(జీఎన్‌ఎం)
వ్యవధి: మూడేళ్లు.
అర్హతలు: 40 శాతం మార్కులతో ఇంటర్మీడియెట్ లేదా తత్సమాన విద్యార్హత ఉత్తీర్ణులై ఉండాలి. సైన్స్ సబ్జెక్టులతో ఈ కోర్సులు పూర్తి చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంది.
వయోపరిమితి: 2017 జూలై 1 నాటికి 17-35 ఏళ్ల లోపు ఉండాలి. ఎస్సీ/ఎస్టీ/బీసీ అభ్యర్థులకు గరిష్ఠ వయోపరిమితిలో మూడేళ్ల సడలింపు ఉంటుంది.
రిజిస్ట్రేషన్ ఫీజు: రూ.200.
దరఖాస్తు విధానం: ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి. దానిని ప్రింటవుట్ తీసుకొని సంబంధిత ధ్రువపత్రాల నకళ్లు తదితర అవసరమైన వాటిని జతచేసి కవరులో ఉంచి జిల్లాస్థాయి సూపరింటెండెంట్ (హాస్పిటల్) చిరునామాకు గడువులోగా చేరేలా పంపాలి.
ఎంపిక విధానం: విద్యార్హతల మెరిట్ ఆధారంగా.
రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లింపునకు చివరి తేదీ: ఆగస్ట్ 24, 2017
ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేదీ: ఆగస్ట్ 28, 2017
దరఖాస్తు హార్డ్‌కాపీలు చేరడానికి చివరి తేదీ: సెప్టెంబర్ 4, 2017
వెబ్‌సైట్: www.dme.telangana.gov.in

ఏయూలో దూరవిద్య ప్రవేశాలు

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీ స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్.. వివిధ దూరవిద్య కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది.
కోర్సులు:
1. ఆర్నెల్ల సర్టిఫికెట్ కోర్సులు
2. డిప్లొమా కోర్సులు
3. గ్రాడ్యుయేట్ కోర్సులు(మూడేళ్ల వ్యవధి)
4. పోస్ట్ గ్రాడ్యుయేట్(పీజీ) కోర్సులు(రెండేళ్ల వ్యవధి)
5. ఏడాది పీజీ డిప్లొమా కోర్సులు
6. బీఈడీ/ఎంఏ అడిషనల్ మెథడాలజీ ఎడ్యుకేషన్

అర్హతలు: సంబంధిత కోర్సులను అనుసరించి ఇంటర్మీడియెట్/డిగ్రీ/పీజీ/బీఈడీ/ఎంఏ ఎడ్యుకేషన్.
దరఖాస్తు విధానం: ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: నవంబర్ 1, 2017
రూ.200 ఆలస్య రుసుముతో దరఖాస్తులు చేరడానికి చివరి తేదీ: నవంబర్ 30, 2017
దరఖాస్తులు పంపాల్సిన చిరునామా: డైరెక్టర్, స్కూల్ ఆఫ్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్, ఆంధ్ర యూనివర్సిటీ, విశాఖపట్నం.
పూర్తి వివరాలకు వెబ్‌సైట్: www.andhrauniversity.edu.in

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్	266 ▼	31,259
నిఫ్టీ	83 ▼	9,754

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

విదేశీ సూచీలు (తొలి రెండూ రాత్రి 11:30కి)

సూచీ	విలువ		మార్పు
నాస్‌డాక్	6,203	▼	14
డోజోన్స్	21,677	▲	2
ఎఫ్‌టీఎస్ఈ 100	7,319	▼	5
డాక్స్	12,066	▼	99
షాంఘై	3,287	▲	19
నికాయ్	19,393	▼	77

● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

	కరెన్సీ		● కొనుగోలు	● అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	63.27	64.95
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	81.14	83.95
€	యూరో	ఎస్‌బీఐ	74.03	76.64
¥	జపాన్ ఎన్ (100)	ఎస్‌బీఐ	57.68	59.72
AUS	ఆస్ట్రేలియా డాలర్	ఎస్‌బీఐ	49.83	51.80
SS	సింగపూర్ డాలర్	ఎస్‌బీఐ	46.27	47.85
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	15.50	18.37
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	15.86	18.59
¥	చైనా యువాన్	థామస్‌కుక్	6.79	11.03

మార్కెట్లోకి యమహా ఫేజర్ 25



ధర రూ. 1.28 లక్షలు

ముంబై: ఆటోమొబైల్ సంస్థ యమహా తాజాగా 250 సీసీ సామర్థ్యంతో ఫేజర్ 25 మోటార్‌సైకిల్‌ను భారత మార్కెట్లో ఆవిష్కరించింది. దీని ధర రూ. 1.28 లక్షలు (ముంబై ఎక్స్‌షోరూం రేటు). వచ్చే నెలలో ఇది పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానుంది. ఎఫ్‌జెడ్ 25 తర్వాత ఈ ఏడాది యమహా ఆవిష్కరించిన బైక్‌లలో ఇది రెండోది. గతేడాది 7.50 లక్షల ద్విచక్ర వాహనాలు విక్రయించిన ఇండియా యమహా మోటార్.. ఈ ఏడాది 15 శాతం వృద్ధితో తొమ్మిది లక్షల మోటార్ సైకిల్స్, స్కూటర్స్‌ను విక్రయించాలని నిర్దేశించుకున్నట్లు సంస్థ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ రాయ్ కురియన్ చెప్పారు. డీలర్‌షిప్ నెట్‌వర్క్‌ను మరో 100 అవుట్‌లెట్లు పెంచుకుని మొత్తం 700 అవుట్‌లెట్స్‌కు చేర్చాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఆయన వివరించారు.

మెర్సిడెస్ ఏఎంజీ జీటీ-ఆర్ @ 2.23 కోట్లు



సోమవారం న్యూఢిల్లీలో ఆటోమొబైల్ దిగ్గజం మెర్సిడెస్ బెంజ్ కొత్తగా వేగవంతమైన ఏఎంజీ జీటీ-ఆర్ కారును ఆవిష్కరించింది. దీని ధర రూ. 2.23 కోట్ల (ఎక్స్-షోరూం) నుంచి ఉంటుంది. అలాగే ఏఎంజీ జీటీ రోడ్‌స్టర్‌ను కూడా ప్రవేశపెట్టింది. దీని ధర రూ. 2.19 కోట్ల నుంచి ఉంటుంది. ఏఎంజీ జీటీ ఆర్ కేవలం 3.6 సెకన్లలో గంటకు 100 కి.మీ. వేగాన్ని అందుకోగలదు. గరిష్ట వేగం గంటకు 318 కి.మీ.

టాటా టియాగో ఆటోమేటెడ్ వెర్షన్

ధర రూ. 4.79 లక్షలు



న్యూఢిల్లీ: ఆటోమొబైల్ సంస్థ టాటా మోటార్స్ తాజాగా ఆటోమేటెడ్ మాన్యువల్ ట్రాన్స్‌మిషన్ టెక్నాలజీ (ఏఎంటీ)తో టియాగో కారును ప్రవేశపెట్టింది. టియాగో ఎక్స్‌టీఏ వేరియంట్ ధర రూ. 4.79 లక్షలుగా ఉంటుందని సంస్థ పేర్కొంది. భారీ ట్రాఫిక్‌లోనూ, పార్కింగ్ సమయంలోనూ ఏఎంటీ టెక్నాలజీ గల కారు నడపడానికి అనువుగా ఉంటుందని టాటా మోటార్స్ హెడ్ (మార్కెటింగ్ ప్యాసింజర్ వెహికల్ వ్యాపార విభాగం) వివేక్ శ్రీవత్స తెలిపారు. ప్రస్తుతం తమ హ్యాచ్‌బ్యాక్ కార్ల విభాగంలో టియాగో అమ్మకాల వాటా దాదాపు 83 శాతం దాకా ఉంటుందని వివరించారు. దాదాపు 1 లక్ష పైగా బుకింగ్స్ రాగా.. 65,000 కార్లను ఇప్పటిదాకా కస్టమర్లకు అందించామని పేర్కొన్నారు. తమ ప్యాసింజర్ వెహికల్ వ్యాపార విభాగం మళ్లీ కోలుకోవడానికి టియాగో తోడ్పడిందని వివేక్ వివరించారు.

రాస్‌నెఫ్ట్ చేతికి ఎస్సార్ ఆయిల్...

13 బిలియన్ డాలర్లకు సొంతం చేసుకున్న రష్యా కంపెనీ
- విక్రయ లావాదేవీ పూర్తి
- దేశంలోనే అతిపెద్ద ఎఫ్‌డీఐ డీల్
- దేశీయ బ్యాంకులకు ఊరట



విలేకరుల సమావేశంలో ప్రశాంత్ రుయా(మధ్య) తదితరులు

ముంబై: రుణభారంతో సతమతం అవుతున్న ఎస్సార్ గ్రూపు తన పరిధిలోని ఎస్సార్ ఆయిల్‌ను రష్యాకు చెందిన రాస్‌నెఫ్ట్‌కు విక్రయించింది. ఎస్సార్ ఆయిల్, దాని పరిధిలోని పోర్టు, విద్యుత్తు, రిటైల్ ఆస్తులను రాస్‌నెఫ్ట్‌తోపాటు ఇతర ఇన్వెస్టర్ల కన్సార్టియం 12.9 బిలియన్ డాలర్లు (రూ.82,500 కోట్లు) చెల్లించి సొంతం చేసుకున్నాయి. దేశంలోకి వచ్చిన అతిపెద్ద విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి ఇదే. వాస్తవానికి ఈ డీల్ గతేడాది అక్టోబర్ 15న గోవా బ్రిక్స్ సదస్సు సందర్భంగా సాకారం కాగా అదిప్పుడు పూర్తయింది. రాస్‌నెఫ్ట్ రష్యా ప్రభుత్వ సంస్థ. ప్రపంచంలోనే ఒకానొక అతిపెద్ద చమురు, సహజవాయువు సంస్థగా ఉంది. ఎస్సార్ ఆయిల్‌కు చెందిన గుజరాత్‌లోని 20 మిలియన్ టన్నుల వాదినార్ రిఫైనరీ, 58 మిలియన్ టన్నుల క్యాప్టివ్ పోర్ట్, 1,010 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్, 3,500 పెట్రోల్ బంక్‌లు రాస్‌నెఫ్ట్, దాని కూటమికి చెందుతాయి. మొత్తం మీద ఈ ఆస్తుల్లో రాస్‌నెఫ్ట్ ఒక్కటే 49.13 శాతం వాటా కలిగి ఉంటుంది. మిగిలిన 49 శాతం వాటా నెదర్లాండ్స్‌కు చెందిన ట్రాఫిగురా గ్రూపు, రష్యన్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్ యునైటెడ్ క్యాపిటల్ పార్ట్‌నర్స్ (యూసీపీ) దక్కించుకున్నాయి. ఎస్సార్ ఆయిల్‌లో డీల్‌కు ముందు ఎస్సార్ ఎనర్జీ హోల్డింగ్స్‌కు 98.26 శాతం, బిడ్కో మారిషస్‌కు మిగిలిన వాటా ఉంది. తాజా డీల్‌తో రుయాలు పూర్తిగా కంపెనీ నుంచి తప్పుకున్నారు. ప్రస్తుతం కంపెనీలో రాస్‌నెఫ్ట్, ట్రాఫిగురా-యూసీపీ కన్సార్టియం కాకుండా మైనారిటీ వాటాదారుల చేతిలో ఇంకా 1.75 శాతం వాటా ఉంటుంది. ఎస్సార్ ఆయిల్ డీలిస్టింగ్‌కు ముందు తమ షేర్లను విక్రయించని వారు వీరు. వీరి దగ్గరున్న వాటాలకు సెబీ బైబ్యాక్ నిబంధనల మేరకు చెల్లింపులు చేయనున్నట్టు కంపెనీ తెలిపింది. ఇక, ఎస్సార్ ఆయిల్‌ను విక్రయించిన తర్వాత కూడా చమురు రంగంలో రుయాల ప్రస్థానం కొనసాగనుంది. బ్రిటిష్ ఆస్తులు, ఓ ఆయిల్ రిఫైనరీ, కోల్‌బెడ్ మీథేన్ బ్లాక్‌లు వారి పరిధిలోనే ఉంటాయి.

బ్యాంకులకు దక్కేది రూ.4,000 కోట్లే

ఎస్సార్ ఆయిల్‌కు చెందిన 5 బిలియన్ డాలర్ల (రూ.35,000 కోట్లు) విలువైన రుణభారాన్ని సైతం ఒప్పందంలో భాగంగా రాస్‌నెఫ్ట్‌తోపాటు కొత్త యజమానులు స్వీకరించారు. రుణాలిచ్చిన ఎస్‌బీఐ, ఐసీఐసీఐ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, ఐడీబీఐ బ్యాంకు ఇతర రుణదాతలు తమ సమ్మతి తెలిపారు. దీంతో ఈ సంస్థలకు ప్రస్తుతానికి రూ.4,000 కోట్ల మేరే ఎస్సార్ గ్రూపు నుంచి చెల్లింపులు జరగనున్నాయి. రుణదాతలు కొత్త యజమానిగా రాస్‌నెఫ్ట్‌ను అంగీకరించడంతో మిగిలిన రుణానికి రష్యా కంపెనీ బాధ్యత వహిస్తుంది.

ఎస్సార్ స్టీల్ రుణాలు ఎగవేతే!

ఎస్సార్ గ్రూపు పరిధిలోని ఎస్సార్ స్టీల్ రూ.44,000 కోట్ల మేర బ్యాంకుల రుణాలను ఎగవేయగా, ఈ కేసు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ ముందుకు వెళ్లిన విషయం తెలిసిందే. అయితే, ఎస్సార్ గ్రూపు భారీ స్థాయిలో రుణాలను తిరిగి చెల్లించే కార్యక్రమం చేపట్టినప్పటికీ... ఎస్సార్ స్టీల్ రుణాలను మాత్రం తిరిగి చెల్లించడం లేదు. ఇదే విషయాన్ని రుయాను ప్రస్తావించగా, 'ఎస్సార్ ఆయిల్, ఎస్సార్ స్టీల్ రెండు వేర్వేరు సంస్థలు, వేర్వేరు వ్యాపారాల్లో ఉన్నాయి. ఒక కంపెనీ ఖాతా నుంచి మరో కంపెనీ ఖాతాలోకి నిధుల మళ్లింపునకు చట్టం ఒప్పుకోదు' అని స్పష్టం చేశారు.

రుణదాతలకు తక్షణం రూ. 4,000 కోట్లు చెల్లిస్తాం: ప్రశాంత్ రుయా

ఎస్సార్ గ్రూపు మొత్తం రుణ భారం రూ.1.35 లక్షల కోట్లు కాగా, ఎస్సార్ విక్రయం నేపథ్యంలో రూ.70,400 కోట్ల మేర రుణ భారం తమ గ్రూప్ నుంచి తగ్గుతుందని ఎస్సార్ గ్రూపు డైరెక్టర్ ప్రశాంత్ రుయా తెలిపారు. రుయాల మొత్తం రుణంలో ఇది 60 శాతం. ''ఈ డీల్‌కు మూడు ప్రత్యేకతలు ఉన్నాయి. దేశంలోకి వచ్చిన అతిపెద్ద ఎఫ్‌డీఐ. దేశ చరిత్రలో భారీ స్థాయిలో రుణాలను తీర్చివేస్తున్న డీల్. మూడోది రష్యా నుంచి ఓ దేశానికి భారీ స్థాయిలో నిధులు వెళుతున్న సందర్భం కూడా ఇదే'' అని ప్రశాంత్ రుయా పేర్కొన్నారు. విక్రయ ఒప్పందం పూర్తయినట్టు సోమవారం ముంబైలో జరిగిన మీడియా సమావేశంలో వెల్లడించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. కంపెనీ బ్యాలన్స్ షీట్లలో గణనీయమైన రుణాలను తీర్చివేయనున్నట్టు చెప్పారు. రాస్‌నెఫ్ట్ డీల్ తర్వాత భారత్‌లోని రుణదాతలకు రూ. 4000 కోట్ల మేర నేరుగా చెల్లించనున్నట్లు ఆయన తెలిపారు. అందులో ఎల్ఐసీకి రూ. 800 కోట్లవరకూ చెల్లిస్తామని అన్నారు. మిగిలిన మొత్తాన్ని ఏ బ్యాంకుకు లేదా బీమా కంపెనీకి ఎంతెంత చెల్లించేదీ వెల్లడించడానికి ఆయన నిరాకరించారు. రూ.1.2 లక్షల కోట్ల మూలధన విస్తరణ కార్యక్రమం పూర్తి అయిన తర్వాత విస్తృతమైన తమ పోర్ట్‌ఫోలియో వృద్ధి అవకాశాలను ఇకపై చూడనున్నట్టు ప్రకటించారు. ''ఈ డీల్ తర్వాత కూడా ఎస్సార్ గ్రూపు ఆస్తుల విలువ 17 బిలియన్ డాలర్లుగా ఉంటుంది. 15 బిలియన్ డాలర్ల ఆదాయం, 2 బిలియన్ డాలర్ల ఎబిటా కూడా ఉండనుంది. చమురు రంగంలో మాకున్న ఏకైక 9 మిలియన్ టన్నుల రిఫైనరీ ద్వారా పెట్టుబడులు కొనసాగుతాయి'' అని ప్రశాంత్ రుయా పేర్కొన్నారు. ఈ చరిత్రాత్మక లావాదేవీతో ఎస్సార్ గ్రూపు వృద్ధికి నూతన ద్వారాలు తెరుచుకున్నాయని సంస్థ వ్యవస్థాపకుడు శశిరుయా కూడా ప్రకటించారు.

రాస్‌నెఫ్ట్‌కు స్వాగతం: ధర్మేంద్ర ప్రధాన్



ఈ ఒప్పందాన్ని పూర్తి చేసిన ఎస్సార్ గ్రూపును పెట్రోలియం మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అభినందించారు. భారత అభివృద్ధిలో పాలుపంచుకుంటున్న రాస్‌నెఫ్ట్, ట్రాఫిగురా యూసీపీ కన్సార్టియానికి స్వాగతం పలుకుతున్నట్టు ప్రకటించారు.

సగం రుణభారం తీరిపోతుంది: కొచర్



ఎస్సార్ గ్రూపు రుణాలను తిరిగి తీర్చివేసే కార్యక్రమంతో ఆ గ్రూపునకు ఇచ్చిన రుణాలు సగం మేర తగ్గిపోనున్నట్టు ఐసీఐసీఐ బ్యాంకు చీఫ్ చందాకొచర్ తెలిపారు.

ఎస్సార్ ఆయిల్ అభివృద్ధికి కృషి: సెచిన్



కొత్త భాగస్వాములతో కలసి ఎస్సార్ ఆయిల్ ఆర్థిక పరిస్థితిని మెరుగుపరిచేందుకు కృషి చేస్తామని, ఆస్తుల అభివృద్ధికి తగిన వ్యూహాన్ని అమల్లో పెడతామని రాస్‌నెఫ్ట్ అధినేత ఇగార్ సెచిన్ పేర్కొన్నారు. కాగా, మీడియా సమావేశంలో ఆయన పాల్గొనలేదు.

కారు రుణాలపై ఎస్‌బీఐ ప్రాసెసింగ్ ఫీజు మాఫీ

పసిడి, వ్యక్తిగత రుణాలపై కూడా సగం



న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ దిగ్గజం ఎస్‌బీఐ పరిమిత కాలానికి కారు, బంగారం, వ్యక్తిగత రుణాలపై ప్రాసెసింగ్ ఫీజు నుంచి పూర్తిగా మినహాయింపు కల్పిస్తున్నట్లు వెల్లడించింది. ఇప్పటికే గృహ రుణాల టేకోవర్‌పై ఈ తరహా ఆఫర్ ఇస్తున్నట్లు వివరించింది. తాజాగా ఈ ఏడాది డిసెంబర్ 31 దాకా కారు లోన్స్‌పై 100% ప్రాసెసింగ్ ఫీజు మాఫీ చేసినట్లు పేర్కొంది. అలాగే అక్టోబర్ 31 దాకా బంగారం రుణాలపై 50 శాతం మేర మినహాయింపు కల్పిస్తున్నట్లు ఎస్‌బీఐ తెలిపింది. ఇక, సెప్టెంబర్ 30 దాకా వ్యక్తిగత రుణాలకు సంబంధించి ఎక్స్‌ప్రెస్ క్రెడిట్ స్కీముపై 50% మేర ప్రాసెసింగ్ ఫీజు మాఫీ చేసినట్లు పేర్కొంది. బీఎస్ఈలో సోమవారం ఎస్‌బీఐ షేరు 1.44% క్షీణించి రూ. 274.65 వద్ద ముగిసింది.

పొదుపు ఖాతాలపై దేనా బ్యాంక్ వడ్డీ తగ్గింపు

దేనా బ్యాంక్ తాజాగా పొదుపు ఖాతాలపై వడ్డీ రేట్లు అరశాతం తగ్గించింది. ఇకపై రూ. 25 లక్షల దాకా డిపాజిట్లు ఉండే సేవింగ్స్ అకౌంట్లపై 3.5% వడ్డీ రేటు ఉంటుందని పేర్కొంది. అయితే, రూ. 25 లక్షలకు పైబడిన మొత్తాలపై మాత్రం యథాప్రకారంగా 4% వడ్డీ రేటు కొనసాగుతుందని వివరించింది.

బీఎస్ఈలో 200 కంపెనీల డీలిస్టింగ్



ముహూర్తం ఈ నెల 23వ తేదీ

న్యూఢిల్లీ: దేశంలోనే అతిపెద్ద స్టాక్ ఎక్స్ఛేంజ్ బీఎస్ఈ ఈ నెల 23 నుంచి 200 కంపెనీలను తప్పనిసరి డీలిస్ట్ చేయనుంది. అంతేకాదు ఈ కంపెనీల ప్రమోటర్లను మార్కెట్‌లో పాల్గొనకుండా నిషేధం విధించనుంది. డీలిస్ట్ కాబోయే కంపెనీల ప్రమోటర్లు ప్రజల వద్దనున్న వాటాలను స్వతంత్ర వ్యాల్యూయర్ ఖరారు చేసిన ధరకు కొనుగోలు చేయాల్సి ఉంటుందని బీఎస్ఈ తన నోటిఫికేషన్‌లో పేర్కొంది. డీలిస్ట్ కానున్న 200 కంపెనీల్లో 117 కంపెనీలు పదేళ్లకు పైగా సస్పెండ్‌లో ఉన్నవే. 28 స్టాక్స్ సైతం పదేళ్లుగా సస్పెన్షన్‌లోనే ఉన్నప్పటికీ లిక్విడేషన్‌లో ఉన్నాయి. వీటితోపాటు మరో 55 కంపెనీల షేర్లు కూడా డీలిస్ట్ అవుతాయి. డీలిస్ట్ కానున్న కంపెనీల్లో యూఫార్మా లేబరేటరీస్, అథెనా ఫైనాన్షియల్ సర్వీసెస్, మాగ్నస్ రబ్బర్ ఇండస్ట్రీస్, రాజస్థాన్ పాలిస్టర్స్, ట్రాన్స్‌పవర్ ఇంజనీరింగ్, డ్యుపాంట్ సాఫ్ట్‌వేర్, డైనవోక్స్ ఇండస్ట్రీస్, జీడీఆర్ మీడియా ఉన్నాయి. షెల్ కంపెనీలపై సెబీ, స్టాక్ ఎక్స్ఛేంజ్‌లు చర్యలు చేపడుతున్న తరుణంలోనే ఈ కంపెనీలను డీలిస్ట్ చేయనుండటం ప్రాధాన్యం సంతరించుకుంది. 331 అనుమానిత షెల్ కంపెనీల్లో ట్రేడింగ్ పరంగా ఆంక్షలకు సెబీ ఇటీవలే ఆదేశించిన విషయం తెలిసిందే. వీటిలో సుమారు పది కంపెనీల వరకు శాట్‌కు వెళ్లి సెబీ ఆదేశాలపై స్టే ఉత్తర్వులు తెచ్చుకున్నాయి.


నేడు ప్రభుత్వరంగ బ్యాంకు ఉద్యోగుల సమ్మె



న్యూఢిల్లీ: ప్రభుత్వరంగ బ్యాంకుల ఉద్యోగులు మంగళవారం దేశవ్యాప్తంగా సమ్మె చేయనుండటంతో సేవలకు అంతరాయం కలగనుంది. బ్యాంకుల విలీనాల ప్రతిపాదనలను ఉపసంహరించుకవోడం, ఉద్దేశపూర్వక రుణ ఎగవేతల్ని నేరపూరిత చర్యగా ప్రకటించడం, ఎన్‌పీఏల వసూలుకు పార్లమెంటరీ కమిటీ సూచించిన సిఫారసులను అమలు చేయడం వంటి డిమాండ్లపై ఒక రోజు సమ్మెకు తొమ్మిది బ్యాంకు ఉద్యోగుల ఉమ్మడి సంఘం యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంకు యూనియన్స్ పిలుపునివ్వటం తెలిసిందే. సమ్మె కారణంగా డిపాజిట్లు, నగదు ఉపసంహరణలు, చెక్కుల క్లియరెన్స్, ఎన్ఈఎఫ్‌టీ, ఆర్టీజీఎస్ సేవలకు విఘాతం కలగనుంది. దీనిపై ఖాతాదారులకు ఇప్పటికే సమాచారం కూడా అందించినట్టు ఇండియన్ బ్యాంక్స్ అసోసియేషన్ (ఐబీఏ) తెలిపింది. మరోవైపు ప్రైవేటు రంగంలోని ఐసీఐసీఐ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, యాక్సిస్ బ్యాంకు, కోటక్ మహీంద్రా బ్యాంకు తదితర బ్యాంకుల సేవలు యథావిధిగా కొనసాగనున్నాయి.

షిప్‌యార్డ్ ఆస్తులు ఎస్సార్‌కు!

- 1998 నాటి బకాయిలపై కోర్టుకెక్కిన ఎస్సార్
- రూ. 204 కోట్ల ఆస్తుల అటాచ్ చేసిన సుప్రీం కోర్టు
- వాటిలో భూములు, విలువైన భవనాలు కూడా
- ఎస్సార్ న్యాయవాది ఆదిత్య వెల్లడి



విశాఖపట్నం: ముంబైకి చెందిన ఎస్సార్ ఆయిల్ లిమిటెడ్ కంపెనీకి విశాఖలోని హిందుస్థాన్ షిప్‌యార్డ్‌కు చెందిన రూ.204 కోట్ల విలువైన స్థిరాస్తులను అటాచ్ చేస్తూ సుప్రీం కోర్టు ఉత్తర్వులు జారీ చేసినట్లు ఎస్సార్ తెలియజేసింది. సోమవారమిక్కడ విలేకరుల సమావేశంలో ఎస్సార్ న్యాయవాది ఎం.ఎన్. ఆదిత్య ఈ వివరాలు వెల్లడించారు. ''హిందుస్థాన్ షిప్‌యార్డుతో కుదిరిన ఒప్పందం ప్రకారం ఎస్సార్ 1998లో రాజమండ్రి దగ్గరున్న రవ్వ గ్యాస్ ఫీల్డ్ వద్ద నాలుగు ఆయిల్ ప్లాట్‌ఫాంలను నిర్మించి అప్పగించింది. అప్పటి ఒప్పందం ప్రకారం చెల్లించాల్సిన రూ. 40 కోట్లను షిప్‌యార్డ్ చెల్లించలేదు. దీంతో ఎస్సార్ యాజమాన్యం కోర్టుకెళ్లింది. 2015లో సుప్రీంకోర్టు ఎస్సార్‌కు అనుకూలంగా ఉత్తర్వులు ఇస్తూ... అప్పటి మార్కెట్ విలువ ప్రకారం రూ.220 కోట్లు చెల్లించాలని మూడు ఈపీలు జారీ చేసింది. దీనిపై హెచ్ఎస్ఎల్ కోర్టుకు వెళ్లి... 1998 నాటి అమెరికన్ డాలర్ రేట్ ప్రకారం బకాయిలను రూపాయల్లో చెల్లిస్తామని, దానిపై వడ్డీ చెల్లించాల్సిన అవసరం లేదని వాదించింది. దీని బదులు 2015 నాటి డాలర్ రేటు ప్రకారం బకాయిని వడ్డీతో సహా రూపాయల్లో చెల్లించాలని ఎస్సార్ వాదించింది. చివరకు 2001 నాటి డాలర్ రేటు తీసుకోవాలని సుప్రీం తీర్పునిచ్చింది'' అని ఆదిత్య తెలిపారు. వివిధ బ్యాంకుల్లో ఉన్న రూ.104 కోట్ల విలువైన టీడీఆర్‌లు, రూ.100 కోట్ల విలువైన మల్కాపురం సర్వే నం.1లోని ఆస్తులు, వాల్తేర్ అప్‌ల్యాండ్స్‌లోని 2 ఎకరాల 'నియో నెస్ట్ క్వార్టర్స్' (షిప్‌యార్డ్ సీఎండీ నివాసం), సిరిపురంలో ఉన్న 'వరుణ్ పార్క్' (15 ఎకరాలు)ను ఎస్సార్‌కు అటాచ్ చేస్తూ కోర్టు తీర్పునిచ్చిందన్నారు.

చేతకాకే మూర్తిపై నిందలు

సిక్కా రాజీనామాపై ఇన్ఫీ మాజీ సీఎఫ్ఓ పాయ్ మండిపాటు ● చెత్త పనితీరును కప్పిపుచ్చుకోవడానికే డ్రామాలని వ్యాఖ్య

బెంగళూరు: ఇన్ఫోసిస్ సీఈఓ పదవికి అర్ధంతరంగా గుడ్‌బై చెప్పిన విశాల్ సిక్కాపై కంపెనీ మాజీల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సిక్కా తన చెత్త పనితీరును కప్పిపుచ్చుకోవడానికే మూర్తిపై ఆరోపణలు గుప్పించారని.. చేతకాక పదవినుంచి తప్పుకున్నారని ఇన్ఫీ మాజీ సీఎఫ్ఓ మోహన్‌దాస్ పాయ్ మండిపడ్డారు. తనపై పదేపదే నిరాధార ఆరోపణలు, వ్యక్తిగతంగా కూడా దూషణలను భరించలేకపోవడంవల్లే తప్పనిసరి పరిస్థితుల్లో ఇన్ఫీని వీడుతున్నానంటూ రాజీనామా లేఖలో సిక్కా పేర్కొన్న సంగతి తెలిసిందే. నేరుగా మూర్తిపేరును ఆయన ప్రస్తావించకపోయినప్పటికీ... ఇన్ఫీ బోర్డు మాత్రం సిక్కా రాజీనామాకు మూర్తే కారణమని కుండబద్దలుకొట్టింది. దీంతో దాదాపు ఏడాదికాలంగా బోర్డుతో మూర్తి సాగిస్తున్న పోరు తారస్థాయికి చేరింది. 'ఈ ఏడాది ఫిబ్రవరిలోనే సిక్కా తనంతటతానుగా వైదొలగారనుకున్నారు. తన వైఫల్యాలను బయటపడకుండా చేసుకోవడం కోసం మూర్తిని టార్గెట్ చేసుకొని సిక్కా ఆరోపణలు చేశారు' అని పాయ్ వ్యాఖ్యానించారు. ఒకపక్క, కొత్త సీఈఓ ఎంపిక కత్తిమీదసాముగా మారగా.. కంపెనీలో కార్పొరేట్ గవర్నెన్స్ లోపాలపై అమెరికాలోని కొన్ని న్యాయ సంస్థలు క్లాస్‌యాక్షన్ దావాలు వేసేందుకు సిద్ధమవుతున్నాయి. దీంతో అటు ఇన్వెస్టర్లతోపాటు కంపెనీ క్లయింట్లలో కూడా తీవ్ర ఆందోళనలు చెలరేగుతున్నాయి. షేర్ల బైబ్యాక్ ప్రకటనను చేసినప్పటికీ(షేరుకు రూ.1,150 చొప్పున ధరతో) స్టాక్ మార్కెట్లో ఇన్ఫీ స్టాక్ కుప్పకూలుతూనే ఉంది. వరుసగా రెండురోజుల్లో 14 శాతం పైగా దిగజారి... రూ.873 స్థాయికి పడిపోయింది.



మళ్లీ కొత్త పోస్టు ఎందుకు...: పూర్తిస్థాయి కొత్త సీఈఓ నియామకం జరిగేవరకూ సిక్కాను ఎగ్జిక్యూటివ్ వైస్-చైర్మన్‌గా కొనసాగించాలని బోర్డు తీసుకున్న నిర్ణయాన్ని కూడా పాయ్ తప్పుబట్టారు. 'కంపెనీకి ఇప్పటికే చైర్మన్(ఆర్.శేషసాయి), సహ-చైర్మన్(రవి వెంకటేశన్)లు ఉన్నారు. తాత్కాలిక సీఈఓను(యూబీ ప్రవీణ్ రావు) కూడా నియమించారు మళ్లీ కొత్తగా ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఎందుకు? ఇదంతా తీవ్ర గందరగోళానికి దారితీస్తుంది' అని పేర్కొన్నారు. కాగా, కాబోయే సీఈఓగా కంపెనీకి చెందినవారు ఉండలా, బయటివ్యక్తి అయితే మంచిదా అన్న ప్రశ్నకు... పొగరుబోతుగా, సొంత నిర్ణయాలతో వ్యవహరించే వ్యక్తులు కాకుండా... ఇన్ఫోసిస్ సంస్కృతి, విలువను గౌరవించే వ్యక్తి అయి ఉండాలని బదులిచ్చారు.

ఇన్ఫీ చైర్మన్, కో-చైర్మన్‌లు వైదొలగాలి

మాజీ సీఎఫ్ఓ వి.బాలకృష్ణన్



న్యూఢిల్లీ: ఇన్ఫీలో సిక్కా రాజీనామా ప్రకంపనలు ఇప్పట్లో ఆగేలాలేవు. కొత్త సీఈఓ కోసం అన్వేషణ మొదలుపెట్టడానికిముందే కంపెనీ డైరెక్టర్ల బోర్డును పూర్తిగా ప్రక్షాళన చేయాలని కంపెనీ మాజీ సీఎఫ్ఓ వి.బాలకృష్ణన్ డిమాండ్ చేశారు. చైర్మన్ ఆర్.శేషసాయి, సహ-చైర్మన్ రవి వెంకటేశన్‌లు కూడా బోర్డు నుంచి తప్పుకోవాల్సిందేనని ఆయన పేర్కొన్నారు. కాగా, ఇన్ఫోసిస్‌లో కార్పొరేట్ గవర్నెన్స్ లోపాలకు ఆడిట్ విభాగం హెడ్ రూపా కుద్వా, రెమ్యూనరేషన్ విభాగం హెడ్ జెఫ్రీ ఎస్. లేమాన్‌లే బాధ్యత వహించాల్సి ఉంటుందని కంపెనీ ప్రమోటర్ నారాయణమూర్తి ఆరోపించిన నేపథ్యంలో బాలకృష్ణన్ వ్యాఖ్యలు కూడా ఇదే తరహాలో ఉండటం గమనార్హం. ముందుగా బోర్డును ప్రక్షాళన చేయకుండా కొత్త సీఈఓను తీసుకురావడం కంపెనీకి ఆత్మహత్యాసదృశంగా మారుతుందని బాలకృష్ణన్ అన్నారు. 'పెద్ద ఇన్వెస్టర్లు, వ్యవస్థాపకులతో తగినవిధంగా చర్చించి బోర్డులోకి మంచి వ్యక్తులకు చోటుకల్పించాలి. ఇప్పుడున్న బోర్డును చూస్తే... ఇన్ఫీకి సారథ్యం వహించేందుకు మంచి సీఈఓలు ఎవరూ ముందుకొచ్చే పరిస్థితి కనబడటం లేదు' అని బాలకృష్ణన్ వ్యాఖ్యానించారు. కొత్త సీఈఓ నియామకానికి వచ్చే ఏడాది మార్చి 31 వరకూ గడువును ఇన్ఫీ బోర్డు నిర్దేశించిన సంగతి తెలిసిందే. కాగా, ఇజ్రాయిల్ కంపెనీ పనయా కొనుగోలు వ్యవహారంలో అవకతవకలు జరిగాయన్న ఆరోపణల నేపథ్యంలో ఈ డీల్‌పై దర్యాప్తు నివేదికను ఇన్ఫోసిస్ బయటపెట్టాల్సిందేనని కూడా బాలకృష్ణన్ పేర్కొన్నారు.

నిత్యావసరాల ధరలు (హోల్‌సేల్/క్వింటాల్‌కు)

సరుకు	ధర
పత్తి (వరంగల్, వ్యాపారస్తులు)	రూ.4,900 (కనిష్టం), రూ.5,240 (గరిష్టం) (18న ముగింపు)
మిర్చి (వరంగల్, తేజ)	రూ.2,000(కనిష్టం), రూ.5,000(గరిష్టం)
పసుపు (నిజామాబాద్, కొమ్ము)	రూ.3,400(కనిష్టం), రూ.7,931(గరిష్టం) (18న ముగింపు)
ఉల్లి (కర్నూలు)	రూ.260 (కనిష్టం), రూ.840 (గరిష్టం) (20న ముగింపు)
చక్కెర (చెన్నై)	రూ.4,080
బియ్యం (కరీంనగర్)	రూ.3,600 (హెచ్ఎంటీ)
కందిపప్పు (చెన్నై)	రూ.7,500
సుబాబులు (కృష్ణా)	రూ.4,400 (టన్నుకు)
ఆయిల్ పామ్ (పశ్చిమ గోదావరి)	రూ.6,781

ఏఏఐకి భోగాపురం ఎయిర్‌పోర్ట్

30.2 శాతం రెవెన్యూ షేర్ ఇస్తానన్నందుకే..

సాక్షి, అమరావతి: విజయనగరం జిల్లా భోగాపురంలో నిర్మించ తలపెట్టిన ఎయిర్‌పోర్ట్ అభివృద్ధి పనుల ఫైనాన్షియల్ బిడ్ ఖరారైంది. ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియా ఈ టెండర్‌ను దక్కించుకున్నట్లు ఏపీ మౌలిక వసతుల విభాగం ముఖ్యకార్యదర్శి అజయ్‌జైన్ తెలిపారు. ఎయిర్‌పోర్ట్‌ను అభివృద్ధి చేసిన సంస్థకే దాని వాణిజ్య కార్యాకలాపాలపై సర్వాధికారాలుంటాయి. అయితే, వచ్చే ఆదాయంలో ఎవరు ఎక్కువ ఇస్తే వారికి ఈ పనులు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ క్రమంలో ఎయిర్‌పోర్ట్ అథారిటీ 30.2 శాతం, జీఎంఆర్ ఇన్‌ఫ్రా 21.6 శాతం రెవెన్యూ షేర్ ఇవ్వటానికి ముందుకొచ్చాయి. అత్యధికంగా వాటా ఇచ్చేందుకు సిద్ధపడిన ఎయిర్‌పోర్ట్ అథారిటీ ఆఫ్ ఇండియాకే ఈ పనులు అప్పగించాలని నిర్ణయించారు.

మార్కెట్‌కు ఇన్ఫీ దెబ్బ

- వరుసగా రెండో రోజూ పతనం
- సెన్సెక్స్ 266 పాయింట్లు, నిఫ్టీ 83 పాయింట్లు డౌన్

ముంబై: విశాల్ సిక్కా సీఈఓ పదవికి రాజీనామా చేసిన పరిణామాలతో ఐటి దిగ్గజం ఇన్ఫోసిస్ టెక్నాలజీస్‌తో పాటే మార్కెట్ కూడా సోమవారం వరుసగా రెండురోజు క్షీణించింది. బీఎస్‌ఈ సెన్సెక్స్ మరో 266 పాయింట్లు పతనమై 31,259 పాయింట్ల వద్ద ముగిసింది. గత శుక్రవారం కూడా ఈ సూచి 270 పాయింట్లు పడిపోయిన సంగతి తెలిసిందే. ఎన్‌ఎస్‌ఈ నిఫ్టీ 9,800 పాయింట్ల స్థాయిని కోల్పోయి, 83 పాయింట్ల నష్టంతో 9,754 వద్ద క్లోజయ్యింది. ట్రేడింగ్ తొలిదశలో బ్యాంకింగ్, మెటల్ షేర్ల దన్నుతో సెన్సెక్స్ 31,641 పాయింట్ల గరిష్టస్థాయికి పెరిగినప్పటికీ, మధ్యాహ్న సెషన్ నుంచి ఆ రెండు రంగాల షేర్లలో కూడా అమ్మకాలు జరగడంతో ఇంట్రాడేలో గరిష్టస్థాయి నుంచి 420 పాయింట్లకుపైగా పడిపోయి 31,220 పాయింట్ల కనిష్టస్థాయిని తాకింది. ఇదేబాటలో నిఫ్టీ 9,884 పాయింట్ల గరిష్టస్థాయికి పెరిగిన అనంతరం 9,740 పాయింట్ల కనిష్టస్థాయిని తాకింది. అమెరికా–దక్షిణ కొరియాలు సంయుక్తంగా సైనిక కవాతులు జరుపుతున్నాయన్న వార్తలతో ఇన్వెస్టర్లు ముందుజాగ్రత్తగా లాభాల స్వీకరణకు పాల్పడినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. ఇన్ఫోసిస్ ప్రీమియం ధరకు బైబ్యాక్ ఆఫర్‌ను ప్రకటించినప్పటికీ, ఆ షేరులో అమ్మకాల ఒత్తిడి కొనసాగిందని జియోజిత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ రీసెర్చ్ హెడ్ వినోద్ నాయర్ చెప్పారు. విదేశీ సంస్థాగత ఇన్వెస్టర్లు మార్కెట్లో విక్రయాలు జరపడం కూడా సెంటిమెంట్‌ను బలహీనపర్చిందని ఆయన వివరించారు.

ఇన్ఫోసిస్ 5 శాతం డౌన్

గత శుక్రవారం 9 శాతంపైగా పతనమైన ఇన్ఫోసిస్ షేరు మరో 5 శాతం క్షీణించి మూడేళ్ల కనిష్టస్థాయి రూ. 873 వద్ద ముగిసింది. రూ. 1,150 ధరతో దాదాపు 5 శాతం షేర్లను బైబ్యాక్ చేయనున్నట్లు గత శనివారం ఇన్ఫోసిస్ చేసిన ప్రకటన...ఈ షేరుపై సానుకూల ప్రభావం చూపలేదు. విశాల్ సిక్కా హఠాత్తుగా రాజీనామా చేసిన ప్రభావంతో ఇన్వెస్టర్లు అమ్మకాలకు పాల్పడ్డారు. రెండు ఎక్స్ఛేంజీల్లో కలిపి భారీగా 4.5 కోట్ల ఇన్ఫీ షేర్లు ట్రేడయ్యాయి. సెన్సెక్స్–30లో అత్యధికంగా పతనమైన షేరు ఇదే. అదాని పోర్ట్స్, డాక్టర్ రెడ్డీస్ లాబ్, సన్‌ఫార్మా, ఓఎన్‌జీసీలు 2.7 శాతం వరకూ క్షీణించాయి. యాక్సిస్ బ్యాంక్, మహీంద్రా, టెక్ మహీంద్రా, ఐటీసీలు స్వల్పంగా పెరిగాయి.

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్‌ఈ	3,953
ఎన్‌ఎస్‌ఈ (ఈక్విటీ)	24,708
ఎన్‌ఎస్‌ఈ (డెరివేటివ్స్)	5,04,350
ఎఫ్ఐఐ	-1,983
డీఐఐ	475

ఇన్ఫోసిస్..ఫ్యూచర్స్ సిగ్నల్స్

ఇన్ఫోసిస్ సీఈఓ పదవికి విశాల్ సిక్కా రాజీనామా చేయడం, దాని వెనుక పరిణామాల కారణంగా ఆ షేరు రెండు ట్రేడింగ్ రోజుల్లో దాదాపు 15 % క్షీణించి మూడేళ్ల కనిష్టస్థాయి రూ. 873 వద్ద ముగిసింది. సోమవారం ఇన్ఫోసిస్ ఫ్యూచర్ కాంట్రాక్టు ఓఐలో 12.76 లక్షల షేర్లు (3.30%) యాడ్ అయ్యాయి. దాంతో మొత్తం ఓఐ 3.99 కోట్ల షేర్లకు పెరిగింది. స్పాట్ ధరతో పోలిస్తే ఫ్యూచర్ ధర క్రితం రోజు రూ. 4 ప్రీమియంతో ట్రేడ్‌కాగా, తాజాగా ఆ ప్రీమియం అంతా హరించుకుపోవడంతోపాటు రూ. 3 డిస్కౌంట్‌తో ఫ్యూచర్ ముగిసింది. ఓఐ పెరగడం, ఫ్యూచర్ ప్రీమియం నుంచి డిస్కౌంట్‌లోకి మళ్లడం..భారీ షార్ట్ బిల్డప్‌ను సూచిస్తోంది. ఆప్షన్ విభాగంలో రూ. 880, 860 స్ట్రయిక్స్ వద్ద పెద్ద ఎత్తున పుట్ రైటింగ్, రూ. 900, రూ. 920 స్ట్రయిక్స్ వద్ద భారీ కాల్ రైటింగ్ జరిగింది. రూ. 880, రూ. 860 స్ట్రయిక్స్ పుట్ ఆప్షన్లలో 5.56 లక్షలు, 9.68 లక్షల చొప్పున యాడ్‌కాగా, పుట్ బిల్డప్ వరుసగా 10.98 లక్షలు, 17.48 లక్షలకు పెరిగింది. రూ. 900, రూ. 920 స్ట్రయిక్స్ కాల్ ఆప్షన్లలో కొత్తగా 21.31 లక్షలు, 12.45 లక్షల చొప్పున యాడ్ అయ్యాయి. ఈ స్ట్రయిక్స్ వద్ద కాల్ బిల్డప్ వరుసగా 26.55 లక్షలు, 20.33 లక్షల షేర్లకు పెరిగింది. సమీప భవిష్యత్తులో రూ. 860–880 శ్రేణి మధ్య మద్దతును ఇన్ఫోసిస్ రక్షించుకోగలిగితే, షార్ట్ కవరింగ్ ర్యాలీ జరిగి రూ. 900–920 శ్రేణిని చేరవచ్చని, రూ. 860 స్థాయిని కోల్పోతే, మరింత క్షీణించవచ్చని ఈ ఆప్షన్ డేటా వెల్లడిస్తున్నది.

→ యాక్సిస్ బ్యాంక్ ఫ్యూచర్ సంకేతాలు ఎలా వున్నాయి?
ఈ వివరాలు W . లో W C

సీపీఆర్‌ఎల్‌తో మెక్‌డొనాల్డ్స్ కటీఫ్

ఫ్రాంచైజీ ఒప్పందం రద్దు

న్యూఢిల్లీ: ఒప్పంద నిబంధనల ఉల్లంఘన, చెల్లింపుల ఎగవేత తదితర ఆరోపణలపై కనాట్ ప్లాజా రెస్టారెంట్‌తో (సీపీఆర్‌ఎల్) మెక్‌డొనాల్డ్స్ ఇండియా తెగతెంపులు చేసుకుంది. దీంతో సీపీఆర్‌ఎల్ తన అవుట్‌లెట్స్‌లో ఎక్కడా కూడా మెక్‌డొనాల్డ్స్ బ్రాండ్‌ను ఉపయోగించుకోవడానికి వీలుండదు. అయితే, ఉద్యోగులు, సరఫరాదారులు, అవుట్‌లెట్స్‌కు స్థలం ఇచ్చిన యజమానులపై ప్రతికూల ప్రభావం పడకుండా తగు పరిష్కార మార్గం కనుగొనే దిశగా సీపీఆర్‌ఎల్‌తో కలిసి పనిచేయడానికి తాము సిద్ధమని మెక్‌డొనాల్డ్స్ ఇండియా పేర్కొంది. సీపీఆర్‌ఎల్ ప్రస్తుతం తూర్పు, ఉత్తరాది రాష్ట్రాల్లో 169 ఫాస్ట్‌ఫుడ్ అవుట్‌లెట్స్‌ను నిర్వహిస్తోంది. ఢిల్లీలో సీపీఆర్‌ఎల్ ఆధ్వర్యంలో నడుస్తున్న 43 అవుట్‌లెట్స్ లైసెన్సులను పునరుద్ధరించుకోకపోవడం వల్ల మూతపడ్డాయి. ఈ నేపథ్యంలో మెక్‌డొనాల్డ్స్ నిర్ణయం ప్రాధాన్యం సంతరించుకుంది.

చిత్తూరులో ఇన్నోవేటివ్ ఫుడ్స్ ఫెసిలిటీ

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: సుమేరు బ్రాండ్‌తో ఫ్రోజెన్ ఫుడ్స్‌ను విక్రయిస్తున్న ఇన్నోవేటివ్ ఫుడ్స్ ఆంధ్రప్రదేశ్‌లోని చిత్తూరు జిల్లాలో తయారీ ఫెసిలిటీని ఏర్పాటు చేస్తోంది. జనవరిలోగా దీనిని అందుబాటులోకి తేనున్నట్లు కంపెనీ సేల్స్, మార్కెటింగ్ వైస్ ప్రెసిడెంట్ సౌరభ్ కుమార్ చెప్పారు. విభిన్న రకాల ఫ్రోజెన్ పరాటాలను సోమవారమిక్కడ పరిచయం చేసిన సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. చిత్తూరు ప్లాంటులో పరాటాలతో పాటు రానున్న రోజుల్లో ఇతర ఉత్పత్తులు తయారు చేస్తామన్నారు. ఫ్రోజెన్ ఫుడ్ విభాగంలో కంపెనీకి 10 % వాటా ఉందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్ల టర్నోవర్‌ను లక్ష్యంగా చేసుకున్నామని తెలిపారు.కొచ్చిలో కంపెనీకి ఇప్పటికే ఓ ప్లాంటుంది.

ఎన్‌పీఏలను 5 శాతానికి తెస్తాం!

- వచ్చే మార్చికల్లా ఇదే మా లక్ష్యం
- రూ.534 కోట్ల ఎన్‌పీఏల్ని విక్రయిస్తాం
- వాటా విక్రయం ద్వారా రూ.1,200–1,500 కోట్ల సమీకరణ
- 'సాక్షి'తో ఇండియన్ బ్యాంక్ సీఈఓ కిశోర్ ఖరాటే

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: ప్రభుత్వ రంగ బ్యాంక్ ఇండియన్ బ్యాంక్ నిరర్థక ఆస్తుల (ఎన్‌పీఏ) రికవరీపై దృష్టిపెట్టింది. ఈ ఏడాది జూన్‌తో ముగిసిన త్రైమాసికం నాటికి స్థూల ఎన్‌పీఏలు రూ.9,653 కోట్లుండగా.. వీటిలో రూ.534 కోట్ల ఎన్‌పీఏలను విక్రయించేందుకు బ్యాంకు సిద్ధమైంది. ప్రస్తుతం 7.21 శాతంగా ఉన్న ఎన్‌పీఏ శాతాన్ని వచ్చే మార్చి నాటికి 5 శాతానికి చేర్చాలని లక్ష్యించినట్లు ఇండియన్ బ్యాంక్ ఎండీ అండ్ సీఈఓ కిశోర్ ఖరాటే తెలిపారు. 1907లో ప్రారంభమైన బ్యాంక్.. 111 ఏళ్ల పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారమిక్కడ జరిగిన సమావేశంలో ఆయన 'సాక్షి' బిజినెస్ బ్యూరో ప్రతినిధితో ప్రత్యేకంగా మాట్లాడారు. వివరాలివీ...

త్వరలోనే అమరావతి జోన్: ప్రస్తుతం దేశంలో ఇండియన్ బ్యాంక్‌కు 2,700 శాఖలుండగా.. ఇందులో దక్షిణాది రాష్ట్రాల్లో 60 శాతం అంటే 1,620 శాఖలున్నాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో 350 బ్రాంచీలున్నాయి. ఇప్పటివరకు తెలంగాణ జోన్ కేంద్రంగానే రెండు రాష్ట్రాల కార్యకలాపాలు కొనసాగిస్తున్నాం. త్వరలోనే అమరావతిలో కొత్త జోన్‌ను ఏర్పాటు చేస్తున్నాం. ప్రస్తుతం శ్రీలంక, సింగపూర్ దేశాల్లోనూ బ్రాంచీలున్నాయి. విదేశాల్లోనూ శాఖలను విస్తరించాలని నిర్ణయించాం.

4.75 కోట్ల షేర్ల విక్రయం: ప్రస్తుతం ఇండియన్ బ్యాంక్‌లో కేంద్రానికి 82% వాటా ఉంది. దీన్ని 75%కి తగ్గించేందుకు ఇటీవలే సెబీ అనుమతినిచ్చింది. ఈ వాటాను విక్రయించేందుకు బోర్డు, షేర్ హోల్డర్లు కూడా అంగీకరించారు. ఈ వాటా విక్రయం ద్వారా 2019 మార్చి నాటికి రూ.1,200–1,500 కోట్లు సమీకరించాలని లక్ష్యించాం. దీంతో ప్రస్తుతం 13%గా ఉన్న మా క్యాపిటల్ అడిక్వసీ రేషియో 15%కి చేరుతుంది.

క్యూ1లో రూ.372.4 కోట్ల నికర లాభం: జూన్‌తో ముగిసిన త్రైమాసికంలో బ్యాంక్ నికర వడ్డీ ఆదాయం 21.16 శాతం పెరిగి... రూ.372.4 నికరలాభాన్ని నమోదు చేశాం. గతేడాది ఇదే సమయానికి లాభం రూ.307.35 కోట్లే. గత ఆర్థిక సంవత్సరం మా మొత్తం వ్యాపారం రూ.3.14 లక్షల కోట్లుగా ఉంది. మార్చి 2018 నాటికి రూ.3.60 లక్షల కోట్లు వ్యాపారాన్ని లక్ష్యించాం. గత రెండు నెలల్లో రూ.17 వేల కోట్ల రుణాలను మంజూరు చేశాం. సెప్టెంబర్ నాటికి రెండింతలకు చేర్చాలని లక్ష్యించాం. వ్యవసాయ, ఎంఎస్ఎంఈ, రిటైల్ రుణాలపై దృష్టి సారించాం. ఆయా విభాగాల్లో రుణగ్రహీతలను గుర్తించేందుకు ప్రత్యేకంగా సెంట్రలైజ్డ్ ప్రాసెసింగ్ సెంటర్స్ (సీపీసీ) ఏర్పాటు చేశాం. ప్రస్తుతం దేశంలో 18 ఎంఎస్ఎంఈ సీపీసీలు, 38 రిటైల్ సీపీసీలను ఏర్పాటు చేశాం. వీటి ద్వారా రూ.46 వేల కోట్ల రుణాల మంజూరు లక్ష్యించాం.

సేవింగ్ ఖాతాలపై వడ్డీ 4 శాతం..

రూ.50 లక్షల కంటే ఎక్కువ మొత్తానికి సేవింగ్ ఖాతాల వడ్డీ ఏడాదికి 4 శాతం, రూ.50 లక్షల్లోపు ఖాతాలపై 3.50 వడ్డీని అందిస్తున్నాం. ప్రస్తుతం ఆస్తులపై రాబడి 0.67 శాతంగా ఉంది. దీన్ని ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే నాటికి 0.80కి, వచ్చే ఏడాది సెప్టెంబర్ నాటికి 1 శాతానికి చేర్చాలని లక్ష్యించాం. గత ఐదేళ్లుగా మా వృద్ధి 2 శాతం కంటే తక్కువగా ఉంది. దీన్ని రానున్న కాలంలో 14 శాతానికి చేర్చాలని లక్ష్యించాం. వ్యాపార పరిమితులు, కస్టమర్ సర్వీస్, నాణ్యమైన అసెట్స్, డిజిటైజేషన్, కార్యనిర్వాహణ సామర్థ్యం వంటి వాటి ద్వారా వృద్ధి ప్రణాళికలు సిద్ధం చేశాం.

బులియన్ రూ.లలో

ముంబై	
బంగారం (99.9, 10గ్రా)	29,125
బంగారం (99.5, 10గ్రా)	28,975
వెండి (కిలో)	38,945
చెన్నై	
బంగారం (24 క్యారెట్లు)	– –
బంగారం (22 క్యారెట్లు)	27,580
వెండి (కిలో)	– –
హైదరాబాద్	
బంగారం (24 క్యారెట్లు)	29,440
బంగారం (22 క్యారెట్లు)	27,530
వెండి(కిలో)	39,115
ప్రొద్దుటూరు	
బంగారం (24 క్యారెట్లు)	29,850
బంగారం (22 క్యారెట్లు)	27,710
వెండి(కిలో)	39,800
విశాఖపట్నం	
బంగారం (24 క్యారెట్లు)	29,920
బంగారం (22 క్యారెట్లు)	27,530
వెండి(కిలో)	39,500
విజయవాడ	
బంగారం (24 క్యారెట్లు)	30,100
బంగారం (22 క్యారెట్లు)	27,900
వెండి(కిలో)	40,200
ఏపీ బులియన్ అసోసియేషన్	
బంగారం (24 క్యారెట్లు)	30,090
బంగారం (22 క్యారెట్లు)	27,860
వెండి(కిలో)	40,250

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

ముడిచమురు... (బ్యారెల్)

నైమెక్స్ లైట్ స్వీట్	47.45 (రాత్రి 11.30కు)	$48.66 (శుక్రవారం ముగింపు)
బ్రెంట్	51.63 (రాత్రి 11.30కు)	$52.72 (శుక్రవారం ముగింపు)

కోడిగుడ్లు (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 22-8-2017

విశాఖ	362–00
చిత్తూరు	390–00
వరంగల్	357–00
ముంబై	400–00
చెన్నై	397–00
విజయవాడ	359–00
గోదావరి	359–00
నమక్కల్	387–00
21-8-2017 ఫామ్ ధర...	
హైదరాబాద్	355–00
రిటైల్ (ఒక గుడ్డుకు)	4.15
బెంగళూరు	382–00
ఢిల్లీ	370–00
కోల్‌కతా	393–00

ఎన్‌ఎస్‌ఈ నగదు విభాగంలో ట్రేడైన షేర్లు

కంపెనీ పేరు	ముగింపు ధర	క్రితం ముగింపు
ACC LIMITED	1792.6	1794.3
ADANI PORT	375.95	386.2
AMBUJA CEME	274.4	274.95
ASIAN PAINT	1134.45	1140
AXIS BANK L	494.8	490.4
BAJAJ AUTO	2766.5	2811.35
BANK OF BAR	142.1	147.2

A B C D

3M INDIA LI	13803.8	13760.4
63 MOONS TE	62.65	59.95
8K MILES SO	514.65	489.45
AARTI DRUGS	517.65	509.5
AARTI INDUS	864.7	862.7
ABAN OFFSHO	176.45	177.1
ABBOTT INDI	4222.65	4268.3
ACCELYA KAL	1403.25	1410.25
ACCORD SYNE	51.05	54.75
BASF INDIA	1436.7	1458
BATA INDIA	669.4	679.65
BAYER CROPS	4224.15	4291.75
BEARDSELL L	53.25	52.85
BEML LIMITE	1832.75	1884.65
BERGER PAIN	238.85	240.55
BF INVESTME	160	160
BF UTILITIE	321.4	331.65
BGR ENERGY	129.05	131.35
BHAGERIA IN	261.7	256.95
BHANSALI EN	85.1	83.5
BHARAT BIJL	1190.9	1223.1
DHANUKA AGR	726.4	733.6
DHUNSERI IN	368.3	379.3
DHUNSERI PE	81.65	82.85
DHUNSERI TE	289.15	289.65
DIC INDIA L	510	518.8
DILIP BUILD	565.15	571.2
DISH TV IND	76.25	78.15
DOLLAR INDU	2052.65	2066.15
DOLPHIN OFF	86.65	87.35
DONEAR IND.	56.25	58.95
DR. LAL PAT	809.55	808.55
DWARIKESH S	65.1	65.3

E F G H

GUJARAT AMB	115.1	117.9
GUJARAT FLU	736.55	747.55
GUJARAT GAS	766.6	770
GUJARAT MIN	135.9	138.2
GUJARAT PIP	136.65	138.4
GUJARAT STA	187.3	184.35
GULF OIL LU	816	814.45
GULSHAN POL	80.2	83.35
HARITA SEAT	720.95	736.4
HARRISON MA	75	76.1
HATSUN AGRO	620.15	626.85
HEALTHCARE	271.35	272.8

I J K L

JINDAL DRIL	162.5	163.2
JINDAL PHOT	65.2	65.9
JINDAL POLY	357.35	365.3
JINDAL SAW	90.75	92.35
JINDAL STAI	82.3	82.65
JINDAL STAI	175.2	168.3
JINDAL STEE	131.7	136.3
JINDAL WORL	827.55	827.9
JK CEMENT L	1001.15	999.35
JK LAKSHMI	413.3	416.85
JK PAPER LI	93.15	93.5
JK TYRE & I	143.1	151.7
MANGALAM CE	364.95	359.95
MANGALAM DR	135.15	137.65
MANPASAND B	812.5	819.8
MARATHON NX	278.75	283.25
MASTEK LTD	275.3	282.85
MAWANA SUGA	88.7	88.95
MAX FINANCI	596.9	596
MAX INDIA L	139.2	136.85
MAX VENTURE	87.05	85.35
MAYUR UNIQU	346.25	350.85
MAZDA LIMIT	366.7	370.6
MCLEOD RUSS	175.95	175.2

R S T U

PG ELECTROP	327.65	330.25
PHILIPS CAR	610.75	618.85
PHOENIX LAM	210.85	213.9
PI INDUSTRI	751.4	763.9
PINCON SPIR	46.45	56.65
PLASTIBLEND	256.8	261
PNB GILTS L	53.1	52.7
PNB HOUSING	1536.4	1526.75
PNC INFRATE	145.2	145.6
PODDAR HOUS	1309.95	1349.15
PODDAR PIGM	256.7	262.05
POKARNA LIM	1179.15	1205.5
SEQUENT SCI	120.95	119.85
SESHASAYEE	688.5	692.7
SHAKTI PUMP	494.15	507
SHANKARA BL	1062.55	1043.85
SHANTHI GEA	130.75	131.05
SHARDA CROP	439.3	440.8
SHARDA MOTO	2699.2	2713.75
SHEELA FOAM	1290.1	1297.5
SHEMAROO EN	340.75	349.8
SHILPA MEDI	552.3	560.85
SHIPPING CO	89.5	90.75
SHIRPUR GOL	139	138.05
THE INDIA C	177.65	182.75
THE INDIAN	119.9	123.95
THE MANDHAN	147.45	148.45
THE P K TEA	144.15	143.15
THE PHOENIX	542.7	539.25
THE RAMCO C	662.3	684.3
THE RUBY MI	309.45	312.95
THE STATE T	152.75	155.15
THE TINPLAT	138.25	141.35
THEJO ENGIN	360	355
THEMIS MEDI	446.05	450
THERMAX LTD	885.25	898



సాగుబడి

'సాక్షి' అందిస్తున్న 'సాగుబడి' కథనాలపై స్పందించదలచారా? అయితే, ఫేస్‌బుక్‌లో గ్రూప్‌ను చూడడండి.

మఖ కార్తె : ఆగస్టు15 నుంచి

'చో' సహజ సాగుపై 40 రోజుల ఉచిత శిక్షణ



టెన్త్, ఇంటర్, వ్యవసాయ డిప్లొమా పూర్తిచేసిన 18–25 ఏళ్ల మధ్య యువతీయువకులకు డాక్టర్ చోహన్ క్యు (దక్షిణ కొరియా) సహజ సాగు పద్ధతిలో 40 రోజుల పాటు న్యూలైఫ్ ఫౌండేషన్ (హైదరాబాద్) ఉచిత శిక్షణ ఇవ్వనుంది. శిక్షణతోపాటు భోజనం, వసతి కూడా ఉచితమే. తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల్లో సెప్టెంబర్ 1 నుంచి శిక్షణ ఇస్తామని ఫౌండేషన్ ప్రతినిధి శివశంకర్ తెలిపారు. చో సహజ సాగుతో పాటు చింతల వెంకటరెడ్డి మట్టి ద్రావణంతో సేద్యంపై కూడా శిక్షణ ఉంటుంది. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోగా 86868 64152, 98660 73174 నంబర్ల ద్వారా వాట్సాప్‌లో సంప్రదించవచ్చు.

తాటి ఉత్పత్తులతో ఆర్థికాభివృద్ధిపై సెప్టెంబర్ 9,10 తేదీల్లో కార్యశాల



'తాటి ఉత్పత్తుల ద్వారా ఆర్థికాభివృద్ధి – అవకాశాలు' అనే అంశంపై తమిళనాడు సేఫ్ ఫుడ్ అలియెన్స్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 9,10 తేదీల్లో కడలూరు జిల్లా చిదంబరం సమీపంలోని కిల్లై (ఆర్.ఎస్.తిరుమన మలింగాయ్)లో జాతీయ స్థాయి కార్యశాల జరగనుంది. రైతులు, గీత కార్మికులు, ఇతర గ్రామీణ వృత్తిదారుల సాంఘిక, ఆర్థిక స్థితిగతులను మెరుగుపరిచేందుకు దోహదపడే తాటి ఉత్పత్తుల తయారీ, మార్కెటింగ్ తదితర అంశాలపై ఈ సమావేశంలో చర్చిస్తారు. రైతులు తాటి ఉత్పత్తులను అదనపు ఆదాయ మార్గంగా మలచుకునే వ్యూహాలు, మహిళలు కుటీర పరిశ్రమగా చేపట్టదగిన తాటి ఉత్పత్తులు, సంప్రదాయ సేద్య పద్ధతులు, గ్రామీణ ఆర్థిక సార్వభౌమత్వం సాధించే మార్గాలు.. తదితర అంశాలపై చర్చాగోష్టులతోపాటు వివిధ తాటి ఉత్పత్తుల ప్రదర్శన ఉంటుంది. ప్రవేశం ఉచితం. **వివరాలకు.. :** 08680828384, 09841416123 E-mail: palmyrahconference2017@gmail.com

26, 27 తేదీల్లో శాశ్వత వ్యవసాయంపై హైదరాబాద్‌లో పరిచయ గోష్టి



రసాయన రహిత వ్యవసాయ పద్ధతుల్లో పెరట్లో గాని, పొలంలో గాని అందుబాటులో ఉండే స్థానిక వనరులతో ఏడాది పొడవునా సేంద్రియ ఆహారోత్పత్తులను పండించుకోవడానికి అవసరమైన లోతైన అవగాహనను శాశ్వత వ్యవసాయ (పర్మాకల్చర్) సిద్ధాంతం అందిస్తుంది. ఈ సిద్ధాంతం గురించి ఈ నెల 26న చర్చాగోష్టిలో పాల్గొని తెలుసుకోవడంతో పాటు.. 27న స్వయంగా శాశ్వత వ్యవసాయ క్షేత్రాలను సందర్శించే సదవకాశాన్ని పౌరులకు అరణ్య అగ్రికల్చరల్ ఆల్టర్నేటివ్స్ కల్పిస్తోంది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ రోడ్డు నంబర్ 10లో(వాక్స్ బేకరీ సమీపంలో) గల సాంస్కృతిక సంస్థ 'కాలచక్ర'లో పర్మాకల్చర్ సీనియర్ నిపుణుడు కొప్పుల నరసన్న శాశ్వత వ్యవసాయంపై పరిచయ గోష్టిని నిర్వహిస్తారు. ప్రవేశం ఉచితం. సేంద్రియ భోజనం ఖర్చు చెల్లిస్తే చాలు. ఆసక్తి గలవారు ముందుగా పేర్లు నమోదు చేయించుకోవాలి. +91 79817 55785 aranyahyd@gmail.com, www.ipcindia2017.org

ప్రకృతి సేద్య సూత్రాలు – పద్ధతులపై ఒడిశా 'బసుధ'లో స్వల్పకాలిక కోర్సు



ప్రకృతి వ్యవసాయ సూత్రాలు, సాగు పద్ధతులు, దేశీ వంగడాల సంరక్షణపై ఆంగ్లంలో ఆరు రోజుల స్వల్పకాలిక కోర్సును 'బసుధ' (బెంగాలీలో 'నేలతల్లి') సంస్థ నిర్వహించనుంది. అక్టోబర్ 26 నుంచి 31 వరకు ఒడిశా రాయగడ జిల్లా మునిగూడ సమీపంలోని దేశీ వరి వంగడాల సంరక్షణకు కృషి చేస్తున్న బసుధ (c) ఆవరణలో శిక్షణ జరుగుతుంది. రసాయన రహిత, సుస్థిర వ్యవసాయ పద్ధతులను అవలంభిస్తున్న లేదా వీటిపై గాఢమైన ఆసక్తి కలిగిన వ్యక్తులకు లోతైన శిక్షణ ఇవ్వడానికి అనుగుణంగా సుప్రసిద్ధ స్వతంత్ర శాస్త్రవేత్తలు ప్రొ. స్టీవ్ గ్లియెస్‌మన్, డాక్టర్ దేబల్ దేవ్ సమగ్ర పాఠ్యప్రణాళికను రూపొందించారు. 6 రోజుల శిక్షణ, భోజన వసతి సదుపాయాలకు కలిపి రుసుము రూ. 15 వేలు. విద్యార్థులకు తగ్గింపు ఉంటుంది. సెప్టెంబర్ 30 లోగా ధరఖాస్తు చేసుకోవాలి. బసుధ ట్రస్టు సమన్వయకర్తను 098538 61558, ద్వారా సంప్రదించవచ్చు.

27న వరి, మిరప ప్రకృతి సేద్యంపై శిక్షణ

రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా కొర్నెపాడులోని రైతు శిక్షణ కేంద్రంలో ఈనెల 27న ప్రకృతి వ్యవసాయ విధానంలో వరి, మిరప పంటల సాగుపై రైతు శాస్త్రవేత్తలు ధర్మారం బాజి, శివనాగమల్లేశ్వరరావు, లావణ్య శిక్షణ ఇస్తారు. పాల్గొనదలచిన రైతులు ముందుగా పేర్ల నమోదుకు 97053 83666, 0863 – 2286255 నంబర్లలో సంప్రదించవచ్చు.

సేంద్రియ కూరగాయల సాగు తప్పనిసరి!

భూమి ఉన్న ప్రతి కుటుంబమూ సేంద్రియ కూరగాయలు విధిగా పండించి తీరాల్సిందేనని ఓ గ్రామ పంచాయతీ తీర్మానించడమే కాదు.. అమల్లోకి తెచ్చింది. ఆ గ్రామం పేరు కంజికూజి. కేరళలోని ఇడుక్కి జిల్లాలో ఉంది. 8 వేలకు పైగా కుటుంబాలున్నాయి. ప్రతి కుటుంబం ఏటా మూడు పంటలను సేంద్రియ పద్ధతుల్లో సాగు చేయాల్సిందే. ఇంటింటికీ 50 కూరగాయ మొక్కలను, నిపుణులచే సాంకేతిక సలహాలను ఉచితంగా ఇస్తారు. ఎవరూ సాగు చేయని భూమిలో కుడుంబశ్రీ మహిళా బృందాలు పంటలు పండిస్తున్నాయి.

గులాబీ పురుగు పీడ మరెక్కడా లేదు!

అంతర్జాతీయ పత్తి సలహా సంఘం(ఐసీఏసీ) ప్రపంచ దేశాలకు చెందిన ప్రభుత్వ ప్రతినిధులతో కూడినది. దీని కేంద్ర సచివాలయం వాషింగ్టన్‌లో ఉంది. పత్తి సాగుపై ఆయా దేశాలకు సాంకేతిక, శాస్త్రీయ సలహాలను అందిస్తుంది. ఈ సంఘంలో సాంకేతిక విభాగం అధిపతిగా పనిచేస్తున్న తెలుగు శాస్త్రవేత్త డాక్టర్ కేశవ్ క్రాంతితో 'సాక్షి సాగుబడి' తాజాగా ఈ-మెయిల్ ఇంటర్వ్యూ చేసింది. పత్తి సాగు సీజన్ ప్రారంభంలోనే గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో గులాబిరంగు కాయతొలిచే పురుగు రైతులను బెంబేలెత్తిస్తున్న విషయం తెలిసిందే. దీని పీడ పత్తిని విస్తారంగా సాగు చేస్తున్న చైనా, పాకిస్తాన్ సహా ఏ దేశంలోనూ లేదన్నారు. ఇతర దేశాల మాదిరిగా 5-6 నెలల్లో పత్తి సాగు పూర్తయ్యే వంగడాల రూపకల్పనే ఉత్తమ పరిష్కారమని డా. క్రాంతి చెబుతున్నారు.





- పత్తి సాగు కాలాన్ని 6 నెలల్లో ముగించడమే పరిష్కారం
- అంతర్జాతీయ పత్తి సలహా సంఘం సాంకేతిక అధిపతి డాక్టర్ కేశవ్ క్రాంతితో 'సాగుబడి' ఈ-మెయిల్ ఇంటర్వ్యూ

- **పత్తి కాయలు తొలిచే గులాబీ రంగు పురుగు ఈ ఖరీఫ్ సీజన్ మొదట్లోనే తెలంగాణ, ఆంధ్రాతోపాటు 5 రాష్ట్రాల్లో పెచ్చరిల్లింది. రైతాంగాన్ని బెంబేలెత్తిస్తోంది. ప్రపంచవ్యాప్తంగా పత్తి సాగవుతున్న దేశాల్లో కూడా ఇలాగే ఉందా?**

మన దేశంలో గులాబీరంగు పురుగు సమస్య, ముఖ్యంగా గత ఏడాది డిసెంబర్ తర్వాత కూడా పత్తి పంట సాగు కొనసాగిన ప్రాంతాల్లో, తిరిగి తలెత్తుతుందని ముందుగా ఊహించినదే. ఈ సమస్య మన దేశంలోనే ఉంది. ఇతర దేశాల్లో లేదు. దీనికో ముఖ్య కారణం ఉంది. పత్తి విత్తిన తర్వాత 5–6 నెలల్లో పంటను తీసెయ్యాలి. అంతకుమించి దాదాపు ఏడాది పొడవునా పత్తి సాగులో ఉండడం వల్ల, పత్తిని మాత్రమే ఆశించే ఈ పురుగులు మనుగడ సాగించగలుగుతున్నాయి. అందువల్ల మన దేశంలో గులాబీ రంగు పురుగు సమస్యగా మారింది. పత్తి విత్తనోత్పత్తి చేసే రైతులు మన దేశంలో సుమారు 2 లక్షల హెక్టార్లలో దాదాపుగా ఏడాది పొడవునా పత్తి పంటను సాగు చేస్తున్నారు. ఇతర దేశాల్లో ఐదారు నెలల్లో పత్తి సాగును పూర్తి చేసి, మరో ఆరు నెలల తర్వాతే తిరిగి పత్తి విత్తుకుంటున్నారు. ఈలోగా పురుగులు నశిస్తున్నాయి. అందువల్ల వారికి గులాబీ రంగు పురుగు బెడద తలెత్తడం లేదు.

- **మన మాదిరిగానే బీటీ పత్తిని సాగు చేస్తున్న చైనాలో పరిస్థితి ఏమిటి?**

చైనాలో 1997 నుంచి బీటీ–1 (సీఆర్‌వై1ఏసీ)ని మాత్రమే సాగుచేస్తోంది. అయినా, గులాబీ రంగు పురుగు అక్కడ సమస్యగా మారలేదు. గులాబీ రంగు పురుగు సమస్య చైనాలో కొన్నేళ్ల క్రితం, పాకిస్తాన్‌లో గత ఏడాది తలెత్తినప్పటికీ.. ఏడాది పొడవునా పత్తి సాగులో లేదు కాబట్టి పురుగుల సంతతి సమస్యాత్మకంగా మారలేదు. పాకిస్తాన్‌లో బీటీ–1కు గులాబీ రంగు పురుగు అలవాటుపడిపోయినప్పటికీ పత్తిని 6–7 నెలల్లో ముగించి, తర్వాత గోధుమను సాగు చేసే అలవాటు ఉండటం వల్ల.. ఈ పురుగు సమస్యాత్మకంగా మారడంలేదు.

- **మన దేశంలో గులాబీ రంగు పురుగు రాకుండా ముందస్తు చర్యలు ఏమైనా తీసుకున్నారా..?**

మన దేశంలో బీటీ 1, బీటీ 2 (బోల్‌గార్డ్–2) రకం బీటీ విత్తనాలకు గులాబీ రంగు పురుగు అలవాటు పడిపోయింది. పైగా 2016–17 నాటి పత్తి పంట పొలాల్లో ఎడతెగకుండా ఏడాదంతా కొనసాగింది. ఈ కారణాల రీత్యా ఈ ఆగస్టులోనే పత్తి చేలల్లో గులాబీ రంగు పురుగు ఉధృతమవుతుందని ఫిబ్రవరిలోనే ఢిల్లీలోని ఉన్నతస్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లాను.

- **ప్రభుత్వం తీసుకోవాల్సిన చర్యలేమిటి?**

ప్రస్తుతం బీటీ పత్తి విత్తన కంపెనీలు ఒక కాపీ (hemi-zygous) ఉన్న బీటీ జన్యువులనే వాడుతున్నారు. రెండు కాపీలు (homozygous) ఉన్న బీటీ జన్యువులతో కూడిన హైబ్రిడ్స్‌ను మాత్రమే మార్కెట్‌లో అమ్మాలని విత్తన కంపెనీలను ప్రభుత్వం ఆదేశించాలి. మా సలహా మేరకు ఇప్పటికే ఒక కంపెనీ ఈ పని చేసి, సత్ఫలితాలు పొందుతోంది. పత్తి రైతులకు ప్రభుత్వం గట్టిగా చెప్పాల్సిందేమిటంటే.. డిసెంబర్ నెలాఖరుకన్నా ముందే పత్తి పంటను పూర్తి చెయ్యాలి. ఆ తర్వాత పొలంలో పత్తి మొక్కలు ఉండకూడదు. ఇందుకోసం పత్తి విత్తన కంపెనీలు కూడా మధ్యకాలిక లేదా స్వల్పకాలిక హైబ్రిడ్ విత్తనాలను మాత్రమే రైతులకు అమ్మాలని విత్తన కంపెనీలకు ఆదేశాలివ్వాలి.

- **సింథటిక్ పైరిత్రాయిడ్ పురుగుమందులకు సేంద్రియ ప్రత్యామ్నాయాలేవీ లేవా?**

ట్రైకోగ్రామా పరాన్నజీవులను సకాలంలో పత్తి పొలంలో విడుదల చేస్తే గులాబీరంగు కాయతొలిచే పురుగులను గుడ్ల దశలోనే అరికట్టవచ్చు. ఈ పరాన్నజీవులను జీవనియంత్రణ ప్రయోగశాలల్లో పెంపొందించవచ్చు. సిఐసిఆర్, ప్రొ. జయశంకర్ తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ విశ్వవిద్యాలయం, ఆచార్య ఎన్జీరంగా విశ్వవిద్యాలయం తదితర యూనివర్సిటీలలో ఇవి అందుబాటులో ఉన్నాయి. లింగాకర్షక బుట్టలను భారీ సంఖ్యలో ఏర్పాటు చేయడం ఒక మంచి ఉపాయం. అయినప్పటికీ, గులాబిరంగు కాయతొలిచే పురుగు యాజమాన్యాన్ని రసాయన రహిత పద్ధతుల్లో చేపట్టాలనుకుంటే చేయాల్సినది.. ఒకటి: 150–180 రోజుల్లో పంట పూర్తయ్యే పత్తి వంగడాలను రూపొందించుకోవడం ఉత్తమం. రెండు: పత్తి పంట పూర్తయ్యాక కనీసం 180 రోజులు గడచిన తర్వాతే తదుపరి పత్తి విత్తుకోవాలి.

- **సిఐసిఆర్ రూపొందించిన లింగాకర్షక బుట్టలను రైతులు పొందాలంటే ఎలా?**

నేను సిఐసిఆర్‌లో పనిచేస్తున్నప్పుడు సరికొత్త ఫెరొమోన్ ఫార్ములేషన్‌ను రూపొందించాను. మార్కెట్‌లో అందుబాటులో ఉన్న వాటికన్నా ఇది ఎక్కువ రెక్కల పురుగులను ఆకర్షించగలుగుతుంది. 30–45 రోజులు పనిచేస్తుంది. లింగాకర్షక బుట్ట (రెండు ల్యూర్‌లు సహా) ధర రూ. 25గా సిఐసిఆర్ విక్రయిస్తున్నది. పన్నులు, రవాణా చార్జీలు అదనం.

పర్యవేక్షణ: పత్తి చేలల్లో తొలి దశలో ఎకరానికి 2–3 లింగాకర్షక బుట్టలు పెట్టాలి.

లింగాకర్షక బుట్టలు: అక్టోబర్ చివరి నాటికి ప్రతి ఎకరంలో 20–30 వరకు లింగార్షక బుట్టలు ఏర్పాటు చేయాలి. నవంబర్ ఆఖర్లో లేదా డిసెంబర్ మొదట్లో ల్యూర్‌ను మార్చాలి.

లింగాకర్షక బుట్టల కోసం సంప్రదించాల్సిన సిఐసిఆర్ చిరునామా:

THE DIRECTOR, CENTRAL INSTITUTE FOR COTTON RESEARCH, PB.No 2 SHANKARNAGAR PO NAGPUR 440 010; Phone: 07103-275536/38 (office)Fax: 07103-275529, E-mail: itmucicrngp@gmail.com

ఈ–మెయిల్ ఇంటర్వ్యూ: **పంతంగి రాంబాబు**, సాగుబడి డెస్క్

- **120 రోజుల 'యుగాంక్' సంగతులేమిటి?**

నాగపూర్‌లోని సీఐసీఆర్ రూపొందించిన 100–120 రోజుల్లో పూర్తయ్యే 'యుగాంక్' పత్తి సూటి వంగడంపై క్షేత్రప్రయోగాలు జరుగుతున్నాయి. వచ్చే ఏడాది దేశంలో చాలా చోట్ల దీన్ని ప్రయోగాత్మకంగా పండించి చూస్తారు. ఫలితాలు అనుకూలంగా ఉంటే త్వరలోనే రైతులకు అందించే ప్రక్రియ మొదలు కావచ్చు. ఈ వంగడాన్ని త్వరగా రైతులకు అందించాలన్నదే నా కోరిక. నేనే అక్కడికి వెళ్లి ఈ ప్రక్రియను వేగవంతం చేయాల్సి వస్తుందేమో.



ఇప్పుడు చేయాల్సిందేమిటి..?

సీజన్ మొదట్లోనే గులాబీ రంగు పురుగు వచ్చిందని బెంబేలెత్తిపోవాల్సిన పని లేదు. లింగాకర్షక బుట్టలు, పైరిత్రాయిడ్ మందుల వాడకం ద్వారా నియంత్రించవచ్చు. నాగపూర్‌లోని కేంద్రీయ పత్తి పరిశోధనా స్థానం (సి.ఐ.సి.ఆర్.) లింగాకర్షక బుట్టలను తయారు చేసింది. దీని ఖరీదు రూ. 20–25 మాత్రమే. వీటిని ఎకరానికి 20–30 చొప్పున పెడితే సమస్య తగ్గుతుంది. సెప్టెంబర్ నుంచి హెక్టారుకు 5 చొప్పున లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసి, పురుగు తీవ్రతను అంచనా వేసుకోవాలి. ఒక్కో బుట్టలో ఒక రాత్రికి 8 తల్లి రెక్కల పురుగుల చొప్పున వరుసగా 3 రోజులు పడితే ఇక ఆలస్యం చేయకుండా పైరిత్రాయిడ్ పురుగుమందులు పిచికారీ చేయాలి. దీనితోపాటు ఎకరానికి 20–30 లింగాకర్షక బుట్టలను పత్తి రైతులంతా సామూహికంగా ఏర్పాటు చేసుకోవాలి. ఇది ఏర్పాటు చేసిన 35–40 రోజులు పనిచేస్తుంది. ఆ తర్వాత మార్చుకోవాలి.

సూటిరకం బీటీ పత్తి వంగడాలకు పచ్చజెండా!

CICR

ప్రతి ఏటా కంపెనీల నుంచి కొనుగోలు చేయాల్సిన అవసరం లేకుండా తిరిగి వాడుకునే సూటిరకం బీటీ పత్తి వంగడాలకు భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) ఇటీవల పచ్చజెండా ఊపింది. నాగపూర్‌లోని కేంద్రీయ పత్తి పరిశోధనా సంస్థ (సీఐసీఆర్) రూపొందించిన ఈ వంగడాలు మరో 2–3 ఏళ్లలో రైతులకు అందుబాటులోకి రావచ్చు. సీఐసీఆర్ ఈ వంగడాలను దేశంలోని వివిధ ప్రాంతాల్లో ఈ ఏడాది ప్రయోగాత్మకంగా సాగు చేయిస్తున్నది. వచ్చే ఏడాది జాతీయ విత్తన సంస్థ (ఎన్.ఎస్.సి.) ద్వారా పెద్ద ఎత్తున విత్తనోత్పత్తి చేసిన తర్వాత రైతులకు అందుబాటులోకి తేవడానికి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ విత్తనాలను రైతులు ఒకసారి కొంటే.. తాము పండించిన పత్తి నుంచి విత్తనాలు తీసి తిరిగి విత్తుకోవచ్చని, ఇతర విత్తనాలతో కలవకుండా ఉంటే నాలుగేళ్ల పాటు తిరిగి వాడుకోవచ్చని సీఐసీఆర్ డైరెక్టర్ డాక్టర్ ఎం.ఎస్. లదానియా చెప్పారు. పత్తి పంటను డిసెంబర్ కల్లా పూర్తి చేస్తే తప్ప గులాబి రంగు పురుగును నిర్మూలించలేమన్నారు. నీటి పారుదల సదుపాయం ఉన్నప్పటికీ డిసెంబర్ నాటికి పత్తి పంటను ముగించడం ముఖ్యమన్నారు.

'నేలతల్లిని బీడువారిస్తే తర్వాతేమి తింటాం?'

- 9 ఏళ్లుగా ప్రకృతి సేద్యంలో రాణిస్తున్న మహిళా రైతు మల్లీశ్వరి
- జీవామృతం, గో మూత్రం అందిస్తూ అరటి, చెరకు, పసుపు, మినుము పంటల సాగులో మంచి దిగుబడులు
- చీడపీడలు, తెగుళ్ల బెడద లేకుండా రుచికరమైన, నాణ్యమైన వ్యవసాయోత్పత్తులు

కృష్ణా తీరంలో సారవంతమైన భూముల్లో ప్రకృతి వ్యవసాయం ఫలప్రదమవుతోంది. వ్యవసాయాన్నే నమ్ముకున్న చిన్న, సన్నకారు రైతులు నేలతల్లికి ప్రణమిల్లుతున్నారు. పాలేకర్ పద్ధతిలో సేద్యం చేస్తూ నాణ్యమైన పంటలను పండిస్తున్నారు. 9 ఏళ్ల క్రితం నుంచే ప్రకృతి వ్యవసాయం చేస్తున్న కొద్ది మంది తొలి తరం ప్రకృతి వ్యవసాయదారుల్లో అన్నపురెడ్డి మల్లీశ్వరి ఒకరు. తన భర్త సంజీవరెడ్డితో కలిసి రోజుకు పది గంటల పాటు పొలంలో శ్రమిస్తూ ఆదర్శప్రాయంగా ప్రకృతిసేద్యం చేస్తూ.. సత్ఫలితాలు పొందుతున్నారు.



'2008లో విజయవాడ పోరంకిలో సుభాష్ పాలేకర్ మీటింగ్‌కు మొదటిసారి వెళ్లాం. ప్రకృతి సేద్యం గురించి పాలేకర్ చాలా సంగతులు చెప్పారు. 2010లో పాలేకర్ గుంటూరు వచ్చినపుడు కూడా వెళ్లాను. రసాయనాలు, క్రిమిసంహారక మందులతో నేల ఎంత నిస్సారమవుతున్నదో పూసగుచ్చినట్టు చెబుతుంటే మనసు కదిలిపోయింది. 'నేలను నమ్ముకుని బతికేవాళ్లం నేలతల్లిని బీడువారిస్తే తర్వాత ఏం తింటాం?' అనిపించింది. ఏమైనా సరే ఇలాగే పండించాలనుకున్నాం...వెంటనే ఒక ఆవును కొని, మొదలుపెట్టాం' అని మల్లీశ్వరి గుర్తుచేసుకున్నారు. గుంటూరు జిల్లా మంగళగిరి మండలం నూతక్కి ఆమె స్వగ్రామం. తొలినాళ్లలో ఘన జీవామృతం, జీవామృతం, వివిధ రకాల కషాయాలు వాడారు. నాలుగేళ్ల క్రితం నుంచి కేవలం గోమూత్రం, జీవామృతం తోనే మంచి దిగుబడులు సాధిస్తున్నారు.

20 రోజులకోసారి జీవామృతం.. 10 రోజులకోసారి గోమూత్రం..

ఆరు ఎకరాల నల్లరేగడి భూమిలో అరటితోపాటు చెరకు, పసుపు పంటలను మల్లీశ్వరి సాగు చేస్తున్నారు. బోరు నీళ్లను డ్రిప్పు ద్వారా పంటలకు అందిస్తున్నారు. పంట ఏదైనా వారు అనుసరించే సాగు విధానం మాత్రం ఒక్కటే. ముందుగా దుక్కిలో ఎకరాకు 2 ట్రక్కుల కోళ్ల ఎరువు వేస్తారు. ఎకరాకు 200 లీటర్ల జీవామృతాన్ని ప్రతి 20 రోజులకోసారి.. 10 రోజులకోసారి గోమూత్రాన్ని డ్రిప్పు ద్వారా పంటలకు అందిస్తారు. కలుపు నివారణకు, భూసారం పెంపొందించడానికి గడ్డీ గాదం, పంట వ్యర్థాలను ఆచ్ఛాదనగా వేస్తూ.. మంచి దిగుబడులు సాధిస్తున్నారు. రెండు ఆవులను పెంచుతున్నారు. ఆవుల పాకలో గోమూత్రం నిల్వ చేసేందుకు గుంత తవ్వి 3 సిమెంట్ వరలు ఏర్పాటు చేశారు. దాని అడుగున గులకరాళ్లు, బేబీ చిప్స్, ఇసుక మిశ్రమాన్ని వేశారు. ఈ గుంతలోకి 10 రోజులకోసారి 30 లీటర్ల గోమూత్రం చేరుతుంది. ఈ మూత్రాన్ని బకెట్లతో సేకరించి వడకట్టి, డ్రిప్ ట్యాంకులో పోసి, పంటలకు అందిస్తారు.

20 అడుగులు పెరిగిన అరటి చెట్లు..

2008లో తొలిసారిగా అరటిని ప్రకృతిసేద్య పద్ధతిలో సాగు చేశారు. ఎకరాకు వెయ్యి మొక్కలు నాటారు. జనవరి–ఫిబ్రవరి మాసాల్లో కోతలయ్యాయి. చక్కెరకేళి రకంలో గెలకు 70 కాయలు.. కర్పూర అరటి చెట్లు దాదాపు 20 అడుగుల ఎత్తు పెరగటం విశేషం. గెలకు 200 కాయలతో ఒక్కో గెల 45 కిలోల వరకూ బరువు తూగుతోంది. రసాయన ఎరువులతో సాగు చేసిన అరటి కాయల కన్నా.. ఇవి అధికంగా పొడవు పెరిగి, మంచి రంగుతో ఆకర్షణీయంగా, రుచిగా ఉన్నాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉంటున్నాయి. దీంతో వ్యాపారస్తులు ఈ అరటికాయలపై ఆసక్తి చూపుతున్నారు. వీరి పసుపు పొలంలో పుచ్చు సమస్య లేదు. దుంప బాగా ఊరి ఎకరాకు 25 క్వింటాళ్ల దిగుబడి వచ్చింది. ఒకటిన్నర ఎకరాలో చెరకును సాగు చేస్తున్నారు. గత రబీలో మల్లీశ్వరి ఎకరాకు 5 క్వింటాళ్ల మినుము దిగుబడి సాధించి.. ఔరా అనిపించారు.

- బి.ఎల్.నారాయణ, సాక్షి, తెనాలి, గుంటూరు జిల్లా

ఇంతకంటే భరోసా ఏముంటుంది?

ప్రకృతి వ్యవసాయంలో పెట్టుబడులు తగ్గాయి. తోటి రైతులు ఎకరా భూమిలో సేద్యానికి ఏటా 10 పిండి కట్టలు (డీఏపీ, యూరియా, పొటాష్..) వేస్తున్నారు. సగటున ఒక పంటకు ఎకరాకు రూ.7–8 వేలు ఖర్చవుతోంది. పురుగుమందుల ఖర్చు అదనం. ఈ ఖర్చులు లేకుండానే ప్రకృతి సేద్యం చేస్తున్నాం. జీవామృతం, ఘనజీవామృతం సొంతంగా తయారుచేసుకోవటానికి కాస్త శ్రమ పడుతున్నప్పటికీ.. సంతృప్తి ఉంది. పండ్లు నాణ్యంగా, రుచికరంగా ఉంటున్నాయి. మంచి ధర పలుకుతోంది. ఆరోగ్యానికి, ఆదాయానికీ ఇంతకంటే భరోసా ఏముంటుంది? నాకు మందుబిళ్లలతో అవసరమే రాలేదంటే ప్రకృతి ఆహారాన్ని తినటమే కారణం.

- **అన్నపురెడ్డి మల్లీశ్వరి,** మహిళా రైతు, నూతక్కి, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా

వాతావరణం ఎలా ఉన్నప్పటికీ నిలకడగా పంట దిగుబడులు!

మల్లీశ్వరి రోజుకు 10 గంటలు పొలంలోనే ఉండి అన్ని పనులూ స్వయంగా చూసుకుంటుంది. 9 ఏళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నందువల్ల మా భూమి బాగుపడింది. వాతావరణ పరిస్థితులు ఎలా ఉన్నప్పటికీ పంట దిగుబడులు నిలకడగా వస్తున్నాయి. పంట నాణ్యత బావుంది. సాగు ఖర్చులు బాగా తగ్గాయి. మమ్మల్ని చూసి మా ఊళ్లో కొంతమంది రైతులు ప్రకృతి సేద్యంపై ఇప్పుడిప్పుడే ఆసక్తి చూపుతున్నారు.

- **అన్నపురెడ్డి సంజీవరెడ్డి** (99510 60379), నూతక్కి, మంగళగిరి మండలం, గుంటూరు జిల్లా



గెలల కోత పూర్తికావచ్చిన తోటలో మల్లీశ్వరి, సంజీవరెడ్డి



గవర్నర్ విద్యాసాగర్‌రావు సమక్షంలో కరచాలనం చేస్తున్న పళని స్వామి, పన్నీర్ సెల్వం

చేతులు కలిపారు

ఈపీఎస్, ఓపీఎస్ వర్గాల విలీనం • డిప్యూటీ సీఎం, పార్టీ సమన్వయకర్తగా పన్నీర్
సీఎం, పార్టీ ఉప సమన్వయకర్తగా పళనిస్వామి • శశికళ తొలగింపునకు త్వరలో జనరల్ కౌన్సిల్ భేటీకి నిర్ణయం
శశికళ వర్గం ఎమ్మెల్యేల అసంతృప్తి • నేడు గవర్నర్‌తో భేటీ

సాక్షి ప్రతినిధి, చెన్నై: ఆర్నెల్ల విభేదాల అనంతరం ఏఐఏడీఎంకే లోని రెండు కీలక వర్గాలు విలీనమయ్యాయి. మూడు నాలుగు రోజులుగా విలీనంపై చర్చలు కొలిక్కి రాకపోవటంతో పెరిగిన ఉత్కంఠకు సోమవారం తెరపడింది. అధికార మార్పిడి విషయంలో రెండు వర్గాలు పరస్పర అంగీకారానికి వచ్చాయి. దీని ప్రకారం పార్టీ పగ్గాలు పన్నీర్ సెల్వం, ప్రభుత్వ బాధ్యతలు పళనిస్వామి నిర్వర్తించాలని నిర్ణయించారు. దీంతోపాటుగా పన్నీరు సెల్వానికి ఉప ముఖ్యమంత్రి, ఆర్థిక శాఖలతోపాటు మరికొన్ని శాఖలను పన్నీర్ వర్గానికి ఇచ్చేందుకు కూడా సీఎం పళనిస్వామి అంగీకరించారు. ఇకపై పన్నీర్ సెల్వం అన్నాడీఎంకే సమన్వయకర్తగా, పళనిస్వామి ఉప సమన్వయకర్తగా వ్యవహరించనున్నారు. తాజా మార్పుల నేపథ్యంలో దినకరన్, శశికళ వర్గానికి చెందిన 18 మంది ఎమ్మెల్యేలు రేపు గవర్నర్‌ను కలవనున్నారు. అటు, అన్నాడీఎంకే విలీనంపై సినీనటుడు కమల్ హాసన్ స్పందించారు. తమిళ ప్రజల నెత్తిన ఈ రెండు వర్గాల నేతలు టోపీ పెడుతున్నారని ట్విటర్ ద్వారా విమర్శించారు.

నాటకీయ పరిణామాలు

రెండు వర్గాల మధ్య నాలుగు రోజులుగా చర్చలు జరుగుతున్నా ఓ కొలిక్కి రాలేదు. శని, ఆది వారాల్లో పన్నీర్, పళని వర్గాల దూతలు సమావేశమైనా పార్టీ, ప్రభుత్వంలో పదవులపై పట్టుబట్టడంతో కలవటం కష్టమేననే సంకేతాలు వెళ్లాయి. ఈ నేపథ్యంలో సోమవారం ఉదయం పన్నీర్‌సెల్వం మరోసారి తన అనుచరులతో సమావేశమయ్యారు. అనంతరం సీఎం పళనిస్వామి దూతలుగా వచ్చిన సీనియర్ మంత్రులు తంగమణి, ఎస్పీ వేలుమణిలు.. పన్నీర్‌సెల్వంకు డిప్యూటీ సీఎం పదవి, పాండియన్‌కు మంత్రి పదవికి సమ్మతి వ్యక్తం చేశారు. అయితే, శశికళను పార్టీ నుంచి బహిష్కరిస్తున్నట్లుగా ప్రకటించాలని పన్నీర్‌వర్గం మరోసారి పట్టుబట్టడంతో మళ్లీ ప్రతిష్టంభన తలెత్తింది. అటు సీఎం కూడా సోమవారం తన నివాసంలో సీనియర్ నేతలతో సమావేశమయ్యారు. ఇంతలో.. మధ్యాహ్నం 12 గంటలకు పార్టీ కేంద్ర కార్యాలయానికి చేరుకోనున్నట్లు ఇరువర్గాల నుంచి కార్యకర్తలు, మీడియాకు సమాచారం వచ్చింది. అయితే మధ్యాహ్నం 2 కావస్తున్నా.. ఇద్దరు నేతలూ వారి ఇళ్లనుంచి బయటకు రాలేదు. దీంతో కార్యకర్తల్లో ఉత్కంఠ పెరిగింది. అయితే మధ్యాహ్నం 2.30గంటల సమయంలో ఇరువురు నేతలు పార్టీ కార్యాలయానికి బయలుదేరి 3.15 గంటలకు సంయుక్త మీడియా సమావేశంలో చేతులు కలిపారు. 'మనల్ని ఎవరూ విడదీయలేరు. మనమంతా అమ్మ పిల్లలం' అని పన్నీర్ సెల్వం తెలిపారు. 'మనమంతా కలిసిపోయినందుకు నేడు ఎంజీఆర్, అమ్మ చాలా సంతోషిస్తారు. ఆర్నెల్లలో చాలా సమస్యలు ఎదుర్కొన్నాం. ఇకపై వాటిని అధిగమిద్దాం' అని పళనిస్వామి వెల్లడించారు. దీంతో సమావేశ మందిరంలో హర్షధ్వానాలు మిన్నంటాయి. శశికళ తొలగింపునకు కొన్ని న్యాయ అడ్డంకులున్నందున.. త్వరలోనే అన్నాడీఎంకే జనరల్ కౌన్సిల్ సమావేశాన్ని ఏర్పాటుచేసి ముందడుగేయనున్నట్లు తెలిసింది.

డిప్యూటీగా పన్నీర్ ప్రమాణం

అనంతరం ఇద్దరు నేతలు మెరీనా బీచ్‌లోని ఎంజీఆర్, జయలలిత సమాధి వద్దకెళ్లి పుష్పాంజలి ఘటించారు. సాయంత్రం.. పన్నీర్‌సెల్వం ఉపముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేశారు. రాజ్‌భవన్‌లో గవర్నర్ విద్యాసాగర్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాదాసీదాగా జరిగింది. డిప్యూటీ సీఎం హోదాలో పన్నీర్ సెల్వం.. ఆర్థిక, గృహ, గ్రామీణ గృహ నిర్మాణం, మురికివాడల నిర్మూలన, పట్టణాభివృద్ధి, చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ శాఖలను నిర్వహించనున్నారు. పన్నీర్‌వర్గానికే చెందినకే పాండియన్ తమిళనాడు అధికార భాష, సంస్కృతి సంప్రదాయాల శాఖలను పొందారు. ప్రమాణ చేసిన పన్నీర్ సెల్వం, సీఎం పళనిస్వామిని ప్రధాని మోదీ అభినందించారు. 'తిరు ఓ పన్నీర్‌సెల్వంతోపాటుగా నేడు ప్రమాణ స్వీకారం చేసిన మంత్రులకు శుభాకాంక్షలు. రానున్న రోజుల్లో తమిళనాడు మరింత అభివృద్ధి చెందుతుందని ఆశిస్తున్నా' అని మోదీ ట్వీట్ చేశారు.

ఇదో కొత్త టోపీ.. కమల్: అన్నాడీఎంకే వర్గాల విలీనంపై సినీనటుడు కమల్ హాసన్ విమర్శలు గుప్పించారు. సోమవారం విలీనం జరుగుతుండగానే.. ట్విటర్ దాడి చేశారు. 'గాంధీ టోపీ, కాషాయ టోపీ, కశ్మీర్ టోపీలను చూశాం. ఇప్పుడు తమిళ ప్రజల నెత్తిన జోకర్ టోపీ పెడుతున్నారు. ఇది చాలా? ఇంకా ఏమైనా కావాలా? తమిళులారా మేల్కొనండి!' అని ట్వీట్‌లో పేర్కొన్నారు. 'మరో స్వాతంత్ర్య సంగ్రామం, ముఖ్యంగా అవినీతిపై పోరాటం కోసం మీలో ఎవరికి ధైర్యముంది?' అని మరో ట్వీట్‌లో కమల్ తమిళప్రజలను ప్రశ్నించారు.

పళని ప్రభుత్వం నిలిచేనా?

అవిశ్వాస తీర్మానంపై స్టాలిన్ యోచన
- కూల్చివేత తప్పదు: శశికళ వర్గం హెచ్చరిక
- మ్యాజిక్ ఫిగర్‌కు 13 సీట్ల దూరంలో సర్కారు
- శరవేగంగా మారుతున్న రాజకీయ సమీకరణాలు

సాక్షి, చెన్నై: అన్నాడీఎంకేలోని రెండు వర్గాల విలీనం పళనిస్వామి ప్రభుత్వానికి సంతోషం కంటే చిక్కులు తెచ్చిపెట్టనుంది. ఓవైపు పార్టీ ఉప ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్ తన వర్గం (28 మంది)ఎమ్మెల్యేలతో బయటకు వచ్చే పరిస్థితి నెలకొనడం, ప్రధాన ప్రతిపక్షనేత స్టాలిన్ అవిశ్వాస తీర్మాన సన్నాహాల్లో ఉండటంతో అన్నాడీఎంకే ప్రభుత్వం పూర్తికాలం మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. జయలలిత కన్నుమూసినప్పటినుంచీ అధికారం కోసం డీఎంకే తీవ్రంగా ప్రయత్నిస్తోంది. అటు శశికళ జైలుకెళ్లినప్పటినుంచీ పార్టీ, ప్రభుత్వంపై పెత్తనం కోసం టీటీవీ దినకరన్ పాకులాడుతున్నారు. ఈ నేపథ్యంలో శరవేగంగా మారుతున్న తమిళ రాజకీయాల్లో తర్వాత ఏం జరగనుందనేది ఆసక్తి రేపుతోంది.

దినకరన్ వర్గం రాజీనామా చేస్తే!

తమిళనాడు అసెంబ్లీలో ప్రస్తుత ఎమ్మెల్యేల సంఖ్య 234 (జయలలిత



మరణంతో ఆర్కేనగర్ ఖాళీగా ఉంది). ఇందులో ప్రభుత్వాన్ని నిలుపుకునేందుకు కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ 118. జయ మరణం తర్వాత పన్నీర్ వర్గం విడిపోవటంతో జరిగిన విశ్వాస పరీక్షలో పళనిస్వామి 122 సీట్లతో గట్టెక్కారు. ఇందులో పళనిస్వామి వద్ద 94 మంది ఎమ్మెల్యేలుండగా.. దినకరన్, దివాకరన్ (20+8 మంది సభ్యులు)లు మద్దతు తెలిపారు. అయితే తాజా విలీనం, శశికళను పార్టీనుంచి బహిష్కరించేందుకు జరుగుతున్న ప్రయత్నాలతో దినకరన్, దివాకరన్ అసంతృప్తితో ఉన్నారు. వీరు మంగళవారం గవర్నర్ విద్యాసాగర్ రావుతో భేటీ కానున్నారు. ఒకవేళ వీరందరితో దినకరన్ రాజీనామా చేయిస్తే.. (చెన్నైలో ఈ చర్చ జరుగుతోంది) మ్యాజిక్ ఫిగర్ 104కు తగ్గి.. పన్నీర్, పళనిలకు (94+11=105) మేలు జరుగుతుంది. అయితే, ఇన్నిరోజులు కష్టపడీ దినకరన్ ఇంత సులువుగా పళనికి అవకాశమిస్తారా అనేది ప్రశ్నార్థకమే.

మద్దతు వెనక్కి తీసుకుంటే?

ప్రభుత్వానికి మద్దతు ఉపసంహరించుకుంటున్నట్లు ఈ 28 మంది ఎమ్మెల్యేలు గవర్నర్‌కు వెల్లడిస్తే.. పళని సర్కారు మైనారిటీలో పడుతుంది. అప్పుడు స్టాలిన్ పెట్టే అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా వీరు ఓటేస్తే.. ప్రభుత్వం కూలటం ఖాయమే. అసెంబ్లీలో డీఎంకేకు 89, కాంగ్రెస్‌కు 8 మంది ఎమ్మెల్యేలుండగా ముస్లింలీగ్‌కు ఒక సభ్యుడున్నాడు. స్టాలిన్‌కు దినకరన్ వర్గం మద్దతిచ్చినట్లయితే.. ఈ కూటమి బలం (89+8+1+28) 126కు చేరుతుంది. అయితే.. అన్నాడీఎంకేను ఓడించేందుకు దినకరన్ వర్గం డీఎంకేతో చేతులు కలుపుతుందా అనేదానిపై చర్చ జరుగుతోంది. స్టాలిన్, దినకరన్ లక్ష్యం పళని ప్రభుత్వంపై వ్యతిరేకతే కనుక వీరిద్దరూ కలవటంలో తప్పేముందనే వాదనా చెన్నై రాజకీయాల్లో వినబడుతోంది. వారం రోజుల క్రితం స్టాలిన్ లండన్ వెళ్లినపుడు దినకరన్ దూత ఆయన్ను కలసి చర్చించినట్లు తమిళ పత్రికల్లో వార్తలొచ్చాయి. ఈ నేపథ్యంలో అన్నాడీఎంకే ప్రభుత్వ భవిష్యత్తు డీఎంకే చేతుల్లోకి వెళ్లిపోయింది.

జైలు బయట శశికళ షికార్లు!

ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతున్న వీడియో

సాక్షి, బెంగళూరు: అక్రమాస్తుల కేసులో పరప్పన అగ్రహార సెంట్రల్ జైల్లో శిక్ష అనుభవిస్తున్న అన్నాడీఎంకే నాయకురాలు శశికళ(61)కు రాజభోగాలు అందుతున్నాయని ఫిర్యాదు చేసిన జైళ్ల శాఖ మాజీ డీఐజీ రూప.. అందుకు సంబంధించిన ఆధారాలను అవినీతి నిరోధక శాఖ(ఏసీబీ)కు సమర్పించారు. వాటిలో ఓ వీడియో తాజాగా ఆన్‌లైన్‌లో చక్కర్లు కొడుతోంది. ఆ వీడియోలో సల్వార్ కమీజ్ ధరించిన శశికళ, ఆమె బంధువు ఇళవరసితో కలసి షాపింగ్ బ్యాగులతో జైలులోకి వస్తున్నారు. ఆ సమయంలో ముగ్గురు పురుష సెంట్రీలు కూడా అక్కడ ఉన్నారు. జైలు నిబంధనల ప్రకారం మహిళా ఖైదీల బ్యారక్ వద్ద పురుష వార్డన్‌లు, సెంట్రీలు కానీ ఉండకూడదు. అదే సమయంలో మహిళా సూపరింటెండెంట్ అధికారి కూడా శశికళ, ఇళవరసిలతోపాటు ఉన్నారు. దీన్ని బట్టి చూస్తే శశికళ బయటి నుంచి వస్తున్నారనే అనుమానించాల్సి ఉంటుందని ఓ పోలీస్ ఉన్నతాధికారి వ్యాఖ్యానించారు. జైల్లో శశికళ రాజభోగాలు పొందిన వైనంపై మరో 74



శశికళ, ఇళవరసి షాపింగ్ ముగించుకుని జైలులోకి వస్తున్న దృశ్యం

ఆధారాలు కూడా ఏసీబీకి చేరాయి. అయితే ఈ వీడియోను ఏ రోజు రికార్డు చేశారన్న అంశంపై స్పష్టత లేదు. మరోవైపు ఈ ఘటన గురించి తనకెలాంటి సమాచారం లేదని జైలు డైరెక్టర్ జనరల్ నహర్ సింగ్ మేఘరిఖ్ తెలిపారు.





శ్వేతసౌధం నుంచి సూర్యగ్రహణాన్ని వీక్షిస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఆయన భార్య మెలానియా

అమెరికాలో కనువిందు చేసిన సూర్యగ్రహణం

చార్లెట్సన్: అమెరికాలో సోమవారం సంపూర్ణ సూర్యగ్రహణం కనువిందు చేసింది. పశ్చిమ తీరంలో ఒరెగాన్‌లోని లింకన్ బీచ్‌లో మొదలైన ఈ అద్భుతం 14 రాష్ట్రాల గుండా సాగింది. గ్రహణంతో అమెరికాలో 14 రాష్ట్రాల మీదుగా 70.కి.మీ వెడల్పు ప్రాంతం చీకటిమయమైంది. ఒరెగాన్ రాష్ట్రంలో మొదలై తూర్పు తీరమైన దక్షిణ కరోలినా రాష్ట్రంలో ముగిసింది. సంపూర్ణ సూర్యగ్రహణం మాత్రం 90 నిమిషాలు కొనసాగింది. ఈ సూర్యగ్రహణాన్ని వీక్షించేందుకు ప్రపంచ నలుమూలల నుంచి వందల మంది ఖగోళ శాస్త్రవేత్తలు తరలివచ్చారు. దాదాపు 99 ఏళ్ల తర్వాత అమెరికాలో సంపూర్ణ సూర్య గ్రహణం ఏర్పడడంతో పండగ వాతావరణం నెలకొంది. ఈ ఖగోళ అద్భుతాన్ని నాసా ప్రత్యక్ష ప్రసారం చేసింది.

ఎన్నికల సంఘం, అహ్మద్ పటేల్‌కు నోటీసులు

అహ్మదాబాద్: ఇటీవల జరిగిన గుజరాత్ రాజ్యసభ ఎన్నికల్లో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేల ఓట్లను చెల్లనివిగా ప్రకటించడంపై గుజరాత్ హైకోర్టు సోమవారం నోటీసులు జారీ చేసింది. బీజేపీ అభ్యర్థి బల్వంత్‌సిన్హ్ రాజ్‌పుత్ పిటిషన్‌పై స్పందించిన జస్టిస్ బేలా త్రివేది కేంద్ర ఎన్నికల సంఘం, కాంగ్రెస్ నేత అహ్మద్ పటేల్‌తో పాటు మరో ఇద్దరు బీజేపీ అభ్యర్థులైన అమిత్ షా, స్మృతీ ఇరానీకి నోటీసులు జారీ చేశారు. సెప్టెంబర్ 21లోగా స్పందించాలని హైకోర్టు ఆదేశించింది. రాజ్యసభ ఎన్నికల్లో మరో ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు కూడా అనధికారిక ప్రతినిధులకు బ్యాలెట్లను చూపారని, ఆ ఓట్లు చెల్లవని, అందువల్ల తనను విజేతగా ప్రకటించాలని పిటిషన్‌లో రాజ్‌పుత్ కోరారు.

ఆసుపత్రిలో ముగ్గురు చిన్నారుల మృతి

ఆక్సిజన్ సరఫరాలో లోపమే కారణమంటున్న బంధువులు
- మరణాలకు ఇతర కారణాలు ఉన్నాయి: అధికారులు




రాయ్‌పూర్: గోరఖ్‌పూర్ ఆసుపత్రిలో ఆక్సిజన్ అందక 60 మందికిపైగా చిన్నారులు మరణించిన సంఘటన మరువకముందే ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్‌లోని ఓ ప్రభుత్వ వైద్యశాలలోనూ ముగ్గురు నవజాత శిశువులు మృతి చెందారు. డా.బీఆర్ అంబేడ్కర్ స్మారక వైద్యశాలలో ఆదివారం జరిగిన ఈ ఘటనపై ముఖ్యమంత్రి రమణ్ సింగ్ విచారణకు ఆదేశించారు. ఆక్సిజన్ సరఫరా సరిగా లేకపోవడమే పసికందుల మృతికి కారణమని బంధువులు ఆరోపిస్తున్నారు. అధికారులు మాత్రం శిశువుల మృతికి ఇతర కారణాలు ఉన్నాయనీ, ఆక్సిజన్ సరఫరాలో ఏ లోపమూ లేదని వాదిస్తున్నారు. ఓ శిశువు తక్కువ బరువుతో పుట్టిందనీ, కొన్ని ఇతర ఆరోగ్య సమస్యలు కూడా ఉండటంతో మధ్యాహ్నం 12.30 గంటలకు మరణించిందని వైద్యులు చెప్పారు. మరో ఇద్దరు శిశువుల మృతికి శ్వాసకోశ సంబంధ సమస్యలే కారణమన్నారు. మరోవైపు మద్యం సేవించి, విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో ఆక్సిజన్ సరఫరా విభాగంలోని రవిచంద్ర అనే ఉద్యోగిని పోలీసులు అరెస్టు చేశారు. రిజర్వాయర్‌లో ఆక్సిజన్ స్థాయిలు తక్కువగా ఉండటాన్ని సాయంత్రం ఐదు గంటలకు ఓ డాక్టర్ గమనించారనీ, వెంటనే రవిచంద్రను పిలవగా అతను మద్యం తాగి ఉండటంతో పోలీసులకు ఫిర్యాదు చేశామని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. అయితే ఆక్సిజన్ సరఫరాలో మాత్రం ఏ ఇబ్బందీ తలెత్తలేదనీ, రిజర్వాయర్‌లో కూడా ఆక్సిజన్ స్థాయి పడిపోవడాన్ని గుర్తించిన 15 నిమిషాల్లోనే సరిచేశారని ఆరోగ్య శాఖ ముఖ్య కార్యదర్శి చెప్పారు. కాగా, సిబ్బంది నిర్లక్ష్యం వల్లే చిన్నారులు మరణించారని బంధువులు, ప్రతిపక్ష కాంగ్రెస్ పార్టీ సభ్యులు ఆరోపించారు.

'డోక్లాం'కు త్వరలోనే తెర: రాజ్‌నాథ్

న్యూఢిల్లీ: భారత్–చైనా మధ్య డోక్లాంలో నెలకొన్న ప్రతిష్టంభనకు తెర పడేలా త్వరలోనే పరిష్కారం కనుగొంటామని కేంద్ర హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ చెప్పారు. అదే సమయంలో దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకొనేందుకు అవసరమైన శక్తిసామర్థ్యాలూ భారత్‌కు పుష్కలంగా ఉన్నాయని స్పష్టం చేశారు. చైనా–భారత్ సరిహద్దు భద్రతా దళం ఐటీబీపీ ఆధ్వర్యంలో సోమవారం ఇక్కడ జరిగిన కార్యక్రమంలో రాజ్‌నాథ్ మాట్లాడారు. 'డోక్లాం వ్యవహారంలో భారత్–చైనాల మధ్య ప్రతిష్టంభన కొనసాగుతోంది. త్వరలోనే దీనికో పరిష్కారం లభిస్తుందని భావిస్తున్నా'అని రాజ్‌నాథ్ చెప్పారు.


ప్రపంచపు అత్యంత వేగవంతమైన బుల్లెట్ రైలు



మాలేగావ్ కేసులో పురోహిత్‌కు బెయిల్

న్యూఢిల్లీ: మాలేగావ్ పేలుళ్ల కేసులో లెఫ్టినెంట్ కల్నల్ శ్రీకాంత్ ప్రసాద్ పురోహిత్‌కు సోమవారం సుప్రీంకోర్టు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. కోర్టు అనుమతి లేకుండా దేశం విడిచి వెళ్లరాదని, ప్రత్యక్షంగా కానీ, పరోక్షంగా కానీ సాక్ష్యులను ప్రభావితం చేసే ప్రయత్నం చేయరాదని షరతులు విధించింది. మహారాష్ట్రలోని నాసిక్ జిల్లా మాలేగావ్‌లో 2008 సెప్టెంబర్ 29న జరిగిన బాంబు పేలుడులో ఆరుగురు మృతి చెందారు. ఈ కేసులో కీలక నిందితునిగా ఉన్న పురోహిత్ తొమ్మిదేళ్లుగా జైల్లో ఉన్నా రు. ఈ కేసు విచారణ సందర్భంగా యాంటీ టెర్రరిస్ట్ స్క్వాడ్(ఏటీఎస్), జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) వేసిన చార్జిషీట్లలో వ్యత్యాసం ఉందని కోర్టు గుర్తించింది. వీటిలో ఒక వెర్షన్‌ను పరిగణనలోకి తీసుకోలేమంటూ బెయిల్ మంజూరు చేసింది.

2018 నాటికి ఆన్‌లైన్‌లోనే పాస్‌పోర్ట్ వెరిఫికేషన్



న్యూఢిల్లీ: 2018 మార్చి నాటికి పాస్‌పోర్టుల జారీ కోసం పోలీసులు భౌతికంగా వెళ్లి వెరిఫికేషన్ చేయాల్సిన అవసరం ఉండదని హోంశాఖ కార్యదర్శి రాజీవ్ మహర్షి తెలిపారు. ఇందుకోసం క్రైమ్ అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్క్ అండ్ సిస్టమ్స్ ప్రాజెక్టు(సీసీటీఎన్ఎస్)ను విదేశాంగ శాఖ నేతృత్వంలోని పాస్‌పోర్టు సేవలకు అనుసంధానం చేస్తున్నట్లు తెలిపారు. దీనివల్ల పోలీసులు భౌతికంగా వెరిఫికేషన్‌కు వెళ్లకుండా ఆన్‌లైన్‌లోనే వ్యక్తుల వివరాలు (గతంలో నేరచరిత్ర ఏమైనా ఉంటే) తెలుసుకునే అవకాశం ఉందన్నారు. సీసీటీఎన్ఎస్ ప్రాజెక్టులో భాగంగా హోంమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సోమవారమిక్కడ డిజిటల్ పోలీస్ పోర్టల్‌ను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మహర్షి మీడియాతో మాట్లాడుతూ.. 'కొన్ని రాష్ట్రాల్లో పోలీసులు ఇప్పటికే సీసీటీఎన్ఎస్‌ను వినియోగిస్తున్నారు. ఇందులో భాగంగా అందించే స్మార్ట్‌ఫోన్ లాంటి పరికరంతో పోలీసులు పాస్‌పోర్ట్ దరఖాస్తుదారు ఇంటికి చేరుకుని వివరాలను అప్‌లోడ్ చేస్తారు. దీనివల్ల సమయం తగ్గుతుంద'ని వెల్లడించారు. దేశంలోని మొత్తం 15,398 పోలీస్ స్టేషన్లలో 13,775 స్టేషన్లను సీసీటీఎన్ఎస్ పరిధిలోకి తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు.

బీజేపీ 'మిషన్ 350 ప్లస్'

అమిత్ షా, మోదీ దిశానిర్దేశం
- బీజేపీ పాలిత సీఎంల భేటీ

సాక్షి, న్యూఢిల్లీ: 2019 లోక్‌సభ ఎన్నికల్లో 350కి పైగా సీట్లలో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని బీజేపీ పాలిత రాష్ట్రాల సీఎంలకు ఆ పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, ప్రధాని నరేంద్ర మోదీలు దిశానిర్దేశం చేశారు. 'మిషన్ 350 ప్లస్'లో భాగంగా ఇంతకవరకూ బీజేపీ గెలవని 120 నియోజకవర్గాల్లో విజయం సాధించేందుకు శ్రమించాలని స్పష్టం చేశారు. అమిత్ షా అధ్యక్షతన సోమవారం సాయంత్రం పార్టీ ప్రధాన కార్యాలయంలో బీజేపీపాలిత రాష్ట్రాల ముఖ్యమంత్రులతో మూడున్నర గంటలు భేటీ జరిగింది. ప్రధాని నరేంద్ర మోదీతో పాటు హోం మంత్రి రాజ్‌నాథ్ సింగ్, విదేశాంగ మంత్రి సుష్మా స్వరాజ్, 13 రాష్ట్రాల సీఎంలు, ఆరు రాష్ట్రాల ఉప ముఖ్యమంత్రులు భేటీకి హాజరయ్యారు. రాష్ట్రాల్లో మోదీ ప్రభుత్వ ప్రతిష్టాత్మక పథకాల అమలు తీరుపై అమిత్‌షా ప్రధానంగా ఆరా



సమావేశంలో ప్రధాని మోదీ, పార్టీ అధ్యక్షుడు అమిత్ షా, కేంద్ర మంత్రులు, పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు

తీశారు. పేదల అనుకూల పథకాలు క్షేత్ర స్థాయిలో ప్రభావం చూపుతున్నాయా? పథకాల అమలుకు నిధుల కొరత ఉందా? అన్న అంశాలపై సీఎంలతో చర్చించారు. మోదీ ప్రభుత్వ అభివృద్ధి పథకాలపై సీఎంలు, పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ప్రచారం చేయాలని, 'మిషన్ 350 ప్లస్' కోసం పార్టీ శ్రేణుల్ని ఉత్సాహపరుస్తూ, వారి అండగా ఉండాలని మోదీ, అమిత్‌షాలు సూచించారు. సిట్టింగ్ స్థానాల్ని నిలబెట్టుకొనేందుకు అమలు చేస్తున్న ప్రణాళికల గురించి సీఎంల్ని అడిగి తెలుసుకున్నారు. రాష్ట్రాల్లో పార్టీ పట్టు పెంచుకునేందుకు క్రమం తప్పకుండా వాస్తవ పరిస్థితుల్ని బేరీజు వేసుకోవాలని సీఎంలకు షా సూచించారు. వచ్చే ఎన్నికల్లో గెలుపు అవకాశాలున్న అభ్యర్థుల జాబితా రూపొందించామని, నియోజకవర్గాల్లో పనితీరు, పార్లమెంట్ హాజరు మేరకు కొందరికి మొండిచేయి తప్పదని అధినాయకత్వం స్పష్టం చేసినట్లు సమాచారం. భేటీలో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్, ఎంపీ సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్, రాజస్తాన్ సీఎం వసుంధరా రాజే, మహారాష్ట్ర సీఎం దేవేంద్ర ఫడ్నవిస్, ఛత్తీస్‌గఢ్, ఉత్తరాఖండ్, అస్సాం, గోవా, ఇతర బీజేపీపాలిత రాష్ట్రాల సీఎంలు హాజరయ్యారు.

సీట్ల కేటాయింపులో మిత్రపక్షాలకు నిరాశే!

2014లో బీజేపీ 428 సీట్లకు పోటీచేయగా 66 శాతం ఉత్తీర్ణతతో 282 స్థానాల్లో విజయం సాధించింది. ఈసారి లక్ష్యం 350 కావడంతో మిత్రపక్షాలకు సీట్ల కేటాయింపు విషయంలో బీజేపీ అంత ఉదారంగా ఉండకపోవచ్చని తెలుస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో టీడీపీ, పంజాబ్‌లో అకాలీదళ్ వంటి పార్టీలు కొన్ని స్థానాలతోనే సరిపెట్టుకోకతప్పదు.

వేగంగా విస్తరణ కసరత్తు

సాక్షి, న్యూఢిల్లీ: ఈ వారంలోనే కేంద్ర మంత్రివర్గ విస్తరణ జరిపేందుకు కసరత్తు కొనసాగుతోంది. జేడీయూ, అన్నాడీఎంకే పార్టీల్లో వివాదాలు కొలిక్కిరావడంతో ఆగస్టు 24 లేదా 26న విస్తరణ ఉండవచ్చని ప్రభుత్వ వర్గాల సమాచారం. జేడీయూ ఇప్పటికే ఎన్డీఏలో చేరగా అన్నాడీఎంకే త్వరలో చేరనుందని తెలుస్తోంది. ఈ నేపథ్యంలో ఆ రెండు పార్టీలకూ మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో స్థానం కల్పించనున్నారని సమాచారం. అందుకోసమే బీజేపీ అధ్యక్షుడు అమిత్‌షా తమిళనాడు పర్యటన రద్దు చేసుకుని ప్రధానితో కలసి మంత్రివర్గ కూర్పుపై తుదిమెరుగులు దిద్దుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు అన్నాడీఎంకేకు రెండు కేబినెట్, రెండు సహాయ మంత్రి పదవులు, జేడీయూకు ఒక కేబినెట్, సహాయమంత్రి పదవి దక్కవచ్చు. 2019లోక్‌సభ ఎన్నికల్ని దృష్టిలో పెట్టుకుని ఈ విస్తరణ జరుగుతుందని పార్టీ వర్గాలు పేర్కొన్నాయి. ఆశించిన పనితీరు కనపర్చని వారిని మంత్రివర్గం నుంచి తప్పించనున్నట్లు సమాచారం. వయసు పైబడ్డ కల్‌రాజ్ మిశ్రాను తప్పించి బిహార్ గవర్నర్‌గా పంపే అవకాశముంది. ఉత్తరప్రదేశ్, బిహార్‌కు ప్రాధాన్యత తగ్గించి త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరిగే మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, కర్ణాటక నుంచి కొత్తవారిని మంత్రివర్గంలోకి తీసుకోవచ్చు.

ఆగస్టు 24 లేదా 26న ముహూర్తం!
- అన్నాడీఎంకేకు 2, జేడీయూకు ఒక కేబినెట్ పదవి
- టీడీపీ నుంచి సీఎం రమేష్, బీజేపీ నుంచి హరిబాబుకు అవకాశం!

తంబిదురైకి పట్టణాభివృద్ధి శాఖ?: లోక్‌సభ డిప్యూటీ స్పీకర్ తంబిదురైకి పట్టణాభివృద్ధి శాఖ, ఆయన స్థానంలో శివసేన ఎంపీ ఆనందరావ్ అడుసుకు డిప్యూటీ స్పీకర్ పదవి ఇవ్వనున్నట్లు సమాచారం. శివసేన నుంచి అనిల్ దేశాయ్, టీడీపీ నుంచి సీఎం రమేష్‌కి మంత్రిపదవి ఇస్తారనే ప్రచారం సాగుతోంది. ఏపీ బీజేపీ కోటాలో వెంకయ్యనాయుడి స్థానంలో హరిబాబుకు సహాయ మంత్రి పదవి దక్కే అవకాశాలున్నాయి. కర్ణాటక నుంచి బీజేపీ ఎంపీ అనిల్ హెగ్డేకి చోటు కల్పిస్తారని సమాచారం. ప్రస్తుతం కేంద్ర కేబినెట్‌లో రక్షణ, అటవీ, పర్యావరణ శాఖ, పట్టణాభివృద్ధి, సమాచార ప్రసార శాఖలకు పూర్తిస్థాయి మంత్రులు లేరు. కొందరు మంత్రుల వద్ద అదనపు శాఖలు ఉన్నాయి. కేబినెట్‌లో కొత్తగా చేరేవారికి వీటిని కేటాయించనున్నారు.

✦ బ్రహ్మోత్సవాలు వైభవంగా నిర్వహిస్తాం



టీటీడీ ఈవో అనిల్ కుమార్ సింఘాల్

సాక్షి, తిరుమల: సెప్టెంబరు 23 నుంచి అక్టోబరు 1 వరకు జరగనున్న తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహిస్తామని తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ తెలిపారు. బ్రహ్మోత్సవ ఏర్పాట్లపై సోమవారం జేఈవోలు శ్రీనివాసరాజు, పోల భాస్కర్, చిత్తూరు జిల్లా కలెక్టర్ ప్రద్యుమ్న, సీవీఎస్‌వో ఆర్‌కే రవికృష్ణతో ఆయన సమీక్ష జరిపారు. అనంతరం శ్రీవారి బ్రహ్మోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు.

✦ సికింద్రాబాద్- హౌరా ప్రత్యేక రైలు

సాక్షి, హైదరాబాద్: ప్రయాణికుల రద్దీ దృష్ట్యా సికింద్రాబాద్- హౌరా మధ్య ప్రత్యేక రైళ్లు నడపనున్నట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎం.ఉమాశంకర్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు సికింద్రాబాద్-హౌరా (02513/02514) ప్రత్యేక రైలు మంగళవారం (22న) సాయంత్రం 5.55కి సికింద్రాబాద్ నుంచి బయలుదేరి మరుసటి రోజు రాత్రి 10.30కి హౌరా చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో 25వ తేదీ తెల్లవారుజామున 1.05 గంటలకు హౌరా నుంచి బయలుదేరి మరుసటి రోజు ఉదయం 4 గంటలకు సికింద్రాబాద్ చేరుకుంటుంది.

✦ సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌లో 120 కిలోల గంజాయి పట్టివేత

హైదరాబాద్: రైళ్లలో జరుగుతున్న గంజాయి అక్రమ రవాణాను జీఆర్‌పీ బృందం క్రమంగా అడ్డుకట్ట వేస్తోంది. ఈ నెల 12న ఒక క్వింటాలు గంజాయిని స్వాధీనం చేసుకుని ముగ్గురిని రిమాండ్‌కు తరలించిన రైల్వే పోలీసులు సోమవారం 120 కిలోల గంజాయిని స్వాధీనం చేసుకుని మరో ముగ్గురిని రిమాండ్‌కు తరలించారు. జీఆర్‌పీ ఇన్‌స్పెక్టర్ ఎస్.చంద్రయ్య, ఎస్‌ఐలు బి.ప్రమోద్‌కుమార్, నాగేశ్వర్‌రెడ్డి, వీరలింగం నేతృత్వంలో ఏర్పాటైన ప్రత్యేక బృందం ఆదివారం సాయంత్రం సికింద్రాబాద్ రైల్వేస్టేషన్‌కు వచ్చిన లోకమాన్యతిలక్ ఎక్స్‌ప్రెస్ రైలులో తనిఖీలు నిర్వహించింది. జనరల్ బోగీలో అనుమానాస్పదంగా లగేజీ బ్యాగులు కలిగి ఉన్న ముగ్గురు వ్యక్తులను తనిఖీ చేయగా వారివద్ద 120 కిలోల గంజాయి ప్యాకెట్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. వీటిని ఒడిశా నుంచి ముంబైకి రవాణా చేస్తున్నట్లు నిందితులు బసుదేబ్(40), సంజయ్ కుమార్(21), గౌరవ్ చంచన్(40) పోలీసుల విచారణలో అంగీకరించారు.

✦ ఆ ఎస్‌హెచ్‌వోపై కేసు నమోదు చేయండి

సైబరాబాద్ కమిషనర్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) అక్రమంగా తమ ఇంట్లోకి రావడమే కాకుండా, తమను బెదిరించారంటూ యాప్రాల్‌కు చెందిన భార్యాభర్తలు దాఖలు చేసిన పిటిషన్‌పై ఉమ్మడి హైకోర్టు స్పందించింది. ఆ ఎస్‌హెచ్‌ఓపై కేసు నమోదు చేసి, అతనిపై వచ్చిన ఆరోపణలపై విచారణ జరిపాలని, రెండు వారాల్లో నివేదిక ఇవ్వాలని సైబరాబాద్ కమిషనర్‌ను ఆదేశించింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ చల్లా కోదండరామ్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. యాప్రాల్‌లోని తమ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించిన జవహర్‌నగర్ ఎస్‌హెచ్‌ఓ, సీఐలు సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, తమను బెదిరించారంటూ భార్యాభర్తలు ఎం.అరుణ, ఎం.నాగరాజ్ హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ వ్యాజ్యంపై జస్టిస్ కోదండరామ్ విచారణ జరిపారు. పిటిషనర్ల తరఫు న్యాయవాది వి.రామచంద్రగౌడ్ వాదనలు వినిపిస్తూ... ఎస్‌హెచ్‌ఓ తదితరులు ఇంటిని ఖాళీ చేసి వెళ్లాలంటూ పిటిషనర్లను బెదిరించారన్నారు. ఈ విచారణకు హాజరైన ఎస్‌హెచ్‌ఓను న్యాయమూర్తి వివరణ కోరగా... ఇంటికి సంబంధించిన డాక్యుమెంట్ల పరిశీలనకు మాత్రమే తాము వెళ్లామని తెలిపారు. దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసిన న్యాయమూర్తి... ఎస్‌హెచ్‌ఓపై కేసు నమోదుకు ఆదేశించారు.

✦ బీసీ భవన్ ఏర్పాటు చేయండి

ఈటలను కోరిన బీసీ సంక్షేమ సంఘం నేతలు

సాక్షి, హైదరాబాద్: బీసీల కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కార్యక్రమాలు, సమావేశాలు నిర్వహించేందుకు హైదరాబాద్‌లో బీసీ భవన్ ఏర్పాటు చేయాలని ఆర్థిక మంత్రి ఈటల రాజేందర్‌ను బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ కోరారు. ఈ మేరకు సోమవారం బీసీ సంఘ ప్రతినిధులతో కలసి మంత్రికి వినతిపత్రం అందజేశారు. పదెకరాల స్థలాన్ని కేటాయించి, రూ.100 కోట్లతో బీసీ భవనాన్ని నిర్మించాలని మంత్రిని కోరారు.

పటప్.. కొంగ బావా..



అమెరికాలోని ఫ్లోరిడా.. ఎవర్‌గ్లేడ్స్ జాతీయ పార్కు..మధ్యాహ్నం సమయం.. కొంగ బావ కడుపు మాడిపోతోంది.. ఒంటికాలిపై జపం చేసినా.. చేపలేమో చిక్కలేదాయె..మరేం చేయాలి అని ఆలోచనలో పడింది.. ఇంతలో అటుగా పోతున్న పచ్చ పాము కంటపడింది. ఎలాగూ నాన్‌వెజ్జే కదా.. ఏదైతే ఏమిటి అనుకుంది.. పామును అమాంతం మింగేద్దామని ప్లానేసింది.. ప్రయత్నమూ చేసింది. దీంతో పాముకేమో చిర్రెత్తుకొచ్చింది.. ఇద్దరి మధ్యా ఓ 20 నిమిషాలు భీకరమైన యుద్ధం నడిచింది. సడన్‌గా పాముకు లైటు వెలిగింది.. తనను మింగేద్దామనుకున్న కొంగ బావ మూతికే తాళమేసేస్తే.. అని అనుకుంది. వెంటనే.. మూతినిలా చుట్టుకుని.. సర్పబంధనం చేసేసింది.. అంతే.. కొంగ బావకు పరిస్థితి అర్థమైంది. తెల్ల జెండా ఎగరేసింది.. నోటికి బదులు కాళ్లకు పనిచెప్పింది..

❖ *ఈ ఆసక్తికర దృశ్యాన్ని అమెరికాకు చెందిన జోస్ గార్సియా అనే ఫొటోగ్రాఫర్ క్లిక్‌మనిపించారు. 2017 బర్డ్ ఫొటోగ్రాఫర్ ఆఫ్ ద ఇయర్ పోటీకి వచ్చిన ఎంట్రీల్లో మెచ్చదగిన చిత్రాలను తాజాగా విడుదల చేశారు. అందులో ఈ ఫొటోకూడా ఒకటి.*

కడుపులో 6 బంగారు బిస్కెట్లు

- మలేసియా నుంచి అక్రమంగా తరలించేందుకు యువకుడి యత్నం
- నిందితుడిని అదుపులోకి తీసుకున్న తిరుచ్చి ఎయిర్‌పోర్ట్ అధికారులు



కేకే.నగర్ (చెన్నై): కడుపులో బంగారు బిస్కెట్లు దాచుకుని వచ్చిన యువకుడిని విమానాశ్రయం అధికారులు అదుపులోకి తీసుకున్నారు. కౌలాలంపూర్ నుంచి తిరుచ్చికి ఏయిర్ ఏషియా విమానం ఆదివారం సాయంత్రం వచ్చింది. విమానంలో వచ్చిన ప్రయాణికుల వద్ద అధికారులు తనిఖీలు జరుపుతుండగా, ఓ యువకుడిపై అనుమానం రావడంతో అతడిని విచారించారు. ఆయన మలేసియా నుంచి తిరుచ్చికి కడుపులో ఆరు బంగారు బిస్కెట్లు ఉంచుకుని వచ్చినట్లు విచారణలో తేలింది. నిందితుడు రామనాథపురం జిల్లా ఎస్పీ పట్టణానికి చెందిన మహ్మద్ ముస్తఫా సలీంగా అధికారులు గుర్తించారు. వెంటనే అధికారులు ముస్తఫాను తిరుచ్చి ప్రభుత్వ ఆస్పత్రిలో చేర్పించి, చికిత్స ద్వారా బంగారు బిస్కెట్లు వెలికితీయాలని వైద్యులకు సూచించారు. వైద్యులు ఒక బంగారు బిస్కెట్ మాత్రమే వెలికి తీయగలిగారు. మరో ఐదు బిస్కెట్లను తీసేందుకు ప్రయత్నిస్తున్నారు.

బీటెక్, బీఫార్మసీ రీవాల్యుయేషన్ ఫలితాలు విడుదల

సాక్షి, హైదరాబాద్: బీటెక్, బీఫార్మసీ కోర్సులకు సంబంధించి రీకౌంటింగ్, రీవాల్యుయేషన్ ఫలితాలను విడుదల చేసినట్లు జేఎన్‌టీయూహెచ్ సోమవారం తెలిపింది. వీటిని సంబంధిత ప్రిన్సిపల్ అకౌంట్లకు పంపినట్లు పేర్కొంది. బీటెక్ 1, 2వ సెమిస్టర్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు ఈ నెల 24 నుంచి నిర్వహించనున్నట్లు ప్రకటించింది.

Published and Printed by K.Ramachandra Murthy, Editorial Director, on behalf of Jagati Publications Limited, Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034,
Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Survey No. 127, Plot No. 12, Mallapur Village, Nacharam, Medchal District. Editor: V. Murali, Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.